సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 18 సంచిక: 96

శుక్రవారం 27-6-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'ప్రభుత్వ ఉద్యోగులు పదవీ విరమణ నాటికి సొంత ఇల్లు కలిగి ఉండేటట్లు చూడటం ప్రభుత్వాల కనీస బాధ్యత'



తరుణ్ శుభారంభం

యూఎస్ ఓపెన్ టోర్నీలో ప్రీక్వార్టర్ ఫైనల్ చేరిన హైదరాబాద్ ప్లేయర్ - 15లో



దుమ్ము రేపిన బుల్

మూడో రోజూ మార్కెట్లో జోష్.. సెన్సెక్స్ 1,000 పాయింట్లు ప్లస్ - 15లో



పూర్తిగా కమ్యూనిస్ట్ పిచ్చోడు

న్యూయార్క్ మేయర్ అభ్యర్థి మమ్దానీ అసలు సిసలైన కమ్యూనిస్ట్ పిచ్చోడని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు. - వివరాలు 6లో



అమెరికా చెంప చెళ్లుమనిపించాం

ఖతార్‌లోని అమెరికా వైమానిక స్థావరంపై క్షిపణులు ప్రయోగించి సత్తా చాటామని ఇరాన్ సుప్రీం నేత ఖమేనీ వ్యాఖ్యానించారు. - వివరాలు 6లో



ఉమ్మడి ప్రకటనపై సంతకానికి నో

ఆనవాయితీకి భిన్నంగా ఉమ్మడి ప్రకటన జారీ చేయకుండానే షాంఘై సహకార సంస్థ (ఎస్సీఓ) సదస్సు గురువారం ముగిసింది. - వివరాలు 6లో



రాజ్యాంగమే సుప్రీం

దేశంలో రాజ్యాంగమే అత్యున్నతమైనదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ మరోసారి తేల్చిచెప్పారు. - వివరాలు 6లో



ఇంజనీరింగ్ కౌన్సెలింగ్‌కు లైన్‌క్లియర్!

- నేడు షెడ్యూల్ ప్రకటిస్తామన్న ఉన్నత విద్యామండలి చైర్మన్
- ముఖ్యమంత్రి జోక్యంతో దారికొచ్చిన అధికారులు
- కలిసి ప్రకటిస్తారా లేదా అనే దానిపై సందిగ్ధత

- వివరాలు 12లో



6 లో

చరిత్ర సృష్టించిన శుభాన్షు

అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో మన తొలి ముద్ర

తొలి భారతీయునిగా వాయుసేన పైలట్ రికార్డ్

గగన్‌యాన్ దిశగా కీలక ముందడుగు.. భారత అంతరిక్ష చరిత్రలో సువర్ణాధ్యాయం

28 గంటల అనంతరం ఐఎస్ఎస్‌తో యాగ్జియం-4 అనుసంధానం

రూ.180 కోట్ల మెడికల్ బిల్లులు క్లియర్

- రెండున్నరేళ్లుగా పెండింగ్‌లో ఉన్న బిల్లులన్నింటికీ మోక్షం
- ఉద్యోగులు మా కుటుంబ సభ్యులు: ఉపముఖ్యమంత్రి భట్టి

12 లో

మత్తు ముఠాలూ..

ఈగల్ ఉంది జాగ్రత్త

ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి హెచ్చరిక

- యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఇకపై 'ఈగల్'
- తెలంగాణ గడ్డపై మాదక ద్రవ్యాల ఆలోచన చేస్తే వెన్ను విరుస్తాం
- మత్తు ముఠాలు రాష్ట్రంలోకి రావాలంటే వణికిపోవాలి
- స్కూళ్లు, కాలేజీల్లో డ్రగ్స్ మూలాలు గుర్తిస్తే కేసులు
- మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవంలో సీఎం.. హాజరైన రామ్‌చరణ్, విజయ్ దేవరకొండ

12 లో



'ఈగల్' లోగోను ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

జూరాల భద్రమేనా?

- తాజాగా తెగిన ప్రాజెక్టు 4వ గేటు ఇనుప రోప్
- ఇదివరకే తెగిన మరో 8 గేట్ల ఇనుప రోప్‌లు
- దెబ్బతిన్న 18 గేట్ల రబ్బర్ సీళ్లు.. ఏడాదిగా లీకేజీలు
- ప్రమాదం లేదంటున్న ఇరిగేషన్ అధికారులు

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్/గద్వాల: కృష్ణా బేసిన్‌లో ఉమ్మడి రాష్ట్రంలోనే మొట్టమొదటిదైన ఇందిరా ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు భద్రతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అత్యంత వెనుకబడిన ప్రాంతమైన పాలమూరు జిల్లా వరప్రదాయినిగా నిలుస్తూ ప్రత్యక్షంగా, పరోక్షంగా ఏడు లక్షలకు పైగా ఎకరాలను సస్యశ్యామలం చేస్తున్న ఈ ప్రాజెక్టుకు ఏళ్ల తరబడి మరమ్మతులు కరువయ్యాయి. సుమారు ఏడాది కాలంగా గేట్ల నుంచి నీళ్లు లీకవుతుండగా, తాజాగా నాలుగో గేట్ ఇనుప రోప్ తెగిపోవడంతో ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో జూరాల పరిస్థితిపై 'సాక్షి' గ్రౌండ్ రిపోర్ట్..



4వ గేటులో తెగిన ఇనుప రోప్

దెబ్బతిన్న రోప్‌లు, రబ్బరు సీళ్లు..

జూరాల ప్రాజెక్ట్‌కు పై నుంచి వచ్చిన నీటిని గానీ, సాగు అవసరాలకు గానీ ఆపరేట్ (పైకెత్తడం)

మిగతా 13వ పేజీలో ▶

డేంజర్‌లో మంజీర!

- మేడిగడ్డ తరహాలో కొట్టుకుపోయిన బరాజ్ అప్రాన్
- తేల్చిన స్టేట్ డ్యామ్ సేఫ్టీ ఆర్గనైజేషన్ నివేదిక
- సీడబ్ల్యూపీఆర్ఎస్ అధ్యయనానికి సిఫారసు

13 లో


పట్టాలపై కారుతో 7 కి.మీ

- హైదరాబాద్ శివార్లలో యూపీ యువతి హల్‌చల్.. జాబ్ పోవడం, భర్తతో విభేదాలతో ఆత్మహత్యకు ఓమికా సోనీ యత్నం
- నాగులపల్లి-శంకర్‌పల్లి రైల్వే మార్గంలో రెండు గంటలపాటు హంగామా
- రైల్వే గేట్‌మెన్ సకాల స్పందనతో ఐదు రైళ్ల నిలిపివేత.. ట్రాక్ మళ్లింపులతో నిలిచిన కారు.. ఎర్రగడ్డకు యువతి తరలింపు

3 లో



మేడిన్ ఇండియా ఎలక్ట్రానిక్స్



ఎలక్ట్రానిక్స్ తయారీలో భారత్ చాలా పురోగతి సాధించింది. దశాబ్దంలో వచ్చిన మార్పును చూస్తే ఔరా అనిపించాల్సిందే. ఇందుకు స్మార్ట్‌ఫోన్స్‌ను ఉదాహరణగా చెప్పవచ్చు. యాపిల్ ఫోన్లు భారత్‌లో రూపుదిద్దుకుంటున్నాయి. 2014లో దేశంలో వినియోగించిన ఫోన్లలో 30 శాతంలోపు దేశీయంగా అసెంబుల్ అయితే.. 2024 వచ్చే సరికి ఇది 99 శాతం దాటిందంటే ఎలక్ట్రానిక్స్ రంగంలో భారత దూకుడును అర్థం చేసుకోవచ్చు. ఉపకరణాల తయారీలో వినియోగించే విడిభాగాలను దేశీయంగా ఉత్పత్తి చేయడం ద్వారా 'ఎలక్ట్రానిక్స్ హబ్'గా అవతరించే దిశగా భారత్ దూసుకుపోతోంది. - సాక్షి, స్పెషల్ డెస్క్

ఏటా కొత్త మైలురాళ్లు..

మొబైల్ ఫోన్స్, కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్, ఇండస్ట్రియల్ ఎలక్ట్రానిక్స్.. ఇలా విభాగం ఏదైనా తయారీపరంగా భారత్‌లో ఏటా కొత్త మైలురాళ్లు నమోదవుతున్నాయి. దేశంలో తయారైన ఎలక్ట్రానిక్స్ విలువ 2014–15లో రూ. 1.9 లక్షల కోట్లుగా ఉంటే 2023–24 నాటికి ఐదురెట్లు పెరిగి రూ. 9.5 లక్షల కోట్లకు చేరుకోవడం ఎలక్ట్రానిక్స్ తయారీ రంగంలో భారత్‌లో జరుగుతున్న పురోగతికి నిదర్శనం. అయితే మొబైల్ ఫోన్ల అసెంబ్లింగ్ కొత్త రికార్డులకు ప్రధానంగా రూ. 1.9 లక్షల కోట్ల ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక (పీఎల్ఐ) పథకం కారణం. 2024–25లో భారత్ నుంచి స్మార్ట్‌ఫోన్ల ఎగుమతులు రూ. 2 లక్షల కోట్లు దాటాయి. ఎలక్ట్రానిక్స్ తయారీలో వినియోగించే విడిభాగాల ఉత్పత్తిని ప్రోత్సహించేందుకు పీఎల్ఐ పథకం ప్రకటించడం ఈ రంగంలో పెద్ద అడుగు పడినట్టు అయింది.

ఈసీఎంఎస్‌తో ఊతం..

విడిభాగాల తయారీ కంపెనీలను ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది ఏప్రిల్‌లో రూ. 22,919 కోట్ల విలువైన ఎలక్ట్రానిక్స్ కాంపోనెంట్ తయారీ పథకం (ఈసీఎంఎస్) ప్రారంభించింది. ఈ పథకం 2031–32 వరకు కొనసాగుతుంది. కెమెరా మాడ్యూల్స్, డిస్‌ప్లేలు, మల్టీ లేయర్ పీసీబీలు సహా వివిధ విడిభాగాల తయారీని ప్రోత్సహించనుంది. రూ. 59,350 కోట్ల పెట్టుబడులను ఆకర్షించడం, రూ. 4.5 లక్షల కోట్ల విలువైన ఉత్పత్తి సాధించడం, కొత్తగా 91,600 మందికి ప్రత్యక్షంగా ఉపాధిని కల్పించడం లక్ష్యంగా పెట్టుకుంది. దీనికి ఇప్పటికే 70 దరఖాస్తులు వచ్చాయి. వాటిలో 80% చిన్న, మధ్యతరహా కంపెనీలు ఉన్నాయి. టాటా ఎలక్ట్రానిక్స్, ఫాక్స్‌కాన్, డిక్సన్ టెక్నాలజీస్ వంటి పెద్ద కంపెనీలు సైతం దరఖాస్తు చేసిన కంపెనీల జాబితాలో ఉన్నాయని సమాచారం.

అసెంబ్లింగ్‌ను మించితేనే..

ప్రపంచ తయారీ కేంద్రంగా భారత్ ఎదగాలంటే విడిభాగాల తయారీలో దూసుకుపోవాలి. అసెంబ్లింగ్‌కు పరిమితం కాకుండా తయారీ దిశగా అభివృద్ధి చెందాలన్నది నిపుణుల అభిప్రాయం. మొబైల్ ఫోన్లను తయారు చేయడానికి దేశీయంగా ఉన్న ఎలక్ట్రానిక్ తయారీ సేవలు లేదా కాంట్రాక్ట్ తయారీ కంపెనీలు కెమెరాలు, డిస్‌ప్లేలు, హై-ఎండ్ బ్యాటరీ ప్యాక్‌లు, సెమీకండక్టర్లు, ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డుల వంటి కీలక భాగాల దిగుమతులపై ఆధారపడుతున్నాయి. ఇతర ఎలక్ట్రానిక్ ఉత్పత్తులైన స్మార్ట్ టీవీలు, సీసీటీవీ కెమెరాలు, కంప్యూటర్లు, వేరబుల్స్, హియరబుల్స్‌ను సైతం దిగుమతి చేసుకున్న విడిభాగాలతోనే అసెంబుల్ చేస్తున్నారు. విడిభాగాలు ఇప్పటికీ చైనా, కొరియా, తైవాన్ నుంచి ప్రధానంగా సరఫరా అవుతున్నాయి. ఎలక్ట్రానిక్స్ విడిభాగాల విలువలో దిగుమతుల వాటా ఏకంగా 85–90% ఉందని ఎలక్ట్రానిక్స్ మంత్రిత్వ శాఖ పేర్కొంది.

2023-24లో రూ. 9.5 లక్షల కోట్ల ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తి


తొమ్మిదేళ్లలో అయిదు రెట్లు దూసుకెళ్లిన పరిశ్రమ

మనం వినియోగిస్తున్న ఫోన్లలో 99% భారత్‌లో తయారీ

విడిభాగాల తయారీకి రూ.22,919 కోట్ల పీఎల్ఐ పథకం

గత పదేళ్లలో స్మార్ట్‌ఫోన్ల అసెంబ్లింగ్‌లో వృద్ధి ఇలా..

విషయం	2013-14	2023-24
మొబైల్స్ తయారీ యూనిట్లు	2	300
మేడిన్ ఇండియా ఫోన్ల శాతం	26	99.2
మొబైల్స్ తయారీ విలువ	రూ.18,900 కోట్లు	రూ.4.2 లక్షల కోట్లు
మొబైల్స్ ఎగుమతులు	రూ.1,566 కోట్లు	రూ.1.2 లక్షల కోట్లు



విభాగాలవారీగా దేశంలో ఎలక్ట్రానిక్స్ తయారీ (రూ. కోట్లలో)

విభాగం	2022-23	2023-24
మొబైల్ ఫోన్స్	3,50,000	4,22,000
టీవీల వంటి కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్	99,442	1,07,627
ఇండస్ట్రియల్ ఎలక్ట్రానిక్స్	99,442	1,03,487
ఎలక్ట్రానిక్ విడిభాగాలు	82,868	86,929
ఆటో ఎలక్ట్రానిక్స్	62,151	66,378
కీలక ఎలక్ట్రానిక్స్	39,363	45,534
ల్యాప్‌టాప్స్ వంటి ఐటీ హార్డ్‌వేర్	37,291	41,395
ఎల్ఈడీ లైటింగ్	24,861	28,976
టెలికం పరికరాలు	16,574	28,976
వేరబుల్స్, హియరబుల్స్	10,459	20,697

రేపు కొత్త ఎక్సైజ్ స్టేషన్ల ప్రారంభం

- ఇన్‌చార్జిలుగా ప్రస్తుత ఎస్‌హెచ్‌వోలే

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కొత్త ఎక్సైజ్ స్టేషన్ల ప్రారంభానికి ఎట్టకేలకు ముహూర్తం కుదిరింది. అదిగో ఇదిగో అంటూ వాయిదాలు పడుతూ వస్తున్న ఈ కొత్త ఎక్సైజ్ స్టేషన్లను ఈనెల 28న ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, కమిషనర్ హరికిరణ్‌ల చేతుల మీదుగా ఈ ఎక్సైజ్ స్టేషన్లను ప్రారంభించనున్నారు. కొత్తగా ఏర్పాటు కానున్న 14 స్టేషన్లలో హైదరాబాద్, రంగారెడ్డి డివిజన్లలో 12, మెదక్, వరంగల్ డివిజన్లలో ఒక్కొక్కటి చొప్పున ఉన్నాయి. కాగా, కొత్త ఎక్సైజ్ స్టేషన్లకు ప్రస్తుత ఎస్‌హెచ్‌వోలనే ఇన్‌చార్జిలుగా కొనసాగించనున్నారు. అదే విధంగా కొత్త వాటిలో కొన్నింటికి అద్దెభవనాలను గుర్తించగా, మరికొన్నింటిని పాత స్టేషన్లలోనే విభజించనున్నారు. కొత్త ఎక్సైజ్ స్టేషన్లకు పాత స్టేషన్ల నుంచి ఆయా స్టేషన్లకు కేటాయించిన పరిధుల వారీగా కేసులను కూడా బదలాయించనున్నారు. ఇందుకు సంబంధించిన కేసుల రికార్డులతో పాటు స్వాధీన సొత్తును కూడా అప్పగించనున్నారు. ఇప్పటివరకు కొత్త స్టేషన్ల పరిధిలో పట్టుబడిన గంజాయి, డ్రగ్స్, వాహనాలు, బెల్లం, ఎన్‌డీపీఎల్ మద్యం బాటిళ్లను వాటిలోనే నిల్వ చేయాల్సిందిగా ఎక్సైజ్ కమిషనర్ ఇచ్చిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ ఎక్సైజ్ స్టేషన్లకు అవసరమైన సిబ్బంది కేటాయింపు కూడా పూర్తయిందని ఆ శాఖ వర్గాలు వెల్లడించాయి.

పట్టాలపై కారుతో 7 కిలోమీటర్లు

- హైదరాబాద్ శివార్లలో యూపీ యువతి హల్‌చల్
- ఉద్యోగం పోవడం, భర్తతో విభేదాలతో ఆత్మహత్యకు యత్నించిన ఓమికా సోనీ


రైలు పట్టాలపై కారు నడుపుతున్న ఓమికా సోనీ


అంబులెన్స్‌లో ఉస్మానియాకు తరలిస్తున్న పోలీసులు

చేవెళ్ల/శంకర్‌పల్లి: రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం కండకల్ సమీపంలో గురువారం ఉదయం ఓ యువతి రైల్వేట్రాక్‌పై హల్‌చల్ చేసింది. ఆత్మహత్య చేసుకోవడం కోసం సుమారు 7 కి.మీ.పాటు కారుతో పట్టాలపై ప్రయాణించి రైల్వే సిబ్బంది, అధికారులను ఉరుకులు పరుగులు పెట్టించింది. దాదాపు రెండు గంటలపాటు సాగిన యువతి హంగామాతో రైల్వే అధికారులు ఐదు రైళ్లను నిలిపేయాల్సి వచ్చింది. ఎట్టకేలకు పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

మానసికంగా కుంగిపోవడంతో..

రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తర ప్రదేశ్‌లోని లక్నోకు చెందిన ఓమికా సోనీ (34) నార్సింగి పరిధిలోని పుప్పాలగూడలోని ఓ అపార్ట్‌మెంట్‌లో అద్దెకు ఉంటోంది. గచ్చిబౌలిలోని 'కాప్‌జెమిని'లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న ఆమెను రెండు నెలల క్రితం కంపెనీ తొలగించింది. దీనికితోడు భర్తతో విభేదాలతో ఒంటరిగా ఉంటోంది. దీంతో ఇంటి అద్దె, ఇతర ఖర్చుల కోసం యూపీ నుంచి తల్లితండ్రులు విజయలక్ష్మి, సుధీర్‌కుమార్ ప్రతినెలా డబ్బు పంపిస్తున్నారు. ఉద్యోగం పోవడం, భర్తతో దూరంగా ఉండటంతో మానసికంగా కుంగిపోయిన ఓమికా సోనీ.. గురువారం ఉదయం వాకింగ్‌కు వెళ్లొచ్చాక ఆత్మహత్య చేసుకోవాలనుకుంది. వెంటనే తన కారు (కియా సోనిట్)లో పెంపుడు కుక్కను ఎక్కించుకొని నార్సింగి పోలీస్ స్టేషన్ ఆవరణలో ఓ చెట్టుకు కుక్కను కట్టేసింది. అనంతరం నాగులపల్లి, కండకల్ సమీపంలోని రైల్వేట్రాక్‌పై కారుతో వెళ్లింది.

ట్రాక్ మళ్లింపులతో ఆగిన కారు..

శంకర్‌పల్లి రైల్వేస్టేషన్ పరిధిలోని నాగుపల్లి, కండకల్ సమీపంలో రైల్వే ట్రాక్‌పై ఓ కారు వేగంగా వెళ్తూ స్థానికులకు కనిపించడంతో రైల్వే గేట్‌ల వద్ద స్థానికులు, సిబ్బంది ఆమెను అడ్డుకోవడానికి ప్రయత్నించారు. కానీ ఆమె కారు వేగాన్ని మరింత పెంచి దూసుకెళ్లింది. అప్రమత్తమైన రైల్వే సిబ్బంది, అధికారులకు సమాచారం అందించడంతో శంకర్‌పల్లి-సికింద్రాబాద్ మార్గంలో ఐదు రైళ్ల (గూడ్స్ రైలు, చిత్తాపూర్-సికింద్రాబాద్ మెము ఎక్స్‌ప్రెస్, బీదర్- హైదరాబాద్, నాందేడ్-రాయచూర్, ఫలక్‌నుమా- వాడి ప్యాసింజర్)ను నిలిపేశారు. చివరకు శంకర్‌పల్లి సమీపంలో పట్టాలపై ట్రాక్ మళ్లింపులు ఉండటంతో కారు పట్టాల మధ్య ఆగిపోయింది. దీంతో స్థానికులు, రైల్వే సిబ్బంది, శంకర్‌పల్లి పోలీసులు అక్కడకు చేరుకున్నారు. అయితే యువతి కారులోంచి దిగకపోవడంతో అద్దాలు పగలగొట్టారు. అయినా ఆమె దిగకుండా నాన్‌చాక్‌తో స్థానికులు, రైల్వే సిబ్బందిపై దాడికి ప్రయత్నించింది. ఎట్టకేలకు పోలీసులు ఆమెను మహిళా కానిస్టేబుళ్ల సాయంతో అదుపులోకి తీసుకొని శంకర్‌పల్లి పోలీసుస్టేషన్‌కు తరలించారు. అనంతరం ఆమెను చికిత్స నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అరుపులు కేకలతో వింతగా ప్రవర్తించడంతో ఉస్మానియా ఆస్పత్రికి, అక్కడి నుంచి ఎర్రగడ్డకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని రైల్వే పోలీస్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. కాగా, పోలీసులు ఆమెకు మంచినీళ్లు, స్నాక్స్ ఇవ్వగా తన కుక్కను చూసే వరకూ ఏమీ తీసుకోనని మొండికేసింది. దీంతో నార్సింగి పీఎస్‌కు ఫోన్ చేసిన శంకర్‌పల్లి పోలీసులు యువతికి కుక్క ఫొటోలు, వీడియో చూపించారు. సదరు యువతి యూపీలోని ఓ పోలీస్ ఉన్నతాధికారికి బంధువని తెలుస్తోంది.

వీడియో కోసం ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయగలరు

పీజీఈసెట్‌లో 21,290 మందికి అర్హత

ఫలితాలు విడుదల చేసిన ఉన్నత విద్యామండలి చైర్మన్

సాక్షి, హైదరాబాద్: పోస్టు-గ్రాడ్యుయేట్ ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించిన ఉమ్మడి ప్రవేశపరీక్ష (టీజీపీజీఈసెట్) ఫలితాల్లో 21,290 మంది అర్హత సాధించారు. పరీక్ష ఫలితాలను ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి. బాలకిష్టారెడ్డి గురువారం జేఎన్‌టీయూహెచ్‌లో విడుదల చేశారు. మొత్తం 19 విభాగాలకు 25,335 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 22,983 మంది పరీక్ష రాశారు. వారిలో 92.63 శాతం అర్హత సాధించినట్లు సెట్ కన్వీనర్ డాక్టర్ అరుణకుమారి తెలిపారు. కార్యక్రమంలో మండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఇటిక్యాల పురుషోత్తం, కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేశ్, జేఎన్‌టీయూహెచ్ రెక్టార్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన విభాగాల్లో టాపర్లు

విభాగం	టాపర్	జిల్లా	మార్కులు
సివిల్ ఇంజనీరింగ్	మూడ్ వెంకటేశ్	నిజామాబాద్	82
కంప్యూటర్ సైన్స్ అండ్ ఐటీ	షబిస్తా	రంగారెడ్డి	84
ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్	నర్సింగోజు మహేశ్	నల్లగొండ	84
ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్	మడిపల్లి శివప్రసాద్	నల్లగొండ	74

రాజకీయంగా ఎదుర్కొనలేకే తిట్ల పురాణం

- బీఆర్ఎస్ నేత ఎర్రోళ్ల శ్రీనివాస్

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ పార్టీని, నాయకులను రాజకీయంగా ఎదుర్కొనలేకే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహా కాంగ్రెస్ నాయకులు తిట్ల పురాణం అందుకుంటున్నారని బీఆర్ఎస్ నాయకుడు ఎర్రోళ్ల శ్రీనివాస్ విమర్శించారు. తెలంగాణ భవన్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ అబద్ధాల ప్రచార కమిటీకి రేవంత్ అధ్యక్షుడిగా వ్యవహరిస్తుండగా, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క ఎంపీ చామల, పార్టీ నేతలు అది శ్రీనివాస్, అద్దంకి దయాకర్, సామ రామ్మోహన్ రెడ్డి తదితరులు సభ్యులుగా వ్యవహరిస్తున్నారని ఎద్దేవా చేశారు. అబద్ధాలు చెప్పి పదవులు పొందడంలో రేవంత్‌ను కాంగ్రెస్ నేతలు ఆదర్శంగా తీసుకుంటున్నారని విమర్శించారు.

డిగ్రీ కళాశాలల్లో అధ్యాపకుల కొరతను తీర్చాలి

టీపీసీసీ చీఫ్‌కు డిగ్రీ లెక్చరర్ల ఫోరం వినతి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా 150 డిగ్రీ కళాశాలల్లో 3.20 లక్షల మందికిపైగా విద్యార్థులు చదువుకుంటున్నా...బోధించేందుకు అధ్యాపకులు లేకపోవడం దారుణమని తెలంగాణ డిగ్రీ లెక్చరర్ల ఫోరం (టీడీఎల్ఎఫ్) ఆవేదన వ్యక్తం చేసింది. ఈ మేరకు గురువారం టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌ను టీడీఎల్ఎఫ్ అధ్యక్షుడు చింతల కిషోర్ కుమార్, ట్రెజరర్ శ్రీనివాస్ కలిసి వినతి పత్రం సమర్పించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అధ్యాపకుల ఖాళీలను తక్షణమే భర్తీ చేయాలని కోరారు. యూజీసీ నిబంధనల ప్రకారం దాదాపుగా 6వేల మంది అధ్యాపకులు అవసరముండగా, ఆర్థిక శాఖ నుంచి 4,098 పోస్టులకు మాత్రమే అనుమతి వచ్చిందన్నారు. అధ్యాపకులను ఆలస్యంగా నియమించడంతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు అతిథి అధ్యాపకులకు రూ. 50 వేల వేతనం ఇవ్వాలని, డిగ్రీ కాలేజీల్లో ఉన్న ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని కోరారు.

సాక్షి ఉద్యోగ అవకాశాలు





నిషేధం ఉంది.. బదిలీలు చేయొద్దు

సర్క్యులర్ జారీ చేసిన ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో బదిలీలపై నిషేధం అమలులో ఉందని, ఈ నిబంధనను అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా హెచ్చరించారు. ఈమేరకు గురువారం ఆయన రాష్ట్ర ప్రభుత్వ శాఖలకు సర్క్యులర్ జారీ చేశారు. 2024 ఆగస్టు 1వతేదీ నుంచి ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలపై నిషేధం కొనసాగుతోందన్నారు. 'ఈ నిషేధం నుంచి కొన్ని మినహాయింపులకు మాత్రమే అనుమతి ఉంది. ఆరు నెలలకు మించి సుదీర్ఘ సెలవు నుంచి తిరిగి వచ్చిన ఉద్యోగులను ఖాళీగా ఉన్న పోస్టులలో నియమించవచ్చు. కానీ ఆరునెలల వరకు సెలవు వల్ల ఏర్పడిన ఖాళీలను బదిలీల ద్వారా భర్తీ చేయవద్దు. బదిలీల నిషేధంలో ఏదైనా సడలింపు కావాలంటే, సంబంధిత శాఖ కార్యదర్శి, ముఖ్య కార్యదర్శి, సంబంధిత మంత్రి, ఆర్థిక మంత్రి ద్వారా ముఖ్యమంత్రి ఆమోదం తప్పనిసరిగా పొందాలి. కొన్ని శాఖలు ఈ నిషేధాన్ని ఉల్లంఘిస్తూ బదిలీలు చేస్తున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. ఇలాంటి ఉల్లంఘనలను సహించేది లేదు. అన్ని శాఖలు, హెడ్స్ ఆఫ్ డిపార్ట్‌మెంట్స్, కార్పొరేషన్‌లు, ఇతర సంస్థలు ఈ ఉత్తర్వులను కచ్చితంగా పాటించాలి'అని సర్క్యులర్‌లో స్పష్టం చేశారు.

80 మంది జీతాలు నిలుపుదల

నీటిపారుదల శాఖలో ఒక ఈఎన్‌సీతో పాటు 45 మంది ఏఈఈలు, 20 మంది డీఈఈలు, 14 మంది ఈఈలు, ఎస్ఈలు కలిపి మొత్తం 80 మంది జీతాలను రాష్ట్ర ఆర్థిక శాఖ నిలుపుదల చేసింది. రాష్ట్రంలో ఉద్యోగుల బదిలీలపై సామూహిక నిషేధం అమల్లో ఉండగా, వీరిని నీటిపారుదల శాఖ బదిలీ చేసింది. తమ శాఖ నుంచి అనుమతి తీసుకోకుండానే ఈ బదిలీలు చేపట్టడం పట్ల ఆర్థిక శాఖ అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో బదిలీ అయిన ఉద్యోగుల జీతాలను నిలుపుదల చేసింది.

ఆరోగ్య శాఖలో 52 ఉద్యోగాలు

- 48 డెంటల్ అసిస్టెంట్ సర్జన్, 4 స్పీచ్ పాథాలజిస్ట్ పోస్టులు
- భర్తీకి నోటిఫికేషన్లు విడుదల చేసిన మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు
- త్వరలో 6 వేల పోస్టుల భర్తీకి కసరత్తు

సాక్షి, హైదరాబాద్: ఆరోగ్యశాఖలో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకి రెండు నోటిఫికేషన్లు విడుదలయ్యాయి. డెంటల్ అసిస్టెంట్ సర్జన్, స్పీచ్ పాథాలజిస్ట్ పోస్టులకు సంబంధించి మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు గురువారం నోటిఫికేషన్లను విడుదల చేసింది. డెంటల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులు 48 ఉండగా, స్పీచ్ పాథాలజిస్ట్ పోస్టులు 4 ఉన్నాయి. స్పీచ్ పాథాలజిస్ట్ పోస్టులకు జూలై 12 నుంచి 26వ తేదీ వరకు, డెంటల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులకు జూలై 14 నుంచి 25వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. పోస్టుల వివరాలు, విద్యార్హతలు, ఇతర వివరాలను బోర్డు వెబ్‌సైట్‌లో (https://mhsrb.telangana.gov.in/MHSRB/home.htm) అందుబాటులో ఉంచామని అధికారులు తెలిపారు.

మరో 6 వేల పోస్టుల భర్తీకి ప్రణాళిక

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వ ఆస్పత్రుల్లో 8 వేలకుపైగా పోస్టులను భర్తీ చేసింది. ఇందులో డాక్టర్లు, స్టాఫ్ నర్సులు, డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్స్ తదితర పోస్టులు ఉన్నాయి. మరో 6 వేలకుపైగా పోస్టులను భర్తీ చేసేందుకు మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. కొత్తగా భర్తీ చేయాల్సిన వాటిలో ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులు 1,284 ఉండగా, మల్టీ పర్పస్ ఫీమేల్ హెల్త్ అసిస్టెంట్ 1,930, ఫార్మసిస్ట్ 732, నర్సింగ్ ఆఫీసర్ (స్టాఫ్‌నర్స్) 2,322 పోస్టులు ఉన్నాయి. త్వరలో మెడికల్ కాలేజీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి కూడా నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు.

ఎవరైతే (తాము చేసిన పాపాలకు) పశ్చాత్తాప పడి, విశ్వసించి సత్కార్యాలు చేస్తారో...
అలాంటి వారి పాపాలను అల్లాహ్ పుణ్యాలుగా మార్చుతాడు.
– ఇస్లాం ధర్మం

సాక్షి
శుక్రవారం, 27 జూన్ 2025

దారి మరిచిన ఎస్సీవో!

ఆర్భాటంగా ఏర్పడటం, ఘనంగా లక్ష్యాలు చాటుకోవటం, కీలక సమయాల్లో మొహం చాటేయటం ప్రాంతీయ సహకార సంస్థలకు అలవాటుగా మారింది. సంక్షుభిత ప్రపంచంలో సమస్యలు రావటం సహజమే అయినా, దేశాల మధ్య తలెత్తే విభేదాలు అలాంటి సంస్థల ఉనికినే ప్రశ్నార్థకం చేస్తున్నాయి. ఆ సంస్థల వల్ల ఉద్రిక్తతలు ఉపశమిస్తాయనుకోవటం అమాయకత్వమని రుజువు చేస్తున్నాయి. సరిగ్గా 24 ఏళ్ల క్రితం ఆవిర్భవించిన షాంఘై సహకార సంస్థ (ఎస్సీవో) అవస్థ అలాగే ఉంది. ఆ సంస్థ రక్షణ మంత్రుల స్థాయి శిఖరాగ్ర సదస్సు రెండు రోజులు జరిగి గురువారం చైనాలోని చింగ్‌దావ్‌లో ముగిశాక విడుదల కావాల్సిన ఉమ్మడి ప్రకటన భారత్ కారణంగా మూలన పడింది. ఆ ప్రకటనపై సంతకం చేసేందుకు మన రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ నిరాకరించటంతో చేసేదేమీ లేక ఉమ్మడి ప్రకటన ఆలోచనే విరమించుకున్నారు. ఈ సదస్సుకు మన దేశంతోపాటు చైనా, రష్యా, పాకిస్తాన్, ఇరాన్, కిర్గిజ్ రిపబ్లిక్, కజఖ్‌స్తాన్ తదితర దేశాల రక్షణమంత్రులు హాజరయ్యారు. ఉగ్రవాదాన్ని ఎదుర్కొనటం ఎలా అనే అంశంపై సదస్సు జరిగింది.

ఎస్సీవో 2001లో షాంఘైలో ఏర్పడినప్పుడు అది అందరిలో ఆశలు రేకెత్తించింది. ఎందుకంటే మధ్య ఆసియా దేశాల భద్రత, అభివృద్ధిపైనే ప్రధానంగా కేంద్రీకరిస్తామని సంస్థ తెలిపింది. భారత్, చైనాల మధ్య ఏనాటి నుంచో సరిహద్దు వివాదాలున్నాయి. ఇక పాకిస్తాన్ నాలుగు దశాబ్దాలుగా సరిహద్దు చొరబాట్లను ప్రేరేపిస్తూ ఉగ్రవాద ఘటనలకు పాల్పడుతోంది. ఈ నేపథ్యంలో ఎస్సీవో వల్ల చైనా, పాక్‌లతో ఉన్న సమస్యలకు ఒక పరిష్కారం దొరుకుతుందన్న ఆశ ఉండేది. 2005 నుంచి మన దేశం పరిశీలక హోదాలో సదస్సులకు హాజరవుతూ వచ్చింది. 2017లో రష్యా అధినేత పుతిన్ చొరవతో భారత్ పూర్తి స్థాయి సభ్యదేశమైంది. కానీ, సభ్య దేశాల వ్యవహార శైలి దేని దారి దానిదే! ఎస్సీవో స్థాపనలో కీలక పాత్ర పోషించిన చైనాయే 2020 జూన్‌లో వాస్తవాధీన రేఖ(ఎల్ఏసీ)వద్ద చొరబాటు యత్నం చేసింది. చైనా సైన్యం రాళ్లతో, కర్రలతో, రాడ్లతో దాడి చేసి 21 మంది మన జవాన్ల ప్రాణాలు తీసింది. అంతకుముందూ, ఆ తర్వాతా చైనా తీరు అదే.

తాజా శిఖరాగ్ర సదస్సులో విభేదాలకు దారితీసిన అంశం ఆశ్చర్యం కలిగిస్తుంది. మొన్న మార్చిలో పాకిస్తాన్‌లోని బలూచిస్తాన్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ) మిలిటెంట్లు జాఫర్ ఎక్స్‌ప్రెస్ రైలును హైజాక్ చేసి పలువురు పాక్ సైనికులను హతమార్చారు. పాక్ సైన్యం కూడా ప్రతీకార దాడికి దిగి ఆ ఘటనలో పాల్గొన్న మిలిటెంట్లలో అత్యధికుల్ని కాల్చిచంపింది. ఆ మరుసటి నెలలో కశ్మీర్‌లోని పెహల్‌గామ్‌లో పాక్ నుంచి వచ్చిన ఉగ్రవాదులు నిరాయుధులైన పర్యాటకులపై దాడి చేసి 26 మందిని పొట్టనబెట్టుకున్నారు. ఈ రెండు దాడుల్లో కేవలం బలూచిస్తాన్ ఘటనను ఉమ్మడి ముసాయిదా ప్రకటన ప్రస్తావించి పెహల్‌గామ్‌ను మినహాయించింది. ఆ ఉదంతం తర్వాత మన దేశం 'ఆపరేషన్ సిందూర్' పేరిట పాక్‌లోని ఉగ్రవాద శిబిరాలపై దాడి చేయటం, పాక్ సైన్యం దాడుల్ని తిప్పికొట్టడానికి వారి వైమానిక స్థావరాలను ధ్వంసం చేయటం పతాక శీర్షికలకెక్కాయి. ఆ ఘటనల పరంపర జరిగి నిండా నెల్లాళ్లు కాకుండానే ఎస్సీవో ఎలా మరిచి పోతుంది? చైనా, పాక్‌ల మధ్య సాన్నిహిత్యం ఉంది గనుక ఆ దేశం చెప్పి నట్టల్లా ఆడి ఉమ్మడి ప్రకటన రూపొందించటం, దానిపై మన దేశం సంతకం చేయాలని కోరుకోవటం తెలివితక్కువతనం కాదా? అసలు ఇలాంటి తీరుతెన్నులు సమష్టి తత్వాన్ని దెబ్బ తీస్తాయన్న స్పృహ ఉండొద్దా?

ఎస్సీవో స్థాపించిన కాలంకన్నా ఇప్పుడు ప్రాంతీయంగా సవాళ్లు ఎన్నో రెట్లు పెరిగాయి. ఉగ్రవాదం వల్ల ఈ ప్రాంత శాంతికీ, భద్రతకూ ముప్పు ఏర్పడుతోంది. దేశాల మధ్య పరస్పరం అవిశ్వాసం కూడా గతంతో పోలిస్తే ఎంతగానో పెరిగింది. ఈ సమయంలో ఎస్సీవో వంటి సంస్థ ఈ సమస్యలకు అర్థవంతమైన పరిష్కారం ఆలోచించాలి. కానీ జరిగిందంతా వేరు. ఈ సదస్సులో ప్రసంగించిన రాజ్‌నాథ్ సింగ్ అన్నట్టు రాజ్యేతర శక్తుల వల్లా, ఉగ్రవాద ముఠాల వల్లా ప్రమాదకరమైన పరిస్థితులు ఏర్పడ్డాయి. వీటి వెనకున్న దేశాలు ఆ పరిస్థితుల పర్యవసానాలను ఎదుర్కొని తీరాలని కూడా ఆయన అన్నారు. రాజ్‌నాథ్ ప్రసంగంలో పెహల్‌గామ్, 'ఆపరేషన్ సిందూర్' ప్రస్తావనకొచ్చాయి. అయినా ముసాయిదా ప్రకటన వాటిని మరిచినట్టు నటించింది.

ఎస్సీవోను సభ్యదేశాలు తమ స్వప్రయోజనాలకు ఉపయోగించుకోవాలని చూస్తున్నాయి తప్ప సమష్టిగా అడుగులేయాలన్న సంకల్పం ప్రదర్శించటం లేదు. ఈ సంస్థ చాటున తన బెల్ట్ అండ్ రోడ్ ఇనీషియేటివ్ (బీఆర్ఐ)నూ, పలుకుబడినీ పెంచుకోవటమే చైనా ఎజెండా. సంస్థను మధ్య ఆసియా దేశాలకు మించి విస్తరింప జేయాలన్న ఉద్దేశంలోని ఆంతర్యం కూడా అదే. ఇక రష్యాకు ప్రధానంగా పాశ్చాత్య దేశాలతో లడాయి ఉంది. వాటిని ఎదుర్కొనటానికి సంస్థ ఎంతో కొంత తోడ్పడుతుందన్న ఆశ ఉంది. ఎస్సీవోను చిత్తశుద్ధితో నిర్వహిస్తే ఈ ప్రాంత దేశాలకు ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ఎస్సీవో వాటా 23 శాతం. ప్రపంచ జనాభాలో వాటా 42 శాతం. సంస్థ పెట్టినప్పుడు సభ్య దేశాలమధ్య సైనిక సహకారం, నిఘా నివేదికల్ని పంచుకోవటం, ఉగ్రవాదాన్ని ఎదుర్కొనటం, విద్య, ఇంధనం, రవాణా రంగాల్లో సహకరించుకోవటం వంటి ఉద్దేశాలున్నాయి. కానీ ఇవన్నీ మరిచి ముఠాలు కట్టి నచ్చినవారికి అనుకూలంగా వ్యవహరించదల్చుకుంటే ఇలాంటి సంస్థలెందుకు? ఈ గంభీరమైన లక్ష్య ప్రకటనలెందుకు? అందుకే ఎస్సీవో తీరు మారాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు ఆషాఢ మాసం, **తిథి:** శు.విదియ ప.1.22 వరకు, తదుపరి తదియ, **నక్షత్రం:** పునర్వసు ప.9.47 వరకు, తదుపరి పుష్యమి, **వర్జ్యం:** సా.5.41 నుండి 7.16 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.07 నుండి 8.59 వరకు, తదుపరి ప.12.26 నుండి 1.18 వరకు, **అమృత ఘడియలు:** ఉ.7.25 నుండి 8.57 వరకు, పూరీ జగన్నాథ స్వామి రథోత్సవం.

సూర్యోదయం : 5.31
సూర్యాస్తమయం: 6.34
రాహుకాలం : ఉ.10.30 నుండి 12.00 వరకు
యమగండం : ప.3.00 నుండి 4.30 వరకు

దేశమే జైలు!

అభిప్రాయం


గోపాలకృష్ణ గాంధీ

స్వతంత్ర భారతావని చరిత్రలో 1975 నుంచి 1977 వరకు కొనసాగిన ఎమర్జెన్సీ పాలనలో అధికార దుర్వినియోగం జరిగింది. ప్రజాస్వామిక హక్కులను కాలరాచారు. ప్రతిపక్షాల నిరసన గళాన్ని నొక్కేశారు. భావ వ్యక్తీకరణ స్వేచ్ఛకు సంకెళ్లు పడ్డాయి. నాటి దుశ్చర్యలను పాలక పక్షం వల్లె వేస్తుంది. భారత జాతీయ కాంగ్రెస్ వాటిని తిరస్కరించగలదా? లేదు. అందుకే "మరి మీ మాటేమిటి? అంతకంటే ఎక్కువగానే మీరు ప్రజాస్వామిక విలువలకు తిలోదకాలిస్తున్నారు కదా" అంటూ ఎదురు దాడికి దిగుతోంది. ఈ దూషణల హోరులో ఆ భయానక దుర్ఘటనల నుంచి నేర్వాల్సిన పాఠాలు కొండెక్కే ప్రమాదం ఉంది.

జైలు అనుభవాలు

ఎమర్జెన్సీలో ఆంతరంగిక భద్రతా నిర్వహణ చట్టం కింద 34,988 మంది, భారత రక్షణ చట్టం, నిబంధనల కింద 75,818 మంది అరెస్ట్ అయ్యారు. తమిళనాడు కేడర్‌లో నేనప్పుడు 30 ఏళ్ల జూనియర్ ఐఏఎస్ అధికారిగా ఉన్నాను. ఆకస్మికంగా నన్ను నేనే జైల్లో వేసుకున్నట్లు ఫీల్ అయ్యాను. నా ఆలోచనలు మనసు లోనే బందీ అయ్యాయి.

> ఎమర్జెన్సీ భయానక ఘటనలను వల్లె వేయడం కంటే మించినది ఏదైనా ప్రభుత్వం తలపెట్టాలి. ఈ సందర్భంగా 'రాజకీయ ఖైదీ'లను విడుదల చేయాలి. హింస, ద్వేషాలను రెచ్చగొట్టక పోయినా కేవలం రాజకీయ అభిప్రాయాల కారణంగా ఇక మీదట నిర్బంధించబోమని ప్రకటించాలి.

దేశ అత్యున్నత నేత జయప్రకాశ్ నారాయణ్‌ను తెల్లవారక ముందే మూడింటికి నిద్రలేపి జైలుకు తరలించారు. ఆ సమయంలో ఆయన నోటి నుంచి వచ్చిన మాట ఏమిటో తెలుసా? 'వినాశ కాలే విపరీత బుద్ధి'!

మొరార్జీ దేశాయి, వాజ్‌పేయి, అద్వానీ, చరణ్ సింగ్, చంద్రశేఖర్ వంటి జాతీయ నాయకులను లోపల వేశారు. అప్పటి సీపీఎం విద్యార్థి నాయకులు ప్రకాశ్ కారత్, సీతారామ్ ఏచూరి, బీజేపీ అరుణ్ జైట్లీలనూ ఊచలు లెక్కపెట్టించారు. ఆ తర్వాత కొద్ది నెలలకు, అజ్ఞాతంలో ఉన్న జార్జి ఫెర్నాండెజ్‌ను పట్టుకున్నారు. ఆయన మద్దతుదారు స్నేహలతారెడ్డిని జైల్లో ఉంచి చిత్రహింసలు పెట్టారు. పెరోలు మీద బయటకు వచ్చిన కొద్ది కాలంలోనే ఆమె చనిపోయారు. జైలు అనేది రాజ్యపు అత్యంత వికృత పార్శ్వం. ఇవన్నీ చూశాక ఈ భావన నాలో మరింత బలపడింది.

నేను నా ఐఏఎస్ కెరీర్‌లో కలెక్టర్‌గా ఎప్పుడూ పనిచేయలేదు. దాంతో కారాగారాల గురించి ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం కలగలేదు. జైళ్ల స్థితిగతులను స్వయంగా తెలుసుకోవాల్సిందిగా మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్నప్పుడు ఓసారి రాష్ట్రాల గవర్నర్లను కోరారు. నేరస్థుల దిద్దుబాటు గృహం (జైలు) ఎలా ఉంటుందో పశ్చిమ బెంగాల్ గవర్నర్‌గా ఉన్న ఆ సమయంలో తెలుసుకున్నాను.

ఒక జైలును చూడ్డానికి వెళ్లినప్పుడు, గడ్డం పెంచుకున్న ఓ యువకుడు నా దగ్గరకు వచ్చి హిందూస్తానీలో మాట్లాడాడు. "హుజూర్! నేను పాకిస్తాన్ వాడిని. నేను ఒక మొక్కు తీర్చుకోడానికి అజ్మీర్ షరీఫ్‌కు వెళ్లాలనుకున్నాను. నేను చేసిన పొరబాటల్లా ఒంటరిగా బయలుదేరడమే. దాంతో నన్ను టెర్రరిస్టుగా అనుమానించి నిర్బంధంలోకి తీసుకున్నారు. నేను మిమ్మల్ని ఏదీ కోరను, ఏ ఫిర్యాదూ చేయను. మీకు కృతజ్ఞతలు చెప్పాలనుకుంటున్నాను. నన్ను ఈ జైల్లో పెట్టి ఇండియా నాకు మేలు చేసింది. ఇక్కడి లైబ్రరీలో నాకు పవిత్ర ఖురాన్ కనిపించింది. మొదటిసారి నేను ఖురాన్ మొత్తం చదివాను." అతడికి ఏం బదులు చెప్పాలో అర్థం కాలేదు. వ్యంగ్యంగా అంటున్నాడా? నిజంగానే మెచ్చుకోలుగా అంటున్నాడా? ఎలా అయినా అతడు పూర్తి మేధావి.

మరో దిద్దుబాటు గృహం సందర్శించాను. అక్కడి నుంచి వెనుదిరుగుతుండగా, కట్నం చావుల కేసులో శిక్ష అనుభవిస్తున్న వృద్ధురాలు కనబడింది. ఆమెను, అక్కడి 'పాగల్ వార్డు'ను చూసి చలించి పోయాను. ఇంతలో అందులోని ఓ బెంగాలీ యువకుడు నన్ను ఆపి, "ఇక్కడ మాకు లైబ్రరీ ఉంది. దానికి మంచి పుస్తకాలు పంపించండి" అని అడిగాడు. మరోచోట, "సర్! ఒక్కరోజు ఇక్కడ టీవీ పెట్టించండి, వింబుల్డన్ ఓపెన్ చూస్తాం" అంటూ ప్రాధేయపడ్డారు. వారి కోరిక తీరింది. వారిలో హంతకులు, రేపిస్టులు, దొంగలు కూడా ఉంటారు. కానీ ఆ ఒక్కరోజు వాళ్లు మనలాగే రఫేల్ నాదల్, రోజర్ ఫెదరర్ ఫ్యాన్లుగా మారి ఆనందించారు.

కాంగ్రెస్ క్షమాపణ చెప్పాలి!

నేడు ఇండియాలో ఎమర్జెన్సీ లేదు. కానీ జైలు అనే 'హారర్ ఆఫ్ ది హారర్స్' ఉంది. ఇది బాధాకరమైన వాస్తవం కాదా? ఇవ్వాళ మాత్రం ఇండియాలో రాజకీయ నిర్బంధితులు లేరా? మన రాజకీయ ఆర్థిక వ్యవస్థలో జైలు అనే ముప్పు ఇప్పటికీ పొంచి ఉందా లేదా? ఈ సమయంలో మనం రాజకీయాలు చేయడం కంటే, చరిత్రను గౌరవించడం ముఖ్యం. కాంగ్రెస్ పార్టీకి ఇదొక సువర్ణావకాశం. నాటి మానవ హక్కుల, రాజకీయ సంప్రదాయాల, న్యాయ విధానాల అతిక్రమణలు అన్నింటికీ ఆ పార్టీ సుస్పష్టంగా క్షమాపణ కోరాలి. ఎమర్జెన్సీ కాలంలో చెరసాల పాలైన వారిలో ఇప్పటికీ జీవించి ఉన్నవారిలో వయసులో పెద్దవాడు అద్వానీజీ. కాంగ్రెస్ అధ్యక్షుడు ఆయన్ని కలిసి వ్యక్తిగత క్షమాపణ చెప్పాలని అనుకోవడంలో తప్పేమైనా ఉందా? అలాగే ప్రభుత్వానికీ ఇది సువర్ణావకాశం. ఎమర్జెన్సీ భయానక ఘటనలను వల్లె వేయడం కంటే మించినది ఏదైనా తలపెట్టాలి. ఈ సందర్భంగా 'రాజకీయ ఖైదీ'లను విడుదల చేయాలి. హింస, ద్వేషాలను రెచ్చగొట్టక పోయినా కేవలం రాజకీయ అభిప్రాయాల కారణంగా ఇక మీదట నిర్బంధించబోమని ప్రకటించాలి. తద్వారా, భారత శిక్షాచరిత్రలో కొత్త అధ్యాయాన్ని లిఖించాలి.

అంతకంటే మించిన అంశం: విచారణ కోసం ఎదురు చూస్తూ జైళ్లలో మగ్గుతున్న అండర్ ట్రయల్ ఖైదీలను వారికి పడే గరిష్ఠ శిక్షలో సగం కాలం పూర్తి చేసుకున్నట్లయితే (మరణ శిక్ష విధించదగిన నేరాభియోగాలు ఉన్న వారిని మినహాయించి), నేర శిక్షాస్మృతి 436ఎ సెక్షన్ (భారతీయ నాగరిక్ సురక్షా సంహితలోని 479 సెక్షన్)ను సవరించి వారిని విడుదల చేయాలి.

వ్యాసకర్త పశ్చిమ బెంగాల్ మాజీ గవర్నర్, ఆధునిక భారత చరిత్ర విద్యార్థి
('ది హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

నేటి మాటేమిటి?

అభిప్రాయం



ఎన్. వేణుగోపాల్

వలసానంతర భారత చరిత్రలో అత్యంత ప్రాధాన్యత గల పరిణామమైన ఎమర్జెన్సీకి ఈ జూన్ 25 అర్ధరాత్రికి యాభై ఏళ్లు నిండాయి. ప్రాథమిక హక్కులను రద్దు చేసి ప్రజల హక్కులను కొల్లగొట్టడం, అక్రమంగా నిర్బంధించడం, బలవంతపు కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సల వంటి ఇష్టారాజ్యపు విధానాలను రుద్దడం, నగర సుందరీకరణ పేరుతో నివాస స్థలాలను కూల్చి వేయడం, అధికార, న్యాయ వ్యవస్థలను సొంత ప్రయోజనాల కోసం దుర్వినియోగం చేయడం భారత రాజ్యానికి కొత్తేమీ కాదు గానీ, ఆ పనులన్నీ జరిగిన ఎమర్జెన్సీకి ఆ స్థాయిలో అపకీర్తి రావడానికి ఒక కారణం ఉంది. అప్పటివరకూ ఆ దమనకాండ అంతా సాధారణ ప్రజల మీద అమలవుతుండినప్పటికీ, ఎమర్జెన్సీయే మొదటిసారిగా మధ్యతరగతికి, తెల్లబట్టలవాళ్లకు, పార్లమెంటరీ రాజకీయ ప్రత్యర్థులకు కూడా భారత రాజ్యపు దెబ్బల రుచి చూపింది.

పాఠాలు నేర్చుకున్నామా?

ఆ ఎమర్జెన్సీ కాళరాత్రి గడిచిపోయి ఐదు దశాబ్దాలు గడిచింది. ఇందిరా గాంధీతో సహా ఆ కాళరాత్రికి కారకులైనవారిలో అత్యధికులు మరణించారు. బాధితులలో కూడా చాలా మంది మరణించారు, లేదా తమ జీవితపు చరమాంకంలో ఉన్నారు. ఇప్పుడు ఆ పాత ఎమర్జెన్సీ గురించి తెలుసుకోవడం, అధ్యయనం చేయడం, విమర్శించడం కేవలం అకడమిక్ ఆసక్తే తప్ప వర్తమాన ఆచరణ కాదు. కాకపోతే ఆ ఎమర్జెన్సీ అనుభవం తర్వాత ఈ దేశం మరెప్పుడూ అటువంటి పరిస్థితి రాగూడదని ఆకాంక్షించింది గనుక వర్తమాన పాలనలను విమర్శనాత్మకంగా చూడటం అవసరం, సముచితం కూడా!

ఎమర్జెన్సీ అనంతరం వేలాది పేజీల వివరణలు, విమర్శలు, విశ్లేషణలు వచ్చాయి. బాధితులు ఎవరైనప్పటికీ ఎమర్జెన్సీ అత్యాచారాలకు అటువంటి నిరసన రావడం సముచితమే. ఆ నిరసన వ్యాప్తి వల్లనే 1977 మార్చ్ ఎన్నికలలో ఇందిరా గాంధీ, కాంగ్రెస్ పార్టీ దిగ్గజాలు ఓటమికి గురయ్యారు. ఆ ఎన్నికల్లో గెలిచిన జనతా పార్టీ ప్రభుత్వం ఎమర్జెన్సీ అత్యాచారాలను పరిశోధించడానికి, విచారణ జరపడానికి మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జయంతిలాల్ ఛోటాలాల్ షా నేతృత్వాన 1977 మేలో ఒక కమిషన్‌ను నియమించింది. షా కమిషన్‌గా సుప్రసిద్ధమైన ఈ కమిషన్ అనేకమంది సాక్షులను విచారించి, సాక్ష్యాధారాలు సేకరించి 1978 మార్చ్, ఏప్రిల్, ఆగస్ట్‌లలో మూడు భాగాల నివేదిక సమర్పించింది.



> "ప్రభుత్వంలోనో, ప్రభుత్వానికి దగ్గరగానో ఉన్న ఒక వ్యక్తి, లేదా బృందం వ్యక్తిగత ప్రయోజనాలు నెరవేర్చడం కోసం అధికారిక యంత్రాంగాన్ని దుర్వినియోగం చేయడం భవిష్యత్తులో జరగకుండా ఉండే చర్యలను చేపట్టడం వర్తమాన, భావి తరాల కోసం జాతి చేయవలసిన పని అని" జస్టిస్ షా 1978లో రాశారు. ఆ హితవచనంలో ప్రస్తావించిన వ్యక్తీ, బృందమూ మారి ఉండవచ్చు గాని నేటికీ పరిస్థితి ఏమాత్రం మారలేదు.

వర్తమాన వాస్తవం

ఆ 543 పేజీల నివేదికను ఇప్పుడు చదువుతుంటే అదేదో గడిచిపోయిన దుర్ఘటనల మీద చారిత్రక పత్రం అనిపించదు. నామవాచకాలు మారిస్తే, గత పదకొండు సంవత్సరాల పాలనా వ్యవహారాల మీద నివేదిక కావచ్చునని అనిపిస్తుంది. ఈ పాలకులు ఆ ఎమర్జెన్సీ బాధితులు కావడం, ఇప్పటికీ ఆ ఎమర్జెన్సీని నిరంతరం విమర్శిస్తుండటం, తమ పాలనలో పదకొండు సంవత్సరాలుగా అవే ఎమర్జెన్సీ విధానాలను ఎమర్జెన్సీ ప్రకటించకుండానే అమలు చేస్తుండటం క్రూరమైన పరిహాసం.

"ఆచరణలో, ప్రభుత్వానికి అనుకూలంగా లేని వార్తలను తొక్కిపట్టడానికి, ప్రభుత్వానికి అనుకూలమైన వార్తలను పైకెత్తడానికి, కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులకు అనుకూలంగా లేని వార్తలను తొక్కిపట్టడానికి సెన్సార్‌షిప్ విధానాన్ని దుర్వినియోగం చేశారు" అని అప్పుడు షా కమిషన్ నివేదిక రాసింది. ఇప్పుడు అధికారికంగా సెన్సార్‌షిప్ విధానం ఏమీ లేదు. కానీ ప్రభుత్వానికి, అధికార పార్టీకి అనుకూలంగా లేని వార్తలను తొక్కిపెట్టే విధానాలు ముమ్మరంగా సాగుతున్నాయి.

అప్పుడు ఎమర్జెన్సీలో ఆంతరంగిక భద్రతా చట్టం (మెయింటెనెన్స్ ఆఫ్ ఇంటర్నల్ సెక్యూరిటీ యాక్ట్– మీసా), డిఫెన్స్ ఆఫ్ ఇండియా రూల్స్ అనే ముందస్తు నిర్బంధ చట్టాలను వినియోగించుకుని, కారణాలు చూపకుండా, విచారణ జరపకుండా లక్ష మందిని ఇరవై ఒక్క నెలల పాటు నిర్బంధించారు. ఇప్పుడు బెయిల్ ఇవ్వడాన్ని కఠినతరం చేసే సవరణలతో చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (అన్‌లాఫుల్ యాక్టివిటీస్ ప్రివెన్షన్ యాక్ట్) కింద వేలాది మందిని నిర్బంధించి, అబద్ధపు ఆరోపణలతో, విచారణ లేకుండా ఏళ్ల తరబడి నిర్బంధిస్తున్నారు. అప్పుడు ఒక్క తుర్క్‌మన్ గేట్ మురికివాడ కూల్చివేత జరిగితే, ఇప్పుడు కనీసం అర డజను రాష్ట్రాల నుంచి కూల్చివేతల వార్తలు నిరంతరం వస్తున్నాయి.


"ప్రభుత్వంలోనో, ప్రభుత్వానికి దగ్గరగానో ఉన్న ఒక వ్యక్తి, లేదా ఒక బృందం వ్యక్తిగత ప్రయోజనాలు నెరవేర్చడం కోసం అధికారిక యంత్రాంగాన్ని దుర్వినియోగం చేయడం భవిష్యత్తులో జరగకుండా ఉండే చర్యలను చేపట్టడం వర్తమాన, భావి తరాల కోసం జాతి చేయవలసిన పని" అని జస్టిస్ షా 1978లో రాశారు. ఆ హితవచనంలో ప్రస్తావించిన వ్యక్తీ, బృందమూ మారి ఉండవచ్చు గాని నేటికీ పరిస్థితి ఏమాత్రం మారలేదు. యాభై ఏళ్లు నిండిన సందర్భంగా చాలా మంది నాటి ఎమర్జెన్సీని సరిగ్గానే తలచు కున్నారు. కానీ కొనసాగుతున్న అప్రకటిత ఎమర్జెన్సీ సంగతి ఏమిటి?

వ్యాసకర్త 'వీక్షణం' సంపాదకుడు

ఇన్ బాక్స్

గండం గడిచినట్లేనా?!

ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికాల యుద్ధం నేపథ్యంలో హోర్ముజ్ జల సంధిని మూసివేస్తామని ఇరాన్ ప్రకటించడం కలకలం రేపింది. దీనికి ఎందుకంత ప్రాధాన్యం? ఇది ఇరాన్‌కు ఉత్తర భాగంలో, ఒమన్, యూఏఈ దేశాలకు పశ్చిమ భూభాగంలో ఉంటుంది. ఈ జలసంధి ఎంట్రీ, ఎగ్జిట్ ప్రాంతాల్లో 50 కి.మీ. వెడల్పుతో ఉంటుంది. లోతు చాల ఎక్కువగా ఉండి పెద్ద రవాణా నౌకలు కూడా ప్రయాణించడానికి అనువుగా ఉంటుంది. ఇది గల్ఫ్ దేశాలను అరేబియా సముద్రానికి అనుసంధానిస్తుంది. హోర్ముజ్ జలసంధి ద్వారా ఒక్క ఇరాన్ కాకుండా ఇంకా గల్ఫ్ దేశాలైన ఇరాక్, కువైట్, ఖతర్, సౌదీ అరేబియా, యూఏఈలు కూడా ఆయిల్ సరఫరా చేస్తుంటాయి. అమెరికాలోని ఎనర్జీ ఇన్ఫర్మేషన్ అడ్మినిస్ట్రేషన్ అంచనా ప్రకారం 2023లో ఈ జలసంధి ద్వారా 2 కోట్ల బారెళ్ల క్రూడ్ ఆయిల్ని ఆ యా గల్ఫ్ దేశాలు సరఫరా చేశాయి. దీని విలువ సుమారు 600 బిలియన్ల డాలర్లు. ఇది ఒక్క ఏడాదిలో జరిగిన ఆయిల్ సరఫరా విలువ.



హోర్ముజ్ జలసంధి

యూకే ఇంటెలిజెన్స్ ఏజెన్సీ మాజీ డైరెక్టర్ సర్ అలెక్ యూన్గర్ అంచనా ప్రకారం ఈ జలసంధిని మూసివేయడం వల్ల ఆయిల్ రేట్లు అంచనాకు మించి పెరిగే అవకాశముంటుంది. ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థలు తీవ్రంగా ప్రభావితమవుతాయి. ఈ జలసంధి ద్వారా ముఖ్యంగా ఆసియా దేశాలకు ఆయిల్ సరఫరా అవుతోంది. చైనా దిగుమతి చేసుకొనే 90% ఆయిల్ ఒక్క ఇరాన్ నుంచే సప్లై అవుతుంది. ఇండియా 60% క్రూడ్‌ను దిగుమతి చేసుకుంటోంది. దక్షిణ కొరియా 60%, జపాన్ ఉపయోగించే ఆయిల్‌లో మూడొంతులు ఈ జలసంధి ద్వారానే దిగుమతి అవుతోంది. ముఖ్యంగా చైనా, దక్షిణ కొరియాలో ఉత్పత్తి అయ్యే అన్ని వస్తువుల ధరలూ దీని మూసివేత వల్ల బాగా పెరిగే అవకాశం ఉంటుంది. ఈ దేశాల వస్తువులు ఒక్క అమెరికానే కాకుండా ప్రపంచంలోని అనేక దేశాలు వాడటంతో అంతటా ద్రవ్యోల్బణం పెరిగి పోతుంది. అయితే ప్రస్తుతం యుద్ధం ఆగిపోయింది కనుక హోర్ముజ్ మూసివేత నిర్ణయాన్ని విరమించినట్టు వస్తున్న వార్తలు నిజమైతే అదే పదివేలు!

– డా॥ కొండి సుధాకర్ రెడ్డి । లెక్చరర్, 89850 37713

ప్రైవేటు శ్రామికుల మీద ఎందుకంత కక్ష?

సందర్భం


దానీ

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రైవేటురంగ శ్రామికుల పని గంటల్ని పెంచింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో శ్రామికులు రోజుకు గరిష్ఠంగా 8 గంటలు పని చేసేవారు. కొత్త ఆంధ్రప్రదేశ్‌లో దాన్ని 9 గంటలకు పెంచారు. ఇప్పుడు మళ్ళీ దాన్ని 10 గంటలకు పెంచారు.

పెట్టుబడుల్ని భారీగా ఆకర్షించేందుకు చేస్తున్న ప్రయత్నాల్లో పని గంటల పెంపు కూడా ఒకటని ప్రభుత్వ వర్గాలు అంటున్నాయి. కార్మిక శక్తి చౌకగా లభిస్తున్న ఆంధ్రప్రదేశ్‌లో పని గంటల్ని కూడా పెంచితే పరిశ్రమలు నెలకొల్పేందుకు కార్పొరేట్ సంస్థలు మొగ్గు చూపుతాయని ప్రభుత్వం వాదిస్తోంది. ఇప్పటికే ఇన్ఫోసిస్, ఎల్ అండ్ టీ సంస్థల అధినేతలు వారానికి 70 గంటలు, 90 గంటలు పనిచేయాలని కోరుతున్నారు. వాళ్ళ కోరికలకు అనుగుణంగా ఫ్యాక్టరీలు, కార్మిక చట్టాలను మార్చాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భావిస్తున్నట్టుంది.

ఇక్కడో విచిత్రం ఉంది. 10 గంటల పనిదినం అనేది ప్రైవేటు రంగ శ్రామికులకు మాత్రమే! ప్రభుత్వ, ప్రభుత్వరంగ సంస్థల ఉద్యోగుల పనివేళలు 10 నుండి 6 గంటల వరకు 8 గంటల పనిదినంగానే కొనసాగు తాయి. ప్రభుత్వమే ప్రభుత్వ, ప్రైవేటు సిబ్బంది మధ్య వివక్ష చూపడానికి సిద్ధపడింది. ఈ వివక్ష పని గంటలతో మాత్రమే ఆగడం లేదు. జీత భత్యాల్లోనూ అసాధారణ వ్యత్యాసం రూపంలో ఉంది. ప్రైవేటు శ్రామికుల పని గంటలు పెంచిన ప్రభుత్వం కనీస వేతనాలను పెంచాలనే కనీస ఆలోచన చేయలేదు.

వారానికి ఆరు రోజులు, రోజుకు 8 గంటలు అనే ప్రమాణానికి అనేక చారిత్రక, సామాజిక, శారీరక ధర్మాల కారణాలున్నాయి. యుక్త వయస్సు దాటిన ప్రతి మనిషి మొదటగా, ఆహారం, నిద్ర, మైథునాల వంటి శరీర ధర్మాల్ని పాటించాల్సి ఉంటుంది. ఆ పిదప కుటుంబం, బంధుమిత్రులు, కళాసాహిత్య, రాజకీయ ఆసక్తుల వంటి సామాజిక ధర్మాలను పాటించాల్సి ఉంటుంది. ఆ తరువాత, బతుకు తెరువు కోసం ఓ వృత్తిని ఎంచుకుని పనిచేయాల్సి ఉంటుంది. వీటిల్లో ప్రతీదీ ముఖ్యమైనదే కనుక ఒక రోజులో ఉండే 24 గంటల్లో ఈ మూడు ధర్మాలకు సమానంగా చెరో 8 గంటలు కేటాయించాలనే ప్రమాణం ప్రపంచ వ్యాప్తంగా నెలకొంది. అయితే, అత్యాశాపరులుగా మారిన కార్పొరేట్ సంస్థల్ని సంతృప్తి పరచడానికి ప్రభుత్వాలు కార్మికుల్ని వేధించడానికి సిద్ధపడుతున్నాయి. ఇదొక అమానవీయ పరిణామం.

ప్రజల సౌకర్యాలను పెంచడానికి రోడ్లు, నీటి పారుదల ప్రాజెక్టులు, విద్యా, ఆరోగ్య సదుపాయాలు, అల్పాదాయ వర్గాలకు మెరుగైన జీవితాన్ని అందించడానికి సంక్షేమ పథకాలు వగైరాలను ప్రభుత్వాలు నిరంతరం అభివృద్ధి చేస్తుండాలి. వీటికయ్యే ఖర్చును కూడా ప్రభు త్వాలు ప్రజల నుండి పన్నుల రూపంలో వసూలు చేస్తాయి. ఈ వ్యవస్థను నిర్వహించడానికి ఒక కార్య నిర్వాహక వర్గం కూడా కావాలి. దానినే మనం సామాన్య భాషలో 'ప్రభుత్వ ఉద్యోగులు' అంటున్నాం. అయితే, ఇటీవలి కాలంలో ప్రభుత్వ ఉద్యోగుల వ్యవస్థ నిర్వహణ వ్యయం అనూహ్యంగా పెరిగిపోతున్నది. ఇది ఎంతటి ప్రమాదకర స్థాయికి చేరుకుందంటే ప్రభుత్వం వసూలు చేస్తున్న పన్నుల రెవెన్యూ మొత్తాన్ని ప్రభుత్వ ఉద్యోగుల జీతభత్యాలకే ఖర్చుపెట్టేస్తున్నారు.



> ప్రభుత్వమే ప్రభుత్వ, ప్రైవేటు సిబ్బంది మధ్య వివక్ష చూపడానికి సిద్ధపడింది. ఈ వివక్ష పని గంటలతో మాత్రమే ఆగడంలేదు. జీతభత్యాల్లోనూ అసాధారణ వ్యత్యాసం రూపంలో ఉంది.

ఏపీ ఎన్జీవో సంఘం 20వ మహాసభలు 2017 నవంబరు 4న తిరుపతిలో జరిగాయి. అందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న అప్పటి ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు ఆ వేదిక మీద నుండే ఒక దిగ్భ్రాంతికరమైన విషయాన్ని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వానికి ప్రజల నుండి పన్నుల రూపంలో వస్తున్న మొత్తం ఆదాయంలో 94 శాతం ప్రభుత్వ ఉద్యోగ జీత భత్యాలు, పెన్షన్లకు సరి పోతున్నదన్నారు.

ఏ ప్రభుత్వం అయినా సరే రాష్ట్ర అభివృద్ధి కోసమే ప్రజల నుండి పన్నుల్ని వసూలు చేస్తుంది. అందులో ఓ నాలుగో వంతు (25 శాతం) నిర్వహణ ఖర్చులకు కేటాయించినా 75 శాతం రాష్ట్ర అభివృద్ధి కోసం వెచ్చించాలి. కానీ అలా జరగడం లేదు. వసూలు చేస్తున్న పన్నుల్లో 94 శాతం ఉద్యోగుల జీత భత్యాల కోసం పోతోంది. దానితో, అభివృద్ధి పనులకు ప్రభుత్వం ప్రతి సంవత్సరం అప్పులు చేయాల్సి వస్తున్నది.

ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ తరువాత అమరావతిలో రాజధాని నిర్మాణం మొదలెట్టినపుడు రాష్ట్ర సచివాలయ ఉద్యోగులు హైదరాబాద్‌ను వదిలి రావడానికి సిద్ధపడలేదు. వారి విషయంలో ప్రభుత్వం బుజ్జగింపు ధోరణిని ప్రదర్శించింది. పని దినాల్ని వారా నికి 5 రోజులకు తగ్గించింది. పనివేళల్ని రోజుకు అరగంట తగ్గించింది. వారు రోజూ హైదరాబాద్ నుండి వచ్చిపోవడానికి వీలుగా ఒక ప్రత్యేక రైలును కూడా ఏర్పాటు చేశారు. 12796 నంబరుగల లింగంపల్లి సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ఉదయం 9 గంటల 30 నిమిషాలకు మంగళగిరి వస్తుంది. 12795 నంబరుగల లింగంపల్లి సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ సాయంత్రం 5 గంటల 46 నిమిషాలకు మంగళగిరి రైల్వేస్టేషన్‌లో బయలు దేరు తుంది. మంగళగిరిలో రైలు దిగి 10 గంటల లోపు సచివాలయానికి చేరుకోవడం, అలాగే, ఆఫీసులో 5.30 నిమిషాలకు బయలుదేరి మంగళగిరిలో ట్రెన్ ఎక్కడమూ అసాధ్యం. కనీసం ఉదయం, సాయంత్రాల్లో అర గంట పని సమయాన్ని తగ్గించాల్సిందే!

సచివాలయ ఉద్యోగులకు ఈ సౌకర్యాన్ని కలుగజేసి పదేళ్ళు దాటుతోంది. ఈ సౌకర్యాన్ని మరో ఏడాది పాటు కొనసాగిస్తూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే. విజయానంద్ జూన్ 20న కొత్త జీవో ఒకటి జారీ చేశారు. ప్రభుత్వానికి తన ఉద్యోగులంటే ఎందుకింత ప్రేమ, ప్రైవేటు శ్రామికులంటే ఎందుకింత ద్వేషం? ఎవరికయినా రావలసిన సందేహమే!

వ్యాసకర్త సమాజ విశ్లేషకులు
మొబైల్: 90107 57776

క్లుప్తంగా...

ఇద్దరు మహిళా మావోయిస్టులు మృతి

- నారాయణపూర్ జిల్లాలో ఎదురుకాల్పులు

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని నారాయణపూర్ జిల్లాలో గురువారం ఉదయం జరిగిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు మహిళా మావోయిస్టులు మృతి చెందారు. నారాయణపూర్ జిల్లా కోహక్‌మెట్ట పోలీస్‌స్టేషన్ పరిధి అబూజ్‌మడ్ అడవుల్లో మావోయిస్టులు సంచరిస్తున్నారనే నిఘా వర్గాల సమాచారంతో.. నారాయణపూర్, దంతెవాడ జిల్లాలకు చెందిన డీఆర్‌జీ, ఎస్టీఎఫ్ బలగాలు సంయుక్తంగా కూంబింగ్ చేపట్టాయి. ఈ క్రమంలో బలగాలకు తారసపడిన మావోయిస్టులు కాల్పులు మొదలుపెట్టగా.. పోలీసు బలగాలు సైతం ఎదురుకాల్పులు జరిపాయి. ఈ ఘటనలో ఇద్దరు మహిళా మావోయిస్టులు మృతి చెందారు. ఘటనాస్థలి నుంచి రెండు తుపాకులు, మందుగుండు సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అయితే, మృతులను గుర్తించాల్సి ఉందని ఆ రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు.

ఆన్‌లైన్ బెట్టింగ్‌కు యువకుడు బలి


అఖిలేశ్

ఇల్లందకుంట: ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లో రూ. లక్షలు పోగొట్టుకుని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట మండలం శ్రీరాములపల్లికి చెందిన గుత్తికొండ రాజయ్య టైలరింగ్ చేస్తుంటాడు. ఇతని చిన్న కొడుకు అఖిలేశ్ (22) బీటెక్ ఫెయిలై ఇంటివద్ద ఉంటున్నాడు. గతంలో జల్సాల కోసం తన స్నేహితుల వద్ద అప్పులు చేశాడు. ఆ అప్పును తల్లిదండ్రులు తీర్చారు. అయినా తీరు మార్చుకోని అఖిలేశ్ తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలనుకున్నాడు. మళ్లీ స్నేహితుల వద్ద అప్పు చేశాడు. వాటిని ఆన్‌లైన్ బెట్టింగ్‌లో పెట్టి నష్టపోయాడు. దీనికి తోడు లోన్‌యాప్స్ లోనూ రుణాలు తీసుకున్నాడు. వాటిని తీర్చే మార్గంలేక గురువారం ఉదయం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకు న్నాడు. మృతుడి తండ్రి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

అప్పు తీర్చలేక..

- కౌలు రైతు బలవన్మరణం


సమ్మయ్య

ములుగు రూరల్: అప్పుల బాధతో ఒక కౌలు రైతు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ములుగు జిల్లా ములుగు మండలం జగ్గన్నపేటలో బుధవారం రాత్రి జరిగిన ఈ సంఘటన వివరాలివి. జగ్గన్నపేట గ్రామానికి చెందిన జట్టి సమ్మయ్య (42)కు సొంత భూమి లేదు. దీంతో గత ఏడాది 4 ఎకరాలు, ఈ ఏడాది 3 ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని వ్యవసాయం చేశాడు. పంట పెట్టుబడికి అప్పులు చేశాడు. సమ్మయ్యకు ఇద్దరు కుమార్తెలు ఉండగా, పెద్ద కుమార్తె వివాహం గత సంవత్సరం జరిపించాడు. పెళ్లి కోసం, పెట్టుబడి అప్పు మొత్తం రూ.8 లక్షలు అయ్యింది. ఈ అప్పు తీర్చలేక మనస్తాపానికి గురై ఈ నెల 5వ తేదీన పురుగు మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు హనుమకొండలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స అందించారు. వైద్యానికి డబ్బుల్లేక నాలుగు రోజుల క్రితం వరంగల్ ఎంజీఎంకు తరలించి చికిత్స అందించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. మృతుని భార్య సుమలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్‌రావు తెలిపారు.

వాగులో యువకుడు గల్లంతు

- ఆదిలాబాద్ జిల్లాలో ఘటన


వాగులో కొట్టుకుపోతున్న శేఖర్

సాక్షి, ఆదిలాబాద్/ఆదిలాబాద్ రూరల్: ఆదిలాబాద్ జిల్లా ఆదిలాబాద్ రూరల్ మండలం లాండసాంగ్వి వాగులో గురువారం ఉదయం వరద ప్రవాహంలో జక్కార్ శేఖర్ (19) అనే యువకుడు గల్లంతయ్యాడు. ఆదిలాబాద్ పట్టణంలోని డాల్డా కంపెనీ ప్రాంతానికి చెందిన శేఖర్ తన స్నేహితులు వికాస్, జాదవ్ కృష్ణలతో కలసి వాగులో చేపలు పట్టడానికి వెళ్లాడు. చేపలు పట్టే ప్రయత్నంలో పట్టు తప్పిన శేఖర్ వాగులో పడి కొట్టుకుపోయాడు. అతడిని కాపాడేందుకు స్నేహితుడు వికాస్ ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకుని శేఖర్ కోసం గాలింపు చేపట్టారు. అయితే రాత్రివరకు అతని ఆచూకీ లభించలేదు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. బుధవారం రాత్రి నుంచి గురువారం వేకువజాము వరకు జిల్లాలో భారీ వర్షం కురిసింది. దీంతో వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి.

'హనీమూన్ మర్డర్'లా పోలీసులకు చిక్కొద్దని..

ప్రియుడితో కలిసి భర్తను హత్య చేయించిన భార్య

- ఎనిమిది మంది అరెస్టు.. రిమాండ్
- తేజేశ్వర్ హత్య కేసు వివరాలను వెల్లడించిన గద్వాల ఎస్పీ శ్రీనివాసరావు


తిరుమలరావు
రాజు
పరుశరాముడు
నిందితులను తీసుకువస్తున్న పోలీసులు
ఐశ్వర్య
సుజాత

గద్వాల క్రైం: ప్రైవేట్ సర్వేయర్ తేజేశ్వర్ హత్య కేసును జోగుళాంబ గద్వాల జిల్లా పోలీసులు ఛేదించారు. మేఘాలయ హనీమూన్ మర్డర్ తరహాలో హత్య చేయించి.. అక్కడిలా తాము పోలీసులకు దొరకకుండా జాగ్రత్తలు తీసుకోవాలని.. అనంతరం లడాఖ్ లేదా అండమాన్‌కు వెళదామని ప్రియుడు, ప్రేయసి ప్లాన్ వేశారు. ఇందుకోసం ముందుగానే రూ.20 లక్షల రుణం కూడా తీసుకున్నారు. కానీ పోలీసులు సీసీ ఫుటేజీ, సెల్ సిగ్నల్స్ ఆధారంగా కేసును ఛేదించారు. రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపిన తేజేశ్వర్ హత్య కేసు వివరాలను ఎస్పీ శ్రీనివాసరావు గురువారం వెల్లడించారు.

తేజేశ్వర్‌తో ఐశ్వర్య పరిచయం ఇలా..

గద్వాలలోని గంటవీధికి చెందిన తేజేశ్వర్(32) ప్రైవేటు సర్వేయర్. సుజాత కర్నూలులోని ఓ ప్రైవేట్ బ్యాంకులో స్వీపర్‌గా పనిచేస్తోంది. ఈమె పుట్టినిల్లు గద్వాలలోని జమిచేడ్. ఈమె కూతురే ఐశ్వర్య అలియాస్ సహస్ర. తల్లీకూతురు తరచూ గద్వాలలోని బంధువుల ఇంటి వచ్చేవారు. ఈ క్రమంలోనే తేజేశ్వర్‌తో ఐశ్వర్యకు పరిచయం ఏర్పడింది. ఇద్దరి కులాలు ఒక్కటే కావడంతో పెద్దలు పెళ్లి చేయాలనుకున్నారు. ఇదిలా ఉండగా, సుజాతకు బ్యాంకు మేనేజర్ తిరుమలరావుతో వివాహేతర సంబంధం ఉంది. ఈ క్రమంలో తిరుమలరావు ఐశ్వర్యతోనూ కొంతకాలంగా వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఈ విషయాన్ని దాచి ఎలాగైనా తన కూతురికి పెళ్లి చేయాలని సుజాత అనుకుంది. తేజేశ్వర్‌తో ఐశ్వర్య నిశ్చితార్థం చేయించింది. ఇది ఇష్టంలేని ఐశ్వర్య తిరుమలరావుతో కలిసి ఇంటి నుంచి వెళ్లిపోయింది. దీంతో పెద్దల సమక్షంలో నిశ్చితార్థాన్ని రద్దు చేసుకున్నారు. కొన్ని రోజుల తర్వాత తేజేశ్వర్, ఐశ్వర్య ఫోన్‌లో మాట్లాడుకొని పెద్దల సమక్షంలో మే 18న బీచుపల్లి ఆలయంలో వివాహం చేసుకున్నారు. పెళ్లి అనంతరం కూడా ఐశ్వర్య తిరుమలరావుతో తరచూ ఫోన్‌లో మాట్లాడేది. ఈ విషయాన్ని గ్రహించిన తేజేశ్వర్ భార్యను మందలించాడు. దీంతో తమ బంధానికి అడ్డు వస్తున్నాడనే నెపంతో ఐశ్వర్య, తిరుమలరావు కలిసి తేజేశ్వర్‌ను హత్య చేసేందుకు పథకం వేశారు.


నగేశ్


మోహన్

నమ్మించి.. హత్య చేశారిలా..: తేజేశ్వర్‌ను హత్య చేసేందుకు కర్నూలు జిల్లా కృష్ణానగర్‌కు చెందిన సుపారీగ్యాంగ్ కుమ్మరి నాగేష్, చాకలి పరుశరాముడు, చాకలి రాజుతో రూ.6 లక్షలకు ఒప్పందం చేసుకున్నారు. దీంతో ఆ గ్యాంగ్ ఫోన్ ద్వారా తేజేశ్వర్‌తో పరిచయం పెంచుకుంది. మీ జిల్లాలో తక్కువ ధరలకు భూములు ఉంటే చూపించండి అందుకు తగిన పారితోషికం ఇస్తామని నమ్మించారు. సర్వేయర్ కావడంతో తేజేశ్వర్ వారితో పలుమార్లు వెళ్లి వచ్చాడు. ఈ క్రమంలోనే ఈ నెల 17వ తేదీన భూములు కొనుగోలు చేస్తామని సుపారీ గ్యాంగ్ ఏపీ 39 యూకే 3157నంబర్ గల కారులో గద్వాలకు వచ్చారు. కారులో తేజేశ్వర్ ఎక్కించుకొని పలు ప్రాంతాలు తిరిగి వస్తుండగా, పథకంలో భాగంగా గద్వాల మండలం వీరాపురం శివారులో పరుశరాముడు మొదట కొడవలితో తేజేశ్వర్‌పై దాడి చేశాడు. ఆ వెంటనే చాకలి రాజు, కుమ్మరి నగేష్ కొడవలి, కత్తితో విచక్షణా రహితంగా దాడి చేశారు. దీంతో తేజేశ్వర్ కారులోనే మృతి చెందాడు. ఈ విషయాన్ని నగేష్ వాట్సప్ కాల్ ద్వారా తిరుమలరావుకు చెప్పగా, మృతదేహాన్ని పంచలింగాల దగ్గరలో ఉన్న ఒక వెంచర్ వద్దకు తీసుకు రావాల్సిందిగా ఆదేశించాడు. బీచుపల్లి బ్రిడ్జి మీదుగా వస్తున్న క్రమంలో తేజేశ్వర్ ఫోన్, ల్యాప్‌టాప్ బ్యాగ్‌ను కృష్ణానదిలో పడేశారు. అక్కడకు వచ్చాక తిరుమ లరావు తేజేశ్వర్ మృతదేహాన్ని చూసి నిర్ధారించుకు న్నాడు. అనంతరం వారికి రూ.లక్ష అందజేశాడు. అనంతరం సుపారీ గ్యాంగ్ నంద్యాల సమీపంలోని పాణ్యం మండలంలోని గాలేరు నగరి కెనాల్ సమీపంలోని జమ్ములో తేజేశ్వర్ మృతదేహాన్ని పడేడి కర్నూలుకు వచ్చారు. తిరుమలరావు తండ్రి తిరుపతయ్య ద్వారా 19, 20 తేదీల్లో 2.50 లక్షల నగదు తీసుకున్నారు

జీపీఎస్ ట్రాకర్ అమర్చి.. నిఘా పెట్టి

తేజేశ్వర్‌ను హత్య చేసేందుకు సుపారీ గ్యాంగ్ పలుమార్లు యత్నించింది. ఈ క్రమంలోనే తిరుమలరావు జీపీఎస్ ట్రాకర్‌ను కొనుగోలు చేసి ఓ ఇన్‌ఫార్మర్ సహాయంతో తేజేశ్వర్ బైక్‌కు అమర్చారు. అప్పటి నుంచి తేజేశ్వర్ విషయాలను నిత్యం తిరుమలరావు ఐశ్వర్యతో తెలుసుకుంటూ ఓ పథకం వేసుకున్నారు. తేజేశ్వర్‌ను హత్య చేసిన తర్వాత లడాఖ్ లేదా అండమాన్‌కు వెళ్లేందుకు ప్లాన్ చేసుకున్నారు.

నన్నూర్ టోల్‌ప్లాజా వద్ద కారు వెళుతున్న సీసీ ఫుటేజీ, గద్వాలలో కారులో తేజేశ్వర్‌ను తీసుకెళ్లిన ఫుటేజీ, సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా నిందితులను గుర్తించారు. గురువారం పుల్లూర్ చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో తిరుమలరావు, నగేష్, పరుశరాముడు, చాకలి రాజు కారులో హైదరాబాద్‌కు పారిపోతుండగా పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. గద్వాలలో ఉంటున్న ఐశ్వర్య, మోహన్,

నిందితులను పట్టుకున్నారిలా..

కర్నూలు ఉంటున్న తిరుపతయ్య, సుజాతలను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. వారి నుంచి హత్యకు వినియోగించిన కారు, రెండు కొడవళ్లు, 10 సెల్‌ఫోన్లు, రూ.1.20 లక్షలు, కత్తి, జీపీఎస్ ట్రాకర్ స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ వివరించారు. కేసులో ఏ1 తిరుమలరావు, ఏ2 ఐశ్వర్య అలియాస్ సహస్ర, ఏ3 కుమ్మరి నగేష్, ఏ4 చాకలి పరుశరాముడు, ఏ5 చాకలి రాజు, ఏ6 మోహన్, ఏ7 తిరుపతయ్య , ఏ8 సుజాత ఉన్నారు. హత్య కేసు విచారణలో పాల్గొన్న డీఎస్పీ మొగిలయ్య, గద్వాల సీఐ శ్రీను, ఎస్‌ఐలు కల్యాణ్‌కుమార్, శ్రీకాంత్, శ్రీహరి, మల్లేష్, నందికర్, శ్రీనువాసులు, అబ్దుల్‌షుకూర్, సిబ్బంది చంద్రయ్య, కిరణ్‌కుమార్, రాజుయాదవ్, వీరేష్, రామకృష్ణను ఎస్పీ అభినందించి రివార్డులు అందజేశారు.

జీవో 49ను రద్దు చేయాలి

- భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) డిమాండ్

సాక్షి, హైదరాబాద్: కొమురంభీం జిల్లాలో సుమారు 339 గ్రామాలను ఖాళీ చేయించాలని తెచ్చిన జీవో 49ను రద్దు చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) తెలంగాణ రాష్ట్ర కమిటీ అధికార ప్రతినిధి జగన్ డిమాండ్ చేశారు. ఈ జీవో తెచ్చింది పులుల కోసమా.. మానవ పులుల కోసమా? అని గురువారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. పన్నెండు లక్షల ఎకరాల్లో పోడు వ్యవసాయం చేస్తున్న ఆదివాసులకు.. భూమి హక్కు పత్రాలు కల్పిస్తామన్న హామీ ఇప్పటి వరకు మొదలు కాలేదని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే క్షేత్ర సర్వే చేసి పోడు వ్యవసాయం చేస్తున్న ఆదివాసులకు పట్టా ఇచ్చి.. భూమాతలో నమోదు చేయాలని కోరారు. ఆదివాసీ ప్రజల హక్కుల పరిరక్షణకు మంత్రి సీతక్క పూర్తి బాధ్యత వహించాలని జగన్ డిమాండ్ చేశారు.

కావాల్సింది 2.48 లక్షల మెట్రిక్ టన్నులు.. ఉన్నది 1.47 ఎల్‌ఎంటీనే

- జూలై కోటా యూరియా పూర్తిగా రాకుంటే రైతులకు కష్టాలే
- జూన్ వరకే కోటాలో కేంద్రం 2.25 లక్షల మెట్రిక్ టన్నుల కోత
- ప్రస్తుతం అందుబాటులో ఉన్నది 1.20 లక్షల మెట్రిక్ టన్నులే
- ఆందోళనలో రాష్ట్ర ప్రభుత్వం.. కేంద్రానికి వినతుల వెల్లువ

సాక్షి, హైదరాబాద్: వానాకాలం సీజన్ మొదలైనా కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన యూరియా కోటా రాకపోవడంతో వచ్చే రెండు నెలలను తలచుకొని రాష్ట్ర ప్రభుత్వం ఆందోళన చెందుతోంది. రాష్ట్రానికి జూన్ వరకే 5 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా రావాల్సి ఉండగా, ఇప్పటి వరకు 2.75 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే వచ్చింది. వచ్చిన కోటాలోనూ ఇప్పటికే 1.28 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను రైతులు కొనుగోలు చేశారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న యూరియా కేవలం 1.47 లక్షల మెట్రిక్ టన్నులే. నిజామాబాద్, నల్లగొండ తదితర జిల్లాల్లో ఇప్పటికే వరినాట్లు మొదలుకాగా, జూలై మొదటి వారంలో రాష్ట్రమంతటా నాట్లు మొదలవుతాయి. ఇప్పటికే సుమారు 25 లక్షల ఎకరాల్లో పత్తి విత్తనాలు వేసి యూరియాను ఉపయోగిస్తున్నారు. వచ్చే నెల మొదటివారం కల్లా మరో 25 లక్షల ఎకరాల్లో వరిసాగు చేసే అవకాశముంది. ఈ పరిస్థితుల్లో వరినాట్లు ఉధృతమైతే యూరియా కష్టాలు మొదలైనట్టే.

కేటాయింపుల్లో ఇప్పటికే 2.25 ఎల్‌ఎంటీ కోత

తెలంగాణలో ఏటా సాగు విస్తీర్ణం పెరుగుతున్నా, రాష్ట్రానికి కేటాయించాల్సిన యూరియా కోటాను మాత్రం కేంద్ర ప్రభుత్వం పెంచడం లేదు. నెలనెలా పంపాల్సిన యూరియాను కూడా పంపించకపోవడంతో నాట్లేసిన తర్వాత రైతులు యూరియా కోసం ఇబ్బందులు పడుతున్నారు. ఈ సీజన్‌లో రాష్ట్రానికి పంపాల్సిన కోటాను కోతలు లేకుండా ఇవ్వాలని కేంద్ర మంత్రి జేపీ నడ్డాను కలిసి కోరినా ఫలితం లేదు. జూన్ నుంచి సెప్టెంబర్ వరకు కేంద్రం 9.80 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను కేటాయించాలని కేంద్రం నిర్ణయించింది.

- ఏప్రిల్‌లో 1.70 ఎల్‌ఎంటీకి 1.22 ఎల్‌ఎంటీ యూరియా పంపిన కేంద్రం... మేలో 1.60 ఎల్‌ఎంటీకి గాను 87 వేల మెట్రిక్ టన్నులే పంపింది.
- జూన్‌లో 1.70 ఎల్‌ఎంటీకి పంపించింది కేవలం 67వేల మెట్రిక్ టన్నులే.
- మూడు నెలల కోటా కేవలం 2.75 లక్షల మెట్రిక్ టన్నులే రాగా, అందులో జూన్ నెలలో 1.28 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను రైతులు కొనుగోలు చేశారు.
- వరి, పత్తి, మొక్కజొన్నకు జూలై నెలలో 2.48 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా, ఆగస్టులో మరో 3.50 లక్షల మెట్రిక్ టన్నులు అవసరం . అంటే 6 లక్షల మెట్రిక్ టన్నులు వచ్చే రెండు నెలల్లో అవసరమవుతుంది. కానీ అందుబాటులో ఉన్న 1.47 లక్షల మెట్రిక్ టన్నుల యూరియానే.

జూలైలో కేంద్రం పంపించే కోటాను బట్టి రైతులకు యూరియా అందించాలని వ్యవసాయ శాఖ ప్రణాళికలు సిద్ధం చేస్తుంది. ఇప్పటి వరకు కేంద్రం పంపించిన యూరియా జూలైతో పాటు ఆగస్టు మొదటి వారానికి సరిపోతుందని మార్క్‌ఫెడ్ ఎండీ శ్రీనివాస్ రెడ్డి 'సాక్షి'కి తెలిపారు.

జూన్ 28 నుంచి అక్టోబర్ 2 వరకు సాగు న్యాయయాత్ర

- 800 గ్రామాలు, 2,400 కిలోమీటర్లు
- రైతులకు సాగు చట్టాలపై అవగాహన కల్పించనున్న లీఫ్స్ బృందం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రైతుల కోసం వినూత్న యాత్ర ప్రారంభం కాబోతోంది. లీగల్ ఎంపవర్‌మెంట్ అండ్ అసిస్టెన్స్ ఫర్ ఫార్మర్స్ సొసైటీ (లీఫ్స్) సంస్థ ఇందుకు శ్రీకారం చుడుతోంది. భూ చట్టాల నిపుణుడు, న్యాయ శాస్త్ర ఆచార్యుడు భూమి సునీల్ నేతృత్వంలో ఈ నెల 28వ తేదీ నుంచి యాత్ర ప్రారంభం కానుంది. రాష్ట్రంలోని దాదాపు 800 గ్రామాల మీదుగా సుమారు 2,400 కిలోమీటర్ల మేర అక్టోబర్ 2వ తేదీ వరకు ఈ యాత్ర జరగనుంది. లక్షమంది రైతులకు సాగు చట్టాలపై అవగాహన కల్పించడంతోపాటు రైతు న్యాయ అవసరాలపై అధ్యయనం చేయడమే లక్ష్యంగా శనివారం ఉదయం 6గంటలకు యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి నుంచి యాత్ర ప్రారంభమవుతుందని నిర్వాహకులు వెల్లడించారు.

రైతులను నేరుగా కలుస్తాం



'దుక్కి దున్నే నాటి నుంచి పండించిన పంటను మార్కెట్‌లో అమ్మేదాకా రైతులు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారు. వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులు, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఎన్నో చట్టాలు వచ్చాయి. ప్రస్తుతం తెలంగాణలో 200కు పైగా చట్టాలు అమల్లో ఉన్నాయి. వీటిని తెలుసుకొని వినియోగించుకుంటేనే ఏరువాక సాఫీగా సాగుతుంది. అందుకే ప్రతి రైతుకు చట్టాలు తెలియాలి. ఇందుకోసం లీఫ్స్ సంస్థ ఈ యాత్రను ప్రారంభిస్తోంది. యాత్రలో భాగంగా కనీసం 10 వేల మంది రైతులను కలిసి వారికి చట్టాలపై అవగాహన కల్పిస్తాం. ఈ 10వేల మందితో పదిమందికి విషయాలను తెలియజేసే ప్రయత్నం చేస్తాం. ఇందుకోసం కరపత్రాలను కూడా రైతులకు ఇస్తాం. తెలంగాణ రైతాంగానికి న్యాయ చైతన్యం కలిగించే ప్రయత్నమే మా యాత్ర.'

– భూమి సునీల్

'బయోసైన్సెస్'లోని జంతువులను రక్షించాలి

- ప్రభుత్వానికి సీసీఎస్‌ఈఏ సూచన


భూత్పూర్‌లోని పాలమూరు బయోసైన్సెస్

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్/ సాక్షి, నాగర్‌కర్నూల్: మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్‌లోని పాలమూరు బయోసైన్సెస్ ప్రయోగశాలలో జంతువులను క్రూరంగా హింసించినట్టు కేంద్ర ప్రభుత్వం నియమించిన తనిఖీ కమిటీ గుర్తించింది. ఈ నేపథ్యంలో బయోసైన్సెస్‌లోని 1,200 జంతువులకు వెంటనే విముక్తి కల్పించి, వేరే చోట పునరావాసం కల్పించాలని ప్రభుత్వానికి సూచించింది. ఈ ల్యాబొరేటరీలో ప్రయోగాల పేరుతో ఇకపై జంతువులపట్ల క్రూరంగా ప్రవర్తించకుండా చర్యలు చేపట్టాలని పేర్కొంది. జంతువుల బ్రీడింగ్, ప్రయోగాల పేరుతో ఆవులు, కుక్కలు, పందులు, కోతులను తీవ్రంగా హింసిస్తున్నారని పెటా ఇండియా ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ నెల 16న భూత్పూర్ పోలీస్‌స్టేషన్‌లో పాలమూరు బయోసైన్సెస్‌పై కేసు నమోదైంది. దీనిపై కమిటీ ఫర్ కంట్రోల్ అండ్ సూపర్‌విజన్ ఆఫ్ ఎక్స్‌పరిమెంట్స్ ఆన్ యానిమల్స్ (సీసీఎస్‌ఈఏ)కు చెందిన ఆరుగురు సభ్యులతో కూడిన కమిటీ ఇటీవల బయోసైన్సెస్‌లో తనిఖీలు చేపట్టింది. ఈ సందర్భంగా జంతువులపై అశాస్త్రీయ పద్ధతిలో ప్రయోగాలు చేపట్టడం, అందుకోసం వాటిపై క్రూరంగా ప్రవర్తించినట్టు గుర్తించింది. ఇరుకైన స్థలంలో వందలకొద్దీ జంతువులను ఉంచడం, వాటి సంరక్షణకు ఏర్పాట్లు చేయకపోవడాన్ని నివేదికలో ప్రస్తావించింది. ఇదిలా ఉండగా జంతువులపై హింస విషయాన్ని కప్పిపుచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని పెటా ఇండియా సైంటిస్ట్ డాక్టర్ అంజునా అగర్వాల్ ఆరోపించారు. ప్రయోగశాలలోని జంతువులకు త్వరగా విముక్తి కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.

క్రెడిట్ కార్డు నోటీసులకు భయపడి..

- ఉరి వేసుకుని ప్లంబర్ ఆత్మహత్య

బాన్సువాడ: క్రెడిట్ కార్డు నోటీసులు రావడంతో ఆందోళన చెందిన ఒక వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. కామారెడ్డి జిల్లా బాన్సువాడ పట్టణం బండాగల్లీకి చెందిన బశప్ప (35) క్రెడిట్ కార్డుపై రూ.70 వేలు అప్పు చేసాడు. గడువు దాటినా అప్పు చెల్లించకపోవడంతో బశప్పకు నోటీసులు వచ్చాయి. దీంతో ఆందోళనకు గురైన బశప్ప గురువారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు ప్లంబర్‌గా పనిచేస్తూ జీవనం కొనసాగించేవాడు. మృతునికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కేసు నమోదు చేసినట్లు సీఐ అశోక్ తెలిపారు.

చరిత్ర సృష్టించిన శుభాన్షు



డాకింగ్‌కు యత్నిస్తున్న క్యాప్సూల్

అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో మన తొలి ముద్ర

- తొలి భారతీయునిగా వాయుసేన పైలట్ రికార్డ్
- గగన్‌యాన్ దిశగా కీలక ముందడుగు
- భారత అంతరిక్ష చరిత్రలో సువర్ణాధ్యాయం
- 28 గంటల అనంతరం ఐఎస్ఎస్‌తో యాగ్జియం-4 అనుసంధానం

న్యూఢిల్లీ: భారత అంతరిక్ష చరిత్రలో సువర్ణాధ్యాయానికి తెరలేచింది. మానవసహిత అంతరిక్ష యాత్ర దిశగా భారీ ముందడుగు పడింది. 140 కోట్ల పై చిలుకు భారతీయుల ఆకాంక్షలను మోసుకుంటూ నిన్న రోదసిలోకి దూసుకెళ్లి, ఆ ఘనత సాధించిన రెండో భారతీయునిగా నిలిచిన మన వాయుసేనాని గ్రూప్ కెప్టెన్ శుభాన్షు శుక్లా (39) నేడు మరోచరిత్ర లిఖించారు. గురువారం సాయంత్రం అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లోకి విజయవంతంగా ప్రవేశించారు. ఆ ఘనత సాధించిన తొలి భారతీయునిగా చెరిగిపోని రికార్డును తన పేరిట లిఖించుకున్నారు. శుభాన్షుతో పాటు మరో ముగ్గురు వ్యోమగాములు ఇస్రో, నాసా సంయుక్త వాణిజ్య మిషన్ యాగ్జియం-4లో భాగంగా స్పేస్ ఎక్స్ డ్రాగన్ స్పేస్‌క్రాఫ్ట్ ద్వారా బుధవారం విజయవంతంగా నింగికెగిసిన విషయం తెలిసిందే. 28 గంటల పాటు భూ కక్ష్యలో పరిభ్రమించిన అనంతరం భారత కాలమానం ప్రకారం సాయంత్రం 4 గంటల 1 నిమిషానికి అది భూమి నుంచి 418 కి.మీ.ల ఎత్తున ఐఎస్ఎస్‌తో విజయవంతంగా అనుసంధానమైంది. తర్వాత రెండు గంటల పాటు తప్పనిసరి తనిఖీలు, ఐఎస్ఎస్‌తో డ్రాగన్ అనుసంధాన (డాకింగ్) ప్రక్రియ కొనసాగాయి. 12 జతల హుక్కులతో పరస్పరం అనుసంధానమయ్యాయి. తర్వాత డ్రాగన్, ఐఎస్ఎస్ నడుమ సమాచార, ఇంధన లింకేజీ తదితర సంబంధాలు నెలకొన్నాయి. అంతా సజావుగా జరిగిపోయిందని నిర్ధారించుకున్నాక సాయంత్రం 5.44 గంటలకు ఐఎస్ఎస్ మూత తెరుచుకుని తొలుత మిషన్ కమాండర్ పెగ్గీ వాట్సన్ (అమెరికా), ఆ వెనకే శుభాన్షు ఐఎస్ఎస్‌లోకి ప్రవేశించారు. అనంతరం ఉజ్నాన్‌స్కీ విస్నేవ్‌స్కీ (పోలండ్), టిబర్ కపు (హంగరీ) వారిని అనుసరించారు. ఐఎస్ఎస్‌లోని ఏడుగురు వ్యోమగాములు వారికి చప్పట్ల నడుమ హార్దిక స్వాగతం పలికారు. వెల్‌కం డ్రింక్‌గా మంచినీళ్చి సేదదీర్చారు. శుభాన్షు బృందం ఆనంద హేలను కెమెరాల్లో బంధించి భద్రపరిచారు. అనంతరం పరస్పర ఆలింగనాలు, హై-ఫైవ్‌లు, క్షేమ సమాచారాలు తదితరాలతో ఐఎస్ఎస్ సందడిగా మారింది. శుభాన్షు బృందం 14 రోజులపాటు అక్కడ గడపనుంది. 60కి పైగా వినూత్న ప్రయోగాలు చేసి అత్యంత విలువైన సమాచారాన్ని అందించనుంది. ఐఎస్ఎస్‌లో అడుగుపెట్టిన తొలి భారతీయునిగా కొత్త చరిత్ర సృష్టించిన శుభాన్షుకు దేశ నలుమూలల నుంచీ అభినందన సందేశాలు వెల్లువెత్తుతున్నాయి. ఆయన స్వస్థలం లఖ్‌నవూలో తల్లిదండ్రులు తదితరులు హర్షాతిరేకాలు వెలిబుచ్చారు. భారత్ మాతా కీ జై అంటూ నినదించారు. హంగరీ, పోలండ్ దేశాల నుంచి ఒక వ్యోమగామి ఐఎస్ఎస్‌లో ప్రవేశించడం కూడా ఇదే తొలిసారి. 1984లో రాకేశ్ శర్మ అనంతరం అంతరిక్షంలోకి ప్రవేశించిన రెండో భారతీయునిగా శుభాన్షు నిలవడం తెలిసిందే.


ఐఎస్ఎస్‌లోకి ప్రవేశించగానే తోటి వ్యోమగాముల సమక్షంలో ప్రసంగిస్తున్న శుభాన్షు శుక్లా

జాయ్.. ఐదో 'వ్యోమగామి'

శుభాన్షు, మరో నలుగురితో పాటు యాగ్జియం-4 మిషన్ ద్వారా ఐదో వ్యోమగామి 'జాయ్' కూడా ఐఎస్ఎస్ చేరింది! అదెవరా అని ఆశ్చర్యపోతున్నారా? నిజానికి అదొక హంస బొమ్మ!. వ్యోమగాములు జీరో గ్రావిటీ (శూన్య స్థితి)కి చేరగానే వారిని అలర్ట్ చేస్తుందన్నమాట. జీరో గ్రావిటీని సూచించే బొమ్మలను ఇలా అంతరిక్షంలోకి వెంట తీసుకెళ్లడం తొలి రోదసి యాత్రికుడు యూరీ గగారిన్ నాటినుంచీ వస్తున్న ఆనవాయితీ. దానికి కొనసాగింపుగా జాయ్ బొమ్మను యాగ్జియం-4 బృందం తమ వెంట తీసుకెళ్లింది.

శుభాన్షు కుమారుని కోసం..

శుభాన్షు కుమారుడు కియాశ్‌కు జంతువులంటే ఉన్న ప్రేమను దృష్టిలో పెట్టుకుని హంస బొమ్మను ఎంపిక చేసుకున్నట్టు యాగ్జియం-4 మిషన్ కమాండర్ వాట్సన్ చెప్పడం విశేషం! పాలను, నీటిని వేరుచేసే హంస భారతీయ సంప్రదాయంలో జ్ఞానానికి అత్యున్నత ప్రతీక అని శుభాన్షు తన సహచర వ్యోమగాములకు వివరించారు.

నంబర్ 634

శుభాన్షు అంతరిక్షంలోకి వెళ్లిన 634వ వ్యోమగామిగా నిలిచారు. అందుకు గుర్తుగా ఐఎస్ఎస్‌లో ఆయనకు వ్యోమగామి నంబర్ 634 అంటూ అధికారికంగా స్పేస్ స్టేషన్ పిన్ కేటాయించారు. ''నేను ఆస్ట్రోనాట్ నంబర్ 634ను. ఇక్కడ ఉండటం నిజంగా గర్వకారణంగా అనిపిస్తోంది. ఐఎస్ఎస్ నుంచి భూమిని చూసే అవకాశం దక్కిన అతి కొద్ది మందిలో నాకు చోటు దక్కడం ఎంతో ఆనందంగా ఉంది'' అని శుభాన్షు వ్యాఖ్యానించారు.

పాపాయిలా నేర్చుకుంటున్నా

ఐఎస్ఎస్ నుంచి శుభాన్షు తొలి పలుకులు

ఐఎస్ఎస్‌లో ప్రవేశించిన క్షణాలను 'అత్యద్భుతమైనవి'గా శుభాన్షు అభివర్ణించారు. తన అనుభూతిని వీడియో లింకేజ్ ద్వారా అందరితోనూ పంచుకున్నారు. ''తొలిసారి సహజమైన, సంపూర్ణమైన భారరహిత స్థితిలో అడుగుపెట్టా. శూన్యంలో తేలిపోతుంటే కలుగుతున్న అనుభూతి వర్ణనాతీతం!. ఇక్కడంతా కొత్త కొత్తగా, గమ్మత్తుగా ఉంది. నేను ఊహించిన దానికంటే కూడా ఎంతో గొప్పగా ఉంది. ఐఎస్ఎస్‌లో ప్రవేశించాక సజావుగా నుంచోవడం నేను అనుకున్న దానికంటే తేలికగానే ఉంది. కెమెరాలకు పోజివ్వడం వంటివన్నీ కూడా ఎంతో సరదాగా ఉన్నాయి. కాకపోతే తలే కాస్త భారంగా అనిపిస్తోంది. పారాడే పాపాయి మాదిరిగా నడక మొదలుకుని అన్నీ మొదటినుంచి కొత్తగా నేర్చుకుంటున్నా. శూన్య స్థితిలో నన్ను నేను నియంత్రించుకోవడానికి ప్రయత్నిస్తున్నా. చివరికి ఎలా తినాలో కూడా నేర్చుకుంటున్న పరిస్థితి!. ఆ క్రమంలో ఎన్నో తప్పటడుగులూ వేస్తున్నా. ఆ పొరపాట్లను పూర్తిగా ఆస్వాదిస్తున్నా. భారరహిత స్థితి అలవాటు లేక నా సహచరులు చేస్తున్న సరదా తప్పిదాలను కూడా అంతే ఎంజాయ్ చేస్తున్నా. ఇక్కడి పరిస్థితులకు మెల్లిగా అలవాటు పడుతున్నా. అద్భుత దృశ్యాలను ఆస్వాదిస్తున్నా. అన్ని విషయాలనూ ఒక్కొక్కటిగా నేర్చుకుంటున్నా. కొత్త వాతావరణం. ప్రతి క్షణమూ సరికొత్త అనుభూతులు. సహచరులతో కలిసి ప్రయోగాలు చేపట్టేందుకు ఎంతో ఉత్సాహంగా ఎదురుచూస్తున్నా'' అని వివరించారు.

ప్రయోగం పొడవునా ఎదురైన అనుభూతులను శుభాన్షు ఆసక్తికరంగా వివరించారు. ''బుధవారం గ్రేస్ (డ్రాగన్ స్పేస్‌క్రాఫ్ట్‌కు శుభాన్షు బృందం పెట్టుకున్న పేరు)లో కూర్చుని ప్రయోగానికి సిద్ధమైన క్షణాల్లో నాలో ఒకే ఆలోచన మెదిలింది. 'సరికొత్త చరిత్ర సృష్టించేందుకు బయల్దేరదాం పదా!' అని నాకు నేను చెప్పుకున్నా. ప్రయోగం మొదలవగానే ఆ విసురుకు నా సీట్లోకి నొక్కుకుపోయా.

శూన్యంలో తేలియాడా

రోదసిలోకి ప్రవేశించిన తొలి క్షణాల్లో ఏమంత పెద్దగా తేడా అనిపించలేదు. కానీ కాసేపటికే భారరహిత స్థితి తాలూకు మజా అనుభవంలోకి వచ్చింది. 'వావ్! సూపర్ కదా!!' అనిపించింది. ఐఎస్ఎస్ చేరే దాకా ఏకబిగిన 28 గంటల పాటు కదలకుండా కూచుని ఉండటం అలసటగా అన్పించినా చెప్పలేని అనుభూతిని కూడా పంచింది. కాకపోతే చాలాసేపు నిద్రలోనే గడిపా. దాన్ని గుర్తు చేస్తూ నా సహచరులు ఇంకా నన్నెంతగానో ఆటపట్టిస్తున్నారు కూడా'' అంటూ శుక్లా చెప్పుకొచ్చారు.

అంతరిక్షం నుంచి నమస్కారం!

ఐఎస్ఎస్‌తో అనుసంధానం అయ్యేముందు భారతీయులందరినీ శుభాన్షు ఆప్యాయంగా పలకరించారు. 'అంతరిక్షం నుంచి మీకందరికీ నమస్తే. ఈ అద్భుత యాత్రలో ప్రతి భారతీయుడూ నాకు తోడుగా ఐఎస్ఎస్‌లో ఉన్న భావనే కలుగుతోంది' అని శుభాన్షు అన్నారు. ''మీ అందరి ప్రేమ, ఆశీస్సులతోనే ఐఎస్ఎస్ చేరగలిగా. మనమంతా కలిసి ఈ యాత్రను మరింత ఉత్సాహభరితంగా మారుద్దాం. మీ అందరితో పాటు త్రివర్ణ పతాకం వెంట రాగా నాతోపాటు ఐఎస్ఎస్ చేరా. ఇది నా ఒక్కని ఘనత కాదు. భారతీయులందరి విజయం. భారత్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మానవసహిత అంతరిక్ష యాత్రకు ఘనమైన ఆరంభం'' అంటూ శుభాన్షు హర్షాతిరేకాలు వెలిబుచ్చారు.


ఐఎస్ఎస్‌తో క్యాప్సూల్ అనుసంధానం దృశ్యం


లక్నో నుంచి డాకింగ్ దృశ్యాలను చూస్తున్న శుక్లా తల్లిదండ్రులు

అరగంట ముందుగానే

డ్రాగన్ స్పేస్‌క్రాఫ్ట్ అనుకున్న సమయం కంటే అరగంట ముందుగానే ఐఎస్ఎస్‌తో అనుసంధానమైంది. ముందుగా నిర్ణయించిన ప్రకారం వేపాయింట్ 1, 2 వద్ద ఆగకుండా చకచకా ఐఎస్ఎస్‌ను సమీపించడమే అందుకు కారణం. దానికి 20 మీటర్ల సమీపానికి చేరుకున్నాక డ్రాగన్ తుది అప్రోచ్‌కు సిద్ధమైంది. లేజర్ ఆధారిత సెన్సర్లు, కెమెరాల సాయంతో ఐఎస్ఎస్ హార్మనీ మాడ్యూల్ తాలూకు డాకింగ్ పోర్ట్‌తో సవ్యంగా అనుసంధానమైంది. అనంతరం ఐఎస్ఎస్‌లోని ఏడుగురు సిబ్బంది డ్రాగన్‌లో ఏమైనా లీకేజీలు తదితరాలు చోటుచేసుకున్నాయేమో తనిఖీ చేశారు. డ్రాగన్ లోపలి పీడనం ఐఎస్ఎస్‌తో సమానంగా ఉందని నిర్ధారించుకున్నారు. అలా డాకింగ్ ప్రక్రియ విజయవంతంగా ముగిశాక వ్యోమగాములు ఐఎస్ఎస్‌లోకి అడుగుపెట్టారని నాసా ప్రకటించింది. ఇది దేశమంతటికీ గర్వకారణమని ఇస్రో ఒక ప్రకటనలో పేర్కొంది.


ఐఎస్ఎస్ నుంచి యాగ్జియం-4 సభ్యుడు తీసిన పుడమి ఫొటో

ఉమ్మడి ప్రకటనపై సంతకానికి నో

- తిరస్కరించిన భారత రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్
- పహల్గాం దాడి, ఉగ్రవాదంపై భారత్ ప్రస్తావన లేని ముసాయిదా
- జాయింట్ డాక్యుమెంట్ లేకుండానే ముగిసిన ఎస్సీఓ సదస్సు

ఛింగ్‌డావో: ఆనవాయితీకి భిన్నంగా ఉమ్మడి ప్రకటన జారీ చేయకుండానే షాంఘై సహకార సంస్థ(ఎస్సీఓ) సదస్సు గురువారం ముగిసింది. 26 మంది పర్యాటకులను బలితీసుకున్న పహల్గాం ఉగ్రవాద దాడితోపాటు భారత్‌కు వ్యతిరేకంగా కొనసాగుతున్న సీమాంతర ఉగ్రవాదం, ముష్కరుల దాడుల పట్ల భారత్ ఆందోళన గురించి ఈ ప్రకటన ముసాయిదాలో మాటమాత్రంగానైనా ప్రస్తావించకపోవడం గమనార్హం. పైగా పాకిస్తాన్‌లోని బలూచిస్తాన్‌లో స్థానిక వేర్పాటువాద ఉద్యమకారులకు, సైన్యానికి మధ్య జరుగుతున్న ఘర్షణల వెనుక భారత్ హస్తం ఉండొచ్చనే వాదనను ఈ జాయింట్ డాక్యుమెంట్ ముసాయిదాలో పొందుపర్చడం వివాదాస్పదంగా మారింది. దీనిపై సంతకం చేసేందుకు భారత రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నిరాకరించారు. ఫలితంగా ఏకాభిప్రాయం కుదరలేదన్న కారణంతో ఉమ్మడి ప్రకటన జారీ చేయకుండానే ఎస్సీఓ సదస్సును ముగించాలని నిర్ణయించారు. చైనాలోని తీరప్రాంత నగరం ఛింగ్‌డావోలో ఎస్సీఓ దేశాల రక్షణ శాఖ మంత్రుల సదస్సు బుధవారం ప్రారంభమైన సంగతి తెలిసిందే. చైనా ఆతిథ్యం ఇచ్చిన ఈ సదస్సులో ఉగ్రవాదాన్ని అంతం చేసేందుకు చేపట్టిన చర్యలపై విస్తృతంగా చర్చించారు. పాకిస్తాన్ రక్షణ మంత్రి ఖవాజా అసిఫ్, చైనా రక్షణ మంత్రి డాంగ్ జున్ తదితరులు సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడారు. ఇండియాలో అశాంతి సృష్టించాలన్న లక్ష్యంతో సీమాంతర పొరుగుదేశం ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తోందని పరోక్షంగా పాకిస్తాన్‌పై మండిపడ్డారు. ఉగ్రవాదులకు ఆశ్రయం ఇస్తూ ఆర్థికంగా అండగా నిలుస్తోందని, సీమాంతర ఉగ్రవాదాన్ని ఒక విధానంగా మార్చుకుందని దుయ్యబట్టారు. ఉగ్రవాదులను ఏరిపారేసే విషయంలో ద్వంద్వ ప్రమాణాల పాటించొద్దని హితవు పలికారు. ఉగ్రవాదాన్ని ఎగదోసే దేశాలపై కఠినంగా వ్యవహరించేందుకు ఏమాత్రం వెనుకాడొద్దని షాంఘై సహకార సంస్థకు సూచించారు. ఉగ్రవాదులను, వారి పోషకులను చట్టం ముందు నిలబెట్టి, శిక్షించాల్సిందేనని తేల్చిచెప్పారు.



అమెరికా చెంప చెళ్లుమనిపించాం

- మేమే గెలిచాం
- మళ్లీ దాడికి యత్నిస్తే భారీమూల్యం తప్పదు
- అమెరికాను హెచ్చరించిన ఇరాన్ సుప్రీంనేత ఖమేనీ
- యుద్ధం ముగిశాక తొలిసారిగా వీడియో ప్రసంగం

దుబాయ్: ఖతార్‌లోని అమెరికా వైమానిక స్థావరంపై క్షిపణులు ప్రయోగించి ఇరాన్ తన సత్తాను చాటిందని ఇరాన్ సుప్రీం నేత అయతొల్లా అలీ ఖమేనీ వ్యాఖ్యానించారు. దాడులతో అమెరికా చెంప చెళ్లుమనిపించామని ఆయన అన్నారు. యుద్ధంలో మేమే గెలిచామని ఆయన ప్రకటించారు. ఇరాన్‌పై బాంబుదాడులు చేసిన అమెరికాకు ఒనగూరింది శూన్యమని ఆయన ఎద్దేవాచేశారు. మరోసారి ఇరాన్‌పై దాడికి సాహిస్తే భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని అమెరికాను ఖమేనీ హెచ్చరించారు. యుద్ధం ముగిశాక తొలిసారి ఖమేనీ ఒక వీడియో సందేశం ఇచ్చారు. అమెరికా, ఇజ్రాయెల్‌లకు హెచ్చరికలు చేస్తూ పది నిమిషాలకుపైగా ఖమేనీ మాట్లాడిన ఆ వీడియోను ఇరాన్ ప్రభుత్వ అధికారిక టెలివిజన్ గురువారం ప్రసారం చేసింది.



అమెరికా రాకుంటే ఇజ్రాయెల్ ధ్వంసమయ్యేది

''యుద్ధంలో ఇజ్రాయెల్‌ను రక్షించేందుకే అమెరికా తప్పని పరిస్థితుల్లో రంగప్రవేశం చేసింది. అమెరికా గనక జోక్యంచేసుకోకపోయి ఉంటే మా దాడుల్లో ఇజ్రాయెల్ దారుణంగా ధ్వంసమయ్యేది. అయినా సరే అమెరికా స్థావరాలపైనా క్షిపణుల్ని ప్రయోగించి మా సత్తా చాటాం. ఖతార్‌లోని దోహా నగర సమీపంలోని అల్-ఉదేయిద్ అమెరికా ఎయిర్‌బేస్‌పై క్షిపణి దాడులు చేశాం. ఇరాన్‌పై అమెరికా దాడులను ట్రంప్ అతిశయోక్తిగా చెప్తున్నారు. నిజానికి ఇరాన్‌పై దాడులతో అమెరికా సాధించింది శూన్యమే. జోక్యం చేసుకోకపోతే ఇజ్రాయెల్ నాశనమవుతుందన్న అంచనాతోనే అమెరికా యుద్ధంలోకి అడుగుపెట్టింది. కానీ లక్ష్యసాధనలో పూర్తిగా విఫలమైంది. మా ఇస్లామిక్ రిపబ్లిక్ జయకేతనం ఎగరేసింది. ఇది అమెరికాకు ఘోర పరాభవం. భవిష్యత్తులో మరోసారి మాపై దాడి చేయాలని అమెరికా భావిస్తే ఇంతకంటే పెద్దస్థాయిలో పరాభవం ఎదుర్కోక తప్పదు'' అని ఖమేనీ హెచ్చరించారు. అయితే ఈ వీడియోలో ఖమేనీ కాస్తంత నీరసంగా కనిపించారు.

టూ వీలర్లపై టోల్ చార్జీలుండవ్: గడ్కరీ

సాక్షి, న్యూఢిల్లీ: జాతీయ రహదారులపై ద్విచక్ర వాహనాలకు ఎటువంటి టోల్ చార్జీలను తాము విధించడం లేదని జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) స్పష్టం చేసింది. జూలై 15 నుంచి దేశవ్యాప్తంగా ఉన్న జాతీయ రహదారులపై టూ వీలర్లకు కూడా టోల్ చార్జీలు వసూలు చేస్తున్నట్లు జాతీయ మీడియాలో వస్తున్న కథనాలన్నీ అవాస్తవమని కేంద్ర రోడ్లు, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ గురువారం 'ఎక్స్' వేదికగా స్పష్టం చేశారు. ఇటువంటి కట్టుకథలు, తప్పుడు వార్తలను ఎవరూ నమ్మొద్దని కోరారు. 'ద్విచక్రవాహనాలకు టోల్ రుసుము వసూలు ప్రతిపాదనేదీ మా పరిశీలనలో లేదు. అటువంటి యోచన చేయడం లేదు. టూ వీలర్స్‌కు టోల్ ఛార్జీలంటూ వచ్చేవన్నీ ఫేక్ వార్తలు' అంటూ ఎన్‌హెచ్‌ఏఐ, మంత్రి గడ్కరీ వేర్వేరుగా సోషల్ మీడియా ద్వారా ప్రకటించారు. జాతీయ రహదారులపై ఇప్పటి వరకూ ఫోర్ వీలర్స్, భారీ వాహనాలకు మాత్రమే టోల్ వసూలు చేస్తున్నారు. ఈ విధానంలో మార్పునకు కేంద్రం శ్రీకారం చుట్టినట్లు ప్రముఖ మీడియా సంస్థలు కథనాలను ప్రచురించాయి. దీంతో, దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం తీరును నెటిజన్లు సోషల్ మీడియాలో తప్పుబట్టారు. అసత్యాల ప్రచారంపై ఎన్‌హెచ్‌ఏఐ, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఈ మేరకు స్పష్టతనిచ్చారు.

రాజ్యాంగమే సుప్రీం

- మూడు ప్రజాస్వామ్య విభాగాలు రాజ్యాంగానికి లోబడి పనిచేయాలి
- సీజేఐ జస్టిస్ బి.ఆర్.గవాయ్

అమరావతి(మహారాష్ట్ర): దేశంలో రాజ్యాంగమే అత్యున్నతమని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ మరోసారి తేల్చిచెప్పారు. ప్రజాస్వామ్యంలోని శాసన, కార్యనిర్వాహక, న్యాయ విభాగాలు రాజ్యాంగానికి లోబడి పనిచేయాల్సిందేనని పేర్కొన్నారు. రాజ్యాంగానికి సవరణలు చేసే అధికారం పార్లమెంట్‌కు ఉన్నప్పటికీ.. రాజ్యాంగ మౌలిక నిర్మాణాన్ని మార్చే అధికారం మాత్రం లేదని గతంలో అత్యున్నత న్యాయస్థానం తీర్పు ఇచ్చినట్లు గుర్తుచేశారు. 52వ సీజేఐగా జస్టిస్ గవాయ్ గత నెలలో ప్రమాణం చేసిన సంగతి తెలిసిందే. మహారాష్ట్రలోని అమరావతి పట్టణంలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆయనను తాజాగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్లమెంట్ అత్యున్నతమని కొందరు చెబుతుంటారని, కానీ, తన ఉద్దేశంలో రాజ్యాంగమే సుప్రీం అని స్పష్టంచేశారు. అలాగే ప్రజాస్వామ్యంలో శాసన, కార్యనిర్వాహక, న్యాయ విభాగాల్లో ఏది అత్యున్నతం అనే చర్చ కూడా సాగుతోందని, నిజానికి రాజ్యాంగం పరిధిలోనే ఈ మూడు విభాగాలూ పనిచేయాలని ఉద్ఘాటించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉత్తర్వులు ఇచ్చే అధికారం ఉన్నంత మాత్రాన ఒక న్యాయమూర్తి తనను తాను స్వతంత్రుడిగా భావించుకోవడానికి వీల్లేదన్నారు. పౌరుల హక్కులను, రాజ్యాంగ విలువలను, సూత్రాలను కాపాడాల్సిన బాధ్యత న్యాయమూర్తిపై ఉందని, అది అతడి విధ్యుక్త ధర్మమని చెప్పారు.



ఐదేళ్ల సోషల్ మీడియా ఖాతాలను బహిర్గతం చేయండి

వీసా దరఖాస్తు దారులకు అమెరికా ఎంబసీ సూచన

న్యూఢిల్లీ: వీసా దరఖాస్తు దారులంతా ఐదేళ్లపాటు తమ సోషల్ మీడియా కార్యకలాపాలన్నింటినీ బహిర్గతం చేయాలని న్యూఢిల్లీలోని అమెరికా రాయబార కార్యాలయం తెలిపింది. సోషల్ మీడియా యూజర్ ఐడీలను డీఎస్-160 ఫారమ్‌లో వెల్లడించాలని ఆదేశించింది. అలా చేయని పక్షంలో వీసా తిరస్కరణకు గురవుతుందని, ఇది భవిష్యత్తులో అనర్హతకు దారితీయవచ్చని హెచ్చరించింది. ''వీసా దరఖాస్తుదారులు గత 5 సంవత్సరాలుగా వారు ఉపయోగించిన ప్రతి సోషల్ మీడియా యూజర్‌నేమ్‌లు లేదా హ్యాండిల్స్‌ను డీఎస్-160 వీసా దరఖాస్తు ఫామ్‌లో పేర్కొనాలి. సంతకం చేసి సమర్పించే ముందు వారి వీసా దరఖాస్తులోని సమాచారం నిజమని, సరైనదని ధృవీకరించాలి'' అని అమెరికా ఎంబసీ ఎక్స్‌లో పేర్కొంది.

డాడీ ట్రంప్

అమెరికా అధ్యక్షుడిని డాడీ అని సంబోధించిన నాటో చీఫ్ మార్క్ రుట్టే

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు కొత్తగా ఒక నిక్‌నేమ్ వచ్చి చేరింది. అదేమిటో తెలుసా?.. డాడీ. అంటే నాన్న అని తెలిసిందేగా. నాటో సదస్సు సందర్భంగా ట్రంప్‌ను డాడీ అని పిలుస్తున్న వీడియోను వైట్‌హౌస్ తాజాగా విడుదల చేసింది. ఇది సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందంపై మీడియాతో మాట్లాడుతున్న ట్రంప్‌ను పక్కనే ఉన్న నాటో చీఫ్ మార్క్ రుట్టే సరదాగా డాడీ అని సంబోధించారు. ఒక నిమిషం నిడివి ఉన్న ఈ వీడియోను 'డాడీస్ హోమ్. హే, హే, హే, డాడీ' అని శీర్షికతో శ్వేతసౌధం షేర్ చేసింది. ఇది జనాన్ని బాగా ఆకట్టుకుంటోంది. వారు తమకు తోచిన రీతిలో ప్రతిస్పందిస్తున్నారు. నెదర్లాండ్స్‌లోని హేగ్ నగరంలో నాటో సదస్సుకు ట్రంప్ హాజరయ్యారు. ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధం ముగిసిపోయేలా తానే చొరవ తీసుకున్నానని ఆయన చెప్పారు. ఇంతలో నాటో చీఫ్ మార్క్ రుట్టే మాట్లాడుతూ.. డాడీ (ట్రంప్) ఇరు దేశాలకు బలమైన భాషలో చెప్పారని వ్యాఖ్యానించారు. తర్వాత డాడీ అన్న సంబోధనపై ట్రంప్ స్పందించారు. అది చాలా ఆప్యాయత, అనురాగంతో కూడిన సంబోధన అని ఆనందం వ్యక్తం చేశారు.

పూర్తిగా కమ్యూనిస్ట్ పిచ్చోడు

న్యూయార్క్ మేయర్ అభ్యర్థి మమ్దానీపై ట్రంప్ విమర్శలు

న్యూయార్క్: న్యూయార్క్ మేయర్ ఎన్నికలకు సంబంధించి డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థిత్వ రేసులో విజయం సాధించిన భారత సంతతి ముస్లిం నేత జోహ్రాన్ మమ్దానీపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విమర్శలు గుప్పించారు. మమ్దానీ అసలు సిసలైన కమ్యూనిస్ట్ పిచ్చోడంటూ వ్యాఖ్యానించారు. ట్రంప్ తన సొంత సామాజిక మాధ్యమం 'ట్రూత్ సోషల్'లో గురువారం మమ్దానీని విమర్శిస్తూ పలు పోస్టులుపెట్టారు. ''చివరకు జరగకూడనిదే జరిగింది. డెమొక్రాట్లు హద్దు మీరారు. పూర్తిగా కమ్యూనిస్ట్ పిచ్చోడైన జోహ్రాన్ మమ్దానీని ప్రైమరీ ఎన్నికల్లో గెలిపించారు. చూడబోతే ఆయనే నగర కొత్త మేయర్ అయ్యేలా ఉన్నారు. గతంలోనూ న్యూయార్క్ పీఠంపై విప్లవకారులు కూర్చున్నారు. కానీ ఈసారి మమ్దానీ ఎన్నిక హాస్యాస్పదంగా ఉంది. మమ్దానీ గత ర్యాడికల్ నేతలకంటే కూడా విపరీత పోకడలో పయనిస్తున్నాడు. అతను అంత తెలివైనవాడు కాదు. సామాజిక న్యాయం, ఆర్థిక అసమానతలు, వాతావరణ మార్పులపై ఇతనికి బొత్తిగా అవగాహన లేదనుకుంటా. దమ్ము లేని నేతలంతా కలిసి ఇతడికి మద్దతు పలికారు. గొప్ప యూద సెనేటర్ చుక్ షెమెర్, కాంగ్రెస్ సభ్యురాలు అలెగ్జాండ్రియా ఒకాసియో-కోర్టెజ్ సైతం మమ్దానీపై ప్రశంసల వర్షం కురిపించడం వింతగా ఉంది. మమ్దానీ లాంటి వ్యక్తులను గెలిపించడం చూస్తుంటే మన దేశం నిజంగా తప్పుదారిలో వెళ్తోందని స్పష్టమవుతోంది'' అని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఎలాగూ తెలివి తక్కువ వాళ్లే గెలుస్తున్నారు గనుక తక్కువ ఐక్యూ ఉన్న అభ్యర్థులనే డెమొక్రాట్లు ఏ ఎన్నికలకైనా నామినేట్ చేయాలని ట్రంప్ వ్యంగ్య వ్యాఖ్యలు చేశారు.



హిమాచల్ వరదల్లో నలుగురి మృతి

సిమ్లా: హిమాచల్ ప్రదేశ్‌లో సంభవించిన ఆకస్మిక వరదల్లో నలుగురు చనిపోగా సుమారు 20 మంది గల్లంతయ్యారు. కంగ్రా, కులూ జిల్లాల్లో బుధవారం సాయంత్రం కురిసిన కుంభవృష్టి కారణంగా ఒక్కసారిగా వరదలు వచ్చాయి. ఇందిరా ప్రియదర్శిని జల విద్యుత్ ప్రాజెక్టు పనులు చేస్తున్న కార్మికుల కోసం ఆ సమీపంలోనే తాత్కాలిక శిబిరాలను ఏర్పాటు చేశారు. ఆకస్మిక వరదల్లో కార్మికుల శిబిరాలు కొట్టుకుపోయాయి. నలుగురు చనిపోగా మరో 15 మందికిపైగా గల్లంతై ఉంటారని స్థానిక అధికారులు తెలిపారు. గల్లంతైన వారిలో హిమాచల్ ప్రదేశ్‌తోపాటు యూపీకి చెందిన వారున్నారు. కొందరిని రక్షించామని అధికారులు చెబుతున్నప్పటికీ ఎందరనే విషయంలో స్పష్టత లేదు.

సాక్షి హైదరాబాద్

శుక్రవారం । 27 । జూన్ । 2025



సునీల్ శెట్టి @ 187

సొంత దుకాణం నుంచి చోరీలు ప్రారంభించిన సునీల్‌శెట్టి.. 34 ఏళ్ల నేర ప్రస్థానంలో 187 చోరీలు చేశాడు. ఇప్పటి వరకు 25 సార్లు కటకటాల్లోకి వెళ్లాడు. -8లో



హమేషా.. తమాషా..

నగరం సియోల్, బ్యాంకాక్, టోక్యో దేశాల రుచులకు కేంద్రంగా మారుతోంది. గన్‌రాక్‌తో పాటు తమాషా పేరుతో ఆసియన్ వెజ్ కేఫేలు సరికొత్త రుచులను అందిస్తున్నాయి. - సిటీప్లస్‌లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 32.0/22.0

నగరంలో శుక్రవారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్టంగా 32, కనిష్టంగా 22 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముంది.



బోనంతో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



గోల్కొండ కోటలో బోనాల సందడి



బంగారు బోనంతో జోగిని నిషాక్రాంతి



ఒగ్గు కళాకారుల విన్యాసాలు

కొండంత బోనం.. కోటంత సంబురం

ఆషాఢ మాసం బోనాల జాతరలో భాగంగా గోల్కొండ శ్రీ జగదాంబిక మహంకాళి అమ్మవారికి గురువారం తొలి బోనం పూజ ఘనంగా జరిగింది. బోనాల జాతరకు వీఐపీలతో పాటు భక్తులు భారీ సంఖ్యలో తరలి వచ్చారు. బోనాల నిర్వహణ ఉత్సవ కమిటీ చైర్మన్ కె.చంటిబాబు గోల్కొండ చౌరస్తా వద్ద ఘటాలకు స్వాగతం పలికారు. కాగా.. సప్త మాతృకలకు సప్త బంగారు బోనాల్లో భాగంగా జగదాంబిక అమ్మవారికి తొలి బంగారు బోనం సమర్పించారు. ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ చైర్మన్ గోపిశెట్టి రాఘవేందర్ ఆధ్వర్యంలో అక్కన్న మాదన్న దేవాలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఊరేగింపుగా గోల్కొండ కోటకు బయలుదేరారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్, గాజుల అంజయ్య, రాకేష్ తివారి, పాటిల్ సదానంద్ యాదవ్, జనగామ మధుసూదన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. - గోల్కొండ/చార్మినార్



గోల్కొండ కోటలో ఏనుగు అంబారీ వద్ద భక్తుల కోలాహలం



పోతురాజుల వీరంగాలు

రేపు కొత్త ఎక్సైజ్ స్టేషన్లు ప్రారంభం

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో కొత్తగా ఏర్పాటు చేసిన ఎక్సైజ్ స్టేషన్లను శనివారం ఆ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రారంభించనున్నారు. 2020లో కొత్త ఎక్సైజ్ స్టేషన్ల ఏర్పాటుకు ప్రతిపాదించారు. ఈ మేరకు ఇటీవల కొత్త ఎక్సైజ్ స్టేషన్ల విభజన, ప్రాంతాల బదలాయింపు కార్యక్రమాలు పూర్తయ్యాయి.

కొత్తగా ఏర్పాటు చేసిన స్టేషన్లకు ప్రభుత్వం నుంచి ఆమోదం లభించింది. బంజారాహిల్స్, చిక్కడపల్లి, గండిపేట్, కొండాపూర్, పెద్ద అంబర్‌పేట్, కూకట్‌పల్లి, అమీన్‌పూర్‌లలో అద్దె భవనాల్లో స్టేషన్లను ఏర్పాటు చేశారు. మారేడ్‌పల్లి, మీర్‌పేట్, కొంపల్లి, కాప్రా, నాచారం, అల్వాల్ స్టేషన్లకు ప్రస్తుతం ఉన్న ఎక్సైజ్ స్టేషన్లలోనే కొత్త కార్యాలయాలను ప్రారంభించనున్నారు. పాత ఎక్సైజ్ స్టేషన్ల సీఐలే నయా ఆబ్కారీ ఠాణాలకు ఎస్‌హెచ్‌ఓలుగా వ్యవహరించనున్నారు. కొన్ని చోట్ల సీనియర్ ఎక్సైజ్ ఎస్సైలకు బాధ్యతలు అప్పగించనున్నారు. కొత్త ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలోని కేసులను సైతం ఇక నుంచి ఆ స్టేషన్ల అధికారులే పర్యవేక్షించనున్నారు.

పాతబస్తీలో మెట్రో కారిడార్ పనులు వేగవంతం చేయండి

హైదరాబాద్ కలెక్టర్ హరిచందన



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ హరిచందన


సాక్షి, సిటీబ్యూరో: పాతబస్తీ మెట్రో కారిడార్–6 పనులను వేగవంతం చేయాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మెట్రో కారిడార్, రెవెన్యూ అధికారులతో భూసేకరణ, పనుల నిర్వహణ, పురోగతిపై ఆమె సమీక్షించారు. మహాత్మా గాంధీ బస్ స్టేషన్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు మెట్రో స్టేషన్లతో విస్తరించి ఉన్న 7.5 కి.మీ కారిడార్, హైదరాబాద్ పాత నగరంలో కనెక్టివిటీ పెంచే దిశగా చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించిన విషయాన్ని గుర్తు చేశారు. అక్కడి రోడ్లను 100 అడుగులకు పెంచేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. సుమారు 821 ఆస్తులను స్వాధీనం చేసుకోగా.. 435 మంది ఆస్తి యజమానులు అంగీకరించడంతో రూ.283 కోట్ల పరిహారం చెల్లించినట్లు చెప్పారు సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ముకుంద రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (అర్బన్ ల్యాండ్ సీలింగ్), మెట్రో అధికారులు పాల్గొన్నారు.

ఆర్టీఏలో ఆమ్యామ్యాలు!



ప్రతి పనికో ధర చొప్పున పౌర సేవల విక్రయాలు

- ఉప్పల్, తిరుమలగిరిల్లో ఏసీబీకి పట్టుబడిన దళారులు
- ఇన్‌చార్జిల పాలనలో ప్రాంతీయ రవాణా కార్యాలయాలు
- ఉన్నతాధికారుల పర్యవేక్షణ, నిఘా లేకపోవడమే కారణం



సాక్షి, సిటీబ్యూరో:

రవాణా శాఖలో దళారుల దందా హడలెత్తిస్తోంది. అధికారులు, సిబ్బంది కుమ్మక్కై ప్రతి పనికో ధర చొప్పున నిర్ణయించి యథేచ్ఛగా పౌరసేవల విక్రయాలకు పాల్పడుతున్నారు. డ్రైవింగ్ లైసెన్సులు, వాహనాల రిజిస్ట్రేషన్లు, బదిలీలు వంటి పౌరసేవల్లో ఏజెంట్లు, దళారులే రాజ్యమేలుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. తాజాగా గురువారం నగరంలోని ఉప్పల్, సికింద్రాబాద్ (తిరుమలగిరి) ప్రాంతీయ రవాణా కార్యాలయాల్లో ఏసీబీ అధికారులు నిర్వహించిన దాడుల్లో పదుల సంఖ్యలో దళారులు పట్టుబడ్డారు. వాహనదారులకు సంబంధించిన డాక్యుమెంట్లతో సహా వారు ఏసీబీకి దొరికిపోవడం గమనార్హం.

అడ్డూ అదుపూ లేకుండా..

నగరంలోని పలు కార్యాలయాల్లో కొంత కాలంగా దళారుల కార్యకలాపాలు అడ్డూ అదుపూ లేకుండా కొనసాగుతున్నాయి. ఉన్నతాధికారుల పర్యవేక్షణ, నిఘా, నియంత్రణ లేకపోవడంతో ప్రాంతీయ రవాణా కార్యాలయాల్లో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. గురువారం ఏసీబీ దాడులు నిర్వహించిన ఉప్పల్, సికింద్రాబాద్ ప్రాంతీయ రవాణా కార్యాలయాల్లోనే కాకుండా బండ్లగూడ, మణికొండ, కూకట్‌పల్లి, ఇబ్రహీంపట్నం తదితర ప్రాంతీయ రవాణా కార్యాలయాల్లో దళారులు, ఏజెంట్ల నుంచి వచ్చే ఫైళ్లను మాత్రమే అధికారులు పరిశీలించి పౌరసేవలను అందజేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. కొన్ని చోట్ల తప్పుడు అడ్రస్‌లపై డ్రైవింగ్ లైసెన్సులు, రిజిస్ట్రేషన్లు సైతం అందజేస్తున్నారు.

ఇన్‌చార్జిల ఏలుబడిలో అస్తవ్యస్తం..

- గ్రేటర్‌లోని ఉప్పల్, సికింద్రాబాద్ (తిరుమలగిరి), బండ్లగూడ, మెహిదీపట్నం తదితర కార్యాలయాల్లో ఎనిమిది నెలలుగా ఇన్‌చార్జిల పాలన కొనసాగుతోంది. దీంతో కిందిస్థాయి సిబ్బంది నుంచి పరిపాలన అధికారులు, ఎంవీఐలు బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నారు. రెగ్యులర్ అధికారులు లేకపోవడంతో ఇన్‌చార్జిలు దళారుల కార్యకలాపాలను అదుపు చేయలేకపోతున్నారు. దీంతో పౌరసేవల నిర్వహణలో వివిధ విభాగాల మధ్య సమన్వయం కొరవడింది.
- సాధారణంగా ప్రాంతీయ రవాణా అధికారి పర్యవేక్షణలో పని చేసే కార్యాలయాల్లో కొంతమేర పారదర్శకత కనిపిస్తోంది. వివిధ రకాల సర్వీసుల కోసం రూ.వేలల్లో ఫీజులు చెల్లించే వాహనదారుల పట్ల అధికారులు, ఉద్యోగులు జవాబుదారీగా వ్యవహరిస్తారు. కానీ పరిపాలన అధికారులు, ఉద్యోగులకు, మోటారు వాహన తనిఖీ ఇన్‌స్పెక్టర్ల మధ్య సమన్వయం లేకపోవడంతో పలు చోట్ల డ్రైవింగ్ లైసెన్సులు, వాహనాల రిజిస్ట్రేషన్లు, బదిలీలు, ఫిట్‌నెస్ పరీక్షలు, యాజమాన్య బదిలీ వంటి పలు సేవల్లో వాహన వినియోగదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. మరోవైపు అన్ని చోట్ల ఏజెంట్ల కార్యకలాపాలు బహిరంగంగానే కొనసాగుతున్నాయి.

ఈ ఘటన ఓ మచ్చుతునక..

రెండు నెలల క్రితం కూకట్‌పల్లి యూనిట్ కార్యాలయంలో కొత్త ద్విచక్రవాహనం రిజిస్ట్రేషన్ కోసం వెళ్లిన ఒక వాహనదారుడిని సిబ్బంది తీవ్ర ఇబ్బందులకు గురి చేశారు. సదరు వాహనదారు చిరునామా ధ్రువీకరణ కోసం విద్యుత్ బిల్లు, అఫిడవిట్లు అందజేసినప్పటికీ మ్యారేజ్ సర్టిఫికెట్ కూడా జత చేస్తే తప్ప ఫైల్‌ను ముందుకు కదలదని చెప్పడంతో అతడు విస్తుపోయాడు. దళారుల ద్వారా వెళ్లకపోవడం వల్లే తనను అధికారులు ముప్పుతిప్పలు పెట్టినట్లు విస్మయం వ్యక్తం చేశాడు. ఇంచుమించు అన్ని చోట్ల ఇదే పరిస్థితి నెలకొంది.

అసిస్టెంట్లకు అద్దాలు..

వాహనదారులు ఆన్‌లైన్‌లో స్లాట్ నమోదు చేసుకొని ఫీజులు చెల్లించినప్పటికీ లెర్నింగ్ లైసెన్సులు, శాశ్వత డ్రైవింగ్ లైసెన్సులు, వాహనాల రిజిస్ట్రేషన్ల కోసం ఆర్టీఏ కార్యాలయాలకు స్వయంగా వెళ్లాల్సి ఉంటుంది. ఈ క్రమంలో ఏజెంట్‌ల ద్వారా వచ్చే ఫైళ్లు సత్వరమే పరిష్కారమవుతుండగా, స్వయంగా వెళ్లే వినియోగదారులు మాత్రం ఇబ్బందులకు గురవుతున్నారు. కొన్ని ప్రాంతీయ రవాణా కార్యాలయాలు మధ్యవర్తులకు ప్రధాన అడ్డాలుగా మారాయి. జూనియర్ అసిస్టెంట్లు, సీనియర్ అసిస్టెంట్ల విధుల్లో వాళ్లకు అసిస్టెంట్లుగా వ్యవహరించే దళారులే స్వయంగా ఆఫీసుల్లో తిష్టవేసి పనులు చేయడం గమనార్హం.

కర్ణన్ మార్క్!



జీహెచ్‌ఎంసీలో భారీ స్థాయిలో ప్రక్షాళన

- అడిషనల్ కమిషనర్ల బాధ్యతల్లో మార్పులు
- ఇద్దరు 'అదనపు' కమిషనర్లు మాతృ సంస్థకు
- మరో ఇద్దరి స్థాయి తగ్గింపు

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత దాదాపు రెండు నెలల కాలంలో కర్ణన్ తనదైన మార్క్‌తో అడిషనల్ కమిషనర్ల స్థానాలు మార్చారు. అదనపు భారమని భావించారో ఏమో కానీ ఇద్దరు అడిషనల్ కమిషనర్లను మాతృసంస్థ అయిన మున్సిపల్ పరిపాలన విభాగానికి సరెండర్ చేశారు. వారిని వెంటనే రిలీవ్ కూడా చేశారు. అడిషనల్ కమిషనర్లుగా ఉన్న ఇద్దరిని జాయింట్ కమిషనర్లుగా మార్చడం అంతు చిక్కడం లేదు. మొత్తానికి కర్ణన్ చేసిన బదిలీలు, రిలీవ్‌ల ఉత్తర్వులు జీహెచ్‌ఎంసీ వర్గాలను ఓ కుదుపు కుదిపివేశాయి.

బల్దియాలో భారీ కుదుపులు ఇలా..

రెవెన్యూ, ఐటీ విభాగాల అడిషనల్ కమిషనర్ అనురాగ్ జయంతికి అదనంగా ప్రకటనల విభాగాన్ని అప్పగించారు. నగరంలోనే కీలక జోన్ అయిన ఖైరతాబాద్ జోనల్ కమిషనర్‌గానూ అనురాగ్ జయంతి విధులు నిర్వహిస్తున్నారు. యూబీడీ అడిషనల్ కమిషనర్ వి.సుభద్రాదేవికి క్రీడల విభాగం అదనంగా అప్పగించారు. శానిటేషన్ విభాగం నిర్వహిస్తున్న సీఎన్ రఘుప్రసాద్‌కు అదనంగా హెల్త్ విభాగాన్ని కూడా అప్పగించారు. గతంలోనూ శానిటేషన్, హెల్త్ విభాగాలు ఒకే అదనపు కమిషనర్‌కు ఉండేవి. ఎక్కువ మంది అదనపు కమిషనర్లు జీహెచ్‌ఎంసీకి రావడంతో కొన్ని విభాగాలను విడదీసి ఇద్దరు, ముగ్గురికి కూడా అప్పగించారు. ఆ విధానానికి స్వస్తి చెప్పినట్లు తాజా కేటాయింపులతో అవగతమవుతోంది.

చర్చనీయాంశంగా బాధ్యతల అప్పగింతలు..

ఎస్.పంకజకు ప్రస్తుతం ఖాళీగా ఉన్న యూసీడీ విభాగం అడిషనల్ కమిషనర్ బాధ్యతలప్పగించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య విభాగం అడిషనల్ కమిషనర్‌గా ఉన్నారు. ఎస్టేట్స్ విభాగం బాధ్యతల్ని ఎన్నికల విభాగం నిర్వహిస్తున్న అడిషనల్ కమిషనర్ కె.అలివేలు మంగతాయారుకు అదనంగా అప్పగించారు. పి.సరోజను డిపార్ట్‌మెంటల్ ఎంక్వైరీస్ అడిషనల్ కమిషనర్‌గా యథాస్థానంలో ఉంచారు. ప్రస్తుతం అడిషనల్ కమిషనర్లుగా ఉన్న ఇద్దరికి జాయింట్ కమిషనర్లుగా బాధ్యతలప్పగించడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

- జి. వేణుగోపాల్‌రెడ్డిని శానిటేషన్–1 (చార్మినార్, సికింద్రాబాద్, ఎల్‌బీనగర్ జోన్లు) జాయింట్ కమిషనర్‌గా నియమించడంతో పాటు ఫిర్యాదుల పరిష్కారం, సోషల్ మీడియా ఎంగేజ్‌మెంట్ పేరిట కొత్త బాధ్యత లప్పగించారు. అశోక్ సామ్రాట్‌ను శానిటేషన్–2 (శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, ఖైరతాబాద్) జాయింట్ కమిషనర్‌గా నియమించారు. వీరిద్దరినీ జాయింట్ కమిషనర్లుగా మార్చడం వెనుక కారణాలు అంతు చిక్కడం లేదు. అశోక్ సామ్రాట్ ఎస్టేట్స్ విభాగం అడిషనల్ కమిషనర్‌గా జీహెచ్‌ఎంసీకి గతంలో మున్నెన్నడూ లేనంత భారీ ఆదాయాన్ని సమకూర్చడంతో పాటు ఆ విభాగం ప్రక్షాళన చేపట్టారు. ఆన్‌లైన్ విధానాన్ని అందుబాటులోకి తెచ్చారు. గతంలో చార్మినార్ జోనల్ కమిషనర్‌గానూ సమర్థవంతంగా పనిచేయడాన్ని పలువురు ఈ సందర్భంగా ప్రస్తావిస్తున్నారు.
- కూకట్‌పల్లి జోన్ జాయింట్ కమిషనర్‌గా ఉన్న ఎన్. శంకర్‌ను హెల్త్ విభాగం జాయింట్ కమిషనర్‌గా బదిలీ చేశారు. హెల్త్ విభాగం జాయింట్ కమిషనర్‌గా ఉన్న కె.జయంత్‌రావును కోఆర్డినేషన్ జాయింట్ కమిషనర్‌గా నియమిస్తూ.. మెట్రోపాలిటన్ ఏరియా అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్ సెక్రటరీ పేషీకి డిప్యుటేషన్‌పై నియమించారు. ఎన్నికల విభాగం ఇన్‌చార్జి జాయింట్ కమిషనర్‌గా కులీకుతుబ్‌షా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ సెక్రటరీ రమాదేవికి అదనపు బాధ్యతలప్పగించారు. హౌసింగ్ విభాగాన్ని ఇదే విభాగం సీఈకి, వీధిదీపాల నిర్వహణను మెయింటనెన్స్ విభాగం సీఈకి, హెరిటేజ్ విభాగం బాధ్యతలు సీసీపీకి అప్పగించారు.

మాతృసంస్థకు ఇద్దరు అడిషనల్ కమిషనర్లు

స్పోర్ట్స్ విభాగం అడిషనల్ కమిషనర్ డా.ఎస్.యాదగిరిరావును, హౌసింగ్‌విభాగం అడిషనల్ కమిషనర్ జి.నళినీ పద్మావతిని మాతృసంస్థ పురపాలకశాఖ డైరెక్టర్ కార్యాలయానికి పంపించారు. ఈ మేరకు విడిగా ప్రొసీడింగ్స్ జారీ చేశారు.

త్వరలో డీసీల బదిలీలు ?

ప్రస్తుతం అడిషనల్ కమిషనర్ల స్థానాల్లో మార్పులు చేసిన కర్ణన్.. త్వరలోనే డిప్యూటీ కమిషనర్ల బదిలీలు చేసే అవకాశం ఉంది. పలువురు డిప్యూటీ కమిషనర్లు ఇటీవల పదోన్నతులు పొందినప్పటికీ, వారి స్థానాలను మార్చలేదు. త్వరలోనే వారి బదిలీలు జరుగుతాయని బల్దియా వర్గాలు భావిస్తున్నాయి. జోనల్ కమిషనర్లలోనూ మార్పులుంటాయా? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.



స్టాండింగ్ కమిటీ సమావేశంలో పాల్గొన్న కమిషనర్ కర్ణన్, మేయర్ విజయలక్ష్మి తదితరులు

అన్నపూర్ణ కేంద్రాలిక 'ఇందిరా క్యాంటీన్లు'

రూ.5కే భోజనంతో పాటు ఉదయం పూట టిఫిన్ సైతం

- పలు అంశాలకు జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ ఆమోదం

సాక్షి, సిటీబ్యూరో: పేదలకు రూ. 5కే భోజన సదుపాయం కల్పిస్తున్న అన్నపూర్ణ కేంద్రాల పేరు మారనుంది. ఇవి ఇందిరా క్యాంటీన్లుగా మారనున్నాయి. ప్రస్తుతం భోజనం మాత్రమే అందిస్తున్న ఈ కేంద్రాల ద్వారా త్వరలో టిఫిన్ సదుపాయం కూడా అందుబాటులోకి రానుంది. ఇడ్లీ, పొంగల్, ఉప్మా, పూరీ.. వీటిలో ఏదో ఒకటి ప్రతిరోజూ టిఫిన్‌గా అందజేస్తారు. ముమ్ముందు దోసె వంటి వాటిని కూడా అందించే తలంపులో ఉన్నారు. దేశంలోనే తొలిసారిగా నిరుపేదల ఆకలి తీర్చాలనే ఉదాత్త ఆశయంతో జీహెచ్‌ఎంసీ హరేకృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్‌తో కలిసి రూ.5కే భోజన కేంద్రాలు ఏర్పాటు చేసింది. ప్రస్తుతం 128 కేంద్రాల ద్వారా ఈ సదుపాయం అందుబాటులో ఉండగా, 11కేంద్రాలు సీటింగ్ సదుపాయాలతో ఉన్నాయి. ఈ కేంద్రాలను, మిగతా కేంద్రాలను పునరుద్ధరించడంతోపాటు వీటికి 'ఇందిరా క్యాంటీన్'గా పేరుపెట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. భోజనంతో పాటు అదే రూ. 5కే టిఫిన్ సదుపాయం కూడా కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు గురువారం జరిగిన స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపింది. మొత్తం 32 అంశాలకు కమిటీ ఆమోద ముద్ర వేసింది. వీటిలో ప్రధానమైనవి ఇలా ఉన్నాయి.. రూ. 5.98 కోట్లతో ఎల్‌బీనగర్ క్రాస్‌రోడ్స్ – లింగోజిగూడ ప్రియదర్శిని పార్కు వరకు వరదనీటి డ్రెయిన్ నిర్మాణం. హెచ్‌ఎండీఏ సహకారంతో ఈఎస్ఆర్ఐ ఏజెన్సీ ద్వారా 150 డివిజన్లలో మొబైల్ ఫీల్డ్ వర్కర్ యూజర్ టైప్ సర్వేకు ఆర్క్ జీఐఎస్ లాగిన్ల కోసం రూ. 77.88 లక్షల చెల్లింపు. మల్కాజిగిరి సర్కిల్‌లో కొత్త రైల్వే స్టేషన్‌కు రాధాకృష్ణనగర్ రైల్వేస్టేషన్‌గా పేరు పెట్టినందున ధ్రువీకరణకు ఇంగ్లిష్, హిందీ, స్థానిక భాషల్లో స్పెల్లింగ్‌తో సహా ప్రభుత్వానికి పంపడం. శిల్పా లేఔట్ ఫేజ్ –2 ఫ్లై ఓవర్‌కు పీజేఆర్ (పి.జనార్దన్‌రెడ్డి) ఫ్లై ఓవర్‌గా నామకరణం. పాలకమండలి ఆమోదానికి పంపడం. చాంద్రాయణగుట్ట బాగ్దాదీ డైరీ ఫామ్ నుంచి గుర్రం చెరువు వరకు, బాలాపూర్ రోడ్డు నుండి గుర్రం చెరువు కల్వర్ట్ వరకు రూ. 2.60 కోట్ల అంచనా వ్యయంతో ఓపెన్ డ్రెయిన్ నాలా నిర్మాణం. పబ్లిక్ టాయ్‌లెట్ల వినియోగానికి పే అండ్ యూజ్ విధానం. సమావేశానికి మేయర్ విజయలక్ష్మి అధ్యక్షత వహించగా, కమిషనర్ కర్ణన్, స్టాండింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సాక్షి
శుక్రవారం । 27 । జూన్ । 2025

ఆటోల దొంగ అరెస్టు

నాంపల్లి: చోరీ చేసిన ఆటోతో తిరుగుతున్న దొంగను హబీబ్‌నగర్ పోలీసులు అరెస్టు చేశారు. హబీబ్‌నగర్ ఇన్‌స్పెక్టర్ టి.పురుషోత్తమ్ రావు తెలిపిన మేరకు.. మంగళహాట్‌కు చెందిన మహ్మద్ యాసీన్ కుమారుడు మహ్మద్ మజీద్(31) కూలిపని చేస్తుంటాడు. తాగుడుకు బానిసైన మహ్మద్ మజీద్ చోరీలకు అలవాటుపడ్డాడు. హబీబ్‌నగర్‌లో రెండు ఆటోలు చోరీ చేసి తప్పించుకుని తిరుగుతున్నాడు. చోరీ చేసిన ఆటోతో బోయిగూడ కమాన్ వద్ద తిరుగుతున్న మజీద్‌ను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. రెండు ఆటోలను స్వాధీనం చేసుకున్నారు.

సునీల్ శెట్టి @187

మళ్లీ చిక్కిన ఘరానా దొంగ మహ్మద్ సలీం

- 1991 నుంచి నేర ప్రస్థానం... 187 కేసులు
- చోరీ సొమ్ముతో హెలీటూరిజం
- గురువారం అరెస్టు చేసిన బండ్లగూడ పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ సుధాకర్, నిందితుడు మహ్మద్ సలీం (ఇన్‌సెట్)

సాక్షి, సిటీబ్యూరో/చాంద్రాయణగుట్ట: అసలు పేరు మహ్మద్ సలీం... మారు పేరు సునీల్‌శెట్టి... సొంత దుకాణం నుంచే చోరీలు ప్రారంభించాడు... 34 ఏళ్ల నేర ప్రస్థానంలో 187 చోరీలు చేశాడు... ఇప్పటి వరకు 25 సార్లు అరెస్టై కటకటాల్లోకి వెళ్లాడు... 'పీడీ'కి దొరక్కుండా జాగ్రత్తపడే సునీల్ గత నెల 5న జైలు నుంచి బయటకు వచ్చాడు... మరో రెండు నేరాలు చేసి బండ్లగూడ పోలీసులకు చిక్కాడు. చోరీ సొత్తుతో ఉత్తరాదిలో జల్సాలతో పాటు హెలీటూరిజం ఈ సునీల్ శెట్టి నైజం. ఈ ఘరానా దొంగను బండ్లగూడ పోలీసులు అరెస్టు చేసినట్లు చంద్రాయణగుట్ట ఏసీపీ ఎ.సుధాకర్ గురువారం వెల్లడించారు.

మార్చిన 'ఆమె' పరిచయం...

ఫతేదర్వాజా సమీపంలోని కుమ్మరివాడికి చెందిన సలీం నిరక్షరాస్యుడు. తొలుత కిరోసిన్ లాంతర్ల కర్మాగారంలో పనివాడిగా చేరాడు. ఆపై తన తండ్రికి చెందిన కిరాణా దుకాణంలోనే పని చేయడం మొదలెట్టాడు. సలీంకు 16వ ఏట ఓ అమ్మాయితో అయిన పరిచయం ప్రేమకు దారి తీసింది. ఆమెతో కలిసి షికార్లు చేయడానికి అవసరమైన ఖర్చుల కోసం తమ దుకాణంలోనే చోరీలు చేయడం మొదలెట్టాడు. ఈ విషయం బయటకు పొక్కేసరికి ఇల్లు వదిలి పారిపోయి చాదర్‌ఘాట్‌లోని ఓ హోటల్‌లో కార్మికుడిగా మారాడు. ఈ పని చేస్తూనే అవకాశం చిక్కినప్పుడల్లా చిన్న చిన్న గృహోపకరణాలు తస్కరించడం మొదలెట్టాడు. 1991లో ఇతడి 18వ ఏట ఇత్తడి వస్తువుల చోరీ కేసులో తొలిసారిగా చాదర్‌ఘాట్ పోలీసులకు చిక్కి జైలుకు వెళ్లాడు. జైల్లో పరిచయమైన 'సీనియర్ల' వద్ద తాళాలు పగులకొట్టడంతో మెళకువలు నేర్చుకున్నాడు.

ఇంటి తాళం ముట్టనే ముట్టడు...

ఈ చోరుడు ప్రధానంగా పాతబస్తీలోని ఓ వర్గానికి చెందిన వారి ఇళ్లనే టార్గెట్‌గా చేసుకుంటాడు. ఆ ప్రాంతాల్లోని ప్రజలు సాధారణంగా తెల్లవారుజాము 3 గంటల వరకు మెలకువగానే ఉంటారు. అందుకే ఇతగాడు తెల్లవారుజాము 4 గంటల తర్వాతే చోరీ చేస్తాడు. అప్పటి వరకు నిద్రరాకుండా ఉండేందుకు తన స్మార్ట్‌ఫోన్‌లో లూడో, క్రికెట్ ఆడుతూ టైమ్‌పాస్ చేస్తాడు. చిన్న టార్చ్‌లైట్, కటింగ్ ప్లేయర్‌తో 'రంగం'లోకి దిగే ఇతగాడు ప్రధానంగా మధ్య తరగతి, దిగువ మధ్య తరగతి వర్గాలకు చెందిన ఇళ్లనే ఎంచుకుంటాడు. తాళం వేసున్న ఇంటిని టార్గెట్ చేసినప్పటికీ ఎట్టి పరిస్థితుల్లోనూ దాన్ని పగులకొట్టడు. గోడ దూకి సజ్జ ద్వారా ఇంటి పైకి చేరతాడు. అక్కడ నుంచి ఇంట్లోకి చేరే మార్గం వెతుక్కుని ప్రవేశిస్తాడు. ఇతగాడు చోరీ చేసే సమయంలో పెట్రోలింగ్ వాహనాలు ఆ ప్రాంతానికి వచ్చినా ఇంటి తాళం యథాతథంగా ఉండటంతో వారు దృష్టిపెట్టరని ఇలా చేస్తుంటాడు. లోపలకు వెళ్లాక చెంచాల సహా అక్కడ ఉన్న ఉపకరణాలతోనే అల్మారాలు పగులకొట్టి సొత్తు స్వాహా చేస్తాడు. 1998లో ముగ్గురు సంతానం ఉన్న ఓ వితంతువును వివాహం చేసుకున్న ఈ సునీల్‌శెట్టి ఇప్పుడు ఏడుగురి పిల్లలకు తండ్రి.

ఈ దొంగనే దోచిన 'దొంగది'...

ఈ సొత్తు విక్రయించగా వచ్చిన సొమ్ముతో ముంబై, అజ్మీర్ సహా ఉత్తరాదిలో జల్సాలు చేస్తుంటాడు. సైట్ సీయింగ్‌తో పాటు హెలీకాప్టర్‌లో సంచరించే హెలీటూరిజం కోసం భారీ ఖర్చు చేస్తాడు. వ్యభిచారిణుల వద్దకు వెళ్ళే అలవాటు ఉన్న సలీం ఓసారి రూ.12 లక్షల చోరీ సొత్తుతో ముంబైలోని ఓ మహిళ వద్దకు వెళ్లాడు. ఇతడు నిద్రపోతున్న సమయంలో ఆ సొత్తు కాజేసిన ఆమె ఉడాయించింది. బాలీవుడ్ నటుడు సునీల్‌శెట్టి అంటే అమితంగా ఇష్టపడే సలీం తన పేరునూ అలానే మార్చుకున్నాడు. ముంబైలోని బాంద్రాలో ఉన్న ఆ హీరో ఇంటి వద్దకు అనేకసార్లు వెళ్లినా కలవడం సాధ్యం కాలేదు. ఇప్పటి వరకు 187 నేరాలు చేసి 25సార్లు అరెస్టు అయినా... శిక్షలు పూర్తయ్యే వరకు జైలు నుంచి బయటకు రాని నేపథ్యంలోనే ఇతడిపై పీడీ యాక్ట్ ప్రయోగం సాధ్యం కాలేదు. గత నెల్లో జైలు నుంచి బయటకు వచ్చిన ఈ సునీల్ శెట్టి బండ్లగూడ పరిధిలో రెండు నేరాలు చేశాడు. ఈ నేరాల్లో ఇతడిని అరెస్టు చేసిన పోలీసులు 35 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నారు. సునీల్ శెట్టిని అరెస్టు చేసిన పోలీసులను డీసీపీ ఎస్.చైతన్యకుమార్ అభినందించారు.

హైడ్రా పేరుతో బెదిరింపు

- నార్సింగి పీఎస్‌లో ఇద్దరిపై కేసు నమోదు

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) పేరు చెప్పి బెదిరించిన ఇద్దరిపై నార్సింగి పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. కరీంనగర్ నుంచి వచ్చి కారుడ్రైవర్‌గా పని చేస్తున్న మిరియాల వేదాంతం అల్కాపురి టౌన్‌షిప్‌లో నివసిస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం ఈ ద్వయం నెక్నాంపూర్‌లోని అల్కాపూర్ టౌన్‌షిప్‌లో ఉన్న ఓ ఇంటి వద్దకు వెళ్లింది. నలుపు రంగు కారులో వచ్చిన వీరిద్దరూ ఆ ఇంటి ఆవరణలోకి వెళ్లి పరిశీలిస్తుండగా గమనించిన ఇంటి వద్ద పని చేసే గుంతకల్ మల్లికార్జున్ వారిని ఎవరంటూ ప్రశ్నించారు. తాము హైడ్రా నుంచి వచ్చామని చెప్పిన ద్వయం ఆ ఇంటిని కూల్చేస్తామని, దానికి సంబంధించిన సమాచారం సేకరిస్తున్నామని చెప్పారు. దీంతో మల్లికార్జున్ ఈ విషయంపై ఇంటి యజమానితో మాట్లాడాలని సూచించగా అక్కడ నుంచి జారుకున్నారు. ఈ మేరకు మల్లికార్జున్ నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది. దర్యాప్తు చేసిన అధికారులు ఇరువురినీ కస్టడీలోకి తీసుకున్నారు. హైడ్రా పేరు చెప్పి ఎవరైనా మోసాలకు, బెదిరింపులకు పాల్పడితే వెంటనే వారిపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని హైడ్రా గురువారం ఒక ప్రకటనలో కోరింది. ఇలాంటి వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించవద్దని, నేరుగా తమకు ఆ సమాచారం ఇచ్చినా వారిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది. ఏదైనా విషయంపై హైడ్రా ఉద్యోగులు విచారణ చేపడితే... అడిగిన వారికి పూర్తి వివరాలు అందిస్తారని పేర్కొంది. హైడ్రా ఉద్యోగుల్లో ఎవరైనా ఇలాంటి చర్యలకు పాల్పడినా, హైడ్రా పేరును దుర్వినియోగం చేసినా వారిపైనా కఠిన చర్యలు తీసుకుంటామని ప్రకటించింది. ఇలాంటి బెదిరింపు వ్యవహారాలు గమనిస్తే 8712406899 నంబరుకు ఫోను చేసి లేదా వాట్సాప్ ద్వారా సమాచారం ఇవ్వాలని కోరింది. వీలుంటే వీరి ఫొటోలు కూడా షేర్ చేయాలని పేర్కొంది.

పెట్టుబడుల పేరుతో టోకరా

సోషల్‌మీడియా ద్వారా ఎర వేసిన సైబర్ నేరగాళ్లు

- రోజుకు 8 నుంచి 20 శాతం వరకు లాభాలంటూ...
- నగర వాసి నుంచి రూ.74.3 లక్షలు కాజేసిన వైనం
- సిటీ సైబర్ క్రైమ్ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు

సాక్షి, సిటీబ్యూరో: వాట్సాప్ ద్వారా నగరవాసికి ఎర వేసిన సైబర్ నేరగాళ్లు తమ ద్వారా పెట్టుబడులు పెడితే భారీ లాభాలు వస్తాయంటూ ఎర వేశారు. ఆపై వివిధ రకాలైన స్కీముల పేరు చెప్పి రూ.74.3 లక్షలు పెట్టుబడి పెట్టించి మోసం చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు గురువారం కేసు నమోదు చేసుకున్నారు. సైదాబాద్ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తికి (50) గత నెల 18న ఓ వాట్సాప్ సందేశం వచ్చింది. సిటాడెల్, యాక్సిస్ సెక్యూరిటీస్ సంస్థలకు చెందిన ప్రతినిధులుగా చెప్పుకున్న వ్యక్తులు ఈయనతో సంప్రదింపులు జరిపారు. తమ వద్ద పెట్టుబడులు పెడితే ప్రతి రోజూ కనిష్టంగా 8 నుంచి గరిష్టంగా 20 శాతం వరకు లాభాలు పొందవచ్చని నమ్మబలికారు. అతను ఆసక్తి చూపడంతో వాళ్లు కొన్ని లింకులు పెట్టారు. వాటి ద్వారా వర్చువల్ యాప్స్ డౌన్‌లోడ్ చేసుకున్న బాధితుడు పెట్టుబడి పెట్టడం ప్రారంభించాడు. తొలుత రెండు పథకాల్లో రూ.లక్ష చొప్పున పెట్టుబడి పెట్టి... రెండు రోజులకే రూ.ఎనిమిది వేల లాభం పొందారు. ఈ మొత్తం డ్రా చేసుకోవడానికీ నేరగాళ్లు అవకాశం ఇచ్చారు. దీంతో వారిని పూర్తిగా నమ్మిన బాధితుడికి కొత్త పథకాల ద్వారా 240 నుంచి 320 శాతం వరకు లాభాలు ఉంటాయని నేరగాళ్లు చెప్పారు. దీంతో గత నెల 23 నుంచి ఈ నెల 13 వరకు వివిధ దఫాల్లో రూ.74.3 లక్షలు ఇన్వెస్ట్ చేశాడు. తన యాప్స్‌లో రూ.7.5 కోట్ల లాభం వచ్చినట్లు కనిపించడంతో డ్రా చేసుకోవాలని బాధితుడు ప్రయత్నించాడు. దీనికి అవకాశం ఇవ్వని సైబర్ నేరగాళ్లు అదనంగా రూ.83 లక్షలు, రూ. 70.07 లక్షలు చొప్పున రెండు స్కీముల్లో ఇన్వెస్ట్ చేయాలని, అప్పుడే విత్‌డ్రాకు అవకాశం ఉంటుందని చెప్పారు. దీంతో ఇది మోసమని తెలుసుకున్న బాధితుడు సిటీ సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది.

రైళ్లలో చోరీలకు పాల్పడే యువకుడి అరెస్టు

200 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం



వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ ఎస్.ఎన్.జావీద్

నాంపల్లి: రైళ్లలో దొంగతనాలకు పాల్పడే ఓ యువకుడిని రైల్వే పోలీసులు అరెస్టు చేశారు. అతడి నుంచి రూ.20 లక్షల విలువైన బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటన గురువారం లింగంపల్లి రైల్వే స్టేషన్‌లో చోటు చేసుకుంది. రైల్వే డీఎస్పీ ఎస్ఎన్ జావీద్, నాంపల్లి జీఆర్పీ రైల్వే ఇన్‌స్పెక్టర్, ఆర్‌పీఎఫ్ ఎస్సై బాలాజీతో కలిసి వివరాలను వెల్లడించారు. లింగంపల్లి రైల్వే స్టేషన్‌లో జీఆర్‌పి, ఆర్‌పిఎఫ్ పోలీసులు సంయుక్తంగా సాధారణ తనిఖీలు చేస్తుండగా అనుమానాస్పదస్థితిలో సంచరించే ఒక యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద ఉన్న ఒక సంచిని పరిశీలించగా బంగారు ఆభరణాలు ఉన్నట్లుగా పోలీసులు గుర్తించారు. దీంతో కస్టడీలోకి తీసుకుని విచారించగా లింగంపల్లి-కాకినాడ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రైలులో దొంగతనం చేసినట్లుగా ఒప్పుకున్నారు. అతను నల్గొండ జిల్లా ఖుత్బుల్లాపూర్ సూరారంలో నివాసముండే ఉండే బి.ఇన్నయ్య కుమారుడు బి.సాగర్ అనీల్‌కుమార్(32)గా గుర్తించారు. బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకుని సీజ్ చేసి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

పరారీలో ఉన్న కలెక్షన్ ఏజెంట్ అరెస్ట్

చాంద్రాయణగుట్ట: నగల దుకాణాలలో వసూలు చేసిన రూ.7 లక్షల నగదును యజమానికి ఇవ్వకుండా ఉడాయించిన ఓ కలెక్షన్ ఏజెంట్‌ను దక్షిణ మండలం టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి రూ.6.42 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. నగర టాస్క్‌ఫోర్స్ అదనపు డీసీపీ అందె శ్రీనివాసారావు తెలిపిన వివరాల ప్రకారం...ఫలక్‌నుమాకు చెందిన మహ్మద్ అఫ్సర్(45)శాలిబండలోని ధన్‌రాజ్ జ్యూయలరీలో ఐదేళ్లుగా కలెక్షన్ ఏజెంట్‌గా కొనసాగుతున్నాడు. నిత్యం నగరంలోని వివిధ జ్యూయలరీ దుకాణాలలో డబ్బులు వసూలు చేసి యజమానికి అందిస్తూ నమ్మకంగా కొనసాగాడు. ఈ నమ్మకం ముసుగులోనే సిద్దంబర్ బజార్, బేగంబజార్‌లలోని జ్యూయలరీలలో వసూలు చేసిన రూ.7 లక్షల నగదును యజమానికి ఇవ్వకుండా పరారయ్యాడు. కొంత డబ్బును అప్పులు కట్టుకొని, మరికొంత నగదుతో జల్సాలు చేశాడు. యజమాని ఫిర్యాదు మేరకు శాలిబండ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడి జాడ తెలుసుకున్న దక్షిణ మండలం టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎస్.రాఘవేంద్ర, ఎస్సైలు ఎన్.నవీన్, ఎం.మహేష్, శాలిబండ పోలీసులు సంయుక్తంగా అరెస్ట్ చేశారు.

కదులుతున్న రైలు ఎక్కబోయి జారిపడి వ్యక్తి మృతి

సికింద్రాబాద్: కదులుతున్న రైలు ఎక్కబోయి జారిపడిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ వ్యక్తి గురువారం మృతి చెందాడు. జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ పండరి వివరాల మేరకు... ఉత్తరప్రదేశ్ రాష్ట్రం భారేల్లికి చెందిన కైలాస్‌చంద్ర రస్తోగి (49) చెన్నై వెళ్లేందుకు ఈనెల 24న రైలు ప్రయాణం ద్వారా బయలుదేరి సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు చేరుకున్నాడు. ఈనెల 25న సాయంత్రం చార్మినార్ ఎక్స్‌ప్రెస్ కదులుతుండగా ఎక్కే ప్రయత్నం చేశాడు. ఈ ప్రమాదంలో కాలుజారి కిందపడ్డాడు. రైలుకు, ప్లాట్‌ఫామ్‌కు మధ్యలో నలిగి తీవ్రంగా గాయపడ్డ కైలాస్‌చంద్ర రస్తోగిని పోలీసులు గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రస్తోగి గురువారం సాయంత్రం మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు.

నకిలీ ట్యాబ్లెట్ల విక్రయం..

- ఇద్దరిని అరెస్టు చేసిన డీసీఏ అధికారులు

సాక్షి, సిటీబ్యూరో: శరీరంలో కొలెస్ట్రాల్‌ను తగ్గించడంతో పాటు గుండె సంబంధిత సమస్యల కోసం వినియోగించే రోసువాస్ ఎఫ్ 10, రోసువాస్ ఎఫ్ 20 టాబ్లెట్స్ నకిలీవి విక్రయిస్తున్న ఇరువురిని డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డీసీఏ) అధికారులు అరెస్టు చేశారు. వీరిని న్యాయస్థానంలో హాజరుపరచగా 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించినట్లు డైరెక్టర్ జనరల్ షానవాజ్ ఖాసిం గురువారం వెల్లడించారు. సన్ ఫార్మా తయారు చేసే ఈ రెండు టాబ్లెట్లకు మార్కెట్‌లో డిమాండ్ ఉంది. ఈ విషయం గుర్తించిన ఇందర్‌బాగ్‌లోని గంగ ఫార్మా డిస్ట్రిబ్యూటర్స్ యజమాని కె.ప్రవీణ్‌కుమార్, గుజరాతీ గల్లీలోని శ్రీ నంది ఫార్మా యజమాని ఎం.శ్రీనివాస్ నకిలీవి విక్రయిస్తున్నారు. ఈ సమాచారం అందుకున్న అధికారులు దాడులు చేసి ఇద్దరినీ పట్టుకున్నారు. వీరి నుంచి భారీ మొత్తంలో నకిలీ టాబ్లెట్లు స్వాధీనం చేసుకున్నారు. ఇవి వీరికి ఎక్కడి నుంచి వస్తున్నాయనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. వీటిని వినియోగిస్తే దుష్ప్రభావాలు సైతం ఉంటాయని అధికారులు చెబుతున్నారు.

మహారాష్ట్ర జైలులో మోస్ట్ వాంటెడ్ నేరస్తుడు

- సిటీకి తీసుకొచ్చిన పోలీసులు

రసూల్‌పురా: పరారీలో ఉన్న మోస్ట్ వాంటెడ్ చైన్‌స్నాచర్‌ను కార్ఖాన పోలీసులు అరెస్టు చేసి విచారిస్తున్నారు. తిరుమలగిరి ఏసీపీ రమేష్ తెలిపిన మేరకు.. బీదర్ జిల్లాకు చెందిన బాబర్ అలియాస్ బాకర్ అక్రమ్ (32) మోస్ట్ వాంటెడ్ నేరస్తుడు. నగరంలోని పలుచోట్ల 94 చైన్‌స్నాచింగ్ కేసుల్లో నిందితుడు. 2015లో కార్ఖానాలో జరిగిన చైన్‌స్నాచింగ్ కేసులో అరెస్టు అయ్యాడు. విచారణ సమయంలో పరారయ్యాడు.ఇతనిపై కోర్టు నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. పెండింగ్‌లో ఉన్న కోర్టు కేసుల విచారణలో భాగంగా పోలీసులు బాబర్ పరారీలో ఉన్నట్లు తెలుసుకుని దర్యాప్తు చేసి విశ్వసనీయ సమాచారం మేరకు మహారాష్ట్రలోని కళ్యాణ్ అధర్వాడి జిల్లా జైలులో ఉన్నట్లు తెలుసుకున్నారు. సమాచారం అందుకున్న కార్ఖాన ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ ఆధ్వర్యంలో డీఐ రాజశేఖర్ నేతృత్వంలో పోలీసులు అధర్వాడి జైలు నుంచి బాబర్‌ను అదుపులోకి తీసుకుని కార్ఖాన పీఎస్‌కు గురువారం తరలించారు.

మద్యం మత్తులో కారుతో యువకుడి బీభత్సం

రాజేంద్రనగర్: మద్యం మత్తులో ఓ యువకుడు తన ఇండికా కారును వేగంగా నడుపుతూ బీభత్సం సృష్టించాడు. కారు అదుపు తప్పి రెండు కార్లు, ఒక ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో పాటు బస్సును ఢీకొట్టింది. ప్రమాదం జరిగిన సమయంలో మద్యం మత్తులో ఉన్న యువకుడు స్థానికులపై తిరగబడటంతో చితకబాది రాజేంద్రనగర్ పోలీసులకు అప్పగించారు. స్థానికులు తెలిపిన మేరకు.. మైలార్‌దేవ్‌పల్లి ప్రాంతానికి చెందిన మహ్మద్ షా (20) ఆలియాస్ మహబూబ్ టైల్స్ వేసే పనులను నిర్వహిస్తుంటాడు. గురువారం మధ్యాహ్నం మద్యం మత్తులో తన ఇండికా కారును తీసుకొని మైలార్‌దేవ్‌పల్లి నుంచి మెహిదీపట్నం వైపు బయలుదేరాడు. ఉప్పర్‌పల్లి నుంచి హైదర్‌గూడ వైపు వేగంగా దూసుకొచ్చాడు. వాహనం అదుపు తప్పడంతో రెండు కార్లతో పాటు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడు. రెండు కార్లు ధ్వంసం కాగా... ద్విచక్ర వాహనంపై ఉన్న ఇద్దరికి గాయాలయ్యాయి. అదే స్పీడ్‌తో ముందు వెళుతున్న బస్సును ఢీకొట్టాడు. కారు నిలిచిపోవడంతో మత్తులో మహ్మద్ షా స్థానికులపైనే తిరగబడ్డాడు. దీంతో స్థానికులు చితకబాది రాజేంద్రనగర్ పోలీసులకు అప్పగించారు. దీంతో ప్రధాన రహదారిపై గంట పాటు ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. నిందితుడు ఆరాంఘర్‌తో పాటు శివరాంపల్లి ప్రాంతంలో డివైడర్లను సైతం ఢీకొడుతూ ముందుకు వచ్చినట్లు వాహనదారులు తెలిపారు. ప్రమాద సమయంలో వాహనంలోని బెలూన్లు సైతం తెరుచుకున్నాయి.

ఆస్తి గొడవ..తమ్ముడిని హత్య చేసిన అన్న కుటుంబం

చాంద్రాయణగుట్ట: ఆస్తి తగాదాల కారణంగా ఓ యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. ఈ సంఘటన చాంద్రాయణగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. సౌత్‌ఈస్ట్ జోన్ డీసీపీ ఎస్.చైతన్య కుమార్ తెలిపిన మేరకు.. బార్కాస్ సలాల ప్రాంతానికి చెందిన సయ్యద్ బవన్న కుమారుడు సాలం బిన్ సయ్యద్ బవన్న(36) వ్యాపారం చేస్తుంటాడు. ఇతనికి, అన్నదమ్ముల నడుమ చాలా రోజులుగా ఆస్తి తగాదాలు ఉన్నాయి. 40 రోజుల క్రితం బవన్న తండ్రి మృతి చెందాడు. అనంతరం సాలం బిన్ సయ్యద్ బవన్న, అతని సోదరుడు మోసిన్ బవన్నల నడుమ గొడవలు మరింత పెరిగాయి. మోసిన్ బవన్న, అతని నలుగురు కుమారులు ఎలాగైనా సాలం బిన్ సయ్యద్ బవన్నను అంతమొందించాలని నిర్ణయించుకున్నారు. గురువారం సాయంత్రం 5.30 గంటలకు ఇంట్లో ఒంటరిగా ఉన్న అతనిపై కత్తులతో కడుపు భాగంలో విచక్షణా రహితంగా పొడిచి పరారయ్యారు. తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. సౌత్‌ఈస్ట్ డీసీపీ ఎస్.చైతన్య కుమార్, చాంద్రాయణగుట్ట ఏసీపీ సుధాకర్ అక్కడికి చేరుకొని హత్య జరిగిన తీరును పరిశీలించారు. మృతుడి చేతిలో కూడా కత్తి ఉండడాన్ని బట్టి ప్రతిఘటించేందుకు యత్నించినట్లు పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. మృతుడు అవివాహితుడు. నిందితులు పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయినట్లు విశ్వసనీయ సమాచారం.

టీఎంఎస్ అధ్యక్షుడిగా శశిరాజ్



బంజారాహిల్స్: తెలంగాణ మాలల సమితి(టీఎంఎస్) ఖైరతాబాద్ నియోజక వర్గ అధ్యక్షుడిగా బంజారాహిల్స్‌కు చెందిన శశిరాజ్ నియమితులయ్యారు. ఈ మేరకు బంజారాహిల్స్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో టీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షులు బరిగెల వెంకటస్వామి శశిరాజ్‌కు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకటస్వామి మాట్లాడుతూ.. మాలల సంక్షేమం కోసం కృషి చేసేవారిని టీఎంఎస్ గుర్తిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బిట్ల శ్రీనివాస్, వీరాస్వామి, దశరథ, అనిల్‌కుమార్, లింగం పాల్గొన్నారు.

రైల్వే అండర్‌పాస్ రీ ఓపెన్ చేయాలి

బంజారాహిల్స్: ఖైరతాబాద్ రైల్వే స్టేషన్ పక్కన ఉన్న అండర్ పాస్ మూసి వేయడంతో వేలాది మంది నిత్యం రైల్వే ట్రాక్ దాటేందుకు ఎక్కువ సమయం వెచ్చించాల్సి వస్తుందని రైల్వే బోర్డు సభ్యులు మొరంగంటి రాఘవరెడ్డి అన్నారు. గురువారం ఆయన సికింద్రాబాద్ డివిజన్ రైల్వే మేనేజర్ భరతేష్ కుమార్ జైన్‌కు ఖైరతాబాద్ రైల్వే అండర్‌పాస్‌ను రీఓపెన్ చేయాలంటూ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాఘవరెడ్డి మాట్లాడుతూ.. ఈ అండర్‌పాస్‌ను తెరిస్తే రైళ్ల రాకపోకలు సాగించే సమయంలో ఎక్కువ సమయం రైల్వే గేటు దగ్గర వాహనదారులు వేచి చూడాల్సి వస్తుందని వెంటనే తెరిచేలా చర్యలు తీసుకోవాలని వినతిలో కోరారు. అదే విధంగా లక్డీకాపూల్ రైల్వే స్టేషన్‌లో అక్రమ పార్కింగ్‌ను అరికట్టాలని కోరారు.

భగత్‌సింగ్ కాలనీలో ఉద్రిక్తత



ఘటనా స్థలంలో విచారణ చేస్తున్న పోలీసులు

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్ భగత్‌సింగ్ కాలనీ బస్తీలో గురువారం ఉద్రిక్తత చోటు చేసుకుంది. భగత్‌సింగ్ కాలనీ కమ్యూనిటీ హాల్ పక్కన ఉన్న స్థలంలో గుడి కట్టేందుకు రాత్రికి రాత్రి పూజలు చేయడంతో ఆ స్థలం తమదంటూ పార్వతమ్మ అనే మహిళతో పాటు వారి కుటుంబ సభ్యులు పూజ కార్యక్రమాలను అడ్డుకున్నారు. దీంతో వారికి బస్తీ కమిటీకి వాగ్వాదం జరిగింది. విషయం తెలుసుకున్న ఫిలింనగర్ సీఐ సంతోషం సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకొని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. అనుమతులు లేకుండా ఎవ్వరూ ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని సూచించారు.

15 రోజుల్లో.. ఇంటికే ఓటరు కార్డు

- అందుబాటులోకి తెచ్చిన కేంద్ర ఎన్నికల సంఘం
- ఓటర్లను ప్రోత్సహించడానికి సరికొత్త మార్గం

బంజారాహిల్స్: ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచడంతో పాటు 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ తమ ఓటు హక్కు వినియోగించుకునేలా కేంద్ర ఎన్నికల సంఘం ఎప్పటికప్పుడు సరికొత్త సంస్కరణలు చేపడుతూ ఓటర్లను ప్రోత్సహిస్తుంది. ఓటు హక్కును అర్హులైన ప్రతిఒక్కరూ వినియోగించుకునేలా పలు చర్యలకు ఎప్పటికప్పుడు శ్రీకారం చుడుతుంది. ఇందులో భాగంగానే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ ఓటర్లను ప్రోత్సహించే కార్యక్రమాలకు ముందుకు వస్తుంది. వెబ్‌సైట్‌లో ఓటరు గుర్తింపు కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న వారికి 15 రోజుల్లోనే ఓటరు కార్డులు అందించాలని కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకుంది. దీంతో ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల పరిధిలో ఈ ప్రక్రియపై జీహెచ్ఎంసీ అధికారులు ఓటర్లను చైతన్యపరుస్తూ అర్హులైన వారు ఓటరు గుర్తింపు కార్డు తీసుకునేలా అవగాహన కల్పిస్తున్నారు. ఓటరుగా నమోదైన వారికి గుర్తింపు కార్డుల జారీలో ఇక నుంచి ఏమాత్రం జాప్యం లేకుండా చర్యలు చేపట్టారు.

మార్పులు చేర్పులు సైతం..

అర్హులైన వారు ఓటు వేసేందుకు ఆసక్తి చూపడంతో పాటు పోలింగ్ శాతం పెంచేందుకు కేంద్ర ఎన్నికల సంఘం కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారికి, ఓటరుగా నమోదై మార్పులు, చేర్పులు చేసుకున్న వారికి 15రోజుల్లోగా ఓటరు కార్డు అందించనుంది. ఇప్పుడు ఉన్న సిస్టం ప్రకారం ఓటర్లకు ఎలక్ట్రోరల్ ఫొటో ఐడెంటిటీ కార్డు చేయడానికి నెలకు పైగా సమయం పడుతుంది. దీని కోసం కేంద్ర ఎన్నికల సంఘం నూతన ప్రామాణిక నిర్వహణ విధానాన్ని ప్రవేశపెట్టింది. ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల ఎన్నికల నమోదు అధికారి (ఈఆర్వో) ఎపిక్ జనరేట్ చేపట్టిన రోజు నుంచి పోస్టల్ ద్వారా చేరేంత వరకు ఓటరుకు ఎస్ఎంఎస్ ద్వారా సమాచారం అందుతుంది.

దరఖాస్తు ఇలా..

ఓటర్లు ఈసీఐ గవర్నమెంట్.ఇన్ వెబ్‌సైట్‌లోకి వెళ్లి తమ ఫోన్ నెంబర్, మెయిల్ ఐడీతో సైన్ అప్ కావాలి.

- క్రియేట్ చేసిన అకౌంట్‌పై క్లిక్ చేసి తన పేరు, పాస్‌వర్డ్ నమోదు చేయాలి. తర్వాత పాస్‌వర్డ్‌ను నిర్ధారించాలి.



- సైన్ అప్ అయిన మెయిల్ ఐడీకి ఓటీపీ వస్తుంది. దానిని ఎంట్రీ చేసి అందులో ఓటరు వివరాలు నమోదు చేసుకోవాలి.
- తర్వాత మొబైల్ నెంబర్, పాస్‌వర్డ్ నమోదు చేసి ఓటీపీతో లాగిన్ అవ్వాలి.
- కొత్తగా నమోదైన వారు ఫారం-6లో వ్యక్తిగత వివరాలు, అడ్రస్ తదితర వివరాలు నమోదు చేసి అందులో పేర్కొన్న ధృవపత్రాలను స్కాన్ చేసి అప్‌లోడ్ చేయాలి. అనంతరం మరోసారి వివరాలను సరిచూసుకుని సబ్మిట్ చేయాలి.
- ఫారం-8లో మార్పులు, చేర్పులు, ఫారం-7 ద్వారా ఓటరు పేరు తొలగించుకోవచ్చు.
- ట్రాక్ అప్లికేషన్ స్టేటస్‌పై క్లిక్ చేస్తే దరఖాస్తు చేసిన సమయంలో ఎస్ఎంఎస్‌గా వచ్చిన రెఫరెన్స్ నమోదు చేసి సబ్మిట్ చేస్తే అప్లికేషన్ స్టేటస్ ఎంత వరకు వస్తుందో తెలుస్తుంది.

ముదిరాజ్‌ల సమస్యలు పరిష్కరించాలి



మంత్రి శ్రీహరికి వినతిపత్రం ఇస్తున్న మెపా ప్రతినిధులు

పంజగుట్ట: తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక జనాభా ఉన్న ముదిరాజ్ కులస్తుల సమస్యలు పరిష్కరించాలని ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (మెపా) బృందం గురువారం రాష్ట్ర మత్స్య శాఖ, పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరిని కలిసి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు పులి దేవేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ .. కామారెడ్డి డిక్లరేషన్‌తో పాటు ముదిరాజ్‌లకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు మత్స్యకారులకు ప్రస్తుతం ఉన్న ప్రమాదబీమా మొత్తాన్ని పెంచాలని కోరారు. 55 సంవత్సరాలు దాటిన మత్స్యకారులకు ఫించన్ సౌకర్యం కల్పించాలని, ముదిరాజ్‌లను బీసీ-డి నుంచి బీసీ-ఏ లోకి మార్చే ప్రక్రియ వెంటనే పూర్తి చేయాలని ముదిరాజ్‌ల జనాభా ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ప్రతీ జిల్లాకు ముదిరాజ్ విద్యార్థుల కోసం వసతిగృహాలు ఏర్పాటు చేయాలని వినతిలో కోరారు. మంత్రిని కలిసిన వారిలో సంజీవ్ కుమార్, ప్రభాకర్, పొన్నం రాజు, బోయిని జగన్మోహన్, వెంకటేశ్వర్లు, చిరంజీవి, రామకృష్ణ, రాజేష్, శ్యామ్, రవీందర్ ఉన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

పంజగుట్ట: అన్ని సమస్యలకు పరిష్కారం భగవద్గీతలో దొరుకుతుందని కృష్ణం వందే జగద్గురుం వ్యవస్థాపకులు గోసుల శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఇంటింటికీ భగవద్గీతను తీసుకువెళ్లాలనే లక్ష్యంతో కృష్ణం వందే జగద్గురుం, నక్క వెంకటమ్మ యాదవ్, నక్క యాదగిరి స్వామి యాదవ్ ట్రస్ట్‌ల ఆధ్వర్యంలో ప్రతీ రెండవ ఆదివారం ఉదయం 9 నుంచి, మధ్యాహ్నం వరకు రవీంద్ర భారతి మినీహాల్‌లో సుమారు 100 మంది పిల్లలతో భగవద్గీతలోని 18 అధ్యాయాలు పఠన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను గీతా ప్రచారక్ అధ్యక్షులు విశ్వేశ్వరయ్య, గీతా ఫౌండేషన్ అధ్యక్షులు బడే సాబ్, యోగి ప్రభుజీ, నక్క శ్రీనివాస్ యాదవ్‌తో కలిసి ఆవిష్కరించారు.



డీసీ సమ్మయ్యకు అరుదైన అవకాశం



బంజారాహిల్స్: ఓటింగ్ పద్ధతిపై, బీఎల్‌ఓల పాత్రపై న్యూఢిల్లీలో కేంద్ర ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమానికి ఖైరతాబాద్ నియోజకవర్గ ఎన్నికల అధికారి (ఈఆర్వో), జూబ్లీహిల్స్ సర్కిల్ డీసీ సమ్మయ్యకు అవకాశం లభించింది. తెలంగాణలో 119అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా ఈ శిక్షణ కార్యక్రమానికి 11 నియోజకవర్గాల ఈఆర్వోలను ఆహ్వానించారు. హైదరాబాద్ జిల్లా నుంచి ఖైరతాబాద్ నియోజకవర్గం ఈఆర్వో సమ్మయ్యకు ఈ అరుదైన అవకాశం లభించింది.గురు,శుక్ర వారాల్లో న్యూఢిల్లీలో జరగనున్న ఈ శిక్షణ కార్యక్రమానికి సమ్మయ్య హాజరయ్యారు. గురువారం ఈ కార్యక్రమాన్ని కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేశ్‌కుమార్ ఎన్నికల ప్రక్రియకు సంబంధించి పలు సూచనలు జారీ చేశారని ఈ సందర్భంగా సమ్మయ్య తెలిపారు. ఎన్నికల ప్రాసెస్, బీఎల్‌ఓల డ్యూటీ రోల్ పైనా ఈ శిక్షణ కొనసాగుతుందన్నారు.

ఆపరేషన్ కగార్‌ను వెంటనే ఆపాలి



లిబర్టీ: మావోయిస్టుల నిర్మూలన లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ)హైదరాబాద్ జిల్లా కౌన్సిల్ ఆధ్వర్యంలో లిబర్టీ నుంచి అంబేద్కర్ విగ్రహం ట్యాంక్‌బండ్ వరకు నల్ల దుస్తులు ధరించి నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ శత్రుదేశమైన పాకిస్తాన్‌తో చర్చలకు మోదీ ప్రభుత్వం సిద్ధ పడింది కానీ.. నిరంతరం ప్రజల కోసం అడవిలో ఉన్న ఖనిజ సంపదను కాపాడుతూ ఆదివాసులకు కనీస మౌలిక సదుపాయాల కోసం పోరాటం నిర్వహిస్తూ అనేక త్యాగాలు చేస్తున్న మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలు జరుపకపోవడం దుర్మార్గం అన్నారు. స్టాలిన్, చందునాయక్, చంద్రమోహన్‌గౌడ్, నేర్లకంటి శ్రీకాంత్, ధర్మేంద్ర, సత్యప్రసాద్, అనిల్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు జగన్నాథ రథయాత్ర

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్-12లోని కమాండ్ కంట్రోల్ సెంటర్ పక్కన ఉన్న శ్రీజగన్నాథ టెంపుల్ జగన్నాథ రథయాత్రకు సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. ఈ నెల 27 (నేడు) నుంచి జూలై 7వ వరకు జగన్నాథ రథయాత్ర ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఆలయ వర్గాలు ఏర్పాట్లు పూర్తి చేశాయి.ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం 9 గంటలకు జగన్నాథ రథయాత్రకు శ్రీకారం చుడతారు. ఆలయం నుంచి జగన్నాథ, బలభద్రుడు, సుభద్రాదేవి ఉత్సవ విగ్రహాలను రథాల్లోకి చేర్చే వేడుకను అట్టహాసంగా భక్తుల జయజయ ధ్వానాల మధ్య నిర్వహించనున్నారు. రథాలను బంగారు చీపురుతో ఊడ్చి విగ్రహాలను అందులో చేర్చనున్నారు. మధ్యాహ్నం ఒంటి గంటకు రథయాత్ర కనుల పండువగా సాగనుంది.

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

బంజారాహిల్స్: కల్యాణ్‌నగర్, రోడ్డునెంబర్-2, ఎల్లారెడ్డిగూడ సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్ ఫీడర్ లైన్ల మరమ్మతు కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని బంజారా హిల్స్ ఏడీఈ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు మధురానగర్, బ్లాక్స్ ఏ, సీ, డీ, హెచ్, బాలాజీ అపార్ట్‌మెంట్స్ ఏరియా, అరోరా కాలనీ ఏరియా, పెట్రోల్ పంప్, రోడ్డు నెంబర్-3, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎస్‌కేనగర్, యూసుఫ్‌గూడ బస్తీ, జీహెచ్ఎంసీ ఆఫీసు, లుంబినీ మాల్, సాగర్ సొసైటీ సిగ్నల్, బీబీ పటేల్, ఫోర్ వీల్స్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

బంజారాహిల్స్: సీజనల్ వ్యాధుల నేపథ్యంలో ఖైరతాబాద్ నియోజకవర్గంలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ డివిజన్లలోని పలు బస్తీల కమ్యూనిటీ హాళ్లలో అర్బన్ హెల్త్ సెంటర్ల ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా బస్తీవాసులకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు.

'అంబేడ్కర్ అభయహస్తం' ప్రారంభించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సురేందర్

పంజగుట్ట: అంబేడ్కర్ అభయహస్తం పథకాన్ని స్థానిక సంస్థల ఎన్నికల లోపు ప్రకటించాలని దళిత, గిరిజన, ఆదివాసీ జేఏసీ, మాదిగ శక్తి వ్యవస్థాపకులు బొంకూరి సురేందర్ సన్ని కోరారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో అంబేద్కర్ అభయ హస్తం సాధనకై చేవెళ్ల ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌పై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహా ఎమ్ఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు ముత్యాపాగ నర్సింగరావు, భారత జాతీయ ఎరుకల కులవృత్తుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు కండేల వెంకటేష్, టి.ఎమ్ఆర్‌పీఎస్ అధ్యక్షులు ఇటుక రాజుతో కలిసి ఆయన మాట్లాడుతూ .. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే అంబేడ్కర్ అభయ హస్తం పేరుతో తెలంగాణలోని ప్రతీ ఎస్సీ, ఎస్టీ కుటుంబానికి రూ.12 లక్షల చొప్పున ఆర్థిక సాయం చేస్తామని చేవెళ్ల డిక్లరేషన్‌లో పేర్కొన్నారని గుర్తుచేశారు. అంతే కాకుండా ఎస్సీ, ఎస్టీ, ఆదివాసీల అభివృద్ధి కోసం మరో 12 అంశాలను ప్రకటించారని ప్రభుత్వం ఏర్పడి 17 నెలలు గడుస్తున్నా వాటిని అమలు జాడ లేదని వెంటనే అమలుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జన్ను కనుకరాజ్,గంధం రాములు, గడ్డ యాదయ్య, విజయ్ కుమార్, జవ్వాడి వెంకటేశర ప్రసాద్, రజని, రవి, రాజమల్లు, రాజేందర్, బేతి విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

'సైలెంట్ నో మోర్' పేరిట అవగాహన



బంజారాహిల్స్: అంతర్జాతీయ మాదకద్రవ్య దుర్వినియోగ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా టెంపెస్ట్ అడ్వర్టయిజింగ్ సంస్థ ఆధ్వర్యంలో 'సైలెంట్ నో మోర్' పేరిట శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 'మంచి కోసం పిచ్చిగా పనిచేయండి' నినాదంతో టెంపెస్ట్ అడ్వర్టయిజింగ్ సంస్థ ఉద్యోగులు ప్లకార్డులు, బ్యానర్లు ప్రదర్శిస్తూ ప్రచారం చేశారు. తమ సంస్థ మాదకద్రవ్యాల వ్యసనం బారిన పడిన వారు కోలుకునేలా మార్గ నిర్దేశం చేస్తుందని ప్రతినిధులు తెలిపారు. హైదరాబాద్ నగరంలో ప్యారడైజ్, రసూల్‌పురా, బేగంపేట, అమీర్‌పేట, జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు వంటి జన సంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు చెప్పారు.

2న ఛలో అమెరికా రాయబార కార్యాలయ ముట్టడి



హిమాయత్‌నగర్: భారత దేశ ప్రయోజనాలను, ప్రతిష్టను అమెరికాకు తాకట్టు పెడుతున్న నరేంద్రమోదీ విధానాలపై ఉద్యమించాలని, భారతీయులపై అమెరికా దుర్మార్గపు చర్యలను ఆపాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) తెలంగాణ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో జూలై 2న ఛలో అమెరికా రాయబార కార్యాలయ ముట్టడి కార్యక్రమానికి పిలుపునిస్తున్నట్లు రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర తెలిపారు. ఈ ముట్టడి కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను గురువారం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో నెర్లకంటి శ్రీకాంత్, టి.సత్య ప్రసాద్, శ్రీమాన్, మాజీద్ అలీఖాన్ పాల్గొన్నారు.

మద్యంమత్తులో కారు డ్రైవింగ్

డివైడర్‌ను ఢీకొట్టిన ఘటనలో ముగ్గురి రిమాండ్

బంజారాహిల్స్: మద్యం మత్తులో కారు నడుపుతూ డివైడర్‌ను ఢీకొట్టిన ఘటనలో ఐదు మంది విద్యార్థులకు గాయాలు కాగా, పలువురిని రిమాండ్‌కు తరలించారు.రాంనగర్‌కు చెందిన ఎం.చరణ్‌కుమార్ (23), శివకుమార్, నితిన్, వరుణ్‌తో పాటు మరో యువతి గురువారం తెల్లవారుజామున 3.30 టిఫిన్ చేసేందుకు కారులో గచ్చిబౌలికి వెళ్లారు. టిఫిన్ చేసిన తర్వాత 5గంటలకు తిరుగు ప్రయాణం కాగా మద్యం మత్తులో ఉన్న చరణ్‌కుమార్ కారును అదుపుతప్పి వేగంతో తీసుకెళ్తూ జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్-92లో డివైడర్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో యువతితో పాటు మిగతా నలుగురికి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కారును సీజ్ చేసి వీరందరికీ డ్రంకన్ డ్రైవ్ నిర్వహించారు. కారును నడుపుతున్న చరణ్‌కుమార్‌తో పాటు శివకుమార్, నితిన్‌ ముగ్గురూ మద్యం తాగినట్లు నిర్ధారించి ముగ్గురిని రిమాండ్‌కు తరలించారు.

రాజునాయక్‌కు డాక్టరేట్

ఉస్మానియాయూనివర్సిటీ: ఓయూ పొలిటికల్ సైన్స్ విభాగం విద్యార్థి వడిత్యా రాజునాయక్‌కు పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీ లభించింది. ప్రొఫెసర్ బ్రహ్మానందం పర్యవేక్షణలో ట్రైబల్ డెవలప్‌మెంట్ అండ్ నాన్‌గవర్నమెంట్ ఆర్గనైజేషన్: ఏ స్టడీ ఆఫ్ మహబూబ్‌నగర్ డిస్ట్రిక్ట్ ఇన్ తెలంగాణ స్టేట్ అనే అంశంపై పరిశోధనకు డాక్టరేట్ లభించింది. ఎంఏ, బీఈడీతో పాటు లైబ్రరీ సైన్స్ చదివిన రాజునాయక్ తెలంగాణ ఉద్యమంలో విద్యార్థి జేఏసీలో చురుకైన పాత్ర పోషించినట్లు తెలిపారు.

బీసీ కుల జనగణన చేపట్టాలి



హిమాయత్‌నగర్: బీసీ ఉద్యమాలకు తలొగ్గిన మోదీ ప్రభుత్వం కాలయాపన చేయకుండా 2025లోనే జనగణనతో పాటు బీసీ కుల జనగణన చేపట్టాలని, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం డిమాండ్ చేశారు. బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు తాటిపాముల వెంకట్‌రాములు అధ్యక్షతన హిమాయత్‌నగర్‌లో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 1931లో బ్రిటిష్ వారు చేసిన కుల జనగణ తప్ప స్వాతంత్ర్య అనంతరం ఏ ప్రభుత్వం కూడా బీసీల కుల జనగణన చేపట్టలేదన్నారు. ప్రధాన కార్యదర్శి ధూళిపాళ్ల ధనుంజయ నాయుడు మాట్లాడుతూ.. జూలై 14న అన్ని జిల్లాల కలెక్టర్ల ద్వారా ప్రధాన మంత్రికి కులజనగణన మీదా దరఖాస్తులు ఇవ్వాలని, సంఘం విస్తరణ, లక్ష సభ్యత్వం చేర్పించడం, జిల్లా మహాసభలు జూలై చివరి వరకు, రాష్ట్ర మహాసభలు ఆగస్టు మొదటి వారంలో నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో నేదునూరి రాజమౌళి, బొడ్డు పెల్లి కృష్ణ, చింతకింది కుమారస్వామి, బి.బాలయ్య, బత్తిని సదానందం, ప్రమీల, పల్నాటి యాదయ్య, రమేష్, బాపు రాజు, పాల్గొన్నారు.

బీజేఆర్ కాలేజీలో వివిధ కోర్సులపై ప్రత్యేక శిక్షణ



సర్టిఫికెట్ అందుకున్న విజయ్‌కుమార్

హిమాయత్‌నగర్: నూతన విద్యా విధానంలో భాగంగా బాబు జగ్జీవన్ రామ్ ప్రభుత్వ కళాశాల(స్వయం ప్రతిపత్తి) ఆధునిక సాంకేతిక నైపుణ్యతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతుందని ప్రిన్సిపాల్ కెప్టెన్ డా.ఎం.విజయ్ కుమార్ తెలిపారు. ఐసీటీ అకాడమీ(ఇన్ఫర్మేషన్ కమ్యూనికేషన్ టూల్స్ చెన్నై) వారితో అవగాహన ఒప్పందం కుదుర్చుకొని పలు సర్టిఫికెట్ల కోర్సులు నిర్వహిస్తున్నామన్నారు. క్రియేటింగ్ న్యూ జనరేషన్ టాలెంట్ టూల్స్, ప్రమోటింగ్ రీసెర్చ్ అండ్ నర్సరీ ఇన్నోవేషన్, ప్లాట్ ఫామ్ టు బ్రిడ్జ్ ఇండస్ట్రీ అండ్ అకాడమియా, స్కిల్ డెవలప్మెంట్(ఎస్‌డీ సర్టిఫికెట్), ఫ్యాకల్టీ డెవలప్మెంట్(ఎఫ్‌డీపీ), ఇంటర్ ప్రెనర్ డెవలప్మెంట్(ఈడీపీ), డిజిటల్ ఎంపవర్మెంట్ పబ్లికేషన్స్(డీఈపీ), కొలాబరేషన్ కోర్సుల ప్రత్యేక శిక్షణ కోసం బాబు జగ్జీవన్ రామ్ ప్రభుత్వ కళాశాలకు ఐసిటి కో-ఆర్డినేటర్ ముకుందర్ చేతుల మీదుగా ప్రిన్సిపాల్ ఎం.విజయ్‌కుమార్ సర్టిఫికెట్ అందుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల కన్వీనర్ డా.దీపికారాణి, వైస్ ప్రిన్సిపాల్స్ డా.రాపోలు శ్రీనివాస్, పి.సత్యనారాయణ రెడ్డి, డా.కదారి శ్రీనివాస్ రావు, అసోసియేట్ ప్రొ.డా. జె.గంగాధర్ పాల్గొన్నారు.

పెళ్లి చేసుకుంటానని మోసం

వ్యక్తిపై కేసు నమోదు

వెంగళరావునగర్: మహిళను నమ్మించి మోసం చేసిన వ్యక్తిపై మధురానగర్ పీఎస్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం సనత్‌నగర్‌కు చెందిన యువతికి ఐదేళ్ల క్రితం సినీ పరిశ్రమకు చెందిన వ్యక్తితో వివాహమైంది. ఆరు నెలలు కలిసి కాపురం చేసిన అనంతరం విడాకులు తీసుకుని విడిగా ఉంటున్నారు. ఆమెకు షూటింగ్‌లో సాయిరామ్ అనే వ్యక్తితో పరిచయమైంది. సాయిరామ్ ఆమెను పెళ్లి చేసుకుంటానని నమ్మించి రహమత్‌నగర్‌లో గది అద్దెకు తీసుకుని అనేకమార్లు శారీరకంగా కలిశాడు. పెళ్లి చేసుకోవాలని అడిగితే బెదిరింపులకు పాల్పడడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

మహిళ అదృశ్యం

వెంగళరావునగర్: ఆసుపత్రికి వెళ్లిన ఓ మహిళ అదృశ్యమైన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. కార్మికనగర్‌లో నివసించే రవికేష్ గుప్తాకు 2014లో వీణాదేవి అనే మహిళతో వివాహమైంది. అతను దినసరి కూలీగా పని చేస్తుండగా వీణాదేవి జూబ్లీహిల్స్‌లో హౌస్‌కీపింగ్‌గా విధులు నిర్వహిస్తుంది. ఈ నెల 25న విధులు ముగించుకుని ఇంటికి వచ్చి చెల్లి కుమారుడిని తీసుకుని ఆసుపత్రికి వెళ్లి ఇంటికి రాలేదు. బంధువులు, స్నేహితులతో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్-2లోని జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు సమీపంలో షాంగ్రిల్లా ప్లాజాను ఆనుకుని సుమారు 2 వేల గజాల ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేసిన అక్రమ నిర్మాణాలను షేక్‌పేట మండల రెవెన్యూ అధికారులు నేలమట్టం చేశారు. సమీపంలోని జింఖానా క్లబ్‌కు చెందిన నూతన భవన నిర్మాణానికి సంబంధించి అక్కడ సిబ్బంది, ఇతర కూలీలు ఉండేందుకు ఈ ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి జింఖానా క్లబ్ యాజమాన్యం అక్రమ నిర్మాణాలను చేపట్టింది. సమాచారం అందుకున్న షేక్‌పేట రెవెన్యూ అధికారులు గురువారం అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు.



నిర్మాణాలను కూల్చివేస్తున్న దృశ్యం

వైభవంగా వారాహి నవరాత్రి ఉత్సవాలు

ఫిలింనగర్: ఫిలింనగర్ దైవసన్నిధానంలో శ్రీ వారాహి నవరాత్రి మహోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు శ్రీ బాహ్మీదేవి అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం, అర్చన అనంతరం మూల మంత్ర హోమాలను నిర్వహించారు. శ్రీ హంపి విరూపాక్ష విద్యారణ్య మహా సంస్థానాధీశులు, జగద్గురు ఆది శంకరాచార్య శ్రీ విద్యారణ్య భారతి స్వామి ఆశీస్సులతో ఈ పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు. తొమ్మిది రోజుల పాటు ఆలయంలో విశేష పూజలు ఉంటాయన్నారు.

నగరంలో నేడు

- బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని హోటల్ తాజ్‌కృష్ణాలో సూత్ర ఆధ్వర్యంలో ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటలకు ఎగ్జిబిషన్ జరుగుతుంది.
- వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బోనాలు- చేతివృత్తుల మేళా పేరిట నెక్లెస్ రోడ్‌లోని అంబేడ్కర్ విగ్రహం పక్కన గ్రౌండ్‌లో ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు బీసీ చేతివృత్తుల వస్తువుల ప్రదర్శన అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లో హైదరాబాద్ కన్వెన్షన్ సెంటర్ నోవాటెల్‌లో ఉదయం 10 నుంచి రాత్రి 8 గంటల వరకు హై లైఫ్ ఎగ్జిబిషన్ అందుబాటులో ఉంటుంది.
- బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని కళింగ కల్చరల్ సెంటర్‌లో నేషనల్ సిల్క్ ఎక్స్‌పో పేరిట వేసవికాలం, వివాహ ప్రత్యేక కలెక్షన్ ఉదయం 10 నుంచి రాత్రి 8.30 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- శ్రీనగర్ కాలనీలోని శ్రీ సత్యసాయి నిగమాగమంలో ఉదయం 10 నుంచి రాత్రి 8.30 గంటల వరకు న్యూ క్రాఫ్ట్స్ సిల్క్ ఇండియా ఎగ్జిబిషన్ కమ్ సేల్
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో కావలి చంద్రకాంత్ తీసిన చిత్ర ప్రదర్శన ఉదయం 10.30 నుంచి రాత్రి 7 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళా శక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.comకు మెయిల్ చేయగలరు.

2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాలి: జాన్‌వెస్లీ

జూలై 4న నిరుద్యోగుల ఆందోళనకు మద్దతు


పోస్టర్ ఆవిష్కరిస్తున్న జాన్‌వెస్లీ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం 2 లక్షల ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. జూలై 4న నిరుద్యోగులు తలపెట్టిన చలో సెక్రటేరియెట్‌కు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్టు ప్రకటించారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో చలో సెక్రటేరియట్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ నిరుద్యోగుల సమస్యలను నాన్చడం సరైంది కాదని, వెంటనే జాబ్ కేలండర్ ప్రకటించాలన్నారు. ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని కేంద్రంలో మళ్లీ అధికారం చేపట్టిన బీజేపీ కూడా నిరుద్యోగులను మోసం చేసిందని విమర్శించారు. అధికారంలోకి రాగానే నిరుద్యోగులను విస్మరించడం, ప్రతిపక్షంగా ఉన్నప్పుడు హామీలు ఇవ్వడం సరైంది కాదన్నారు. నిరుద్యోగులు చనిపోతున్నా ప్రభుత్వానికి పట్టదా అని ప్రశ్నించారు. గత బీఆర్‌ఎస్‌కు పట్టిన గతి కాంగ్రెస్ కూడా పడుతుందన్నారు. కార్యక్రమంలో ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎండీ అబ్బాస్, నేతలు హిమబిందు, జావెద్, శ్రీరాం నాయక్, లెల్లెల బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహించాలి

– నేషనల్ బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్ గోపీచంద్


కార్యక్రమంలో మాట్లాడుతున్న పుల్లెల గోపీచంద్

అడ్డగుట్ట: క్రీడాకారులను ప్రోత్సహించినప్పుడే ప్రపంచ స్థాయిలో భారత్ దేశానికి గుర్తింపు లభిస్తుందని నేషనల్ బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్, జనరల్ సెక్రటరీ ఆఫ్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ పుల్లెల గోపీచంద్ అన్నారు. గురువారం మేడ్చల్–మల్కాజిగిరి బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ లోని ఆర్ ఆర్ సి ఇండోర్ బ్యాడ్మింటన్ అకాడమీలో జీహెచ్ రైసోని మెమోరియల్ యొనిక్స్ సన్ రైస్ 11వ తెలంగాణ రాష్ట్ర స్టేట్ సీనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మేడ్చల్–మల్కాజిగిరి బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. మంత్రి శ్రీధర్ బాబు కూడా క్రీడాకారులకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తున్నారని పేర్కొన్నారు. ఇంటర్నేషనల్ క్రీడాకారుడు సుమిత్ రెడ్డి, రైసోని ఫౌండేషన్ డైరెక్టర్ పూనం పాండే, జాయింట్ సెక్రెటరీ ఈవెంట్స్ అండ్ ప్రోటోకాల్(బ్యాట్) యు.వి.ఎన్. బాబు, బ్యాట్ కోశాధికారి కానూరి వంశీధర్, టోర్నమెంట్ ఆర్గనైజర్ వికాస్, మేడ్చల్ మల్కాజిగిరి జాయింట్ సెక్రెటరీ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎండీఏలో పారదర్శకత ఏదీ?

- బిల్డ్ నౌతో వేగం పెరిగినా పైరవీలు తగ్గలేదు..
- కన్సల్టెంట్లు, లైజనింగ్ సిబ్బంది పేరిట మోహరింపు
- ప్లానింగ్ విభాగంలో ప్రసన్నం చేసుకుంటేనే ఫైళ్ల కదలిక



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్‌ఎండీఏ) ప్రణాళికా విభాగంలో పారదర్శకత లోపించినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఒకవైపు సకాలంలో అనుమతులు లభించకపోవడం వల్ల దరఖాస్తుదారులు పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొని ఉండగా, మరోవైపు కన్సల్టెంట్‌లు, లైజనింగ్ సిబ్బంది ద్వారా వచ్చే ఫైళ్లకు మాత్రమే త్వరితగతిన మోక్షం లభిస్తున్నట్లు వివిధ వర్గాల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి. భవన నిర్మాణాలు, లే అవుట్ అనుమతులను మరింత వేగవంతం చేసేందుకు, పారదర్శకంగా ఇచ్చేందుకు కొత్తగా బిల్డ్‌నౌ సాంకేతిక వ్యవస్థను ప్రవేశపెట్టినప్పటికీ జాప్యాన్ని నివారించ లేకపోవడం గమనార్హం. బిల్డ్‌నౌ వెబ్‌సైట్ ద్వారా క్షణాల్లో డాక్యుమెంట్లను అప్‌లోడ్ చేసి దరఖాస్తు చేసుకొనేందుకు అవకాశం లభించింది. కానీ, ఫైళ్లను పరిష్కరించి, క్షేత్రస్థాయిలో పరిశీలించి అనుమతులు అందజేయడంలో మాత్రం జాప్యం కొనసాగుతోందని దరఖాస్తుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదివరకు అనుమతుల్లో ఉద్దేశపూర్వకమైన జాప్యాన్ని అరికట్టేందుకు బాధ్యులైన అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకొనేవారు. జరిమానాలు విధించేవారు. కానీ, ఇప్పుడు అలాంటి క్రమశిక్షణా చర్యలు లేకపోవడం వల్ల కూడా పారదర్శత కనిపించడం లేదు. మరోవైపు ఈ పరిణామం వల్ల నిజాయతీగా పని చేసే అధికారులు, ఉద్యోగులు సిబ్బంది సైతంఅప్రతిష్ఠను మూట గట్టుకోవలసి వస్తోందని ప్రణాళికా విభాగానికి చెందిన ఒక అధికారి విస్మయం వ్యక్తం చేశారు.

రియల్ పరుగులు...

కొంతకాలంగా నగరంలో రియల్ ఎస్టేట్ కార్యకలాపాలు పెరిగాయి. నగర శివారు ప్రాంతాల్లో, ఔటర్ వెలుపల బహుళ అంతస్తుల భవనాల నిర్మాణం ఊపందుకుంది. అదే సమయంలో భారీ లే అవుట్‌లు సైతం వెలుస్తున్నాయి. దీంతో అనుమతుల కోసం హెచ్‌ఎండీఏకు దరఖాస్తులు కుప్పలుగా వస్తున్నాయి. గతేడాది కంటే ఈ ఏడాది నిర్మాణ రంగంలో అనుమతులు రెట్టింపు అయినట్లు హెచ్‌ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ స్పష్టం చేశారు. శంషాబాద్, అమీన్‌పూర్, కొల్లూరు, పటాన్‌చెరు, మేడ్చల్, ఘట్కేసర్, బాచుపల్లి తదితర ప్రాంతాల్లో హైరైజ్ టవర్లు, బహుళ అంతస్తుల భవనాలు, అపార్ట్‌మెంట్‌ల నిర్మాణం పెరిగినట్లు అంచనా. మరోవైపు టీజీ బీపాస్ కంటే బిల్డ్‌నౌ వెబ్‌సైట్‌లో వెంటనే 'కీ'లు లభించడం వల్ల కూడా దరఖాస్తు ప్రక్రియ సులభతరమైంది. వివిధ రకాలుగా వచ్చిన మార్పులు ఇటు కన్సల్టెంట్‌ల రూపంలో ఉండే మధ్యవర్తులకు, లైజనింగ్ సిబ్బంది పేరిట పైరవీలు చేసేవారికి చక్కటి అవకాశంగా మారింది.

ట్రిపుల్ ఆర్ వరకు అనుమతులు

హెచ్‌ఎండీఏ పరిధిని ట్రిపుల్ ఆర్ వరకు విస్తరించిన సంగతి తెలిసిందే. గతంలో డీటీసీపీ నుంచి అనుమతులు పొందిన ప్రాంతాలన్నీ ఇప్పుడు హెచ్‌ఎండీఏ పరిధిలోకి వచ్చాయి. ఈ మేరకు కొత్తగా విలీనమైన 11 జిల్లాల పరిధిలోని 3,550 గ్రామాల్లో హెచ్‌ఎండీఏ నుంచి అనుమతులు ఇవ్వనున్నట్లు ఇటీవల ప్రభుత్వం ఉత్తర్వులు వెలువరించింది. దీంతో కొంతకాలంగా నెలకొన్న స్తబ్దత తొలగిపోయి నిర్మాణ సంస్థలకు ఊరట లభించింది. ఇదివరకు డీటీసీపీ అనుమతి కోసం దరఖాస్తు చేసుకున్న అపరిష్కృత ఫైళ్లు సైతం హెచ్‌ఎండీఏ పరిధిలోకి వచ్చాయి. అన్ని విధాలుగా రియల్ ఎస్టేట్ కార్యకలాపాలు, నిర్మాణరంగంలో మార్పులు చోటుచేసుకొని వేగం పెరిగింది. అదే స్థాయిలో హెచ్‌ఎండీఏకు వచ్చే ఫైళ్లు సైతం గణనీయంగా నమోదవుతున్నాయి. అందుకనుగుణంగానే హెచ్‌ఎండీఏ కార్యాలయంలో ప్రణాళికా విభాగం కొలువుదీరిన నాలుగు, ఐదు, ఏడో అంతస్థులు పైరవీకారులతో సందడిగా మారడం గమనార్హం.

రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి

జగదాంబిక అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రులు పొన్నం, కొండా సురేఖ


జగదాంబిక అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న స్పీకర్ ప్రసాద్ కుమార్, మంత్రులు పొన్నం, కొండా సురేఖ, ఎంపీ అనిల్, మేయర్ విజయలక్ష్మి

లంగర్‌హౌస్: అమ్మవారి ఆశీర్వాదాలతో తెలంగాణలో సంవృద్ధిగా వర్షాలు కురిసి రైతులు, రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గోల్కొండ జగదాంబిక మహంకాళి బోనాల జాతరను గురువారం లంగర్‌హౌస్‌లో మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ ప్రారంభించారు. మొదటి పూజ సందర్భంగా జగదాంబిక అమ్మవారికి రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు సమర్పించారు. లంగర్‌హౌస్‌లో అమ్మవారి తొట్టెలకు మంత్రులు కల్లు సాక పోసి, పూజలు నిర్వహించి బోనాల ఊరేగింపును ప్రారంభించారు. ఈ సందర్భంగా పట్టు వస్త్రాలు తీసుకెళ్లే సమయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ సరదాగా పోతరాజులతో ఆడుదామా అంటూ వారితో కాలు కలిపి ఆడారు. అనంతరం సాక సమర్పించాక శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్, రాజ్యసభ సభ్యులు అనిల్‌కుమార్ యాదవ్‌తో కలిసి ఆడారు.

రాష్ట్రం సస్యశ్యామలంగా ఉండాలి...

బోనాల జాతర ప్రారంభం సందర్భంగా మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ మాట్లాడుతూ అమ్మవారి చల్లని చూపుతో తెలంగాణ రాష్ట్రం పాడిపంటలతో సస్యశ్యామలంగా ఉండాలని వేడుకుంటున్నామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందని ధీమా వ్యక్తం చేశారు. అమ్మవారికి తొలి బోనం, పట్టు వస్త్రాలు సమర్పించడం తమ అదృష్టంగా భావిస్తున్నామని పేర్కొన్నారు. గోల్కొండ జగదాంబిక ఆలయ కమిటీ చైర్మన్ కొండెపూడి చంటిబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో మేయర్ గద్వాల విజయలక్ష్మి, బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజా రామయ్యర్, హైదరాబాద్ కలెక్టర్ దాసరి హరిచందన, పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్, కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంత రావు, ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్, కాంగ్రెస్ నేత రోహిన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి జగన్నాథ రథయాత్రకు తరలి రండి

గన్‌ఫౌండ్రీ: నగరంలో శుక్రవారం జగన్నాథ రథయాత్రను వైభవంగా నిర్వహించేందుకు 'ఇస్కాన్' ఆలయం ఏర్పాట్లు చేసింది. ఈ మేరకు రథయాత్ర ఊరేగింపు, ఏర్పాట్లపై గురువారం అబిడ్స్ ఇస్కాన్ టెంపుల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇస్కాన్ ఆలయ మేనేజ్‌మెంట్ కమిటీ కన్వీనర్ వరద కృష్ణదాస్ మాట్లాడారు. దక్షిణాది రాష్ట్రాల్లోనే జగన్నాథ రథయాత్ర అతిపెద్ద ఉత్సవమన్నారు. నగరంలో జరిగే యాత్రలో సుమారు రెండు లక్షల మంది భక్తులు పాల్గొంటారన్నారు. ఉదయం 11 గంటలకు ఎన్టీఆర్ స్టేడియం వద్ద రథయాత్రను మంత్రి సీతక్క ప్రారంభిస్తారని చెప్పారు. ఆర్టీసీ క్రాస్ రోడ్డు, చిక్కడపల్లి, నారాయణగూడ, హిమాయత్‌నగర్, టీటీడీ, బషీర్‌బాగ్ మీదుగా నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానానికి రథయాత్ర చేరుకుంటుందని ఆయన తెలిపారు. అక్కడ ముగింపు కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ పాల్గొంటారని పేర్కొన్నారు. సమావేశంలో శంభు వైష్ణవ దాస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వరద కృష్ణదాస్

ప్రపంచ స్థాయి నగరంగా హైదరాబాద్

ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి శ్రీధర్ బాబు


అమీన్‌పూర్ రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

చందానగర్: హైదరాబాద్ ఇమేజ్‌ని కాపాడుతూ ప్రపంచ స్థాయి నగరాల్లో గొప్ప నగరంగా తీర్చిదిద్దేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్తోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు అన్నారు. హైదరాబాద్ సిటి ఇన్నోవేటివ్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ('హెచ్'సిటి ప్రాజెక్ట్) ఆధ్వర్యంలో రూ.45 కోట్లతో ఎన్‌హెచ్ 65 నుంచి అమీన్‌పూర్ వరకు 2.7 కిలో మీటర్ల రోడ్డు విస్తరణ పనులకు గురువారం పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ రహిత నగరంగా మారుస్తున్నామని చెప్పారు. నగరాభివృద్ధికి మరింత వేగవంతం చేసేందుకు రూ.7,032 కోట్లు గత బడ్జెట్‌లో కేటాయించినట్లు చెప్పారు. ఏ1 టెక్నాలజీతో 90 జంక్షన్‌లలో సిగ్నలింగ్ తీసుకువస్తున్నామని తెలిపారు. ఇప్పటికే నగరంలో ఆర్టీసీ ఆధ్వర్యంలో వెయ్యి ఎలక్ట్రిక్ బస్సులను నడిపించేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ శేరిలింగంపల్లిలో ప్రజల మౌలిక సదుపాయాల కల్పన కోసం ముఖ్యమంత్రి రూ.1,605 కోట్లు కేటాయించారన్నారు. శ్రీదేవి థియేటర్ రోడ్డు విస్తరణ పనులు 9 నెలలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మంజుల రఘునాథ్ రెడ్డి, రాగం నాగేందర్ యాదవ్, చందానగర్ సర్కిల్ 21 డీసీ మోహన్‌రెడ్డి, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ నాగిరెడ్డి, ప్రాజెక్ట్ డీఈ హరిష్, ఏఈ శివకుమార్, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భూసేకరణ ప్రక్రియ వేగవంతం

ప్యారడైజ్–శామీర్‌పేట్ కారిడార్ భూసేకరణపై కలెక్టర్ సమీక్ష


సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని ప్యారడైజ్–శామీర్‌పేట ఎలివేటెడ్ కారిడార్ భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని హైదరాబాద్ కలెక్టర్ హరిచందన దాసరి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్యారడైజ్ నుంచి శామీర్‌పేట్ వరకు ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి సంబంధించి భూసేకరణ పనుల పురోగతిపై ఆమె సమీక్షించారు. ఈ కారిడార్ 44వ జాతీయ రహదారి పైన 18 కిలో మీటర్ల (మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా శామీర్‌పేట రింగ్ రోడ్డు నుంచి లోతుకుంట వరకు 12 కి.మీలు, లోతుకుంట నుంచి ప్యారడైజ్ వరకు 6 కి.మీ) పొడవు, 200 అడుగుల విస్తీర్ణంలో చేపట్టినట్లు వివరించారు. ఇప్పటికే భూసేకరణ కోసం నోటిఫికేషన్ విడుదల అయిందని, భూసేకరణపై తలెత్తిన అభ్యంతరాలను పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. హైదరాబాద్, సికింద్రాబాద్‌లలో వాహనాల రద్దీని తగ్గించే కారిడార్ ప్రజల ప్రయాణాన్ని సులభతరం చేస్తుందని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ముకుందరెడ్డి, సికింద్రాబాద్ ఆర్డీఓ సాయిరామ్, ఖైరతాబాద్ తహసీల్దార్ నయీముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

సారస్వత పరిషత్ అధ్యక్షుడిగా ఎల్లూరి శివారెడ్డి ఎన్నిక



సుల్తాన్‌బజార్: తెలంగాణ సారస్వత పరిషత్ అధ్యక్షులుగా ఆచార్య ఎల్లూరి శివారెడ్డి మరోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పరిషత్ నియమావళిని అనుసరించి అధ్యక్షులు గురువారం విలేకరుల సమావేశంలో కార్యవర్గాన్ని ప్రకటించారు. పాతవారి స్థానంలో కొందరు సాహితీ ప్రముఖులకు కార్యవర్గంలో ఈసారి స్థానం కల్పించినట్లు పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్ కేవీ రమణాచారి, ప్రముఖ రచయిత్రి డాక్టర్ ముదిగంటి సుజాతారెడ్డి ఉపాధ్యక్షులుగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ జుర్రు చెన్నయ్య, కోశాధికారిగా మంత్రి రామారావు కొనసాగుతారని శివారెడ్డి తెలిపారు. డాక్టర్ ఎం. చెన్నప్ప, డాక్టర్ సి.వసుంధర, ఆచార్య ఎస్వీ రామారావు, ఎస్ఆర్ వెంకటేశం, నరహరి, చంద్రశేఖర్‌రెడ్డి, సురవరం కృష్ణవర్ధన్‌రెడ్డి, రామ్మూర్తి, కసిరెడ్డి వెంకట్‌రెడ్డి, గిరిజ మనోహర్‌బాబు, గౌరీశంకర్, అమ్మంగి వేణుగోపాల్, సిల్మా నాయక్‌లను కార్యవర్గ సభ్యులుగా నియమించినట్లు తెలిపారు. డాక్టర్ సిల్మా నాయక్‌ను గౌరవ పరీక్షా కార్యదర్శిగా నియమిస్తున్నట్లు ప్రకటించారు. ఈ కార్యవర్గం 2030 వరకు కొనసాగుతుందని తెలిపారు.

నాడు ఎమర్జెన్సీ.. నేడు అప్రకటిత ఎమర్జెన్సీ



సమావేశంలో మాట్లాడుతున్న వేణుగోపాల్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: నాడు ఎమర్జెన్సీ సమయంలో అరెస్ట్ అయి వ్యతిరేకించిన బీజేపీ ప్రభుత్వం వారే నేడు అదే విధానాలతో అప్రకటిత ఎమర్జెన్సీని అమలు చేస్తున్నారని సీనియర్ పాత్రికేయుడు ఎస్.వేణుగోపాల్ విమర్శించారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో భారతీయ న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో 'నాటి ప్రకటిత ఎమర్జెన్సీకి 50 ఏళ్లు'పేరిట రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ అప్పుడు మీసా చట్టం కింద అరెస్ట్ చేస్తే ఇప్పుడు ఉపా చట్టం కింద అరెస్ట్ చేస్తున్నారని అన్నారు. నల్సార్ యూనివర్సిటీ ప్రొఫెసర్ మురళి కర్ణం మాట్లాడుతూ 2012 నుంచి 2022 మధ్య ఈ దేశంలో 427 మంది జర్నలిస్టులు అరెస్టయ్యారని, అందులో 60 మంది పైన ఒక్కటి కంటే ఎక్కువ కేసులు ఉన్నాయన్నారు. దీంతో 25 శాతం మంది జర్నలిస్టులు తమ వృత్తిని మానుకున్నారని చెప్పారు. కార్యక్రమంలో హైకోర్టు అడ్వకేట్ లింగయ్య, ఐఏపీఎల్ ఉపాధ్యక్షులు ఎం.వెంకన్న అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీనియర్ అడ్వకేట్ రఘునాథ్, డి.సురేష్‌కుమార్, ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, రవిచంద్ర పాల్గొన్నారు.

120 పాలిటెక్నిక్ కాలేజీల్లో 36,630 సీట్లు

రాయదుర్గం జీఐఎల్‌టీ ప్రిన్సిపాల్ ఎస్‌కే ఎక్బాల్ హుస్సేన్


అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ఎక్బాల్ హుస్సేన్

రాయదుర్గం: రాష్ట్రంలోని మొత్తం 120 పాలిటెక్నికల్ కళాశాలల్లో 36,630 సీట్లు ఉన్నాయని, వాటి భర్తీకి రెండు ఫేజుల్లో అడ్మిషన్ల ప్రక్రియ కోసం షెడ్యూల్‌ను ప్రభుత్వం విడుదల చేసిందని రాయదుర్గం గవర్నమెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లెదర్ టెక్నాలజీ (జీఐఎల్‌టీ) ప్రిన్సిపాల్ ఎస్‌కే ఎక్బాల్ హుస్సేన్ తెలిపారు. రాయదుర్గంలోని జీఐఎల్‌టీ పాలిటెక్నిక్ కళాశాలల్లో అడ్మిషన్ల ప్రక్రియపై గురువారం విద్యార్థులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలిసెట్–2025లో అర్హత సాధించినవారు ఈ నెల 24 నుంచి 28వ తేదీ వరకు సర్టిఫికెట్ల పరిశీలనకుగాను ఆన్‌లైన్ ద్వారా స్లాట్ బుక్ చేసుకోవాలని సూచించారు. హెల్ప్‌లైన్ సెంటర్‌ను కూడా ఎంపిక చేసుకొని అక్కడే సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి చేసుకోవాలన్నారు. ఆ తర్వాత రాష్ట్రంలోని పాలిటెక్నిక్ కళాశాలను, సబ్జెక్టును ఎంపిక చేసుకొని జూలై 1వ తేదీ వరకు ఆప్షన్లు ఇచ్చుకోవాలని సూచించారు. జూలై 4న సీట్ల కేటాయింపు ఉంటుందని తెలిపారు. చివరి ఫేజ్ అడ్మిషన్ల ప్రక్రియను జూలై 9 నుంచి 15వ తేదీ వరకు నిర్వహిస్తారన్నారు. జూలై 15న సీట్ల భర్తీ ప్రక్రియ పూర్తి, 18వ తేదీ నుంచి పాలిటెక్నిక్ కళాశాలల్లో తరగతులు అధికారికంగా ప్రారంభమవుతాయని చెప్పారు. ఇదే ప్రక్రియను రాయదుర్గంలోని జీఐఎల్‌టీలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

జీఐఎల్‌టీ క్యాంపస్‌లో రెండు హెల్ప్‌లైన్ సెంటర్లు ఏర్పాటు

జీఐఎల్‌టీ క్యాంపస్‌లో రెండు హెల్ప్‌లైన్ సెంటర్లను ప్రిన్సిపాల్ ఎస్‌కే ఎక్బాల్ హుస్సేన్ ప్రారంభించారు. ఈ సెంటర్ల ద్వారా 160 నుంచి 180 మంది విద్యార్థులు అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకున్నారు. ఈ రెండు సెంటర్లు కూడా విద్యార్థులకు నిరంతరం అందుబాటులో ఉంటాయి. మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్ 9912342053లో సంప్రదించాలి.

కనకాల కట్ట మైసమ్మకు తొలి బోనం

ఉత్సవాల్లో మంత్రి పొన్నం, ఎంపీలు అనిల్, ఆర్.కృష్ణయ్య, ఎమ్మెల్యే గోపాల్


బోనాల ఉత్సవాల్లో మంత్రి పొన్నం, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ తదితరులు

కవాడిగూడ: ఆషాడ మాసం బోనాల పండుగ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం ఆధ్వర్యంలో గురువారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని కనకాల కట్ట మైసమ్మకు తొలిబోనం సమర్పించారు. వందలాది కుమ్మరి సంఘం మహిళలు ఘటం ఊరేగింపునిర్వహించారు. జగదీష్ మందిర్‌లో ఏర్పాటు చేసిన బోనాలు, ఘటం , ఫలహారం బండికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నగర ఇన్‌చార్జి మంత్రి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాజ్యసభ సభ్యులు ఎం.అనిల్‌కుమార్ యాదవ్, ఆర్.కృష్ణయ్య, ఎమ్మెల్యే ముఠా గోపాల్, స్థానిక కార్పొరేటర్ జి. రచన శ్రీ, రాష్ట్ర ఫిషరీస్ చైర్మన్ మెట్టు సాయికుమార్, బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, రాష్ట్ర కుమ్మర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నడికుడ జయంత్‌రావు, ప్రధాన కార్యదర్శి మల్కాజిగిరి దయానంద్, కోశాధికారి ఆమంచి రాజలింగం, గౌరవ అధ్యక్షుడు బండారి బిక్షపతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ కుమ్మరి చేతివృత్తిని ఆధునీకరించేందుకు గుజరాత్, రాజస్తాన్, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాలకు అధ్యయన బృందాన్ని ప్రభుత్వం పంపుతుందని చెప్పారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ మట్టి కుండలోనే అమ్మవార్లకు బోనాలు సమర్పించాలని భక్తులను కోరారు. రాష్ట్ర ప్రభుత్వం బోనాల పండుగకు అన్ని రకాలుగా ఏర్పాట్లు చేస్తోందని, రూ.20 కోట్లు మంజూరు చేసిందని అన్నారు. నగర ప్రజలు బోనాల పండుగను అంగరంగ వైభవంగా ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కుమ్మర సంఘం నేతలు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నర్సులను విధుల్లోకి తీసుకోవాలని ధర్నా


డీఎంహెచ్ఎస్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న ఆమ్ ఆద్మీ పార్టీ నేత దిడ్డి సుధాకర్ తదితరులు

సుల్తాన్‌బజార్: తెలంగాణ వైద్య, ఆరోగ్య శాఖలోని కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ నర్సుల తొలగింపు దుర్మార్గమని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేళ్లుగా వివిధ ప్రభుత్వ ఆసుపత్రుల్లో సేవలందిస్తున్న ఈ నర్సులను అన్యాయంగా తొలగించడంతో రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆప్ రాష్ట్ర నాయకుడు బుర్రా రాముగౌడ్ నేతృత్వంలో గురువారం కోఠిలోని డీఎంహెచ్ఎస్‌లో ధర్నా నిర్వహించారు. వెంటనే విధుల్లోకి తీసుకోవాలని నర్సులు, ఆప్ కార్యకర్తలు డిమాండ్ చేస్తూ ప్లకార్డులు చేతబూని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. వారంతా డీఎంహెచ్ఎస్ కార్యాలయం వైపు దూసుకెళ్లగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఆప్ శ్రేణులు, పోలీసుల మధ్య తీవ్ర తోపులాట జరిగి ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఈ క్రమంలో పోలీసులు ఆప్ కార్యకర్తలను, నర్సులను బలవంతంగా అరెస్టు చేసి వివిధ పోలీస్‌స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ కోవిడ్–19 సమయంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రాణాలకు తెగించి వైద్య సేవలందించిన నర్సులను విధుల్లోంచి తొలగించడం శోచనీయమని అన్నారు. వీరందరిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆప్ నేతలు మహ్మద్ మాజిద్, జావీద్, షరీఫ్, విజయ్, హేమ, సుధారాణి, రమ్య గౌడ్, రమేష్, సలావుద్దీన్, రాకేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ నాట్యగురు మంగళాభట్

– సంస్మరణ సభలో కొనియాడిన వక్తలు


సంస్మరణ సభలో పాల్గొన్న ప్రముఖులు

అమీర్‌పేట: కథక్ నాట్యంలో జీవితాన్ని అంకితం చేసిన ఆదర్శ నాట్యగురు నర్తకీమణి మంగళాభట్ అని ప్రముఖులు కొనియాడారు. గురువారం అమీర్‌పేట గ్రీన్‌పార్కు హోటల్‌లో ఆకృతి కళాకేంద్రం వ్యవస్థాపకురాలు మంగళాభట్ సంస్మరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శిల్పారామం స్పెషల్ ఆఫీసర్, విశ్రాంత ఐఏఎస్ అధికారి జి.కిషన్‌రావు మాట్లాడుతూ అంకితభావంతో కథక్‌లో విశేష ప్రయోగాలు చేసిన మంగళాభట్ లోటు తీర్చలేనిదన్నారు. తెలంగాణ సంగీత నాటక అకాడమి అధ్యక్షురాలు డాక్టర్ అలేఖ్య పుంజాల మాట్లాడుతూ మంగళాభట్ సున్నిత మనస్కురాలని, నాట్యమే శ్వాసగా చివరి వరకు అంకితమైన ఒక మంచి స్నేహితురాలిని కోల్పోయానని ఆవేదన వ్యక్తం చేశారు. మంగళాభట్ భర్త రాఘవరాజ్ భట్ మాట్లాడుతూ నృత్యం నేర్చుకోవడం మొదలు మూడున్నర దశాబ్దాల పాటు ఇద్దరం ఒకే మాట, ఒకే బాటగా జీవించామని, ఇద్దరం కలిసి దేశ విదేశాల్లో ప్రదర్శనలు ఇచ్చామని అన్నారు. ఇక నుంచి తనను మంగళా రాఘవరాజ్ భట్‌గా పిలవాలంటూ కన్నీటి పర్యంతమయ్యారు. కార్యక్రమంలో పద్మశ్రీ అవార్డు గ్రహీత డా.ఆనందశంకర్, సంగీత నాటక అకాడమి పూర్వ అధ్యక్షురాలు దీపికారెడ్డి, కేంద్ర సంగీత నాటిక అకాడమి అవార్డు గ్రహీతలు కళాకృష్ణ, భాగవతుల సేతురామ్, వనజ ఉదయ్, యశోద ఠాకూర్, సీనియర్ జర్నలిస్టు మహ్మద్ రఫీ, ప్రముఖ శిల్పి రమణారెడ్డి తదితరులు మంగళాభట్‌కు నివాళులర్పించారు.

లంబాడీలకు అన్యాయం చేస్తే సహించం

– భూక్య సంజీవ్ నాయక్


సేవాలాల్ సేన సదస్సులో మాట్లాడుతున్న భూక్య సంజీవ్ నాయక్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కాంగ్రెస్ ప్రభుత్వం లంబాడీలకు మంత్రి పదవి ఇవ్వకపోవడం సరైంది కాదని సేవాలాల్ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు భూక్య సంజీవ్ నాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. లంబాడీలకు అన్యాయం చేస్తే సహించబోమని హెచ్చరించారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సేవాలాల్ సేన రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో మహాసభ జరిగింది. అంతకుముందు సీఎం రేవంత్‌రెడ్డి విధానాలను నిరసిస్తూ ఆర్టీసీ కళ్యాణ మండపం నుంచి సుందరయ్య విజ్ఞాన కేంద్రం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో సంజీవ్ నాయక్ మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో ఎన్ని ఉద్యమాలు చేసినా తండాలను పట్టించుకోలేదని, తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక తండాలను గ్రామ పంచాయితీలుగా మార్చారన్నారు. తండాల అభివృద్ధికి రూ. 25 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ అధికారంలోకి రాగానే విస్మరించిందని విమర్శించారు. హుస్సేన్ సాగర్ చెత్త తీయడానికి తాము పనికి వస్తాం, కానీ, తమ అభివృద్ధికి నిధులు ఇవ్వరా అని అన్నారు. కార్యక్రమంలో అధ్యక్షులు బానోతు కిషన్ నాయక్, సైదా నాయక్, లకావత్ భాస్కర్, గ్రేటర్ అధ్యక్షులు వి.కళ్యాణ్ నాయక్, నేనావత్ అజయ్, బానోతు హుస్సేన్ నాయక్, బాలు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి సిటీ ప్లస్

11

హైదరాబాద్‌ । శుక్రవారం । 27 । జూన్‌ । 2025

అలరించిన 'సిరికాకొలను చిన్నది'



గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో రాగ సప్తస్వరం పర్ఫ్‌ ఆర్ట్స్‌ అకాడమీ ఆధ్వర్యంలో రచయిత వేటూరి సుందర రామ్మూర్తి రచించిన 'సిరికాకొలను చిన్నది' జానపద పౌరాణిక నృత్యరూపకం అలరించింది. రవీంద్రభారతిలో గురువారం ఈ ప్రదర్శనలో దేవదాసి భాగోద్వేగాలు, సమాజంలో వైరుధ్యాలను ప్రతిబింబిస్తూ సాగిన ఈ నృత్య రూపకం అహూతులను ఆకట్టుకుంది. బాల రామాయణం సీత పాత్రదారి డాక్టర్‌ స్మితా మాదవ్‌ నృత్య దర్శకత్వంలో 40 మంది కళాకారులతో ప్రదర్శన ఆద్యాంతం రక్తి కట్టించింది. కార్యక్రమంలో విద్యావేత్త ప్రీతిరెడ్డి, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్‌ మామిడి హరికృష్ణ, వేటూరి సతీమణి రాజ్యలక్ష్మి, సినీ రచయిత బారవి, సంస్థ అధ్యక్షురాలు రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

'మిసెస్‌ ఆసియా వరల్డ్‌-2025' విజేత రేవతి



హిమాయత్‌నగర్‌: యుఎస్‌తో పాటు భారత్‌లో 16 ఏళ్లకు పైగా సామాజిక సేవ, మహిళా సాధికారత, ప్రపంచ మానవతా విలువల కోసం కృషి చేస్తున్నందుకు గానూ 'మిసెస్‌ ఆసియా వరల్డ్‌ విన్నర్‌-2025' కిరీటాన్ని నగరానికి చెందిన డాక్టర్‌ రేవతి దక్కించుకున్నారు. ఈ విషయాన్ని మనస్వ ఇంటర్నేషనల్‌ ఫౌండేషన్‌ వ్యవస్థాపక అధ్యక్షురాలైన డాక్టర్‌ సూర్య రేవతి మెట్టుకూరు గురువారం తెలిపారు. జూన్‌ 22న దుబాయ్‌లో జరిగిన అంతర్జాతీయ కార్యక్రమంలో భారత మహిళగా ఈ అరుదైన గౌరవం దక్కిందని అన్నారు. ఐటీ, ఫైనాన్స్‌, మైనింగ్‌, ఆరోగ్య సంరక్షణ రంగాల్లో సీఈఓగా పనిచేశాసిన, తెలంగాణ రాష్ట్రంలోని ఐదు గ్రామాలను దత్తత తీసుకుని విద్య, ఆరోగ్య సంరక్షణ, మహిళా సంక్షేమం, యువత ఉపాధిపై దృష్టి సారించినట్లు పేర్కొన్నారు. 100 శాతం అక్షరాస్యత సాధించినందుకు రాష్ట్రపతి అవార్డు పొందినట్లు తెలిపారు.

సుహార్త్‌ శక్తి క్యాంపెయిన్‌



- రెండో దశ కార్యక్రమం విజయవంతం
- బాలికలకు వెయ్యికి పైగా శక్తి కిట్లు పంపిణీ

సాక్షి, సిటీ బ్యూరో: సుహార్త్‌ ఫౌండేషన్‌ నిర్వహించిన 'సుహార్త్‌ శక్తి క్యాంపెయిన్‌' రెండో దశ ఘన విజయం సాధించింది. కొండాపూర్‌ జెడ్పీహెచ్‌ఎస్‌లో బాలికల కోసం నిర్వహించిన ఈ కార్యక్రమంలో జీవన పరిసరాలకు అనుకూలమైన వెదురు ఆధారిత శానిటరీ ప్యాడ్లతో శుభ్రమైన ఋతు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్‌ లావణ్య ఎన్‌జేపీ (డీసీపీ, ఉమెన్‌ సేఫ్టీ వింగ్‌) తోపాటు గైనకాలజిస్ట్‌ డా.శిల్పి రెడ్డి, మాజీ డీసీపీ ఆర్‌ఎస్వీ.బద్రీనాథ్‌ పాల్గొన్నారు. ఇందులో భాగంగా బాలికలకు వెయ్యికి పైగా శక్తి కిట్లు పంపిణీ చేశారు.





- అందుబాటులో కొరియన్‌, థాయ్‌, జపనీస్‌ ఫుడ్‌
- కాంటినెంటల్‌లో సరికొత్త రుచుల పరిచయం
- యాంటిక్‌ యాంబియన్స్‌ త మా షా ప్రత్యేకత
- ఆసియన్‌ శాకాహారానికి రుచికరమైన వేదిక

హమేషా.. తమాషా..

సిటీలో ఆతిథ్యం ఇస్తున్న విదేశీ వంటకాలు

భాగ్యనగరం రుచికరమైన కాంటినెంటల్‌ వంటకాలకు నెలవన్న విషయం విదితమే. అయితే ప్రస్తుతం నగరంలో సియోల్‌, బ్యాంకాక్‌, టోక్యో వంటి ఆసియన్‌ దేశాలకు చెందిన వినూత్న రుచులకు కేంద్రంగా మారుతోంది. ఇందులో భాగంగా గన్‌రాక్‌తో పాటు మరి కొన్ని ప్రాంతాల్లో తమాషా పేరుతో ఆసియన్‌ వెజ్‌ కెఫేలు నగరంలోని ఫుడ్‌ లవర్స్‌కు సరికొత్త రుచులను అందిస్తున్నాయి. ఆసియా వంటకాలకు కొత్త దిశ చూపేలా ప్రారంభమైన తమాషా 100 శాతం శాకాహారి వంటకాలతో, ఓల్డ్‌ స్కూల్‌ రెట్రో లుక్‌తో, లైవ్‌ మ్యూజిక్‌తో, ఓపెన్‌ ఎయిర్‌లో, యాంటీ ఫొటోలు తీసుకునే స్పాట్లతో ఆకర్షిస్తున్నాయి.

– సాక్షి, సిటీ బ్యూరో





నగరవాసులకు ప్రతిదీ వింతే.. మరీ ముఖ్యంగా చెప్పాలంటే ఆహారం విషయంలో కొత్త వెరైటీలకు ఎప్పుడూ క్రేజ్‌ ఉంటుంది. పైగా నగరంలోని ఆహార ప్రియులు కొందరు, ఆహ్లాదం కోసం కొందరు రెగ్యులర్‌గా రెస్టారెంట్లు, కెఫేలు, హోటళ్లను సందర్శిస్తుంటారు. వీరిలో కొందరు ఆకట్టుకునే వాతావరణం కోసం.. అద్భుతమైన యాంబియన్స్‌ కోసం వెతుకుతుంటారు. అలాంటి వారిని ఆకట్టుకునేందుకు నిర్వాహకులు కూడా కొత్త తరహా యాంబియన్స్‌ కోసం అన్వేషిస్తుంటారు. ఇందులో భాగంగానే నగరంలో తమాషా డిషెస్‌ పేరుతో ఏర్పాటు చేసిన రెస్టారెంట్‌ సందర్శకులను, ఆహార ప్రియులను ఆకట్టుకుంటోంది. అంతేకాదు వివిధ దేశాలకు చెందిన వెరైటీ వంటకాలను కూడా అందుబాటులో ఉంచుతోంది.. ముఖ్యంగా శాకాహార వంటకాలకు ప్రాముఖ్యతను ఇస్తూ.. సియోల్‌, బ్యాంకాక్‌, టోక్యో దేశాల ఆహారాలను వండి వడ్డిస్తున్నారు.





నోస్టాల్జిక్‌ అనుభూతి..

అయితే ఈ కెఫే విశిష్టత కేవలం ఆహారంలోనే కాదు -యాంబియన్స్‌లోనూ ఉండేలా ప్లాన్‌ చేస్తున్నారు. వింటేజ్‌ టీవీలు, బుక్‌షెల్ఫ్‌లు, గిటార్‌లు, బ్యాంబూ లైట్స్‌, ఆర్టిస్టిక్‌ కార్నర్లు.. ప్రతి మూల కూడా ఇన్‌స్టా మెంట్‌!, స్టేజిపై లైవ్‌ మ్యూజిక్‌ వింటూ, వెనక నోస్టాలజిక్‌ వీడియోలు చూసే అనుభవాన్ని విభిన్నమైన తరహాలో అందించేలా ఏర్పాటు చేస్తున్నారు. నగరంలో ఈ మధ్య కాలంలో ఆదరణ పొందుతున్న పికిల్‌ బాల్‌ కోర్ట్‌ కూడా ఉండటం విశేషం!

ఇదొక భావోద్వేగం..

ఇది కేవలం కెఫే కాదు– ఒక భావోద్వేగం. మేము మళ్లీ భౌతికంగా అనుసంధానం కావడానికి అనువైన వాతావరణాన్ని ఆహారంతో ముడిపెట్టే ప్రదేశాన్ని సృష్టించాలనుకున్నాం.

– ఏకె.సోలంకీ, తమాషా కో–ఫౌండర్‌





గ్రీన్‌ థాయ్‌ మొదలు జైన్‌ వరకు..

కోరియన్‌ చిల్లీ టోఫూ నుంచి జపనీస్‌ కాటేజ్‌ చీజ్‌ కాట్సు వరకు, గ్రీన్‌ థాయ్‌ కర్రీ నుంచి కిమ్చీ పిజ్జా వరకు – ప్రతి ఐటమ్‌లోనూ కొత్తదనం, ఆరోగ్యం, ఆసియన్‌ స్పైసీ టచ్‌ ఉండేలా చూస్తున్నారు. వెజ్జీ థిన్‌ క్రస్ట్‌ పిజ్జా, రోస్‌ కూలర్‌, క్యూకంబర్‌ ఫిజ్‌ వంటి పానీయాలు, థాయ్‌ మాంగో స్టికీ రైస్‌ వంటి డెజర్ట్స్‌తో వావ్‌ అనిపిస్తున్నాయి. జైన్‌ భోజనాన్ని కోరేవారికి ప్రత్యేక ఐటమ్స్‌ సిద్ధంగా ఉన్నాయి.



రిటైర్డ్‌ ఉద్యోగి దాతృత్వం

ప్రతి ఒక్కరికీ సేవ చేయాలనే ఉద్దేశం ఉన్నప్పటికీ సమయం లేక కొంతమంది.. ఆర్థిక స్తోమత లేక మరి కొంతమంది చేయలేని పరిస్థితి.. అలాంటివారు ఏమాత్రం అవకాశం దొరికినా తమ వంతుగా సమాజానికి సేవ చేయాలనే తలంపుతో ఉంటారు. అలాంటి వారిలో ఒకరే ధర్మారావు.. సేల్స్‌ టాక్స్‌ డిపార్ట్‌మెంట్‌లో డిప్యూటీ కమర్షియల్‌ టాక్స్‌ ఆఫీసర్‌గా విధులు నిర్వహించిన ఆయన ఉద్యోగ విరమణ అనంతరం తన వంతు సాయంగా సేవ చేస్తున్నారు. ఇందులో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్నారు..

– మోతీనగర్‌

- ఉద్యోగ విరమణ అనంతరం విద్యార్థులకు తోడ్పాటు
- నోటు పుస్తకాలు, యూనిఫామ్‌ పంపిణీ
- తన వంతు సాయంగా సమాజ సేవ చేస్తున్న ధర్మారావు



ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరుకు చెందిన బి.ధర్మారావు ప్రస్తుతం మూసాపేట డివిజన్‌ మోతీనగర్‌లో నివాసం ఉంటున్నారు. ఉద్యోగ విధుల నిమిత్తం 1996లో కృష్ణాజిల్లా నుంచి నగరానికి బదిలీ అయ్యారు. డిప్యూటీ కమర్షియల్‌ టాక్స్‌ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తూ జులైలో 2004లో ఉద్యోగ విరమణ పొందారు. అనంతరం ఆయన సతీమణి దివంగత బి.హైమావతి కోరిక మేరకు 2004 నుంచి నేటి వరకూ నిరంతరాయంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నోటు పుస్తకాలు, యూనిఫామ్‌, పాఠశాల ఫీజులు చెల్లిస్తున్నారు.

భార్య జ్ఞాపకార్థం..

ప్రస్తుతం చిన్నకుమారుని వద్ద నివాసం ఉంటున్న ధర్మారావుకు ఇద్దరు కుమారులు ఒక కుమార్తె. 2020లో ఆయన భార్య మరణానంతరం హైమావతి జ్ఞాపకార్థం.. 2021 నుంచి పుస్తకాలు, యూనీఫామ్‌ పంపిణీతో పాటు మూసాపేట డివిజన్‌లోని బబ్బుగూడ, యూసఫ్‌గూడ, వెంగళరావునగర్‌, ఇస్నాపూర్‌, శ్రీరామ్‌నగర్‌, రాజ్‌ భవన్‌ ప్రభుత్వ పాఠశాలలు, శ్రీరామ్‌ నగర్‌లోని ఉర్దూ మదరసాల్లో చదువుతూ ఉత్తమ ప్రతిభ కనబరిచిన పదో తరగతి విద్యార్థులకు రూ.12వేల చప్పున ఫీజులను చెల్లిస్తున్నారు. గత ఐదేళ్లుగా పదో తరగతి మొదటి స్థానంలో ఉత్తీర్ణత సాధించిన, 500కు పైబడి మార్కులు సాధించిన 120 మంది విద్యార్థులకు ఆర్థిక సాయం అందజేస్తున్నారు.

ఆమె ఆలోచన నుంచే..



మేము చదువుకున్న సమయంలో పాఠశాలల్లో సరైన సౌకర్యాలు లేక అవస్థలు పడ్డాం. ఈ నేపథ్యంలో నా భార్య హైమావతి ఆలోచన నుంచే ఉద్యోగ విరమణ అనంతరం మా వంతు సాయం చేయాలని నిర్ణయించుకున్నాం. ఆమె మరణానంతరం ఆమె జ్ఞాపకార్థం విద్యార్థులకు తోచిన విధంగా పరితోషికాన్ని సాయం చేస్తున్నా. అపార్టుమెంట్‌లో విధులు నిర్వహిస్తున్న వాచ్‌మెన్‌ పిల్లలకు నోటు పుస్తకాలు అందజేస్తున్నా. రానున్న రోజుల్లో హైమావతి జ్ఞాపకార్థం మరిన్ని కార్యక్రమాలు చేపడతా.

– ధర్మారావు, రిటైర్డ్‌ డిప్యూటీ కమర్షియల్‌ టాక్స్‌ ఆఫీసర్‌

నేడు 'దిశ' పుస్తకావిష్కరణ



సాక్షి, సిటీబ్యూరో: సమాజంలో మహిళల పరిస్థితి, లైంగిక వేధింపులు, చట్టాల్లోని లొసుగులను ప్రశ్నిస్తూ.. సమకాలీన పరిస్థితులపై భిన్న దృక్కోణాలను మనకు అందించే కథతో రూపొందిన 'దిశ' పుస్తకావిష్కరణ శుక్రవారం జరగనుంది. మాదాపూర్‌లోని టీ హబ్‌ వేదికగా పలువురు రాజకీయనేతలు, ఇతర రంగాల ప్రముఖులు హాజరవుతున్నారు.

సంప్రదాయ నాట్యం నుంచి కథారచన వరకూ..

దిశ పుస్తకాన్ని రచించిన డాక్టర్‌ ధరణికోట సుయోధన్‌ న్యాయ రంగంలో 20 యేళ్లకు పైగా అనుభవంతో ప్రపంచ వేదికపై లైంగిక వేధింపుల నిరోధ కార్యక్రమాల్లో ముఖ్య పాత్ర పోషించారు. 'ప్రొఫెషనల్‌ ఎథిక్స్‌ అండ్‌ మోరల్స్‌ ఫర్‌ ఇంజినీరింగ్‌ స్టూడెంట్స్‌' అనే పుస్తకానికి సహ రచయితగా వ్యవహరించారు, రంగస్థల, కూచిపూడి, భరతనాట్య కళాకారునిగా ఆది శంకరుల నుంచి కామసూత్ర వరకూ వివిధ నృత్య పోటీల్లో ప్రముఖ పాత్రలు పోషించారు.

అమేయ డబ్లి పాన్‌ ఇండియా టూర్‌..

- నగరంలో 'పాన్‌ ఇండియా కృష్ణా టూర్‌'
- హైదరాబాద్‌తో పాటు 11 నగరాల్లో లైవ్‌ కాన్సర్ట్‌
- 'సాక్షి'తో ముచ్చటించిన ప్రముఖ సింగర్‌ అమేయ డబ్లి

ప్రముఖ పాన్‌ ఇండియా సింగర్‌ అమేయ డబ్లి తన స్వర మాధుర్యంతో నగరంలో సందడి చేయనున్నారు. గత 14 సంవత్సరాలుగా ప్రపంచవ్యాప్తంగా 4 వేలకు పైగా సంగీత కచేరీలు, ప్రదర్శనలు చేసిన అమేయ డబ్లి ఈ నెల 28న నగరంలోని శిల్పకళావేదికగా లైవ్‌ కాన్సర్ట్‌తో సంగీత ప్రియులను అలరించనున్నారు. ఏకమ్‌ ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో 'పాన్‌ ఇండియా కృష్ణా టూర్‌'లో భాగంగా హైదరాబాద్‌తో పాటు భారత్‌లోని 11 నగరాల్లో ఈ కాన్సర్ట్‌ నిర్వహించనున్నారు. ఈ మ్యూజికల్‌ టూర్‌ కృష్ణునిపై మాత్రమే సంగీత విభావరి ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఇటీవల సన్నాహక కార్యక్రమానికి హాజరైన నేపథ్యంలో 'సాక్షి'తో ముచ్చటించారు.. ఆ విశేషాలు..

– సాక్షి, సిటీబ్యూరో



టాలీవుడ్‌ స్టార్‌ రాణా దగ్గుబాటి, మిహీకా బజాజ్‌ పెళ్లి మొదలు కపూర్‌ ఖండన్‌, రాణీ ముఖర్జీ, ఆదిత్య చోప్రా, జిందాల్‌ కుటుంబం, ఇమామి గ్రూప్‌లోని అగర్వాల్‌ కుటుంబం, ఇషా అంబానీ, ఆనంద్‌ పిరమల్‌ వంటి లగ్జరీ వేడుకల్లో పాడిన డబ్లి మొదటి సారి నగరంలో సంగీత ప్రదర్శన చేపట్టడం విశేషం.

ఏకమ్‌ ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో..

సంగీతం ఒక సాంత్వన, పాటలు ఒక సంతృప్తి..!! నా ప్రయాణంలో ప్రపంచవ్యాప్తంగా 4 వేలకు పైగా ప్రదర్శనలిచ్చాను. ఈ సారి వినూత్నంగా కృష్ణుని ఇతివృత్తంతో ఈ పాన్‌ ఇండియా టూర్‌ చేయడం సంతోషంగా ఉంది. ముఖ్యంగా నా సామాజిక బాధ్యతగా నా సంపాదనలో 25 నుంచి 50 శాతం వరకూ సేవా కార్యక్రమాలకు వినియోగిస్తుంటాను. ఇందులో భాగంగానే ఏకమ్‌ ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో ఈ మ్యూజికల్‌ టూర్‌ను జైపూర్‌, జోద్‌పూర్‌, సూరత్‌, ముంబై, పుణె, బెంగళూరు, అహ్మదాబాద్‌, కోల్‌కతా నగరాల్లో ప్రదర్శిస్తున్నాను.

ప్రదర్శనలో 25 శాతం వారికే..

దేశం కోసం నిరంతరం పోరాడుతున్న ఆర్మీ కోసం ప్రత్యేకంగా సంగీత ప్రదర్శనలిచ్చాను. అంతేకాకుండా నా ప్రతి ప్రదర్శనలో 25 శాతం సీట్లు ఆర్మీ వారి కోసం ఉచితంగా కేటాయిస్తాను.. ఈ ఆనవాయితి నగరంలోని ప్రదర్శనలో కూడా కొనసాగుతోంది. ఈ ప్రదర్శన కోసం మొదటిసారి తెలుగు పాటను కూడా పాడబోతున్నా. అనాది నుంచి హైదరాబాద్‌కు సంగీతానికీ విడదీయరాని అవినాభావ సంబంధం ఉంది. ఇక్కడి సంగీత ప్రియుల గురించి దేశవ్యాప్తంగా తెలుసు. 16 మంది ప్రముఖ సంగీత విద్వాంసులు, ఐదుగురు ప్రముఖ సింగర్లు.. మొత్తం నాతో పాటు 25 మంది భారీ బృందంతో ఈ ప్రతిష్టాత్మక కచేరీ హైదరాబాద్‌ నగరాన్ని సంగీత సాగరంలో ముంచెత్తనుంది.


– సింగర్‌ అమేయ డబ్లి

ఇంజనీరింగ్ కౌన్సెలింగ్‌కు లైన్ క్లియర్!

నేడు షెడ్యూల్ ప్రకటిస్తామన్న ఉన్నత విద్యామండలి చైర్మన్

ముఖ్యమంత్రి జోక్యంతో దారికొచ్చిన అధికారులు

కలిసి ప్రకటిస్తారా లేదా అనే దానిపై సందిగ్ధత



సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్ కౌన్సెలింగ్ ప్రక్రియ ఎట్టకేలకు ముందుకు కదిలింది. శుక్రవారం షెడ్యూల్ ప్రకటిస్తామని ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి ప్రకటించారు. జేఎన్‌టీయూహెచ్‌లో జరిగిన పీజీఈసెట్ ఫలితాల వెల్లడి సందర్భంగా కౌన్సెలింగ్‌పై ఆయన ప్రకటన చేశారు. వాస్తవానికి జూలై మొదటి వారంలో షెడ్యూల్ ఇస్తామని ఆయన కొన్ని రోజుల క్రితం చెప్పారు. మరోవైపు అఖిల భారత సాంకేతిక విద్యా మండలి తేదీలను అనుసరిస్తామని సాంకేతిక విద్య కమిషనర్ దేవసేన బుధవారం చెప్పారు. ఈ నెల 30 తర్వాతే షెడ్యూల్ వెలువడుతుందనే సంకేతాలిచ్చారు. కానీ ఊహించని విధంగా శుక్రవారం నాడే షెడ్యూల్ ఇస్తున్నామని ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రకటించారు. ఇంజనీరింగ్ కౌన్సెలింగ్ విషయంలో సాంకేతిక, విద్యాశాఖ అధికారుల తీరుపై ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేసిన నేపథ్యంలోనే ఆగమేఘాల మీద షెడ్యూల్ విడుదలకు సిద్ధమైనట్లు సమాచారం.

ఎవరికి వారే..

కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను ఇవ్వబోతున్నామని మీడియాకు తెలియజేసేందుకు సాంకేతిక విద్య అధికారులు గురువారం ప్రెస్‌నోట్ సిద్ధం చేశారు. ఈలోగానే జేఎన్‌టీయూహెచ్‌లో మండలి చైర్మన్ షెడ్యూల్ ఇస్తున్న విషయాన్ని ప్రకటించారు. దీంతో సాంకేతిక, విద్యాశాఖ ఉన్నతాధికారులు షాక్ తిన్నారు. ఈ నేపథ్యంలో షెడ్యూల్ విడుదలకు రావాలంటూ కబురు అందడంతో సాంకేతిక విద్య అధికారులు అసహనం వ్యక్తం చేసినట్లు తెలిసింది. 'మేమెందుకు.. షెడ్యూల్ మీరే ఇచ్చుకోండి. మీ ఆఫీసుకొచ్చి కూర్చోవడం తప్ప ఏం చేయాలి..' అంటూ ఓ అధికారి వ్యాఖ్యానించినట్లు ఉన్నత విద్యామండలి వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే ఈ వ్యవహారంపై ముఖ్యమంత్రి కార్యాలయానికి సమాచారం అందడంతో షెడ్యూల్ విడుదల కార్యక్రమానికి వెళ్లాలంటూ సాంకేతిక, విద్యాశాఖ అధికారులను ఆదేశించినట్లు తెలిసింది. ఈ పరిణామాల నేపథ్యంలో కలిసి షెడ్యూల్ విడుదల చేస్తారా? ఉన్నత విద్యా మండలి అధికారులే ఇస్తారా? అనే సందిగ్ధత నెలకొంది.

అసలేం జరుగుతోంది?: సీఎం

విద్యాశాఖ, సాంకేతిక విద్యాశాఖ.. మండలి అధికారుల మధ్య సమన్వయ లోపంపై ముఖ్యమంత్రి కార్యాలయం దృష్టి పెట్టింది. సీఎం సలహా మేరకు ఓ ప్రత్యేక బృందాన్ని ఈ పని కోసం ఏర్పాటు చేసినట్టు తెలిసింది. సమీక్షకు పిలిస్తే చాలు మండలి అధికారులను టార్గెట్ చేయడమే లక్ష్యంగా సాంకేతిక, విద్యాశాఖ అధికారులు వ్యవహరించడం సీఎంవో వర్గాలను నివ్వెరపరుస్తోంది. దీంతో ఆయా విభాగాల మధ్య అసలేం జరుగుతోందో అని సీఎంవో ఆరా తీస్తోంది. వీలైనంత త్వరగా రెండు వర్గాలతో ఉన్నత స్థాయిలో సంప్రదింపులు జరిపి పరిస్థితిని చక్కదిద్దాలని సీఎం సూచించినట్టు తెలుస్తోంది. విద్యాశాఖ ముఖ్యమంత్రి అధీనంలో ఉన్న నేపథ్యంలో తాజా పరిణామాలపై ఆయన దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది.

ఇంజనీరింగ్ కాలేజీల్లో ఫేక్ ఫ్యాకల్టీ



తనిఖీలు చేశాకే అనుబంధ గుర్తింపు.. తేల్చిచెప్పిన అధికారులు

జూలై రెండో వారంలోనే గుర్తింపు జాబితా

ఈ ఏడాదికి పాత ఫీజులతోనే కౌన్సెలింగ్ చేపట్టాలన్న ప్రభుత్వం

దీనిపై కాలేజీలు కోర్టుకెళ్తే వినిపించాల్సిన వాదనపై న్యాయ సలహా కోరిన విద్యాశాఖ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఇంజనీరింగ్ కౌన్సెలింగ్‌కు అడుగడుగునా అడ్డంకులు ఎదురవుతున్నాయి. షెడ్యూల్ ప్రకటిస్తున్నప్పటికీ కౌన్సెలింగ్ ఏ మేరకు ముందుకెళ్తుందనేది అనుమానంగానే ఉంది. తాజాగా ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో నకిలీ అధ్యాపకులు ఉన్నారని జేఎన్‌టీయూహెచ్ అధికారులే అనుమానం వ్యక్తం చేశారు. పీజీఈసెట్ ఫలితాల ప్రకటన సందర్భంగా వర్సిటీ రెక్టార్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి ఈ అంశాన్ని ప్రస్తావించారు. 'అధ్యాపకుల ఒరిజినల్ సర్టిఫికెట్లను కొంత మంది అప్‌లోడ్ చేయలేదు. కొన్ని అస్పష్టంగా ఉన్నాయి. అవి నకిలీవో లేక అసలువో పరిశీలించాలి' అని ఆయన అన్నారు. ఆ తర్వాతే కాలేజీలకు అనుబంధ గుర్తింపు ఇస్తామని చెప్పారు. ఇంజనీరింగ్ కాలేజీల యాజమాన్యాలు అర్హులైన అధ్యాపకుల సర్టిఫికెట్లను అప్‌లోడ్ చేసి బోధన మాత్రం అనర్హులతో చేయిస్తున్నాయనే ఫిర్యాదులు ఏటా వస్తున్నాయి. వాటిని పరిశీలించడంపై జేఎన్‌టీయూహెచ్ ఈసారి ప్రత్యేక దృష్టి పెట్టింది. అయితే ఈ ప్రక్రియ పూర్తయ్యేదెప్పుడు? కాలేజీలకు అనుబంధ గుర్తింపు ఇచ్చేదెప్పుడనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

జూలై తర్వాతే గుర్తింపు జాబితా

అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ) కొత్త బ్రాంచీలు, అదనపు సీట్లపై స్పష్టత ఇవ్వాల్సి ఉంది. కొన్ని సీట్లు పెంచేందుకు అనుమతి ఇచ్చే వీలుంది. అయితే ప్రభుత్వం మాత్రం ఈ సంవత్సరం ఒక్క సీటు కూడా పెంచేందుకు అనుమతించొద్దని అధికారులను ఆదేశించింది. ఈ నెల 30 వరకు కొత్త సీట్ల కోసం దరఖాస్తు చేసుకొనే అవకాశం ఏఐసీటీఈ కల్పించగా ఆ తేదీ తర్వాతే అనుబంధ గుర్తింపు ఇవ్వాలని యూనివర్సిటీ అధికారులు భావిస్తున్నారు. దీంతోపాటు కొన్ని కాలేజీల్లో ఫ్యాకల్టీ, మౌలికవసతుల లోపం ఉన్నట్లు గుర్తించారు. దాదాపు 80 కాలేజీలకు నోటీసులు కూడా ఇచ్చారు. కాలేజీల నుంచి వచ్చిన సమాధానాలను జూలై మొదటి వారంలో పరిశీలించి ఆ తర్వాతే గుర్తింపు ప్రక్రియ మొదలు పెడతామని అధికారులు చెబుతున్నారు. దీన్నిబట్టి ఇంజనీరింగ్ కౌన్సెలింగ్ షెడ్యూల్ ఇచ్చినా ఆప్షన్లు పెట్టుకొనే గడువు మాత్రం జూలై రెండో వారం తర్వాతే ఉండే వీలుంది.

ప్రైవేటుకు ముకుతాడు వేయడం ఎలా?

ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో ఫీజుల పెంపుపై రాష్ట్ర ప్రవేశాలు, ఫీజుల నియంత్రణ మండలి (ఏఎఫ్ఆర్‌సీ) ఇప్పటికే పలు దఫాలు చర్చలు జరిపింది. ప్రభుత్వం మాత్రం ఈ ఏడాది ఫీజులు పెంచకూడదని స్పష్టం చేసింది. పాత ఫీజులతోనే కౌన్సెలింగ్ చేపట్టాలని అధికారులను ఆదేశించింది. అయితే దీనిపై ప్రైవేటు కాలేజీలు కోర్టుకెళ్లే యోచనలో ఉన్నాయన్న వార్తల నేపథ్యంలో ముఖ్యమంత్రి ఇటీవల అధికారులతో చర్చించారు. దీన్ని ఎదుర్కోవడంపై న్యాయ నిపుణుల సలహా తీసుకోవాలని అధికారులకు చెప్పారు. గతంలో వేసిన టాస్క్‌ఫోర్స్ నివేదికలోని అంశాలు ఏ మేరకు కోర్టులో వినిపించవచ్చో ఆలోచించాలన్నారు. అయితే ఈ పరిణామాలపై ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలు కూడా అంతే పట్టుదలగా ఉన్నాయి. ఏఎఫ్ఆర్‌సీ అధికారాలను ప్రభుత్వం తన చేతుల్లోకి తీసుకోవడాన్ని కోర్టులో సవాల్ చేయాలనుకుంటున్నాయి.

నాణ్యమైన విద్యతోనే విద్యార్థులకు భవిత

విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా



సాక్షి, హైదరాబాద్: నాణ్యమైన విద్య అందించినప్పుడే విద్యార్థి భవిష్యత్తు అద్భుతంగా మారుతుందని రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్య నాణ్యతపై ఇంటర్మీడియట్ విద్యామండలిలో బోర్డు అధికారులు, ప్రిన్సిపాల్స్‌తో జరిగిన మేధోమథన సదస్సులో ఆమె మాట్లాడారు. మెరుగైన బోధన జరగాలంటే.. విద్యార్థికి అవసరమైన విద్యను అందించాలని, ప్రిన్సిపాల్స్, డీఐఈవోలు సమష్టిగా కృషి చేయాలని సూచించారు. ఈ ఏడాది ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో కొత్తగా 75వేల మంది ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలు పొందారన్నారు. ప్రతి ప్రవేశాన్ని యూడైస్‌లో కచ్చితంగా నమోదు చేయాలన్నారు. ప్రతి విద్యార్థి పరీక్షలకు తప్పకుండా హాజరయ్యేలా చూడాలన్నారు. ఇందుకు కాలేజీ స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. సదస్సులో ఇంటర్మీడియట్ విద్య సంచాలకుడు కృష్ణ ఆదిత్య, సీఓఈ జయప్రదాబాయి తదితరులు పాల్గొన్నారు.



అబ్బే నోబెల్ కాదు! పోరు పడలేక ఓ డూప్లికేట్ తయారుచేసి ఇచ్చాం! ఇక ఆ లోకంలోనే ఉన్నారు!

ఈగల్ ఉంది జాగ్రత్త

ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి హెచ్చరిక



'డ్రగ్స్ రహిత తెలంగాణ కోసం కృషి చేద్దాం' వీడియో గీతాన్ని ఆవిష్కరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, విజయ్ దేవరకొండ, రాంచరణ్, అడ్లూరి లక్ష్మణ్, గోపీచంద్, జితేందర్

సాక్షి, హైదరాబాద్: 'నేను రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యత స్వీకరించిన వెంటనే సమీక్ష పెట్టి మరీ హెచ్చరించా..తెలంగాణ గడ్డపై మాదక ద్రవ్యాలపై ఆలోచన చేస్తే వెన్ను విరుస్తామని. మళ్లీ అదే చెబుతున్నా.. తెలంగాణ సరిహద్దుల్లోకి మత్తు ముఠాలు రావాలంటే వణికే పరిస్థితి ఉండాలి. స్కూళ్లు, కాలేజీల్లో డ్రగ్స్ మూలాలు గుర్తిస్తే యాజమాన్యాలపైనా కేసులు పెడతాం. తెలంగాణలో ఎక్కడ డ్రగ్స్ మూలాలు ఉన్నా కనిపెట్టేలా 'ఈగల్' రంగంలోకి దిగుతుంది..' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. 'ఉద్యమ స్ఫూర్తితో ముందుకు వెళ్లాల్సిన తెలంగాణ రాష్ట్ర యువత డ్రగ్స్ మహమ్మారికి బలవడం న్యాయమా? ఉద్యమాల గడ్డ తెలంగాణ. ఇక్కడ పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులు డ్రగ్స్ మహమ్మారికి బలవుతుంటే చూస్తూ కూర్చుందామా?..' అంటూ ప్రశ్నించారు. అంతా కలిస్తేనే ఆదర్శవంతమైన, ఆరోగ్యవంతమైన తెలంగాణ సాధ్యమవుతుందని చెప్పారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకుని గురువారం తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఆధ్వర్యంలో మాదాపూర్‌లోని శిల్పకళా వేదికలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి సీఎం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అతిథులుగా పాల్గొన్న సినీ హీరోలు రామ్‌చరణ్, విజయ్ దేవరకొండ, సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌లతో కలిసి అక్కడ ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. అనంతరం రేవంత్‌రెడ్డి మాట్లాడారు.

పంజాబ్, హరియాణా పరిస్థితి రావొద్దు

'ఒకప్పుడు ఉద్యమాల గడ్డ అయిన తెలంగాణను గంజాయి, డ్రగ్స్ గడ్డగా మార్చొద్దు. ఒకప్పుడు దేశ స్వాతంత్య్ర పోరాటంలో, దేశ రక్షణలో ముందున్న పంజాబ్, హరియాణా రాష్ట్రాల్లోని యువత ఇప్పుడు డ్రగ్స్ మహమ్మారితో నిర్వీర్యమైపోతోంది. అలాంటి పరిస్థితులు తెలంగాణలో రాకుండా ఉండాలనే సదుద్దేశంతోనే తెలంగాణలో గంజాయి, ఇతర మత్తుపదార్థాల రవాణా, వాడకంపై కఠిన చర్యలు తీసుకుంటున్నాం. ఒక దేశాన్ని దెబ్బ తీసేందుకు శత్రు దేశాలు డ్రగ్స్‌ను సైతం ఆయుధంగా మార్చుకునే పరిస్థితులు నేడు ఉన్నాయి..' అని ముఖ్యమంత్రి చెప్పారు.

యాంటీ నార్కోటిక్స్ బ్యూరో.. ఇకపై 'ఈగల్'

'యాంటీ నార్కోటిక్స్ బ్యూరో (ఏఎన్‌బీ)ను ఇకపై 'ఈగల్'గా మారుస్తున్నాం..ఈగల్ అంటే ఎలైట్ యాక్షన్ గ్రూప్ ఫర్ డ్రగ్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్. తెలంగాణలోని కోటి 50 లక్షల ఎకరాల వ్యవసాయ భూమిలో ఎక్కడ గంజాయి పండించినా..ఇతర రాష్ట్రాల నుంచి డ్రగ్స్ సప్లయ్ చేసినా ఈగల్ గుర్తిస్తుంది. స్కూళ్లు, కాలేజీల పరిసరాల్లో డ్రగ్స్ పట్టుబడితే యాజమాన్యాల పైనా కేసులు పెట్టాలని డీజీపీని ఆదేశిస్తున్నా.

కాలేజీలు చైల్డ్ సైకాలజిస్టులను ఏర్పాటు చేసుకోవాలి

విద్యార్థుల ప్రవర్తనను గమనించాల్సిన బాధ్యత యాజమాన్యాలపైనా ఉంది. కొందరు తల్లిదండ్రులు తమకున్న పరిస్థితుల కారణంగా వారి పిల్లలపై దృష్టి పెట్టలేకపోవచ్చు. కానీ అత్యంత ఎక్కువ సమయం స్కూళ్లు, కాలేజీల్లోనే గడుపుతారు కాబట్టి విద్యార్థుల ప్రవర్తనను గమనించేందుకు యాజమాన్యాలు చైల్డ్ సైకాలజిస్టులను ఏర్పాటు చేసుకోవాలి. చాక్లెట్లు కాదు గంజాయి చాక్లెట్లు అమ్మే పరిస్థితి ఉంది. కాబట్టి డ్రగ్స్ జాడ గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. విద్యార్థులు కూడా ఒకవేళ చదువుల్లో రాణించకపోతే క్రీడల్లో రాణించండి. నేను ఉద్యోగాలు ఇస్తాను. లేదంటే రాజకీయంగా ఎదగాలి. మన యువత న్యూయార్క్, టోక్యో, సౌత్ కొరియా యువతతో పోటీపడే స్థాయికి ఎదగాలి..' అని సీఎం ఆకాంక్షించారు.

సినీ హీరోల విజయ గాథలు స్ఫూర్తిగా తీసుకోవాలి

'ఎవరికీ ఎలాంటి బ్యాక్‌గ్రౌండ్ అవసరం లేదు. కష్టపడితేనే జీవితంలో విజయాలు సాధ్యమవుతాయి. మాకెవరికీ బ్యాంక్ గ్రౌండ్ లేదు. చిరంజీవికి ఎలాంటి సినీ బ్యాక్‌గ్రౌండ్ లేకపోయినా కఠోర శ్రమతో ఆయన మెగాస్టార్‌గా ఎదిగారు. రామ్‌చరణ్ కూడా ఎంతో శ్రమతో ఈ స్థాయికి ఎదిగారు. ఆర్‌ఆర్‌ఆర్ సినిమాతో ఆస్కార్ సాధించారు. నేను కూడా 2006లో జెడ్పీటీసీగా మొదలు పెట్టి 2023 నాటికి రాష్ట్ర ముఖ్యమంత్రిని అయ్యాను. విజయ్ దేవరకొండ కూడా నాలాగే నల్లమల నుంచి వచ్చారు. మా పక్క ఊరే. సినీ ఇండస్ట్రీలో ఎలాంటి బ్యాక్‌గ్రౌండ్ లేకపోయినా హీరోగా ఎదిగారు. అయితే సినిమాల్లోని పాత్రలను కాకుండా సినీ హీరోల నిజ జీవితంలోని విజయాలను యువత స్ఫూర్తిగా తీసుకోవాలి..' అని రేవంత్‌రెడ్డి కోరారు. ఎఫ్‌డీసీ చైర్మన్, సినీ నిర్మాత దిల్‌రాజు మాట్లాడుతూ.. డ్రగ్స్ తీసుకునే వారిని బహిష్కరించాలని మలయాళ సినీ పరిశ్రమలో నిర్ణయం తీసుకున్నారని, తెలుగు చిత్రపరిశ్రమలో కూడా అలాంటి చర్యలు తీసుకోవడంపై చర్చిస్తామన్నారు. తెలంగాణను మత్తు రహితంగా చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీజీపీ జితేందర్ కోరారు. ఏఎన్‌బీ డైరెక్టర్ సందీప్ శాండిల్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆకాంక్ష మేరకు నషా ముక్త్ (మత్తు రహిత) తెలంగాణ ధ్యేయంగా తమ విభాగం పనిచేస్తోందన్నారు. కాగా డ్రగ్స్, గంజాయి జోలికి వెళ్లొద్దని..డ్రగ్స్ రహిత తెలంగాణ కోసం కృషి చేద్దామనే నినాదంతో రూపొందించిన లఘు చిత్రాన్ని, వీడియో గీతాన్ని సీఎం విడుదల చేశారు. కార్యక్రమంలో ఎంపీలు కొండా విశ్వేశ్వర్ రెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్, మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవిగుప్తా, వికలాంగుల శాఖ డైరెక్టర్ శైలజ తదితరులు పాల్గొన్నారు.

ఒక తండ్రిగా నాకు ఆందోళన కలుగుతోంది..

స్కూళ్ల వద్ద ఐస్‌క్రీమ్‌లు, చాక్లెట్లలో ఏమిస్తున్నారో తెలియట్లేదు. పిల్లలను బయటకు పంపించాలంటే భయపడే పరిస్థితులు ఏర్పడ్డాయి. ఒక తండ్రిగా ఇప్పుడు నాకు కూడా ఆందోళనగా ఉంది. యువత డ్రగ్స్ వైపు మళ్లకుండా కాపాడేందుకు తెలంగాణ ప్రభుత్వం, పోలీస్ శాఖ చేస్తున్న కృషి అభినందనీయం. డ్రగ్స్ మహమ్మారిని తరిమేయడంలో తెలంగాణ ప్రభుత్వానికి మేం కూడా పూర్తిగా సహకరిస్తాం. డ్రగ్స్ బారిన పడకుండా కాపాడడం మన కుటుంబం నుంచే మొదలు పెడదాం. ప్రతి ఒక్కరం ఒక సైనికుడిలా పోరాడాలి. అప్పుడే డ్రగ్స్‌లేని సమాజం సాధ్యం.

– రామ్‌చరణ్

ఆరోగ్యం లేకపోతే అన్నీ వృథాయే..

సినిమాలు, షూటింగ్‌లు, ఇల్లు మినహా బయట ఏం జరుగుతుందో నాకు పెద్దగా తెలియదు. కానీ ఈ మధ్య కొందరు పోలీసు అధికారులు ఈ డ్రగ్స్ విస్తరణను నాకు వివరించారు. ఆ తర్వాతే ఇది ఎంత ముఖ్యమైన అంశమో నాకు అర్థమైంది. అందుకే డ్రగ్స్‌తో వచ్చే ముప్పును చెప్పడానికి వచ్చా. డబ్బులు లేని లైఫ్‌ను.. ఉన్న లైఫ్ నేను చూశా. సక్సెస్, మనీ ఉన్నా..ఆరోగ్యం బాగా లేకపోతే అది వృథా. కాబట్టి డ్రగ్స్‌కు దూరంగా ఉండండి. మీరు అనుకున్న లక్ష్యాలు సాధించండి.. డబ్బులు సంపాదించండి. తల్లిదండ్రులను సంతోషంగా చూసుకోండి. అదే మీకు ఎంతో సంతోషాన్ని ఇస్తుంది.

– విజయ్ దేవరకొండ

రూ.180 కోట్ల మెడికల్ బిల్లులు క్లియర్

- రెండున్నరేళ్లుగా పెండింగ్‌లో ఉన్న బిల్లులన్నింటికీ మోక్షం
- 26,519 మంది ఉద్యోగులు, పెన్షనర్లకు ఊరట
- ఉద్యోగులు మా కుటుంబ సభ్యులు: ఉపముఖ్యమంత్రి భట్టి



సాక్షి, హైదరాబాద్: దాదాపు రెండున్నరేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులకు మోక్షం కలిగింది. ఈ బిల్లుల చెల్లింపునకు సంబంధించి రూ.180.38 కోట్లను గురువారం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. దీంతో 26,519 మంది ఉద్యోగులు, పెన్షనర్లకు భారీ ఊరట లభించినట్లయింది. రైతు భరోసా కింద రూ.9 వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేసిన వెంటనే ఉద్యోగులకు 2023 మార్చి నుంచి ఈనెల 20 వరకు వచ్చిన మెడికల్ బిల్లులన్నింటినీ చెల్లించడం విశేషం. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమం కోసం ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం చైర్మన్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలను ఒక్కొక్కటిగా ప్రభుత్వం పరిష్కరిస్తోందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులను కుటుంబ సభ్యులుగా భావించి వారి సమస్యలను పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. ఉద్యోగులు, పెన్షనర్లకు రెండు డీఏలను పెంచుతూ ఈనెల 13న ప్రభుత్వం జీవో విడుదల చేసిందన్నారు. డీఏ పెంపుతో రాష్ట్రంలోని 3.50 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులు, మూడు లక్షల మంది పెన్షనర్లకు ప్రయోజనం చేకూరిందన్నారు. డీఏ పెంపుతో ప్రభుత్వంపై ప్రతినెలా రూ. 200 కోట్ల లెక్కన ఏడాదికి రూ. 2,400 కోట్ల భారం పడినప్పటికీ ఉద్యోగుల సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా భావిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు, అధికారుల సమస్యల పరిష్కారానికి జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ ఏర్పాటు ప్రక్రియ తుది దశకు చేరుకుందని, జనాభాను అనుసరించి గ్రామపంచాయతీలను నాలుగు గ్రేడ్లుగా విభజిస్తున్నామన్నారు. వీటితోపాటు ఉద్యోగులు, పెన్షనర్లకు సంబంధించిన ఆరోగ్య బీమా పథకం పూర్తిస్థాయిలో సిద్ధమవుతోందని వెల్లడించారు. వివిధ శాఖల్లో ప్రమోషన్లకు సంబంధించిన డీపీసీల ఏర్పాటు వేగవంతమైందని చెప్పారు. కేవలం రోజుల వ్యవధిలోనే రాష్ట్రంలోని 7.50 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలు పరిష్కారం కావడంపై ఉద్యోగ సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయన్నారు.

విత్తన చట్టం రూపకల్పన దిశగా ప్రయత్నాలు

వ్యవసాయ శాఖ సంచాలకుడి అధ్యక్షతన సమావేశమైన కమిటీ

సాక్షి, హైదరాబాద్: సమగ్ర విత్తన చట్టానికి సంబంధించిన ముసాయిదాను సిద్ధం చేసే ప్రక్రియను సంబంధిత కమిటీ వేగవంతం చేసింది. ఇందులో భాగంగా గురువారం వ్యవసాయ శాఖ కమిషనరేట్ కార్యాలయంలో విత్తన చట్టం రూపకల్పన కమిటీ సమావేశమైంది. కమిటీ కన్వీనర్, వ్యవసాయ సంచాలకుడు డాక్టర్ బి.గోపి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కమిటీ సభ్యులు సీడ్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్‌రెడ్డి, భూమి సునీల్, దొంతి నర్సింహారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ఎం.వి.నాగేశ్ కుమార్, శివప్రసాద్‌తోపాటు అధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో విత్తన చట్టం రూపకల్పనపై కమిటీ సభ్యులు చర్చించారు. తెలంగాణలో సమగ్రమైన విత్తన చట్టం తీసుకొచ్చే క్రమంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, చట్టంలో ఏయే అంశాలను చేర్చాలన్న అంశాలపై చర్చించారు. అవసరమైతే విత్తన రంగంలో అనుభవం ఉన్న వారి అభిప్రాయాలు, సలహాలు సూచనలు తీసుకోవాలని నిర్ణయం తీసుకున్నారు. వచ్చే సోమవారం మరోసారి కమిటీ సభ్యులు సమావేశమై ముసాయిదాను రూపొందించి, ప్రభుత్వానికి పంపాలని, తదనుగుణంగా పూర్తిస్థాయి చట్టం రూపొందించాలని నిర్ణయించారు. సమావేశంలో వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ సుచరిత, డిప్యూటీ డైరెక్టర్ అనిత తదితరులు పాల్గొన్నారు.

29న పసుపు బోర్డు ప్రారంభం

అమిత్‌షా ప్రారంభిస్తారు.. అనంతరం నిజామాబాద్‌లో రైతు సమ్మేళన బహిరంగ సభ: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



మీడియాతో మాట్లాడుతున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా ఈ నెల 29న నిజామాబాద్‌లో పసుపు బోర్డు కార్యాలయాన్ని ప్రారంభిస్తారని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. అదే రోజు జరిగే రైతు సమ్మేళనం బహిరంగసభలో కూడా పాల్గొంటారని చెప్పారు. గురువారం నిజామాబాద్ పర్యటనకు వచ్చిన కిషన్‌రెడ్డి ఎంపీ ధర్మపురి అర్వింద్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. 40 ఏళ్ల రైతుల ఆకాంక్ష, అనేక పోరాటాలు, ఉద్యమాల ఫలితంగా కేంద్రం నిజామాబాద్‌కు పసుపు బోర్డు ప్రకటించిందన్నారు. ఎంపీ అర్వింద్ కృషితో రాష్ట్ర, జాతీయ పార్టీ నిర్ణయం, ప్రధాని మోదీ ఆశీస్సులతో పసుపు బోర్డు ఏర్పడిందని చెప్పారు.సీనియర్ నేత, దివంగత ధర్మపురి శ్రీనివాస్ విగ్రహాన్ని అమిత్‌షా ఆవిష్కరించనున్నట్టు కిషన్‌రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులకు చిత్తశుద్ధి ఉంటే ఫోన్ ట్యాపింగ్ కేసును సీబీఐకి అప్పగించాలన్నారు. రేవంత్‌రెడ్డి టీపీసీసీ చీఫ్‌గా ఉన్న సమయంలో ఫోన్ ట్యాపింగ్ కేసును సీబీఐతో విచారణ చేయించాలని డిమాండ్ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. తెలంగాణ పోలీసులపై తెలంగాణ పోలీసులే దర్యాప్తు చేస్తే న్యాయం జరగదన్నారు. సమావేశంలో నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పాల్గొన్నారు.

హిందూ జిహాద్‌ను ప్రారంభిస్తాం

బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు



నారాయణపేట రూరల్: ముస్లింలు చేస్తున్న లవ్ జిహాద్‌కు వ్యతిరేకంగా హిందూ జిహాద్ కార్యక్రమానికి యువత సిద్ధం కావాలని బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. నారాయణపేట జిల్లా పేరపళ్లలో గురువారం రాత్రి శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. లవ్ జిహాద్ పేరుతో హిందూ అమ్మాయిలను టార్గెట్ చేసి పిల్లలు కనే ఫ్యాక్టరీలుగా మారుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గో రక్షణ, ముస్లిం జనాభా నియంత్రణ తదితర బలమైన చట్టాలను ప్రభుత్వాలు చేయకపోతే హిందూ జిహాద్ కార్యక్రమానికి సిద్ధమవుతామని హెచ్చరించారు.

నేడు టెన్త్ సప్లిమెంటరీ ఫలితాలు

సాక్షి, హైదరాబాద్: పదోతరగతి సప్లిమెంటరీ ఫలితాలను శుక్రవారం విడుదల చేయనున్నట్లు టెన్త్ పరీక్షల విభాగం డైరెక్టర్ కృష్ణారావు ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు ఫలితాలను www.bse.telangana.gov.in వెబ్‌సైట్‌లో చూడవచ్చని ఆయన పేర్కొన్నారు. టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలకు దాదాపు 38 వేల మంది హాజరయ్యారు.


ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపండి

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి టీజీవో నేతల వినతి

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ తీసుకోవాలని తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సచివాలయంలో గురువారం సీఎస్ కె.రామకృష్ణారావును టీజీవో ప్రతినిధులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏలూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగుల సాధారణ బదిలీలను వెంటనే చేపట్టాలని, అర్హులకు అవకాశం కల్పించాలన్నారు. ఉద్యోగుల ఆర్థికపరమైన అంశాలు, ఆర్థికేతర అంశాలను వివరించి వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల ఆరోగ్య పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలని, ఉద్యోగుల సప్లిమెంటరీ బిల్లులను పరిష్కరించాలని, ఎన్నికల సమయంలో బదిలీ అయిన ఉద్యోగులను తిరిగి సొంత జిల్లాలకు పంపించాలని కోరారు. ఈ అంశాలపై సీఎస్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. సీఎస్‌ను కలిసిన వారిలో ఎ.సత్యనారాయణ, బి.శ్యామ్ తదితరులు ఉన్నారు.

గురుకుల పనివేళలు మార్పు

ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి



సీఎస్ రామకృష్ణారావుకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: గురుకులాల పనివేళలను మార్చబోతున్నారని, ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు త్వరలోనే వెలువడతాయని ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి వెల్లడించారు. గతంలో దీనిపై పీఆర్‌జీటీఏ సంఘంతో కలిసి సీఎంకు వినతిపత్రం అందజేశామని గుర్తు చేశారు. సీఎస్ రామకృష్ణారావును గురువారం కలిసి పనివేళల మార్పులపై విజ్ఞప్తి చేశామన్నారు. త్వరలోనే ఉత్తర్వులు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని సీఎస్ హామీ ఇచ్చినట్టు తెలిపారు. సీఎస్‌ను కలిసిన వారిలో పీఆర్‌జీటీఏ అధ్యక్షుడు వేంరెడ్డి దిలీప్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ రమేష్ గౌడ్, రాష్ట్ర బాధ్యులు ఉప్పు అశోక్, నిర్మలానందం, విజయకుమార్, శ్రీనివాసరెడ్డి ఉన్నారు.

క్లుప్తంగా...

ఒకరికి తెలియకుండా ఒకరు ఫోన్లు ట్యాప్ చేశారేమో

కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్



సాక్షి, హైదరాబాద్: కేసీఆర్‌కు తెలియకుండా ఆయన ఫోన్‌ను కేటీఆర్ ట్యాప్ చేసి ఉండొచ్చునని, అదే విధంగా కేటీఆర్‌కు తెలియకుండా ఆయన ఫోన్‌ను కేసీఆర్ కూడా ట్యాపింగ్ చేసి ఉండొచ్చునని కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ఆరోపించారు. గురువారం సీఎల్పీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, అధికారం కోసం సొంత కూతురి ఫోన్‌ను కూడా ట్యాప్ చేయించిన నీచమైన చరిత్ర గత పాలకులదని అన్నారు. ఫోన్ ట్యాపింగ్‌తో తప్పుడు పనులు చేయించిన వాళ్లను కవిత చెప్పుతో కొట్టి తర్వాత ఇతరులపై విమర్శలు చేస్తే బాగుంటుందని హితవు పలికారు. ఫోన్ ట్యాపింగ్‌తో ఎంతో మంది జీవితాలతో చెలగాటం ఆడారని అన్నారు. రాజకీయ నాయకులతో పాటు వారి కుటుంబ సభ్యుల ఫోన్లు ట్యాప్ చేసి, వ్యక్తిగత సంభాషణలు వినడం హేయమైన చర్య అని ఆయన ధ్వజమెత్తారు. తన ఫోన్‌తో పాటు తన కుటుంబ సభ్యులు, అనుచరుల ఫోన్లు కూడా ట్యాప్ చేశారన్నారు. ఇదిలా ఉండగా పుణే మెట్రో విస్తరణకు ఆమోదం తెలిపిన కేంద్రం, హైదరాబాద్ మెట్రో విస్తరణకు ఎందుకు ఆమోదం తెలపలేదని బల్మూరి ప్రశ్నించారు. తెలంగాణపై కేంద్రం వివక్ష చూపుతోందని ఆయన విమర్శించారు.

ఉద్యోగుల జీతాలు సర్కారు అవసరాలకు

మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్



సాక్షి, హైదరాబాద్ : ఉద్యోగుల వేతనం నుంచి ప్రతీ నెలా చెల్లించాల్సిన కంట్రిబ్యూటరీ పెన్షన్‌కు సంబంధించిన నిధులను ప్రభుత్వం సొంత అవసరాలకు వాడుకుంటోందని మాజీమంత్రి వి.శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. రెండున్నర లక్షల సీపీఎస్ ఉద్యోగుల వేతనం నుంచి నెలకు రూ.100 కోట్ల చొప్పున సుమారు రూ.1,300 కోట్లు ప్రభుత్వ ఉద్యోగుల ఖాతాలో వేయడం లేదన్నారు. పదివేల మంది రిటైర్డ్ ఉద్యోగులకు ప్రభుత్వం సుమారు రూ.4వేల కోట్లు బాకీ పడిందన్నారు. పార్టీ నేతలు, ఉద్యోగ సంఘాల మాజీ నాయకులు దేవీప్రసాద్, పాతూరు సుధాకర్‌రెడ్డి, సుమిత్రా నంద్, భుజంగరావు, హమీద్‌తో కలిసి శ్రీనివాస్ గౌడ్ గురువారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వం ఇటీవల ఉద్యోగుల సమస్యల పరిష్కారం దిశగా ఇచ్చిన హామీలేవీ అమలు కావడం లేదని ఫిర్యాదులు అందుతున్నట్లు దేవీప్రసాద్ వెల్లడించారు. రేవంత్ ప్రభుత్వం రాష్ట్రంలో విద్యారంగాన్ని కూనీ చేస్తోందని మాజీ ఎమ్మెల్సీ పాతూరు సుధాకర్‌రెడ్డి విమర్శించారు.

ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం అవినీతిపై సీబీఐ విచారణ జరగాలి

మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో గత ప్రభుత్వ హయాంలో జరిగిన అనేక అవినీతి అక్రమాలపై కేంద్రం చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉందని బీజేపీ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ వెల్లడించారు. ముఖ్యంగా ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం, కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై సీబీఐ విచారణ కోసం సమయం వచ్చినప్పుడు కేంద్రమే ఆదేశాలు జారీ చేస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఢిల్లీలోని తెలంగాణభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ, గత పదేళ్లలో కేసీఆర్ పాలనలో ఎన్నో అక్రమాలు, అవినీతి కుంభకోణాలు జరిగాయని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వ దర్యాప్తు సంస్థలు నిజమైన సమాచారం రాబట్టడంలో విఫలమవుతున్నాయని ఆయన ఆరోపించారు. గత ప్రభుత్వ కాలంలో అనేకమంది రాజకీయ నాయకుల, న్యాయమూర్తుల, సినీ ప్రముఖుల ఫోన్లను ట్యాప్ చేశారని... ఇది వ్యక్తిగత గోప్యతను ఉల్లంఘించే చర్య అని ప్రభాకర్ మండిపడ్డారు. ఈ వ్యవహారంపై సీబీఐ ద్వారా పూర్తి స్థాయిలో విచారణ జరగాలని ఆయన డిమాండ్ చేశారు.

రిజర్వేషన్ల అమలు తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలి

దాసు సురేశ్ డిమాండ్




సాక్షి, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు, తమ ప్రాధాన్యత కలిగిన అంశాలపై పదేసిసార్లు ప్రధాన మంత్రిని కలిసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. బీసీల రిజర్వేషన్ పెంపుపై ఒక్కసారి కూడా ప్రస్తావించకపోవడం దారుణమని బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేశ్ ధ్వజమెత్తారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం బీసీల 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. గురువారం తెలంగాణ సచివాలయ మీడియా పాయింట్ బయట ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర హైకోర్టు తీర్పును అనుసరించి రాబోయే నెలరోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని కోరారు. రిజర్వేషన్లు అమలు చేస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం 18 నెలలుగా కాలయాపన చేస్తుందే తప్ప.. అందుకు రాజ్యాంగ సవరణకు పూనుకోకపోవడం విచారకరమన్నారు.


డేంజర్‌లో మంజీర!

మేడిగడ్డ తరహాలో కొట్టుకుపోయిన బరాజ్ అప్రాన్

- తేల్చిన స్టేట్ డ్యామ్ సేఫ్టీ ఆర్గనైజేషన్ నివేదిక
- మరమ్మతులు లేక దెబ్బతిన్న గేట్లు, మట్టి కట్టలు
- డ్యామ్ పూర్తిగా దెబ్బతిన్నట్టు కనిపిస్తోందన్న నిపుణులు
- సీడబ్ల్యూపీఆర్ఎస్ అధ్యయనానికి సిఫారసు



దెబ్బతిన్న అప్రాన్



పియర్లకు పగుళ్లు

సాక్షి, హైదరాబాద్: 'హైదరాబాద్ నగరంతో పాటు పరిసర ప్రాంతాలకు రోజూ 100 మిలియన్ గ్యాలన్ల తాగునీటిని సరఫరా చేసే మంజీర బరాజ్ తీవ్ర ప్రమాదంలో ఉంది. మేడిగడ్డ బరాజ్ తరహాలో..మంజీర బరాజ్ నుంచి విడుదలైన వరద ఉధృతికి డ్యామ్ దిగువన రక్షణగా ఏర్పాటు చేసిన అప్రాన్ కొట్టుకుపోయింది. అప్రాన్‌కి సంబంధించిన కాంక్రీట్ కొట్టుకుపోవడంతో బరాజ్ దిగువన భారీ గుంతలు ఏర్పడ్డాయి. మిగిలి ఉన్న అప్రాన్ భాగం సైతం ఎప్పుడైనా కొట్టుకుపోవచ్చు అన్నట్టు బలహీనంగా ఉంది. అడ్డగోలుగా తుమ్మ చెట్లు పెరిగిపోవడంతో బరాజ్ మట్టి కట్టలు బలహీనమయ్యాయి. ఏళ్ల తరబడిగా మరమ్మతులు లేకపోవడంతో గేట్లతో పాటు స్పిల్‌వేలోని కొంత భాగం కూడా దెబ్బతింది. బరాజ్‌కు తక్షణమే మరమ్మతులు నిర్వహించకపోతే భవిష్యత్తులో తీవ్ర ముప్పును ఎదుర్కోవాల్సి ఉంటుంది..' అని రాష్ట్ర నీటిపారుదల శాఖలోని స్టేట్ డ్యామ్ సేఫ్టీ ఆర్గనైజేషన్ (ఎస్డీఎస్ఓ) తేల్చి చెప్పింది. నేషనల్ డ్యామ్ సేఫ్టీ యాక్ట్–2021 ప్రకారం ఏర్పాటైన ఎస్డీఎస్ఓ ఆధ్వర్యంలోని నిపుణుల బృందం గత మార్చి 22న బరాజ్‌ను పరిశీలించి ఈ మేరకు ఓ నివేదికను సమర్పించింది.

కాళేశ్వరం బరాజ్‌ల తరహాలో..

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లకు దిగువన రక్షణగా ఉన్న అప్రాన్ వరద ధాటికి కొట్టుకుపోగా, ఆ తర్వాత కాలంలో మేడిగడ్డ బరాజ్ కుంగిపోయింది. మిగిలిన రెండు బరాజ్‌లు కూడా తీవ్రంగా దెబ్బతిన్నాయి. అదే తరహాలో మంజీర బరాజ్ అప్రాన్ సైతం కొట్టుకుపోవడం ఆందోళన కలిగిస్తోంది. 'మంజీర బరాజ్ నుంచి విడుదలయ్యే వరద ఉధృతి దిగువ భాగంలో నిరంతరం బరాజ్‌కు నష్టం కలిగించనుంది. ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయాలి. లేనిపక్షంలో కోత క్రమంగా డ్యామ్ వరకు విస్తరించి దాని భద్రతకే ముప్పుగా పరిణమించనుంది..' అని నివేదికలో ఎస్డీఎస్ఓ పేర్కొంది.

బరాజ్ పియర్లకు పగుళ్లు..

మంజీర బరాజ్ పియర్లు దూరం నుంచి దృఢంగానే కనిపిస్తుండగా, సూక్ష్మంగా పరిశీలించి చూస్తే వాటికి పగుళ్లు వచ్చినట్టు ఎస్డీఎస్ఓ పరిశీలనలో బయటపడింది. తట్టుకునే సామర్థ్యానికి మించిన వరద ఒత్తిడిని ఎదుర్కోవాల్సిరావడంతోనే ఈ పగుళ్లు వచ్చాయని తేల్చింది. మంజీర రాతి ఆనకట్ట కావడంతో స్టీల్, కాంక్రీట్‌తో నిర్మించిన ఆనకట్టలకు ఉండే దృఢత్వం ఉండదని అభిప్రాయపడింది. బరాజ్ తీవ్రంగా దెబ్బతిన్నట్టు కనిపిస్తోంది అని అభిప్రాయపడింది. తాగునీటి అవసరాల కోసం మంజీర బరాజ్‌లో ఏడాది పొడవునా నీళ్లను నిల్వ చేసి ఉంచుతుండడంతో తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటోందని నిపుణులు అభిప్రాయపడ్డారు. సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్(సీడబ్ల్యూపీఆర్ఎస్) ఆధ్వర్యంలో బరాజ్‌ను పటిష్టపరిచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధ్యయనం జరిపించాలని సిఫారసు చేసింది. అత్యవసర కార్యాచరణ ప్రణాళిక, విపత్తుల నిర్వహణ ప్రణాళిక, బరాజ్‌తో ఉండనున్న ముప్పుపై అధ్యయనం, బరాజ్ భద్రతపై సమగ్ర అధ్యయనాన్ని సీడబ్ల్యూపీఆర్ఎస్‌తో జరిపించాలని కోరింది.

మట్టికట్టలపై అడవిలా తుమ్మ చెట్లు

బరాజ్ మట్టికట్టలపై పెద్ద మొత్తంలో తుమ్మ చెట్లు పెరిగి వాటి దృఢత్వాన్ని బలహీనపరుస్తున్నాయని ఎస్డీఎస్ఓ తేల్చింది. అడవి తరహాలో తుమ్మ చెట్లు పెరిగిపోవడంతో 1.5 కి.మీ మేర కట్టలను పరిశీలించకపోయినట్టు పేర్కొంది. తుమ్మ చెట్లతో డ్యామ్ రివర్‌మెంట్ దెబ్బతినే ప్రమాదం ఉందని తెలిపింది.

జూరాల భద్రమేనా?

మొదటి పేజీ తరువాయి

చేయడం ద్వారా దిగువకు నీరు విడుదల చేసేలా సులభతరమైన విధానంలో మొత్తం 62 గేట్లను అర్ధ చంద్రాకారంల్లో ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. వీటిని పైకి, కిందికి ఆపరేట్ చేసేందుకు గేట్లకు ఇరువైపులా రెండు రబ్బర్ సీళ్లు (రాపిడికి గురికాకుండా రక్షణ ఇచ్చేది), అడుగుభాగాన ఒక రబ్బర్ సీల్‌తో పాటు గేటుకు ఇరువైపులా రెండు, కింది భాగాన రెండు ఇనుప రోప్‌లు అమర్చారు. వీటి సాయంతోనే రేడియల్ క్రస్ట్ గేట్లను అవసరమైనప్పుడు పైకెత్తడం, దించడం జరుగుతుంది. అవసరమైనప్పుడు నీటిని విడుదల చేయడం.. లేనిపక్షంలో నిలిపివేయడంలో ఇవి కీలకం. అలాంటి ఎనిమిది గేట్ల ఇనుప రోప్‌లు, 18 గేట్ల రబ్బర్ సీళ్లు దెబ్బతినడంతో లీకేజీలు ఏర్పడ్డాయి.

40 ఏళ్ల తర్వాత తొలిసారిగా..

జూరాల ప్రాజెక్టు చరిత్రలో 40 ఏళ్ల తర్వాత తొలిసారిగా అన్ని గేట్లకు సంబంధించి పూర్తిస్థాయిలో మరమ్మతులు చేసేందుకు సుమారు నాలుగేళ్ల క్రితం గత ప్రభుత్వం రూ.11 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో రబ్బర్ సీళ్లు, రోప్‌లు, శాండ్ బ్లాస్టింగ్, గేట్ల బలోపేత, బకెట్ నిర్మాణాల మరమ్మతులు, పెయింటింగ్ పనులు చేపట్టాలి. హైదరాబాద్‌కు చెందిన స్వప్న కన్‌స్ట్రక్షన్ కంపెనీ పనులు దక్కించుకుంది. ఏడాది కాలపరిమితిలో పూర్తిచేసేలా ఒప్పందం కుదిరింది. ఏడాది గడువు ముగిసింది. మరోసారి పొడిగించారు. అయినా.. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో సగం శాతం పనులు కూడా పూర్తి కాని పరిస్థితి ఉంది. ప్రాజెక్టు పైభాగాన ఉన్న హయిస్ట్ బ్రిడ్జ్ గేట్ల వద్ద వాక్‌వే బ్రిడ్జికి సంబంధించి శాండ్ బ్లాస్టింగ్ పనులు పూర్తికాగా.. మిగిలిన పనులు కొనసాగుతూనే ఉన్నాయి.

తాజాగా వరద వదలడంతో..

తాజాగా గురువారం సాయంత్రం ఆరు గంటల సమయంలో 98 వేల క్యూసెక్కుల నీరు వస్తుండగా.. ప్రాజెక్టు 12 గేట్లను ఎత్తి దిగువకు వదిలారు. అయితే గురువారం ప్రాజెక్టు నాలుగో గేట్ ఇనుప రోప్ తెగిపోయి కన్పించింది. దీంతో ఆ గేట్ ఎత్తలేని పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో ప్రాజెక్టు మరమ్మతుల్లో జాప్యం, భద్రత తదితర అంశాలు ఉమ్మడి జిల్లాలో చర్చనీయాంశంగా మారాయి. 2009 మాదిరి జూరాలకు భారీ వరద వస్తే దెబ్బతిన్న గేట్లు కొట్టుకుపోయే ప్రమాదం ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది.



ప్రాజెక్టులోని 8-9 పిల్లర్ మధ్య ఉన్న 4వ గేటులోని తెగిన ఇనుప రోపు

ఇదీ ప్రాజెక్టు స్వరూపం..

జూరాల ప్రాజెక్టును 1981లో రూ.550 కోట్లతో నిర్మించారు. దీని పొడవు కిలోమీటర్, ఎత్తు 27.80 మీటర్లు. మొత్తం రాతికట్టడమే. ప్రాజెక్ట్‌కు ఆనుకుని ఎడమ వైపున 1.74 కి.మీలు, కుడివైపున 1.84 కి.మీల మేర ఎర్త్‌డ్యాం నిర్మించారు. మొత్తం 62 రేడియల్ క్రస్ట్ గేట్లు, 84 బ్లాకులతో నిర్మాణం చేశారు. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా.. దీని కింద 1.20 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది.

అధికారులది పాత పాటే..

జూరాల ప్రాజెక్టు మరమ్మతుల్లో జాప్యం, భద్రతపై నెలకొన్న అనుమానాల నేపథ్యంలో 'సాక్షి'లో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. తాజాగా నాలుగో గేట్ రోప్ తెగిన నేపథ్యంలో ప్రాజెక్టు అధికారులతో పాటు గద్వాల జిల్లా ఇరిగేషన్ అధికారులను సంప్రదించగా.. గతంలో చెప్పిన సమాధానాలే చెప్పారు. 'రాష్ట్ర వ్యాప్తంగా ప్రాజెక్టు మెకానికల్ పనులు చేసే ప్రైవేట్ ఏజెన్సీలు తక్కువగా ఉన్నాయి. ఈ కారణంగా నాలుగేళ్ల కిందట జూరాల మరమ్మతులకు నిధులు మంజూరు అయినప్పటికీ .. కాంట్రాక్టు ఏజెన్సీ పనులు పూర్తి చేయడంలో తీవ్ర జాప్యం ఏర్పడింది. ప్రాజెక్టుకు పది లక్షల క్యూసెక్కుల వరద వచ్చినా ప్రమాదమేం లేదు..' అని చెప్పారు. అయితే మరమ్మతులు ఎప్పటికి పూర్తవుతాయో చెప్పలేకపోవడం విమర్శలకు తావిస్తోంది.

ముందస్తు వరదతో పనులకు ఆటంకం

జూరాల ప్రాజెక్టు గేట్లు, రోప్‌లకు సంబంధించి మరమ్మతు పనులు కొనసాగుతున్నాయి. ఈసారి అన్ని రకాల సమస్యలను అధిగమించి మెకానికల్ పనులను వేగవంతంగా చేపట్టాలనుకున్నాం. అయితే ముందస్తుగా వరద రావడం ఆటంకంగా మారింది. అయితే ప్రస్తుతం ప్రాజెక్టుకు వచ్చిన ముప్పు ఏమీ లేదు. రేడియల్ క్రస్ట్ గేట్లు కావడంతో ఎంత పెద్ద వరద వచ్చినా కొట్టుకుపోయే అవకాశం లేదు.

– రహీముద్దీన్, సాగునీటి పారుదల శాఖ ఎస్ఈ, జోగుళాంబ గద్వాల

చర్యలు కాదు.. సమస్యల పరిష్కారమే ముఖ్యం

- అందరినీ పిలిపించి మాట్లాడదాం.. కూర్చోబెట్టి సర్ది చెబుదాం
- టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ యోచన.. మల్లురవి అధ్యక్షతన భేటీ
- ఆయా నియోజకవర్గాల్లో ఇరువర్గాలను పిలిపించి మందలించాలని నిర్ణయం
- అప్పటికీ మార్పు రాకపోతే మాత్రం కఠిన చర్యలకు సిఫారసు
- రేపు మరోమారు సమావేశమై తుది నిర్ణయాలు ప్రకటించే చాన్స్

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీలోని నేతల మధ్య వ్యక్తిగతంగా, సంస్థాగతంగా ఉన్న సమస్యలను పరిష్కరించే దిశగా పనిచేయాలని టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ యోచిస్తోంది. పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం పాళ్లు ఎక్కువగా ఉండే నేపథ్యంలో నియోజకవర్గాల్లోని నేతల మధ్య విభేదాలు సహజంగా వస్తుంటాయని, అంతమాత్రాన చర్యలకు ఉపక్రమించడం మంచిది కాదనే అభిప్రాయంతో కమిటీ నేతలున్నట్టు తెలుస్తోంది. ఈ మేరకు ప్రస్తుతం సమస్యలున్న ప్రాంతాలు, నియోజకవర్గాలకు సంబంధించిన నాయకులను పిలిపించి మందలించాలని నిర్ణయించినట్టు తెలుస్తోంది. అప్పటికీ వినకపోతే, నాయకుల వైఖరిలో మార్పు రాకపోతే కఠిన చర్యలకు సిఫారసు చేయాలనే అభిప్రాయంతో కమిటీ ఉందని సమాచారం. చైర్మన్ మల్లురవి అధ్యక్షతన గురువారం గాంధీభవన్‌లో టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ సమావేశమైంది. సభ్యులు శ్యాంమోహన్, కమలాకర్‌రావు, జాఫర్‌జావేద్ తదితరులు ఈ భేటీకి హాజరై కమిటీ ముందున్న ఫిర్యాదులపై మరోమారు చర్చించారు. సమావేశానికంటే ముందు మల్లురవి సీఎం రేవంత్‌రెడ్డిని జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో కలిశారు. కమిటీ ముందున్న ఫిర్యాదులు, తీసుకోవాల్సిన చర్యలపై సీఎంతో కొంతసేపు మాట్లాడారని, ఈ సందర్భంగా పార్టీ ఆలోచన, ఇన్‌చార్జ్ మీనాక్షి అభిప్రాయాలను మల్లు రవికి రేవంత్ వివరించారని సమాచారం. అనంతరం గాంధీభవన్‌లో జరిగిన సమావేశంలో ఫిర్యాదులపై చర్చించిన కమిటీ.. శనివారం మరోమారు సమావేశం కావాలని నిర్ణయించింది. ఈ సమావేశంలో ఇప్పటివరకు అన్ని ఫిర్యాదుల పరిష్కారం కోసం మార్గదర్శకాలను ప్రకటించనుంది. ప్రతి నియోజకవర్గంలో పటాన్‌చెరు తరహాలో ద్విసభ్య కమిటీలను వేయాలని, ఈ కమిటీలు అందరితో మాట్లాడి ఇచ్చే నివేదికల ఆధారంగా చర్యలకు నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించినట్టు సమాచారం.

ఎల్లుండి చెబుతాం: మల్లు రవి



సమావేశానంతరం గాంధీభవన్‌లో క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి మీడియాతో మాట్లాడారు. పార్టీలో ఉన్న సమస్యల పరిష్కారానికి విధివిధానాలను ఖరారు చేయడంపై చర్చించామని తెలిపారు. వరంగల్ జిల్లా నేతల వివాదంపై కూడా శనివారమే మాట్లాడుతామని వెల్లడించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత కంటే పెద్ద అవినీతిపరురాలు ఎవరని ఆయన ప్రశ్నించారు. ఆమె అవినీతి కారణంగానే ఆమ్‌ఆద్మీ, బీఆర్ఎస్‌లు ఖతమయ్యాయని వ్యాఖ్యానించారు. ఆమ్‌ఆద్మీ పార్టీ ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రిని జైలుకు పంపిన కవితకు నీతులు చెప్పే అర్హత లేదని మల్లురవి అన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే జూరాల ప్రమాదం

- స్పిల్ వే నిర్వహణలో రేవంత్ సర్కారు నిర్లిప్తత
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపాటు



సాక్షి, హైదరాబాద్: జూరాల ప్రాజెక్టులోని 9వ నంబర్ గేట్ రోప్ తెగిపోవడం కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు విమర్శించారు. ఒక్క ఇటుక పేర్చడం కూడా చేతకాని ముఖ్యమంత్రికి కనీసం ఉన్న ప్రాజెక్టుల నిర్వహణ చేతకావడం లేదని గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో మండిపడ్డారు. నిర్వహణ లోపం వల్లే జూరాల ప్రాజెక్టు ప్రమాదంలో పడిందని అన్నారు. ఏటా వరద వస్తుందని తెలిసినా స్పిల్ వే వద్ద నిర్వహణ పనులు చేయించడంలో రేవంత్ ప్రభుత్వం నిర్లిప్తంగా వ్యవహరించిందని ధ్వజమెత్తారు. జూరాలకు క్రమంగా వరద ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి, మంత్రులు ఇప్పటికైనా నా మొద్దునిద్ర వీడి దిద్దుబాటు చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రభుత్వ అసమర్థత మూలంగా ఇప్పటికే శ్రీశైలం ఎడమగట్టు కాలువ సొరంగం కూలి ఎనిమిది ప్రాణాలు కోల్పోయారని, పెద్దవాగుకు గండిపడి 16 గ్రామాలు ముంపునకు గురవగా, వట్టెం పంప్ హౌజ్ మునిగిపోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సుంకిశాల రిటెయినింగ్ వాల్ కూలి రూ.వందల కోట్ల నష్టం జరిగిందని గుర్తుచేశారు. తాజాగా జూరాల 9వ నంబర్ గేట్ రోప్ తెగిపోవడంతోపాటు ఇతర గేట్ల రోప్‌లు కూడా బలహీనంగా ఉండటం ప్రాజెక్టును ప్రమాదంలోకి నెట్టిందని ఆందోళన వ్యక్తంచేశారు. దిగువ ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసి ప్రాజెక్టుకు నష్టం వాటిల్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

సెబీ నిబంధనలకు విరుద్ధంగా 'కంచె' భూముల తాకట్టు

మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శ



సాక్షి, హైదరాబాద్: నిబంధనలను ఉల్లంఘిస్తూ కంచెగచ్చిబౌలి భూములను తాకట్టు పెట్టి రుణాలు సమీకరించడం సెబీ నిబంధనలకు విరుద్ధమని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. ఈ మేరకు గురువారం సెబీ (స్టాక్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా) చైర్మన్‌కు పూర్తి వివరాలు, ఆధారాలతో ఫిర్యాదు చేస్తూ హరీశ్‌రావు లేఖ రాశారు. కంచెగచ్చిబౌలిలోని 400 ఎకరాల భూమి తాకట్టు పెట్టి టీజీఐఐసీ ద్వారా రూ.10 వేల కోట్లు అప్పుగా తీసుకోవడంలో జరిగిన అవకతవకలను లేఖలో ఎండగట్టారు. 'సుప్రీం కోర్టు నియమించిన ప్రత్యేక కమిటీ తాకట్టు పెట్టిన భూమిని అటవీ భూమిగా గుర్తించడంతో పాటు అటవీ ప్రాంతాన్ని ధ్వంసం చేసిన అధికారులను జైలుకు పంపుతామని పేర్కొంది. టీజీఐఐసీ వార్షిక ఆదాయం రూ.150 కోట్లు కన్నా తక్కువగా ఉన్నా రూ.వేల కోట్ల అప్పులు తీసుకోవడం ఆర్థిక అవకతవకలకు పాల్పడటమే. ప్రైవేట్ కంపెనీగా ఉన్న టీజీఐఐసీని పబ్లిక్ కంపెనీగా మార్చడంలో పారదర్శకత లోపించడంతో పాటు సెబీ నియమ నిబంధనలు పాటించారన్న విషయంలోనూ స్పష్టత లేదు. ఈ వ్యవహారంపై పూర్తిస్థాయి విచారణ జరిపి ఆర్థిక అవకతవకలను బయటపెట్టాలి' అని హరీశ్‌రావు లేఖలో విజ్ఞప్తి చేశారు.

నాడు డబ్బులుండీ.. రైతుబంధు వేయలేదు

బీఆర్ఎస్‌పై జగ్గారెడ్డి ధ్వజం

- మేము అప్పులు కడుతూ రైతు భరోసా ఒకేసారి చెల్లించాం
- ఈ మూడేళ్లు రేవంత్ సీఎంగా ఉంటారు... తర్వాత ఐదేళ్లు సీఎం కోసం ఆయన ప్రయత్నిస్తారు
- సీఎం కావాలని నేనూ ప్రయత్నిస్తా...



సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు డబ్బులు అందుబాటులో ఉండి కూడా నెలల తరబడి రైతుబంధు వేయకుండా జాప్యం చేశారని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి.జగ్గారెడ్డి ధ్వజమెత్తారు. ఈ ప్రక్రియను జనవరిలో మొదలు పెట్టి ఐదు నెలలు చేసేవారన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక నాటి ప్రభుత్వం చేసిన అప్పులు కడుతూనే ఒకేసారి రైతుభరోసా నిధులను రైతుల ఖాతాల్లో జమ చేశామని చెప్పారు. జగ్గారెడ్డి గురువారం గాంధీభవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. 'హోటల్‌లో భోజనం వడ్డించినట్టు ముందుగా గ్లాసు పెట్టి, తర్వాత ప్లేటు పెట్టి, తర్వాత గ్లాసులో నీళ్లు పోసి, ఆ తర్వాత ప్లేటులో కూరలు వేసి చివరిగా అన్నం పెట్టినట్టు బీఆర్ఎస్ హయాంలో రైతుబంధు వేసేవారు. కానీ, రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మాత్రం ప్లేటు, నీళ్లు, గ్లాసు, అన్నం, కూరలు అన్నీ ఒకేసారి పెట్టి రైతులు కడుపు నిండా తినేలా ఒకేసారి తొమ్మిది రోజుల్లో రూ.9వేల కోట్లు వారి ఖాతాల్లో జమ చేసింది' అని చెప్పారు. బీఆర్ఎస్ మాజీ మంత్రి హరీశ్‌రావు కడుపుబ్బరంతో విమర్శలు చేస్తున్నారని, కవిత మాటలు దెయ్యాలు వేదాలు వల్లించినట్టుందని ఎద్దేవా చేశారు. కేసీఆర్‌కు వారసుడు కొడుకే అవుతాడని, కూతురు కాదని వ్యాఖ్యానించారు. కవితకు కేసీఆర్ కూతురు అనే అర్హతతోనే పెద్దపెద్ద మాటలు మాట్లాడుతోంది తప్ప ప్రజలకు చేసిందేమీ లేదని మండిపడ్డారు. కేసీఆర్ కుటుంబం పరిస్థితి డ్రామా కంపెనీలాగా అయిందని చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో తనతోపాటు కార్యకర్తలు, సన్నిహితుల ఫోన్లు కూడా ట్యాప్ చేశారని, భార్యతో మాట్లాడేది కూడా రికార్డు చేశారని పేర్కొన్నారు.

రేవంత్ మళ్లీ దరఖాస్తు పెట్టుకున్నారు

'ఇప్పుడు సీఎంగా రేవంత్‌రెడ్డి ఉన్నారు. మరో మూడేళ్లు ఆయనే ఉంటారు. ఆ తర్వాత ఐదేళ్లు కూడా ఆయనే ఉండాలని ప్రయత్నం చేస్తున్నారు. అందుకోసం మొన్న గాంధీభవన్‌లో జరిగిన సమావేశంలో ప్రజల ముందు దరఖాస్తు పెట్టుకున్నారు. ఈ పదేళ్లు అధికార బాధ్యతలు చూసుకుంటానని ప్రజలను అడిగారు. ఈలోపు నా దరఖాస్తు కూడా వస్తుంది. నేను కూడా సీఎం అయ్యేందుకు ప్రయత్నిస్తా. మావాళ్లు కూడా కొంత మంది ప్రయత్నించే వాళ్లున్నారు. నిత్యం ప్రజలకు సేవ చేసే మా పార్టీ నేతలే ఇంత మంది ఉంటే ఇంక బీఆర్ఎస్‌కు అవకాశం ఎప్పుడు వస్తుంది' అని జగ్గారెడ్డి వ్యాఖ్యానించారు.

ఇరిగేషన్ ఈఎన్‌సీ (అడ్మిన్)గా శంకర్

సాక్షి, హైదరాబాద్: నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ (అడ్మిన్)గా కరీంనగర్ ఇన్‌చార్జి ఈఎన్‌సీ బి.శంకర్‌కు ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించింది. ఈ మేరకు శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా ఉత్తర్వులు జారీ చేశారు. హైదరాబాద్ సీఈగా ఎండీ మొయిజుద్దీన్ సాదిక్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుతం ఆయన నీటిపారుదల శాఖ కార్యదర్శి కార్యాలయంలో ఎస్ఈ (టెక్నికల్)గా పనిచేస్తున్నారు. కార్యదర్శి కార్యాలయంలో డీఈఈ (టెక్నికల్)గా ఉన్న మహేశ్వర్ రెడ్డికి అదే కార్యాలయంలో ఈఈ (డీడీఎం)గా అదనపు బాధ్యతలు అప్పగించారు.

అవినీతి చక్రవర్తి రేవంత్

- కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతిపై పుస్తకాలు ప్రచురించి పంచుతాం
- చంద్రబాబుతో రేవంత్ భేటీ తర్వాతే బనకచర్ల లింక్ తెరపైకి : ఎమ్మెల్సీ కవిత



సాక్షి, హైదరాబాద్: అవినీతి చక్రవర్తిలా మారిన సీఎం రేవంత్‌రెడ్డితో పాటు కాంగ్రెస్ ప్రభుత్వ అవి నీతిపై త్వరలో పుస్తకాలు ప్రచురించి రాష్ట్ర మంతటా పంపిణీ చేస్తామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రకటించారు. కేవలం ఏడాదిన్నరలోనే రూ.2 లక్షల కోట్ల అప్పులు తెచ్చి కాంట్రాక్టర్లకు బిల్లులు ఇచ్చి రేవంత్‌రెడ్డి కమీషన్లు మెక్కాడన్నా రు. కాంగ్రెస్ సర్కారు తెచ్చిన అప్పులపై శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ పాలనలో క్రమశిక్షణతో రుణాలు తిరిగి చెల్లించడం ద్వారా 'ఏ గ్రేడ్' సాధించిన తెలంగాణ రేవంత్ పాలనలో 'డిఫాల్ట్ స్టేట్'స్థితికి దిగజారిందని మండిపడ్డారు. గురువారం ఉదయం తన నివాసంలో కవిత మీడియాతో మాట్లాడారు. 'రాష్ట్రంలో ఇరిగేషన్ ప్రాజెక్టుల కోసం రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ (ఆర్ఈసీ) నుంచి తెచ్చిన రుణాలను రేవంత్ ప్రభుత్వం సరైన సమయానికి తిరిగి చెల్లించకుండా డిఫాల్ట్ స్టేజీకి రాష్ట్రాన్ని తీసుకొచ్చారనేందుకు ఆర్ఈసీ రాసిన లేఖనే సాక్ష్యం. కేసీఆర్ ప్రభుత్వం చేసిన అప్పులు తిరిగి చెల్లించేందుకు తిరిగి అప్పులు చేస్తున్నామని సీఎం, మంత్రులు చెప్పేవన్నీ శుద్ధ అబద్ధాలని ఆర్ఈసీ లేఖతో తేలిపోయింది' అని కవిత పేర్కొన్నారు. రూ.1,320 కోట్లను ఈ నెల 28వ తేదీలోపు ప్రభుత్వం చెల్లించని పక్షంలో దివాలా తీసినట్టుగా పరిగణించాల్సి వస్తుందని ఆర్ఈసీ హెచ్చరించిందని కవిత వెల్లడించారు.

మళ్లీ మొబిలైజేషన్ అడ్వాన్సుల సంస్కృతి

'కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మొబిలై జేషన్ అడ్వాన్సుల సంస్కృతి మొదలు పెట్టింది. కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు కోసం మేఘా ఇంజనీరింగ్ సంస్థకు రూ.600 కోట్లు, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌కు మరో రూ.600 కోట్లు అడ్వాన్సు చెల్లించారు. చెంచా మట్టి కూడా తీయకుండా ఒక్క ప్రాజెక్టుకే రూ.1,200 కోట్ల ముందస్తు చెల్లింపులు చేయడంలో ఆంతర్యమేమిటో చెప్పాలి. 2024 జూలై 6వ తేదీన ప్రజాభవన్‌లో రేవంత్‌రెడ్డితో సమావేశమైన తర్వాతే చంద్రబాబు పోలవరం–బనకచర్ల లింక్ ప్రాజెక్టును తెరపైకి తెచ్చారు. 2016లో పోలవరం నుంచి బనకచర్ల లింక్ అనే ప్రాజెక్టు ప్రస్తావన మొదలైందని రేవంత్ తప్పుడు ప్రచారంతో కేసీఆర్‌పై బురద చల్లాలని చూస్తున్నారు. మేఘా ఇంజనీరింగ్ సంస్థకు లాభం చేయడానికే బనకచర్ల ప్రాజెక్టు చేపడుతున్నారు. చంద్రబాబుకు రేవంత్‌రెడ్డి హైదరాబాద్ బిర్యానీ తినిపించి గోదావరి నీళ్లను గిఫ్ట్ ప్యాక్‌గా ఇచ్చారు' అని ఎమ్మెల్సీ కవిత మండిపడ్డారు.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
శుక్రవారం ॥ 27-6-2025

ఫ్యాషన్

బాలీవుడ్‌ని సినిమాల గురించి మాత్రమే కాదు, నవతరం బ్యూటీలు చేస్తున్న బోల్డ్ ఫ్యాషన్ ప్రోగ్రెస్ గురించి కూడా మాట్లాడుకోవాలి. ఈ యువ నటీమణులు తమ సినిమా పాత్రలతోనే కాదు ఫ్యాషన్‌లో ఇంటర్నేషనల్ స్టైల్‌ను కూడా నిర్దేశిస్తున్నారు. ప్రపంచంలోని కొన్ని అగ్రశ్రేణి లగ్జరీ బ్రాండ్‌లతో జత కట్టి, ప్రపంచ ఫ్యాషన్ రంగంలో తమకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని ఏర్పరుచుకుంటున్నారు.

నేషనల్ కాదు ఇంటర్నేషనల్



అనన్య పాండే

మిడి స్టైలింగ్‌పై అనన్య పాండే ఆలోచన ప్రపంచ ఫ్యాషన్ సెన్సిబిలిటీలపై ఆమెకున్న పట్టును ప్రదర్శిస్తుంది. లగ్జరీ బ్రాండ్ చానెల్ మ్యూజ్ స్కర్ట్, జాకెట్ రెండూ ఆమెను హై-ఫ్యాషన్‌తో ఆకట్టుకునేలా మార్చాయి. మెరిసే, స్ట్రాపీ హీల్స్‌తో లుక్‌ను పూర్తి చేసింది.



ఖుషీ కపూర్

ఖుషీ కపూర్ బాలీవుడ్ ఫ్యాషన్‌లో మరో వర్ధమాన తార. ఆమె ఫ్యాషన్‌లో చేసే ప్రయోగాలు విరివిగా మనకు కనిపిస్తుంటాయి. ఆమె తాజా ఎంపిక డియోర్ బార్బీకోర్ పింక్ కలర్ స్కర్ట్ సూట్. డ్రెస్సింగ్ సాధారణంగా ఉన్నప్పటికీ ఆమె దానిని సిగ్నేచర్ డియోర్ వైట్ పెర్ల్ నెక్లెస్, బ్లాక్ పెండెంట్, మినీ హ్యాండ్‌బ్యాగ్‌తో హైలైట్ చేసింది.





మానుషి చిల్లర్

మానుషి చిల్లర్

మాజీ మిస్ వరల్డ్ మానుషి చిల్లర్ సోషల్ మీడియాలో యంగ్ వరల్డ్‌కి ఫ్యాషన్ ఐకాన్‌గా చెప్పవచ్చు. ఆమె ఇంటర్నేషనల్ బ్యూటీ కాంటెస్ట్ అనుభవం తన డ్రెస్సింగ్ స్టైల్‌లోనూ ప్రతిబింబిస్తుంది. మిడి స్టైలింగ్‌తో అద్భుతమైన లుక్‌లో ఆకట్టుకుంటుంది. స్లీవ్‌లెస్ బ్లాక్ పెప్లం టాప్‌కి తెల్లటి మినీ స్కర్ట్‌తో జత చేసింది. పాయింటెడ్ హీల్స్, స్టేట్‌మెంట్ బ్యాగ్‌తో లుక్‌ను పూర్తి చేస్తూ, లగ్జరీ బ్రాండ్ లూయిస్ విట్టన్‌ను తల నుండి కాలి వరకు స్టైల్ చేసింది.

జాన్వీ కపూర్

జాన్వీ డ్రెస్సింగ్ స్టైల్ నిరంతరం చర్చనీయాంశంగా ఉంటోంది. ఆమె ఇటీవలి మియు మియు లుక్ చూస్తే మన స్కూల్ రోజులు గుర్తుకు వస్తాయి. జాన్వీ ఇటీవల కాన్స్‌లో పాల్గొనడానికి సోదరి రియా కపూర్ స్లీవ్‌లెస్ మ్యాచింగ్ వైట్ నిట్ టాప్‌తో జత చేసిన తెల్లని నిట్ మినీ స్కర్ట్‌తో స్టైలింగ్ చేసింది. బ్లూ కలర్ చెక్స్ షర్ట్‌తో లుక్‌ను లేయర్‌గా అలంకరించి, దానిపైన లాంగ్ స్లీవ్స్‌తో ఉన్న బ్రౌన్ కలర్ చెక్స్ జాకెట్‌తో మ్యాచ్ చేసింది. ఇది రిలాక్స్ వైబ్‌ను సృష్టిస్తుంది.

తమ డ్రెస్సింగ్ స్టైల్‌తోనే కాన్ఫిడెన్స్‌ను చూపుతున్న ఈ తారలు నవతరానికి ఇంటర్నేషనల్ ఐకాన్స్‌గా మారుతున్నారు.

ఈ తరం కాపురం



పెళ్లికి అర్హతను నిర్ణయించేది అబ్బాయికైతే కొలువు ..
అమ్మాయికైతే వయసు!
ఉద్యోగం వస్తే అబ్బాయి స్థిరపడినట్టు.. ఇరవై ఏళ్లు నిండితే
అమ్మాయి పెళ్లితో స్థిరపడాలన్నట్టు!
ఇవి పెళ్లికి సంబంధించిన సామాజిక ప్రమాణాలు..
సాంస్కృతిక కట్టుబాట్లూనూ!
పెళ్లి వ్యక్తిగత నిర్ణయం.
మానసిక పరిణతి, సంసిద్ధత, ఆర్థిక స్వాతంత్ర్యమే
దానికి అర్హతలు ఎవరికైనా అంటున్నారు నేటి తరం వనితలు!
ఆ చర్చే నేటి కథనం..

మ్యారేజీ ఎంట్రీకి ఏజ్ ఏంటి?

అనూష (పేరు మార్చాం)కు 30 ఏళ్లు. ఇంజినీరింగ్‌లో మాస్టర్స్ చేసింది. మంచి కంపెనీలోనే ఉద్యోగం. నచ్చిన కారు కొనుక్కుంది. దేశ, విదేశాలు తిరుగుతూ ప్రపంచాన్ని ఎక్స్‌ప్లోర్ చేస్తోంది. త్వరలోనే ఫ్లాట్ కొనుక్కోవాలనే ప్లాన్‌లోనూ ఉంది. తోటివాళ్లంతా అబ్బాయిలు సహా.. ఆమెను ఓ అచీవర్‌గా చూస్తుంటారు.. ఇన్‌స్పైర్ అవుతుంటారు. కానీ అనూష తల్లిదండ్రులే దిగులుపడుతూ ఉంటారు. 30 ఏళ్లు వచ్చినా పెళ్లిపేరు ఎత్తట్లేదని, అసలు పెళ్లి ఊసు ప్రస్తావించినా మండిపడుతోందని. బంధువుల పెళ్లిళ్లకు వెళితే ఆ తల్లిదండ్రులను ప్రశ్నలతో ముంచేస్తున్నారు అమ్మాయికి ఇంకా పెళ్లి చేయరా? వయసు మీద పడుతుంటే అమ్మాయిలు లావైపోతారు, ముందుముందు సంతానం కష్టమవుతుంది, అసలు కలగకపోనూ వచ్చు- అంటూ లేని భయాలను సృష్టిస్తున్నారు. అదంతా అమ్మాయి మీద ఒత్తిడిగా మారుతోంది.. 'నీ తోటి వాళ్లంతా పెళ్లిళ్లు చేసుకుని సెటిల్ అయిపోతున్నారు.. నువ్వేమో ఇల్లు కొనాలి, దేశాలు తిరగాలని ఊరేగుతున్నావ్' అంటూ! ఇది నసలా అనిపించడంతో అనూష.. అమ్మానాన్నల దగ్గరకు రావడమే మానేసింది.

ఇక్కడ అనూష ఒక ఉదాహరణ మాత్రమే! అలాంటి పరిస్థితి ఎదుర్కొంటున్న అమ్మాయిలు ప్రతి ఇంట్లో ఉంటున్నారు. జీవితంలో సెటిల్ అవడం అంటే అబ్బాయిలకు ఎలాంటి నిర్వచనం ఉందో అమ్మాయిలకూ అలాంటి నిర్వచనమే ఉండాలని కోరుకుంటున్నారు. ఉద్యోగం వచ్చాక కూడా అబ్బాయిలు ఆర్థికంగా స్థిరపడటానికి టైమ్ ఎలా ఇస్తున్నారో అమ్మాయిలకూ ఆ సడలింపు కావాలని డిమాండ్ చేస్తున్నారు.

ఊహాతీతంగా ఎదుగుతున్న సైన్స్ తద్వారా వైద్యరంగంలో మార్పులొస్తున్నాయి. అలాంటి వాటిల్లో ఒకటి ఎగ్ ఫ్రీజింగ్. అమ్మాయిలు పొటెన్షియల్ ఏజ్‌లో అండాలను ప్రిజర్వ్ చేసుకోవడమన్నమాట. ఇది.. జీవితంలో ఏదైనా సాధించాలనే తపన ఉన్న విమెన్‌కి వరం లాంటిది. ఒకరకంగా చెప్పాలంటే రిప్రొడక్టివ్ చాయిస్‌ని మహిళలు తమ నియంత్రణలో ఉంచుకోవడమన్నమాట. పెళ్లి, పిల్లలతో కెరీర్‌కి బ్రేక్ పడకుండా నేటి అమ్మాయిలకు యూజ్‌ఫుల్‌గా ఉంటోంది ప్రక్రియ. దీనివల్ల వయసు అయిపోతోంది పెళ్లి చేసుకోవాలి, లేకపోతే పిల్లలు పుట్టకపోయే ప్రమాదం ఉండొచ్చు వంటి భయాలకు చోటు లేదు. అంటే బయోలాజికల్ క్లాక్ ప్రెజర్ లేకుండా జీవితంలో వాళ్లనుకున్న లక్ష్యాల మీద మనసు పెట్టే వీలును కల్పిస్తుందిది. అంతేకాదు కెరీర్‌లో, పర్సనల్ చాయిసెస్‌లో జెండర్ ఈక్వాలిటీని సపోర్ట్ చేస్తుంది. అయితే దీనికి సంబంధించి ప్రతికూల ప్రభావాలూ లేకపోలేదు.



– డాక్టర్ ఆకుల దివ్య,
ఎమ్‌డీ, హైదరాబాద్

నిజమే కదా..

చదువు విషయంలో అమ్మాయిలకు అవకాశాలిస్తూ.. బాగా చదివేలా ఇటు కుటుంబాలు, అటు ప్రభుత్వాలూ వాళ్లను ప్రోత్సహిస్తూ మంచి ప్రయత్నానికి నాంది పలికారు. ఇప్పుడా ప్రయత్నం ఫలితాలనిస్తోంది అన్ని రంగాల్లో ఆడవాళ్ల ఉనికి చూపుతూ! మొదలుపెట్టాక గమ్యం చేరాలి కదా! ఆ ప్రయాణంలోనే ఉన్నారు నేటి అమ్మాయిలు. వాళ్లనుకున్న గమ్యం లేదా అచీవ్‌మెంట్‌ను సాధించే వరకు వేచి చూడమంటున్నారు. ఆ టైమ్ ఇవ్వమంటున్నారు. పెళ్లిని తమ జీవితాలకు పరమావధిగా చూపొద్దంటున్నారు.. దానికిమించిన ఆలోచనలు, కార్యాచరణతో ముందుకుసాగుతున్న వాళ్లను మూడుముళ్లతో ఆపొద్దంటున్నారు. అలాగని వాళ్లు పెళ్లిని వ్యతిరేకించడం లేదు. పెళ్లికి వయసుతో ముడిపెట్టిన సాంస్కృతిక కట్టుబాటును సవాల్ చేస్తున్నారు. వాళ్లు పెళ్లికన్నా తమ ఉద్యోగోన్నతి, మానసిక, భావోద్వేగాల పరిణతి, ఆర్థిక స్వాతంత్ర్యాలకే ప్రాధాన్యం ఇస్తున్నారు. పెళ్లికి వయసు కన్నా మానసిక, ఆర్థిక సంసిద్ధతనే ప్రామాణికంగా చూస్తున్నారు.'ఫలానా వయసు రాగానే పెళ్లి చేసేసుకోవాలనేది ఒక మిత్. దాన్నొక కల్చరల్ ఎక్స్‌పెక్టేషన్‌లాగే భావిస్తున్నాం మ్యారేజ్ అనేది పర్సనల్ చాయిస్. ఎప్పుడు చేసుకోవాలనేది వ్యక్తిగత నిర్ణయం. ఇంకా చెప్పాలంటే పెళ్లి అనేది జీవితంలో ఒక భాగం కానీ అదే జీవితం కాదు. అరే.. జీవితంలో సాధించాల్సినవి ఇంకా చాలా ఉన్నాయి. ప్రపంచం చూడండి ఎంత వేగంగా ముందుకు వెళ్తోందో.. దాంతో పోటీ పడాలి కదా!' అంటోంది హైదరాబాద్‌కు చెందిన ఒక బిజినెస్ ఎనలిస్ట్.

మరి బయోలాజికల్ క్లాక్ మాటేమిటి?

'పిల్లలకేం అలాగే అంటారు. ఏ వయసులో జరగాల్సిన ముచ్చట ఆ వయసులో జరగాలని పెద్దలు ఊరికే అన్నారా? పెళ్లి సరైన వయసులో అయితేనే సంతానం కలుగుతుంది. లేకపోతే కనపడ్డ చెట్టు, పుట్టలకు మొక్కినా పిల్లలు పుట్టరు' అంటున్నారు కొంతమంది తల్లిదండ్రులు. 'అన్యాయం.. ఇలాంటి ఒత్తిళ్లతో అమ్మాయిలను అగౌరవ పరచకూడదు. అమ్మాయి విలువను పెంచేది ఆమె అమ్మ అవడం ఒక్కటే కాదుకదా!' అని నొచ్చుకుంటున్నారు స్త్రీ వాదులు, సామాజిక విశ్లేషకులు. 'బయోలాజికల్ క్లాక్ అనేది ఇదివరకటి మాట. ఇది కూడా ఒకరకమైన కల్చరల్ ఎక్స్‌పెక్టేషనే. సైన్స్ చాలా డెవలప్ అయింది. ఎగ్ ఫ్రీజింగ్ బ్యాంక్‌లు, ఆంబ్రియో ప్రిజర్వింగ్ సెంటర్సే దానికి ప్రత్యక్ష ఉదాహరణలు. అవీ వీలుకాకపోతే దత్తత చేసుకునే అవకాశం కూడా ఉంది. ఇన్ని ప్రత్యామ్నాయాల మధ్య కూడా బయోలాజికల్ క్లాక్ గురించిన భయం, సుదీర్ఘ చర్చ అవసరమా?' అంటున్నారు ఇంకొంతమంది అమ్మాయిలు. వీటన్నిటినీ అర్థం చేసుకోవాల్సింది కుటుంబాలే! అమ్మాయిలకూ చదువు, ఆర్థిక స్వేచ్ఛ ఉండాలని వాళ్ల ఆశలకు రెక్కలు తొడిగినప్పుడు ఎగిరే స్పేస్‌నూ ఇవ్వాలి. పెళ్లి విషయంలో వాళ్ల నిర్ణయాలను గౌరవించాలి. వాళ్ల ఆలోచనలను అంగీకరించి తదనుగుణంగా ఇంటి 'లా'ను మార్చాలి అని చెబుతున్నారు సామాజిక విశ్లేషకులు.

– సరస్వతి రమ

సాక్షి సినిమా

ఇదంతా శివలీల అనిపిస్తోంది



- విష్ణు మంచు

''దేవుడికి, భక్తుడికి మధ్య ఎవ్వరూ ఉండాల్సిన పని లేదు. మూఢనమ్మకాలు అవసరం లేదని చెప్పడమే మా 'కన్నప్ప' సినిమా ఉద్దేశం. 'కన్నప్ప' సినిమా స్క్రిప్ట్‌పై ఉన్న నమ్మకంతోనే భారీ బడ్జెట్ పెట్టి, రిస్క్ చేసేందుకు ముందుకు వచ్చాం.'కన్నప్ప'కు ఇప్పటివరకు లక్షకు పైగా టికెట్లు అమ్ముడుపోయాయి. ప్రేక్షకుల నుంచి ఈ స్థాయి స్పందన చూసి, నాకు ఆనందమేస్తోంది. ఇదంతా శివలీల అనిపిస్తోంది'' అని విష్ణు మంచు అన్నారు. విష్ణు మంచు టైటిల్ రోల్‌లో నటించిన చిత్రం 'కన్నప్ప'. ఈ చిత్రంలో మోహన్‌బాబు, మోహన్‌లాల్, ఆర్. శరత్‌కుమార్, బ్రహ్మానందం, ప్రభాస్, కాజల్ అగర్వాల్, ప్రీతీ ముకుందన్ ఇతర ప్రధాన పాత్రల్లో నటించారు. ముఖేష్ కుమార్ దర్శకత్వంలో ఎమ్. మోహన్‌బాబు నిర్మించిన ఈ చిత్రం నేడు (శుక్రవారం) విడుదలవుతోంది. ఈ సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో విష్ణు మంచు మాట్లాడుతూ- ''కన్నప్ప' కథ కల్పితం కాదు. కన్నప్ప ఉన్నారు... ఇప్పటికీ ఆయన్ను ఆరాధిస్తుంటారు. ఆ దేవుడి దయ వల్ల 'కన్నప్ప' సినిమా విషయంలో నేను ఆర్థిక కష్టాలు ఎదుర్కోలేదు. నా నలుగురు పిల్లలు ఈ సినిమాలో నటించారు. ఓ తండ్రిగా నా పిల్లల్ని తెరపై చూడటం ఆనందంగా ఉంది. నేను అందరినీ గౌరవిస్తాను. ఏ కమ్యూనిటీని కించపర్చాలని కూడా అనుకోను. 'కన్నప్ప' చిత్రంలో ఎవ్వరినీ ఎక్కడా కూడా అగౌరవపరచలేదు. ఇతర రాష్ట్రాల్లో భారీ ఎత్తున రిలీజ్ ప్లాన్ చేశాం. ఇక తెలంగాణలో టికెట్ హైక్స్ లేవు. ఆంధ్రప్రదేశ్‌లో కూడా కొన్ని సెంటర్స్‌లోనే టికెట్ ధరలను యాభైరూపాయలు పెంచడం జరిగింది. అమెరికాలో కూడా 'కన్నప్ప' సినిమాను చిన్నారులు ఎక్కువగా చూసేలా, వారి వరకు టికెట్ ధరల్లో మార్పులు చేసే ఏర్పాట్లు చేశాం. మా సినిమాపై నెగటివిటీకి కొందరు కుట్ర చేస్తున్నారని మా దృష్టికి వచ్చింది. సినిమా రిలీజ్ కాకుండానే 'ఎక్స్'లో రివ్యూలు ఇచ్చి, రేటింగ్స్ తక్కువ ఇచ్చారు. అందుకే మా సినిమాపై ఎవరైనా అనవసరంగా నెగటివిటీ స్ప్రెడ్ చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నోట్ విడుదల చేశాం'' అని అన్నారు.

కూలీలో ఫుల్ మాస్‌గా...



● ఆమిర్ ఖాన్

రజనీకాంత్ 'కూలీ'లో ఆమిర్ ఖాన్ అతిథి పాత్ర చేస్తున్న విషయం తెలిసిందే. అయితే ఈ చిత్రంలో ఈ బాలీవుడ్ స్టార్ ఎంతసేపు కనిపిస్తారంటే... వార్తల్లో ఉన్న ప్రకారం పదిహేను నిమిషాలు. అది కూడా సినిమా చివర్లో అని సమాచారం. ఆ పదిహేను నిమిషాల సీన్ మామూలుగా ఉండదట. రజనీ-ఆమిర్ కాంబినేషన్‌లో వచ్చే ఈ ఫుల్ మాస్ సీన్ ఇద్దరి మధ్య డెప్త్ ఉన్న డైలాగ్స్, యాక్షన్... ఇలా జోరుగా ఉంటుందని టాక్. ఆమిర్ ఖాన్ కనిపించే ఈ పదిహేను నిమిషాల సన్నివేశం చిత్రీకరణకు పది రోజులు పట్టిందని తెలిసింది. ఈ క్లైమాక్స్ మొత్తాన్ని చిత్రదర్శకుడు లోకేశ్ కనగరాజ్ రాజస్థాన్‌లో చిత్రీకరించారట. సన్ పిక్చర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఆగస్ట్ 14న రిలీజ్ కానుంది.

తమ్ముడు కోసం ఏడు కిలోలు పెరిగాను

- లయ



"మా కథకి 'తమ్ముడు' సరైన టైటిల్. సినిమా చూశాక ప్రేక్షకులు కూడా అదే మాట చెబుతారు. ఈ సినిమాలో నితిన్‌కి అక్క పాత్ర చేశాను. నటన పరంగా చూస్తే నితిన్ మెచ్యూర్డ్‌గా కనిపిస్తారు. చాలా కష్టమైన సన్నివేశాలను కూడా సులభంగా చేశారు" అని నటి లయ తెలిపారు. నితిన్ హీరోగా రూపొందిన చిత్రం 'తమ్ముడు'. శ్రీరామ్ వేణు దర్శకత్వం వహించిన ఈ సినిమాలో వర్ష బొల్లమ్మ, సప్తమీ గౌడ కీలక పాత్రలు పోషించారు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్‌పై 'దిల్' రాజు, శిరీష్ నిర్మించిన ఈ చిత్రం జూలై 4న రిలీజ్ కానుంది. ఈ సినిమాలో నితిన్ అక్కగా ఝాన్సీ కిరణ్మయి పాత్రలో నటించిన లయ పంచుకున్న విశేషాలు.

● వివాహం తర్వాత అమెరికాలో స్థిరపడిన నేను 2023 ఫిబ్రవరిలో ఇండియాకు వచ్చాను. అప్పుడు కొన్ని యూట్యూబ్ చానల్స్‌కు ఇంటర్వ్యూలు ఇచ్చాను. ఆ ఇంటర్వ్యూలు చూసిన 'తమ్ముడు' మూవీ టీమ్ నుంచి జూన్‌లో నాకు ఫోన్ వచ్చింది. నటిస్తారా? అని అడిగితే ఓకే అన్నాను. 'తమ్ముడు' కథ ఓ లైన్‌గా చెప్పారు. ఝాన్సీ కిరణ్మయి పాత్ర కోసం బరువు పెరగాలని చెప్పడంతో స్వీట్స్ బాగా తిని, 7 కిలోలు బరువు పెరిగాను. ఆ తర్వాత హైదరాబాద్‌కి వచ్చాక పూర్తి కథ విన్నాను. నా రీ ఎంట్రీకి 'తమ్ముడు' సరైన సినిమా అని బలంగా అనిపించి, నటించాను. ● 'తమ్ముడు' సినిమా కోసం హైదరాబాద్ రావాలనుకున్నప్పుడే అమెరికాలో సాఫ్ట్‌వేర్ జాబ్ మానేశాను. అవకాశాలు కోరుకున్నప్పుడు రావు... అందుకే ఇండస్ట్రీ నుంచి వచ్చిన అవకాశం వదులుకోకూడదని వచ్చేశా. ఈ సినిమాలో బ్రదర్ అండ్ సిస్టర్ సెంటిమెంట్ భిన్నంగా ఉంటుంది. ఝాన్సీ కిరణ్మయి స్ట్రిక్ట్ ఆఫీసర్. కుటుంబాన్ని చూసుకుంటూనే, ఆఫీసర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తుంటుంది. నా క్యారెక్టర్‌లో స్ట్రిక్ట్‌నెస్‌తో పాటు ఎమోషన్, అఫెక్షన్ కూడా ఉంటాయి. ● కథలో ప్రాధాన్యం ఉన్న పాత్రల్లోనే నటించాలని అనుకుంటున్నాను. నేను అమెరికా నటిని కాదు... పక్కా హైదరాబాద్ నటినే. నాకు అమెరికాలో ఇల్లు ఉంది. హైదరాబాద్‌లోనూ ఉంది. నాకోసం ఫ్లైట్స్‌లో బిజినెస్ క్లాస్ టికెట్స్, స్టార్ హోటల్స్‌లో వసతి ఏర్పాటు చేయాల్సిన అవసరం లేదు. సినిమాలు ఉన్నప్పుడు హైదరాబాద్‌లోని నా ఇంట్లో ఉంటాను. ప్రస్తుతం శివాజీగారితో చేస్తున్న ఓ సినిమా తుది దశకు వచ్చింది. కొన్ని కథలు వింటున్నాను.

కార్తికేయుడిగా ఎన్టీఆర్ కన్ఫార్మ్ ?





● మురుగ బుక్‌తో...

వెండితెరపై కార్తికేయుడిగా ఎన్టీఆర్ కనిపించనున్నారనే వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే. 'అరవింద సమేత వీరరాఘవ' చిత్రం తర్వాత హీరో ఎన్టీఆర్, దర్శకుడు త్రివిక్రమ్ కాంబినేషన్‌లో మరో చిత్రానికి సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ మైథాలజీ సినిమాలోనే కార్తికేయుడిగా ఎన్టీఆర్ కనిపిస్తారనే టాక్ వినిపిస్తోంది. ఈ వార్త నిజమయ్యేలా ఉంది. ఎందుకంటే 'వార్ 2' సినిమా వర్క్స్‌లో భాగంగా ముంబై ఎయిర్‌పోర్ట్‌కు వెళ్లిన ఎన్టీఆర్ చేతిలో 'మురుగ' (కార్తికేయుడు) పుస్తకం కనిపించింది. దీంతో త్రివిక్రమ్‌తో చేయబోయే మైథాలజీ సినిమాకు ఎన్టీఆర్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారని, ఇందులో భాగంగానే మురుగ పుస్తకం చదువుతున్నారని ఆయన ఫ్యాన్స్ హ్యాపీ ఫీలవుతున్నారు. ఈ సినిమాను కల్యాణ్‌రామ్, సూర్యదేవర రాధాకృష్ణ నిర్మించనున్నారనే ప్రచారం సాగుతోంది. ప్రస్తుతం ప్రశాంత్ నీల్‌తో 'డ్రాగన్' సినిమా చేస్తున్నారు ఎన్టీఆర్. కొరటాల శివతో 'దేవర 2' కమిట్ అయ్యారు. తమిళ దర్శకుడు నెల్సన్‌తో ఎన్టీఆర్ ఓ సినిమా చేస్తారని టాక్. ఈ నేపథ్యంలో త్రివిక్రమ్‌తో ఎన్టీఆర్ చేయబోయే సినిమా చిత్రీకరణ ఎప్పుడు మొదలవుతుందనే చర్చ జరుగుతోంది. ఈ కాంబినేషన్ గురించి కూడా అధికారక ప్రకటన రావాల్సి ఉంది.

సంగీత్ సరసన సారిక



● నయన్ సారిక

'మ్యాడ్, మ్యాడ్ స్క్వేర్' చిత్రాల్లో నటించిన సంగీత్ శోభన్ సోలో హీరోగా ఓ సినిమా తెరకెక్కనుంది. ఈ చిత్రానికి మానసా శర్మ దర్శకత్వం వహించనున్నారు. 'కమిటీ కుర్రోళ్లు' వంటి సక్సెస్‌ఫుల్ సినిమా తర్వాత నిహారిక కొణిదెల నిర్మించనున్న చిత్రం ఇది. ఈ సినిమాలోని హీరోయిన్ పాత్రకు 'ఆయ్, క' చిత్రాల ఫేమ్ నయన్ సారికను ఎంపిక చేసినట్లుగా మేకర్స్ గురువారం ప్రకటించారు. ''జీ5తో పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ రూపొందించిన 'ఒక చిన్న ఫ్యామిలీ స్టోరీ' (ఇందులో సంగీత్ శోభన్ లీడ్ యాక్టర్) వెబ్ సిరీస్‌కి రచయితగా, 'బెంచ్‌లైఫ్' సిరీస్‌కి దర్శకురాలిగా చేసిన మానసా శర్మ దర్శకత్వం వహించనున్న తొలి చిత్రం ఇది'' అని యూనిట్ పేర్కొంది.

అదే మా తొలి సక్సెస్

- విజయ్ ఆంటోని



● సురేష్‌బాబు, విజయ్ ఆంటోని

''మ్యూజిక్ డైరెక్టర్ నుంచి హీరోగా, నిర్మాతగా, దర్శకుడిగా విజయ్ ఆంటోనిగారి ప్రయాణాన్ని నేను చూస్తూనే ఉన్నాను. ఆయనకు సినిమాల పట్ల చాలా ప్యాషన్ ఉంది. నేను అలాంటివారు తీసే చిత్రాలని ఇష్టపడుతుంటాను. అందుకే 'మార్గన్' సినిమాను తెలుగులో రిలీజ్ చేస్తున్నాను'' అన్నారు నిర్మాత డి. సురేష్‌బాబు. విజయ్ ఆంటోని నటించి, నిర్మించిన చిత్రం 'మార్గన్'. లియో జాన్ పాల్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం నేడు విడుదల అవుతోంది. ఈ సందర్భంగా గురువారం 'మార్గన్ ప్రీ రిలీజ్ లైవ్ ఇంటరాగేషన్' అంటూ యూనిట్ నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో విజయ్ ఆంటోని మాట్లాడుతూ –''సురేష్‌బాబుగారు మా సినిమాను రిలీజ్ చేస్తుండటమే మా తొలి సక్సెస్. ఇక 'మార్గన్' సాధారణ సీరియల్ కిల్లర్ చిత్రం కాదు. కథలో చాలా లేయర్స్ ఉన్నాయి. ఫస్ట్ నుంచి లాస్ట్ ఫ్రేమ్ వరకు ఎంగేజింగ్‌గా ఉంటుంది. జాన్ పాల్ అద్భుతంగా తెరకెక్కించారు'' అన్నారు.

టీజర్ చాలా బాగుంది

- సుధీర్ బాబు



● బెల్లి జనార్ధన్, సుధీర్‌బాబు, బాబ్జీ

''మా మామగారు సూపర్ స్టార్ కృష్ణగారికి దర్శకుడు బాబ్జీ చాలా దగ్గర వ్యక్తి. ఆయన దర్శకత్వంలో రూపొందిన 'పోలీస్ వారి హెచ్చరిక' చిత్రం టీజర్‌ను నా చేతుల మీదుగా ఆవిష్కరించడం సంతోషంగా ఉంది. టీజర్ చాలా బాగుంది. సినిమా మంచి విజయం సాధించాలి'' అని హీరో సుధీర్ బాబు పేర్కొన్నారు. సన్నీ అఖిల్, అజయ్ ఘోష్, రవి కాలే, గిద్దేష్, 'శుభలేఖ' సుధాకర్, షాయాజీ షిండే ముఖ్య తారలుగా నటించిన చిత్రం 'పోలీస్ వారి హెచ్చరిక'. బాబ్జీ దర్శకత్వంలో బెల్లి జనార్ధన్ నిర్మించారు. ఈ సినిమా టీజర్‌ని సుధీర్‌బాబు ఆవిష్కరించారు.

సాక్షి బిజినెస్
శుక్రవారం
27-6-2025

స్టాక్ మార్కెట్లు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
1,000	304
83,756	25,549

విదేశీ సూచీలు

సూచీ			
నాస్‌డాక్	20,144	▲	171
డోజోన్స్	43,348	▲	366
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,736	▲	17
డాక్స్	23,649	▲	151
షాంఘై	3,449	▼	7
నికాయ్	39,589	▲	642

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	85.56	86.57
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	116.50	119.47
€	యూరో	ఎస్‌బీఐ	99.27	102.01
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	58.72	60.25
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.04	57.90
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	64.93	69.63
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.95	23.47
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.44	24.23
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.08	12.90

దుమ్ము రేపిన బుల్


మూడో రోజూ మార్కెట్లో జోష్

- జాతీయ, అంతర్జాతీయ సానుకూతల ప్రభావం
- సెన్సెక్స్ 1,000 పాయింట్లు ప్లస్
- 25,500 స్థాయిపైకి నిఫ్టీ

ముంబై: పశ్చిమాసియాలో భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టడంతో స్టాక్ సూచీలు మూడోరోజూ ముందడుగేశాయి. అధిక వెయిటేజీ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, రిలయన్స్ ఇండస్ట్రీస్, ఐసీఐసీఐ బ్యాంకు రాణించి సూచీల ర్యాలీకి దన్నుగా నిలిచాయి. క్రూడాయిల్ ధరల్లో స్థిరత్వం, డాలర్ విలువ పతనం, రూపాయి బలపడటం ఇన్వెస్టర్లకు మరింత విశ్వాసాన్నిచ్చాయి. ఫలితంగా గురువారం సెన్సెక్స్ 1,000 పాయింట్లు లాభపడి 83,756 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 304 పాయింట్లు పెరిగి 25,549 వద్ద నిలిచింది. ఉదయం ఫ్లాటుగా మొదలైన సూచీలు ప్రథమార్థంలో పరిమితంగా స్వల్ప శ్రేణిలో ట్రేడయ్యాయి. ఆసియా మార్కెట్ల నుంచి లాభాల ముగింపు, యూరప్ మార్కెట్ల సానుకూల ప్రారంభంతో మిడ్ సెషన్ నుంచి కొనుగోళ్ల జోరు పెరిగింది. ఒక దశలో సెన్సెక్స్ 1,057 పాయింట్లు ఎగసి 83,812 వద్ద, నిఫ్టీ 320 పాయింట్లు దూసుకెళ్లి 25,565 వద్ద ఇంట్రాడే గరిష్టాలు తాకాయి.

ఆసియాలో జపాన్, సింగపూర్, తైవాన్, ఇండోనేషియా స్టాక్ సూచీలు 2-1% లాభపడ్డాయి. యూరప్ మార్కెట్లు ఒకటిన్నర శాతం పెరిగాయి. అమెరికా మార్కెట్లు అరశాతానికి పైగా లాభాల్లో ట్రేడవుతున్నాయి.

- ఐటీ, రియల్టీ షేర్లు మాత్రమే అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. బీఎస్‌ఈలో రంగాల వారీగా ఇండెక్సుల్లో మెటల్ 2.28%, ఆయిల్ అండ్‌గ్యాస్ 2%, ఇంధన 1.68%, కమోడిటీ 1.4%, ఫైనాన్స్ సర్వీసెస్ 1.25%, యుటిలిటీ 1.25%, విద్యుత్ ఇండెక్సులు 1.13% పెరిగాయి.
- జర్మనీ రక్షణ రంగ సంస్థ రైన్‌మెటల్ వాఫే మ్యునిషన్ జీఎంబీహెచ్ నుంచి రూ.600 కోట్ల విలువైన ఆర్డర్ దక్కించుకోవడంతో రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ షేరు 3 శాతానికి పైగా లాభపడి రూ.418 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 5% ఎగసి రూ.424 వద్ద ఏడాది గరిష్టాన్ని తాకింది.
- అధిక వెయిటేజీ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు(2.16%), రిలయన్స్ ఇండస్ట్రీస్ (2%), ఐసీఐసీఐ బ్యాంకు(1%), భారతీ ఎయిర్‌టెల్ (2.48%) రాణించడంతో స్టాక్ సూచీలు భారీ లాభాలు మూటగట్టుకున్నాయి.
- స్టాక్ మార్కెట్ వరుస ర్యాలీతో మూడు రోజుల్లో రూ.9.70 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది. దీంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్‌ఈలో కంపెనీల మొత్తం విలువ రూ.457 లక్షల కోట్లకు ఎగబాకింది.



36 పైసలు బలపడిన రూపాయి

డాలర్ మారకంలో రూపాయి విలువ 36 పైసలు పెరిగి 85.72 వద్ద స్థిరపడింది. డాలర్ ఇండెక్స్ 97 స్థాయికి దిగిరావడంతో పాటు దలాల్ స్ట్రీట్ ఒకశాతానికి పైగా ర్యాలీ దేశీయ కరెన్సీ ర్యాలీకి కలిసొచ్చాయి. 'ఎఫ్‌పీఓ ద్వారా దేశీయ మార్కెట్లో డాలర్ల రూపంలో పెట్టుబడులు భారీగా తరలివచ్చాయి. ఫెడరల్ రిజర్వ్ అంచనాల కంటే ముందుగా వడ్డీరేట్లను తగ్గిస్తుందనే వార్తలతో డాలర్ ఇండెక్స్ మూడేళ్ల కనిష్టానికి దిగివచ్చింది' అని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ రీసెర్చ్ హెడ్ దిలీప్ పర్మార్ తెలిపారు.

ఆర్‌ఐఎల్ @ రూ. 20 లక్షల కోట్లు

మళ్లీ మార్కెట్ క్యాప్ రికార్డ్‌స్థాయికి..

న్యూఢిల్లీ: డైవర్సిఫైడ్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్ (ఆర్‌ఐఎల్) మార్కెట్ విలువ మరోసారి రూ. 20 లక్షల కోట్ల కీలక మైలురాయిని అధిగమించింది. షేరు ధర తాజాగా 2 శాతం పుంజుకుని రూ. 1,495కు చేరడంతో బీఎస్‌ఈలో కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ. 37,838 కోట్లు బలపడింది. వెరసి బ్లూచిప్ కంపెనీ మార్కెట్ విలువ రూ. 20,23,375 కోట్లను అధిగమించింది. ప్రధాన ఇండెక్సులలో అధిక వెయిటేజీ గల కంపెనీ షేరు లాభపడటంతో మార్కెట్లకు సైతం జోష్‌వచ్చినట్లు నిపుణులు పేర్కొన్నారు. ఇంతక్రితం గతేడాది(2024) ఫిబ్రవరి 13న రూ. 20 లక్షల కోట్ల మార్కెట్ క్యాపిటలైజేషన్ సాధించిన తొలి దేశీ దిగ్గజంగా రిలయన్స్ ఆవిర్భవించిన సంగతి తెలిసిందే. ఆర్‌ఐఎల్ తదుపరి ప్రయివేట్ రంగ బ్యాంకింగ్ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ రూ. 15,51,219 కోట్ల మార్కెట్ విలువతో రెండో స్థానాన్ని పొందింది. ఈ బాటలో మార్కెట్ విలువ ద్వారా ఇతర బ్లూచిప్ కంపెనీలు టీసీఎస్(రూ. 12,45,219 కోట్లు), భారతీ ఎయిర్‌టెల్(రూ. 12,45,219 కోట్లు), ఐసీఐసీఐ బ్యాంక్(రూ. 10,27,839 కోట్లు) తదుపరి ర్యాంకులలో నిలుస్తున్నాయి. కాగా.. ఈ ఏడాది ఆర్‌ఐఎల్ షేరు ఇప్పటివరకూ 23 శాతం జంప్‌చేయడం విశేషం!





మైనస్‌లోకి అమెరికా జీడీపీ

- అంచనాలను మించి క్షీణత
- 2025 క్యూ1లో మైనస్ 0.50 శాతం



వాషింగ్టన్: అమెరికా ఆర్థిక వ్యవస్థ ఈ ఏడాది తొలి మూడు నెలల కాలంలో (జనవరి–మార్చి/క్యూ1) అంచనాలకు మించి క్షీణతను చవిచూసింది. ట్రంప్ గందరగోళ వాణిజ్య విధానాలతో వ్యాపారపరమైన అనిశ్చితులకుతోడు బలహీన వినియోగ డిమాండ్ ప్రభావం చూపించాయి. జీడీపీ మైనస్ 0.5 శాతానికి పడిపోయినట్లు అమెరికా వాణిజ్య శాఖ తన మూడవ, తుది అంచనాలను ప్రకటించింది. ద్వితీయ అంచనాల్లో క్షీణత 0.2 శాతంగానే ఉండొచ్చన్న వాణిజ్య శాఖ అంచనాలను మించి ఆర్థిక వ్యవస్థ కుంగుబాటునకు గురైంది. మూడేళ్లలోనే మొదటిసారి అమెరికా జీడీపీ మైనస్‌లోకి వెళ్లినట్లయింది. ముఖ్యంగా అమెరికా ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా ఉండే కీలకమైన వినియోగదారుల వ్యయం నిదానించినట్లు తాజా అంచనాలు స్పష్టం చేస్తున్నాయి. మార్చి త్రైమాసికంలో వినియోగం 1.2 శాతంగా ఉంటుందని అంచనా వేయగా, ఇది 0.5 శాతానికి పరిమితమైంది. 2024 చివరి త్రైమాసికంలోనూ వినియోగం 4 శాతం వృద్ధిని చూసింది. నాలుగేళ్లలోనే ఒక త్రైమాసికం పరంగా ఇది అతి తక్కువ వినియోగం కావడం గమనార్హం. మొదటి త్రైమాసికంలో ఆర్థిక వ్యవస్థ కుదేలవ్వడానికి ట్రంప్ టారిఫ్‌లు సైతం ప్రభావం చూపించాయి. టారిఫ్‌లు అమల్లోకి రావడానికి ముందే పెద్ద మొత్తంలో దిగుమతులకు అక్కడి సంస్థలు మొగ్గు చూపించాయి. 2024 చివరి త్రైమాసికంలో అమెరికా జీడీపీ 2.4 శాతం వృద్ధిని నమోదు చేయడం గమనార్హం.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

ఆచితూచి రిటైల్ రుణం..!	హైదరాబాద్‌లో ఇళ్ల అమ్మకాలు డౌన్

రేట్ల కోతను వేగంగా బదిలీ చేయాలి: ఆర్‌బీఐ

ముంబై: ఆర్‌బీఐ రెపో రేటును ఈ నెల మొదట్లో 50 బేసిస్ పాయింట్లు తగ్గించగా (0.50 శాతం), దీన్ని వేగంగా రుణ గ్రహీతలకు బదలాయించాలంటూ ఆర్‌బీఐ బులెటిన్ సూచించింది. బ్యాంక్‌లు వెంటనే తమ రుణ రేట్లను ఈ మేరకు తగ్గించాలని కోరింది. వాస్తవానికి చాలా బ్యాంక్‌లు ఇప్పటికే తమ రుణ రేట్లను ఈ మేరకు తగ్గించడం గమనార్హం. రుణ రేట్లను వేగంగా బదలాయించడానికి కావాల్సిన అనుకూలమైన పరిస్థితులు ఉన్నట్టు ఆర్‌బీఐ బులెటిన్ పేర్కొంది. ఎస్‌బీఐ, బ్యాంక్ ఆఫ్ బరోడా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ తదితర బ్యాంక్‌లు వేగంగా బెంచ్‌మార్క్ లెడింగ్ రేటు ఆధారిత రుణ రేట్లను సవరించాయి కూడా. రెపో రేటుతోపాటు నగదు నిల్వల నిష్పత్తిని సైతం (సీఆర్‌ఆర్) అర శాతం మేర తగ్గిస్తూ ఆర్‌బీఐ వెసులుబాటు కల్పించడం తెలిసిందే. సీఆర్‌ఆర్ కోతతో బ్యాంకింగ్ రంగంలోకి రూ.2.5 లక్షల కోట్ల మేర అదనపు నగదు లభ్యత అందుబాటులోకి వచ్చినట్టయింది.



నెస్లే 1:1 బోనస్ బొనాంజా

- వాటాదారులకు తొలిసారి ఉచిత షేర్లు
- 2024లో షేర్ల ముఖ విలువ విభజన
- జూలై 4న రూ. 10 డివిడెండ్ చెల్లింపు



న్యూఢిల్లీ: సుప్రసిద్ధ మ్యాగీ, నెస్కెఫే, కిట్‌కాట్ బ్రాండ్ల ఎఫ్‌ఎంసీజీ దిగ్గజం నెస్లే ఇండియా కంపెనీ చరిత్రలోనే తొలిసారి బోనస్ షేర్లకు తెరతీసింది. దేశీ స్టాక్ ఎక్స్చేంజీలలో లిస్టయ్యాక కంపెనీ వాటాదారులకు 1:1 నిష్పత్తిలో ఉచితంగా షేర్లను జారీ చేయనుంది. బోనస్ షేర్ల జారీకి బోర్డు అనుమతించినట్లు కంపెనీ తాజాగా పేర్కొంది. వెరసి వాటాదారులకు తమ వద్దగల ప్రతీ షేరుకీ మరో షేరుని బోనస్‌గా కేటాయించనుంది. అయితే ఇందుకు రికార్డ్ డేట్‌ను తదుపరి ప్రకటించనున్నట్లు తెలియజేసింది. నెస్లే ఇండియా ఇంతక్రితం 2024 జనవరిలో షేర్ల ముఖ విలువను విభజించింది. రూ. 10 ముఖ విలువను రూ. 1 ముఖ విలువకు కుదించింది. తదుపరి కంపెనీ ఈ నెల 19న తొలిసారి బోనస్ షేర్ల అంశాన్ని ప్రతిపాదించింది. 26న నిర్వహించనున్న సాధారణ వార్షిక సమావేశం (ఏజీఎం)లో డైరెక్టర్ల బోర్డు బోనస్ షేర్ల ప్రతిపాదనను పరిశీలించనున్నట్లు తెలియజేసింది. ఈ నేపథ్యంలో గురువారం(26న) బోనస్ షేర్ల జారీకి బోర్డు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు కంపెనీ చైర్మన్, ఎండీగా పదవీ విరమణ చేయనున్న సురేష్ నారాయణ్ వెల్లడించారు. అంతేకాకుండా ప్రతీ షేరుకీ రూ. 10 చొప్పున తుది డివిడెండ్ చెల్లించేందుకు నిర్ణయించినట్లు తెలియజేశారు. ఇందుకు జూలై 4 రికార్డ్ డేట్‌గా కంపెనీ ప్రకటించింది. ఇంతక్రితం ఈ ఏడాది ఫిబ్రవరి 7న షేరుకి రూ. 14.25 చొప్పున మధ్యంతర డివిడెండ్ చెల్లించింది. కాగా.. బోనస్ షేర్లతో వాటాదారులందరూ ప్రధానంగా 5 షేర్ల కంటే తక్కువగల 1.6 లక్షలమంది చిన్న ఇన్వెస్టర్లు లబ్ధి పొందనున్నట్లు నారాయణ్ పేర్కొన్నారు.

బోనస్ వార్తల నేపథ్యంలో నెస్లే ఇండియా షేరు 1% బలపడి రూ. 2,430 వద్ద ముగిసింది.

మ్యాగీ సంక్షోభం

2015లో అమ్మకాలపై నిషేధ సంక్షోభాన్ని ఎదుర్కొన్న మ్యాగీ తదుపరి దశలో మరింత బలపడింది. ప్రస్తుతం మొత్తం అమ్మకాలలో 7 శాతం వాటాను మ్యాగీ ఆక్రమిస్తున్నట్లు కంపెనీకి దశాబ్ద కాలం సేవలందించిన నారాయణ్ వెల్లడించారు. మ్యాగీ సంక్షోభం తరువాత నెస్లే ఇండియా ఎండీగా 2015 ఆగస్ట్ 1న ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ కాలంలో కంపెనీ వివిధ కేటగిరీలలో 150 కొత్త ప్రొడక్టులను ప్రవేశపెట్టింది. ఈకామర్స్ చానళ్ల ద్వారా 8 శాతం అమ్మకాలు నమోదవుతున్నట్లు కంపెనీ పేర్కొంది. ప్రపంచవ్యాప్తంగా మ్యాగీ అమ్మకాలలో నెస్లే ఇండియా వాటా అత్యధికంకావడం గమనార్హం!



సాక్షి స్పోర్ట్స్



ప్రజ్ఞానంద చేతిలో అర్జున్ ఓటమి

తాష్కెంట్: ఉజ్ చెస్ కప్ అంతర్జాతీయ టోర్నమెంట్‌లో తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్‌కు తొలి పరాజయం ఎదురైంది. భారత్‌కే చెందిన మరో గ్రాండ్‌మాస్టర్ ప్రజ్ఞానందతో గురువారం జరిగిన ఎనిమిదో రౌండ్ గేమ్‌లో అర్జున్ 29 ఎత్తుల్లో ఓడిపోయాడు. మరో గేమ్‌లో అరవింద్ చిదంబరం (భారత్) 44 ఎత్తుల్లో రిచర్డ్ రాపోర్ట్ (హంగేరి) చేతిలో ఓటమి పాలయ్యాడు. ఎనిమిదో రౌండ్ తర్వాత ప్రజ్ఞానంద, అర్జున్ 4.5 పాయింట్లతో సంయుక్తంగా మూడో స్థానంలో ఉన్నారు.

వ్రితి అగర్వాల్‌కు మూడో పతకం

భువనేశ్వర్: జాతీయ సీనియర్ అక్వాటిక్స్ పోటీల్లో తెలంగాణ స్విమ్మర్ వ్రితి అగర్వాల్ మూడో పతకం సొంతం చేసుకుంది. గురువారం ముగిసిన ఈ పోటీల్లో 800 మీటర్ల ఫ్రీస్టయిల్ విభాగంలో వ్రితి రజత పతకం గెలిచింది. ఆమె 9 నిమిషాల 18.16 సెకన్లలో గమ్యానికి చేరి రెండో స్థానంలో నిలిచింది.



నేటి నుంచి 'పంచ్' పండుగ



నిఖత్, లవ్లీనా

- హైదరాబాద్ వేదికగా జాతీయ సీనియర్ మహిళల బాక్సింగ్ టోర్నీ
- బరిలోకి నిఖత్ జరీన్, లవ్లీనా

సాక్షి, హైదరాబాద్: టోక్యో ఒలింపిక్స్ కాంస్య పతక విజేత లవ్లీనా బొర్గొహైన్, రెండుసార్లు ప్రపంచ చాంపియన్ నిఖత్ జరీన్‌తో పాటు పలువురు అంతర్జాతీయ బాక్సర్లు మహిళల ఎలైట్ బాక్సింగ్ టోర్నమెంట్ బరిలో దిగనున్నారు. హైదరాబాద్‌లోని సరూర్ నగర్ ఇండోర్ స్టేడియం వేదికగా నేటి నుంచి ప్రారంభంకానున్న ఈ టోర్నీ జూలై 1న ముగియనుంది. 10 వెయిట్ కేటగిరీల్లో పోటీలు జరగనుండగా... 15 యూనిట్‌లకు చెందిన 100 మందికిపైగా బాక్సర్లు ఇందులో పాల్గొననున్నారు.

తెలంగాణ బాక్సింగ్ సంఘం, భారత బాక్సింగ్ సమాఖ్య, తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ సంయుక్తంగా ఈ టోర్నీని నిర్వహించనున్నాయి. ఆతిథ్య తెలంగాణతో పాటు రైల్వేస్, హరియాణా, ఆలిండియా పోలీస్, సర్వీసెస్, పంజాబ్, చండీగఢ్, ఉత్తరప్రదేశ్, ఢిల్లీ, రాజస్తాన్, మహారాష్ట్ర, తమిళనాడు, సిక్కిం, భారత స్పోర్ట్స్ అథారిటీ (సాయ్) కంబైన్డ్ నేషనల్ ఎక్సలెన్స్ సెంటర్ టీమ్, టాప్స్ కోర్, డెవలప్‌మెంట్ జట్లు బరిలోకి దిగుతాయి. ప్రపంచ చాంపియన్‌షిప్ కాంస్య పతక విజేత మనీషా, ఒలింపియన్ ప్రీతి, వరల్డ్ యూత్ చాంపియన్ అరుంధతి చౌధరీ కూడా తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటారు. ఒక్కో విభాగంలో స్వర్ణ, రజతాలు సాధించిన బాక్సర్లు... పాటియాలాలో జరిగే ఎలైట్ జాతీయ శిబిరానికి ఎంపిక కానున్నారు. 'భారత మహిళల బాక్సింగ్‌లోని పోటీతత్వానికి ఈ టోర్నమెంట్ నిదర్శనం కానుంది. అనుభవజ్ఞులు, యువ బాక్సర్ల మిళితమైన ఈ టోర్నమెంట్ ద్వారా కొత్తగా బాక్సింగ్‌లో అడుగుపెట్టిన వాళ్లు అనుభవం గడిస్తారు. మెరుగైన ప్రదర్శన కనబర్చిన వాళ్లను జాతీయ శిబిరానికి ఎంపిక చేస్తాం. కొత్త ప్రతిభను వెలికి తీసేందుకు ఇది ఉపయోగపడనుంది. భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయిలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు ఇది ఉపకరిస్తుంది' అని భారత బాక్సింగ్ సమాఖ్య అధ్యక్షుడు అజయ్ సింగ్ పేర్కొన్నారు. ఒక్కో జట్టు నుంచి 10 మంది బాక్సర్లు బరిలోకి దిగనున్నారు. ప్రపంచ బాక్సింగ్ నిబంధనల ప్రకారం నిర్వహించనున్న ఈ టోర్నమెంట్ ఒక్క బౌట్‌లో మూడు రౌండ్‌లు ఉంటాయి. ఒక్కో రౌండ్ వ్యవధి 3 నిమిషాలు కాగా... రౌండ్‌ల మధ్యలో ఒక్కో నిమిషం విరామం ఉటుంది.

భారత్ 'తీన్‌మార్'

ఆసియా డబుల్స్ స్క్వాష్ టోర్నీలో మూడు స్వర్ణాలు సొంతం



అనాహత్ సింగ్, జోష్నా చినప్ప



అభయ్ సింగ్, వెలవన్ సెంథిల్

కౌలాలంపూర్: తుది పోరులో అదరగొట్టిన భారత స్క్వాష్ క్రీడాకారులు ఆసియా డబుల్స్ స్క్వాష్ చాంపియన్‌షిప్‌లో క్లీన్‌స్వీప్ చేశారు. ఫైనల్ చేరిన మూడు విభాగాల్లోనూ విజేతగా నిలిచి మూడు స్వర్ణ పతకాలతో మెరిశారు. పురుషుల డబుల్స్‌లో అభయ్ సింగ్–వెలవన్ సెంథిల్ కుమార్ జోడీ... మహిళల డబుల్స్‌లో అనాహత్ సింగ్–జోష్నా చినప్ప ద్వయం... మిక్స్‌డ్ డబుల్స్‌లో అభయ్ సింగ్–అనాహత్ సింగ్ జంట పసిడి పతకాలను సొంతం చేసుకున్నాయి. పురుషుల డబుల్స్ ఫైనల్లో టాప్ సీడ్ అభయ్–సెంథిల్ జోడీ 9–11, 11–5, 11–5తో నూర్ జమాన్–నాసిర్ ఇక్బాల్ (పాకిస్తాన్) జంటను ఓడించింది. మహిళల డబుల్స్ తుది పోరులో అనాహత్–జోష్నా ద్వయం 8–11, 11–9, 11–10తో ఐనా అమాని–జిన్ యింగ్ యీ (మలేసియా) జోడీపై విజయం సాధించింది. మిక్స్‌డ్ డబుల్స్ టైటిల్ సమరంలో అభయ్–అనాహత్ జంట 11–9, 11–7తో రాచెల్ అర్నాల్డ్–అమీషెన్‌రాజ్ చందరన్ (మలేసియా) ద్వయంపై గెలుపొందింది.



తరుణ్ శుభారంభం

ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశం • శ్రీకాంత్, ప్రియాన్షులకు షాక్ • యూఎస్ ఓపెన్ టోర్నీ

అయోవా (అమెరికా): యూఎస్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–300 బ్యాడ్మింటన్ టోర్నమెంట్ పురుషుల సింగిల్స్ విభాగంలో భారత క్రీడాకారులకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. తెలంగాణ ప్లేయర్, ప్రపంచ 54వ ర్యాంకర్ తరుణ్ మన్నేపల్లి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లగా... ప్రపంచ మాజీ నంబర్‌వన్ కిడాంబి శ్రీకాంత్, ప్రపంచ 37వ ర్యాంకర్ ప్రియాన్షు రజావత్, ప్రపంచ 57వ ర్యాంకర్ శంకర్ ముత్తుస్వామి సుబ్రమణియన్, ప్రపంచ 61వ ర్యాంకర్ రిత్విక్ సంజీవి సతీశ్ కుమార్ తొలి రౌండ్‌లోనే ఇంటిముఖం పట్టారు. తొలి రౌండ్‌లో తరుణ్ 19–21, 21–18, 21–18తో ప్రపంచ 53వ ర్యాంకర్ అర్నాడ్ మెర్క్లే (ఫ్రాన్స్)పై గెలుపొందాడు. 70 నిమిషాలపాటు హోరాహోరీగా సాగిన ఈ పోరులో కీలకదశలో తరుణ్ పాయింట్లు గెలిచి విజయాన్ని అందుకున్నాడు. తొలి గేమ్‌ను కోల్పోయిన తరుణ్... రెండో గేమ్‌లో స్కోరు 18–18 వద్ద వరుసగా మూడు పాయింట్లు నెగ్గి గేమ్‌ను దక్కించుకొని మ్యాచ్‌లో నిలిచాడు. నిర్ణాయక మూడో గేమ్‌లో 14–16తో వెనుకబడిన దశలో తరుణ్ విజృంభించి వరుసగా ఐదు పాయింట్లు గెలిచి 19–16తో ఆధిక్యంలోకి వెళ్లాడు. ఆ తర్వాత రెండు పాయింట్లు చేజార్చుకున్న తరుణ్ వెంటనే తేరుకొని మరో రెండు పాయింట్లు నెగ్గి గేమ్‌తోపాటు మ్యాచ్‌ను సొంతం చేసుకున్నాడు. ప్రిక్వార్టర్ ఫైనల్లో భారత్‌కే చెందిన ఆయుశ్ శెట్టితో తరుణ్ తలపడతాడు. ఈ సీజన్‌లో తరుణ్ ఏడు టోర్నీల్లో ఆడి రెండింటిలో క్వార్టర్ ఫైనల్ చేరుకున్నాడు. మరోవైపు ప్రపంచ 50వ ర్యాంకర్ శ్రీకాంత్ 19–21, 21–12, 14–21తో ప్రపంచ 77వ ర్యాంకర్ హ్యారీ హువాంగ్ (ఇంగ్లండ్) చేతిలో, ప్రియాన్షు 10–21, 21–12, 7–21తో 106వ ర్యాంకర్ టింగ్ యెన్ చెన్ (చైనీస్ తైపీ) చేతిలో, శంకర్ 13–21, 19–21తో లియావో జు ఫు (చైనీస్ తైపీ) చేతిలో, రిత్విక్ 18–21, 12–21తో ఎనోగట్ రాయ్ (ఫ్రాన్స్) చేతిలో ఓడిపోయారు.



శ్రియాన్షికి నిరాశ

మహిళల సింగిల్స్ విభాగంలో హైదరాబాద్ క్రీడాకారిణి శ్రియాన్షి వలిశెట్టి, తాన్యా హేమంత్ తొలి రౌండ్‌లోనే నిష్క్రమించగా... భారత్‌కే చెందిన అన్‌మోల్ ఖరబ్, ఆకర్షి కశ్యప్, తన్వీ శర్మ, ఐరా శర్మ తొలి రౌండ్‌లో విజయం సాధించి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టారు. శ్రియాన్షి 16–21, 21–23తో ఏడో సీడ్ పొలీనా బురోవా (ఉక్రెయిన్) చేతిలో, తాన్యా 21–10, 22–24, 16–21తో అమేలీ షుల్జ్ (డెన్మార్క్) చేతిలో ఓటమి పాలయ్యారు. అన్‌మోల్ 16–21, 21–13, 21–19తో తెరెజా స్విబికోవా (చెక్ రిపబ్లిక్)పై, ఆకర్షి 21–19, 21–10తో లియాంగ్ టింగ్ యు (చైనీస్ తైపీ)పై, తన్వీ శర్మ 21–19, 21–9తో రెండో సీడ్ ఎన్గుయెన్ థుయ్ లిన్ (వియత్నాం)పై గెలిచారు. హుంగ్ యిటింగ్ (చైనీస్ తైపీ)తో జరిగిన మ్యాచ్‌లో ఐరా శర్మ తొలి గేమ్‌ను 12–21తో కోల్పోయి, రెండో గేమ్‌ను 21–16తో సొంతం చేసుకుంది. నిర్ణాయక మూడో గేమ్‌లో స్కోరు 6–6తో సమంగా ఉన్నపుడు హుంగ్ యిటింగ్ గాయం కారణంగా మ్యాచ్ నుంచి వైదొలిగింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో టాప్ సీడ్ తనీషా క్రాస్టో–ధ్రువ్ కపిల (భారత్) ద్వయం 21–17, 16–21, 17–21తో లిన్ యు చియె–హుంగ్ యుఎన్ (చైనీస్ తైపీ) జోడీ చేతిలో ఓడిపోయింది.

భారీ బృందంతో బరిలోకి భారత్

- ఆసియా జూనియర్ బ్యాడ్మింటన్ పోటీలకు భారత జట్టు ప్రకటన
- టీమిండియాలో నలుగురు తెలంగాణ ప్లేయర్లు, ముగ్గురు ఆంధ్ర క్రీడాకారులు



అరిగెల భార్గవ్ రామ్, వెన్నెల కలగోట్ల (ఫైల్)

న్యూఢిల్లీ: వచ్చే నెలలో జరిగే ప్రతిష్టాత్మక ఆసియా అండర్–19 జూనియర్ టీమ్, వ్యక్తిగత బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారత్ భారీ బృందంతో బరిలోకి దిగనుంది. ఐదు విభాగాల్లో కలిపి భారత్ నుంచి మొత్తం 19 మంది క్రీడాకారులు ఈ టోర్నీలో పోటీపడనున్నారు. ఇండోనేసియాలోని సోలో నగరంలో జూలై 18 నుంచి 27వ తేదీ వరకు ఈ టోర్నీని నిర్వహిస్తారు. భారత జట్టులో తెలంగాణ నుంచి నలుగురు... ఆంధ్రప్రదేశ్ నుంచి ముగ్గురు ప్లేయర్లు చోటు దక్కించుకున్నారు. తెలంగాణకు చెందిన ప్రణవ్ రామ్ నాగలింగం పురుషుల సింగిల్స్‌లో, తన్వీ రెడ్డి అండ్లూరి మహిళల సింగిల్స్‌లో ఆడతారు. తెలంగాణకే చెందిన వెన్నెల కలగోట్ల సింగిల్స్‌తోపాటు డబుల్స్‌లో, మిక్స్‌డ్ డబుల్స్‌లో మంచాల కీర్తి పోటీపడుతారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన అరిగెల భార్గవ్ రామ్, గొబ్బూరు విశ్వతేజ్ పురుషుల డబుల్స్‌లో... కోడె విష్ణు కేదార్ మిక్స్‌డ్ డబుల్స్‌లో బరిలోకి దిగుతారు.

భారత జట్టు: అన్ష్ నేగి, లాల్‌థజువాలా, రౌనక్ చౌహాన్, ప్రణవ్ రామ్ నాగలింగం (పురుషుల సింగిల్స్). రుజులా రాము, తన్వీ శర్మ, తన్వీ రెడ్డి అండ్లూరి, వెన్నెల కలగోట్ల (మహిళల సింగిల్స్). అరిగెల భార్గవ్ రామ్, గొబ్బూరు విశ్వతేజ్, భవ్య ఛాబ్రా, పరమ్ (పురుషుల డబుల్స్). వెన్నెల, రేషిక, గాయత్రి, మాన్సా రావత్ (మహిళల డబుల్స్). కోడె విష్ణు కేదార్, మంచాల కీర్తి, లాల్‌రామ్‌సాంగా, తారిణి సూరి (మిక్స్‌డ్ డబుల్స్).

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

అగ్రి రోబోటిక్స్.. ప్రణాళికతో సక్సెస్

- సాక్షి సాగుబడి

కృత్రిమ మేధస్సు, రోబోటిక్స్ వంటి సాంకేతికతలు అన్ని రంగాల్లో విప్లవాత్మక మార్పులు తెస్తున్న రోజులివి. వ్యవసాయ రంగం కూడా ఇప్పుడు ఈ డిజిటల్ మార్పులను స్వీకరిస్తోంది. కానీ, మన దేశంలో ఇంకా చాలా ప్రాంతాల్లో వ్యవసాయ రంగంలో రోబోలను విలాసవంతమైన ఆవిష్కరణగా మాత్రమే చూస్తున్నారు. ఈ దశలో తెలంగాణ రాష్ట్రం డిజిటల్ వ్యవసాయ విప్లవం దిశగా అడుగులు వేస్తోంది. ఈ కృషిలో తెలంగాణ సహా తెలుగు రాష్ట్రాలు అగ్రగామిగా ఎలా మారగలవన్న అంశంపై డిజిటల్ వ్యవసాయంలో ప్రపంచ స్థాయి పరిజ్ఞానం ఉన్న సీనియర్ శాస్త్రవేత్త, హైదరాబాద్‌లోని అగ్రికల్చరల్ టెక్నాలజీ అప్లికేషన్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఏటీఏఆర్ఐ- అటారి) సంచాలకులు **డాక్టర్ షేక్ ఎన్.మీరాతో 'సాక్షి' ముచ్చటించింది.** రోబోటిక్స్, డిజిటల్ వ్యవసాయ సాంకేతికతపై స్పష్టమైన ప్రణాళికతో, సమగ్రమైన విధానంతో ముందడుగు వేస్తే రైతులకు మేలు జరుగుతుందని మీరా అంటున్నారు. ఆయన ఇంకా ఏమన్నారంటే..



రూ.50వేల నుంచి లక్ష ధరలో రోబో లభించాలి

రోబోల పనితీరుపై రైతులకు నమ్మకం కలిగించాలి

ఐసీఏఆర్- 'అటారి' డైరెక్టర్ డా. మీరా


అగ్రిరోబో

వ్యవసాయ రోబోటిక్స్‌పై ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడులు పోటెత్తుతున్నాయి.. ఎందుకని?

వ్యవసాయ రంగంలోని ప్రధాన సమస్యలకు రోబోలు సమాధానంగా నిలుస్తున్నాయి. ఇవి కూలీల కొరతను పరిష్కరిస్తాయి. ఎరువులు, నీరు, పురుగుమందుల వంటి ఉత్పాదకాల వినియోగాన్ని తగ్గిస్తాయి. ఉత్పాదకతను పెంచుతాయి. అనేక దేశాల్లో ఇందుకు ఉదాహరణలు కనిపిస్తాయి:

ఎకో రోబోటిక్స్ (స్విట్జర్లాండ్): గడ్డిపై కాకుండా ఇతర కలుపు మొక్కలపై మాత్రమే కలుపు మందులను పిచికారీ చేస్తూ 90% వరకు రసాయనాల వినియోగాన్ని ఈ రోబోలు తగ్గిస్తున్నాయి.

అగ్రోబోట్ (స్పెయిన్): స్ట్రాబెర్రీలను సున్నితంగా, నాణ్యత పాడవకుండా కోసే సామర్థ్యం ఈ రోబోలకు ఉంది.

ఇలాంటి రోబోలు ఖరీదైన 'టాయ్స్' కాదు. భారతీయ చిన్న రైతులకు సరిపోయేలా, సరసమైన వ్యయంతో మనమూ తయారు చేయవచ్చు.

తెలంగాణ కోసం మీరు గతంలో సూచించిన ఐదు అంచెల వ్యూహం ఏమిటి?

తెలంగాణకు ఉన్న ఉరిమే ఉత్సాహం క్షేత్రస్థాయిలో ఆచరణలోకి రావాలంటే ఈ ఐదు అంచెల వ్యూహాన్ని అనుసరించాలి:

1. **ఒక పనికి ఒక రోబో:** ఉదాహరణకు.. మల్టీ టాస్కింగ్ రోబోలు కాకుండా, పసుపును ఉడకబెట్టే ఆవిరి యంత్రం, కలుపు తీసే యంత్రం, వరుసలుగా విత్తనాలు వేసే యంత్రం లాంటి చిన్న రోబోలను అభివృద్ధి చేయాలి.
2. **స్థానిక ఆవిష్కరణ - ప్రపంచ ప్రేరణ:** ఇంజనీరింగ్ కాలేజీలు, పాలిటెక్నిక్‌లు, అగ్రి-స్టార్టప్‌లను ప్రోత్సహించి పత్తి తీయటం, మిరప కాయలు కోయటం, వరి నాట్లు వేయటం వంటి పనులు చేసే చిన్న రోబోలను స్థానికంగానే రూపొందించాలి.
3. **పైలట్ గ్రామాల్లో రోబోటిక్ జోన్లు:** స్మార్ట్ అగ్రికల్చర్ మిషన్ కింద 20 గ్రామాలను ఎంచుకొని పైలట్ ప్రాజెక్టులను అమలు చేయాలి. ఈ గ్రామాల్లో ఫలితాలను బట్టి రాష్ట్రం అంతటా అమలు చెయ్యాలి.
4. **అద్దెకు రోబోలు:** రోబోలను ట్రాక్టర్ల మాదిరిగా అద్దెకు ఇచ్చే విధంగా కస్టమ్ హైరింగ్ సెంటర్లను ఏర్పాటు చెయ్యాలి. రోబోలను రైతులు మొబైల్ ఫోన్ ద్వారా బుక్ చేసుకునే సౌలభ్యం ఉండాలి.
5. **గ్రామీణ రోబోటిక్ వనరుల కేంద్రాలు:** గ్రామీణ యువతకు శిక్షణ ఇచ్చి.. రోబోల మరమ్మతులకు సంబంధించిన నైపుణ్యాలు నేర్పించే శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేయాలి.

ఇతర దేశాల్లో చిన్న రైతులకు రోబోల ద్వారా అందిస్తున్న అనుభవాల నుంచి మనం నేర్చుకోవాల్సినవేమిటి?

ప్రభుత్వాలు పరిశోధనలకు విధానాలు, పెట్టుబడుల ద్వారా అండగా నిలవాలి. సబ్సిడీలు అందించి, శిక్షణ సదుపాయాల ద్వారా అవసరమైన ఆధునిక నైపుణ్యాలను అందించాలి.

- **ఇజ్రాయెల్:** ప్రతి నీటి చుక్కను, పోషకాలను వృథా కాకుండా సూటిగా లక్ష్యానికి చేరేలా రోబో ఆధారిత ఎరువుల సరఫరా వ్యవస్థను ఇజ్రాయెల్ అమలు చేస్తోంది. మహబూబ్‌నగర్ వంటి కరువు ప్రాంతాలకు ఇది ఎంతో ఉపయోగకరం.
- **ఆస్ట్రేలియా:** భారీ కమతాల్లో తమంతట తామే కలుపు తీసే అటానమస్ వీడర్లను ఆస్ట్రేలియాలో గతంలోనే అభివృద్ధి చేసింది.
- **జపాన్, దక్షిణ కొరియా:** వృద్ధ రైతులకు తోడ్పాటునందించే వరి నాట్లేసే రోబో యంత్రాల ఉత్పత్తిపై జపాన్, దక్షిణ కొరియా దేశాలు భారీగా పెట్టుబడులు పెట్టాయి. రైతులు ఈ రోబోలను అద్దెకు తీసుకొని నాట్లు వేసుకుంటున్నారు.
- **చైనా:** రోబోలను చైనా ప్రభుత్వం సబ్సిడీపై రైతులకు ఇస్తోంది. గ్రామీణ యువతకు 'రోబో ఆపరేటర్లు'గా శిక్షణ ఇస్తోంది.

తెలంగాణ ఉద్యాన తోటల సాగు రంగానికి రోబోలు ఎలా తోడ్పడగలవు?

రాష్ట్రంలో భారీగా మామిడి, అరటి వంటి పండ్ల తోటలు, మిరప, పసుపు, కూరగాయల తోటలు సాగవుతున్నాయి. అరటి గెలలు కోసే రోబోలు, మామిడి కాయలను గ్రేడింగ్ చేసే రోబోలను అందుబాటులోకి తెస్తే నాణ్యత పెరిగి మంచి ధర వస్తుంది. రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోని పాలీహౌస్ రైతులకు రోబోలను అందిస్తే తక్కువ ఖర్చుతోనే పనులు చకచకా, తక్కువ ఖర్చుతో పూర్తి చేసుకోగలుగుతారు.


ఎకో రోబోటిక్స్

కానీ, ప్రతిబంధకాలు కూడా ఉన్నాయి కదా?

అవును. ప్రధానంగా రోబోల ధరలు. రోబో ధర రూ. 8–10 లక్షలు ఉంటే రైతులకు అందుబాటులో ఉండదు. రూ. 50 వేల నుంచి లక్ష పరిధిలో దొరికేలా మార్గాలు చూడాలి.

- స్థానికంగా మరమ్మతులు చేసే వ్యవస్థ ఉండాలి.
- రోబోలు వస్తే ఇక తమకు ఏమీ పని ఉండదని రైతులు భావిస్తున్నారు. అవి మనుషులకు ప్రత్యామ్నాయం కాజాలవని, రైతు కూలీలకు సహాయంగా ఉండే సాధనాలు మాత్రమేనని చెప్పి, వారిలో నమ్మకం కల్పించాలి. క్షేత్ర ప్రయోగాల్లో రోబోలు వాడి చూపించి రైతుల్లో రోబోల ప్రయోజకత్వంపై నమ్మకం కలిగించాలి.

రోబోలతో తెలుగు రాష్ట్రాల్లో వ్యవసాయంపై ప్రభావం ఎంత ఉండొచ్చు?

పురుగుమందులు, ఎరువుల వాడకం 30–40% తగ్గిపోతుంది. పనులు ఒత్తిడి ఉండే కాలంలో కూలీల శ్రమ 20–25% వరకు తగ్గుతుంది. విత్తనాలు వేయటం, నాట్లు వేయటం, పంటల కోతలో సామర్థ్యం 50% పెరుగుతుంది. రోబోలను నడపటం, మరమ్మతు చేయటం, డిజైన్లపై పనిచేయటం ద్వారా గ్రామీణ యువతకు కొత్త ఉపాధి అవకాశాలు పెరుగుతాయి.

విశేష అనుభవం

సీనియర్ వ్యవసాయ విస్తరణ శాస్త్రవేత్తగా అపారమైన క్షేత్రస్థాయి అనుభవంతో పాటు అంతర్జాతీయ స్థాయిలో పనిచేసిన అనుభవం డాక్టర్ షేక్ ఎన్.మీరాకు ఉంది. ఐక్యరాజ్యసమితికి చెందిన ఇంటర్నేషనల్ ఫండ్ ఫర్ అగ్రికల్చరల్ డెవలప్‌మెంట్ (ఐఫాడ్)లో సీనియర్ డిజిటల్ అగ్రికల్చర్ నిపుణుడిగా ఈజిప్టు రాజధాని కైరో నగరం కేంద్రంగా గతంలో అనేక సంవత్సరాలు పనిచేశారు.


'అటారి' అంటే ?

భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి(ఐసీఏఆర్–ఐకార్), పరిశోధనా సంస్థలు కాలానుగుణంగా చేసే పరిశోధనల ఫలితాలను సాధారణ రైతులకు చేర్చేందుకు కృషి విజ్ఞాన కేంద్రాల (కేవీకేలు) వ్యవస్థ ఏర్పాటైంది. ప్రతి జిల్లాలో కనీసం ఒక కేవీకే ఉంటుంది. స్థానిక వాతావరణ, భౌగోళిక పరిస్థితులకు అనుగుణంగా రైతులకు మార్గనిర్దేశనం చేయటంలో కేవీకేలు కీలకపాత్ర పోషిస్తున్నాయి. కేవీకేల వ్యవస్థపై పర్యవేక్షణకు జోన్ల వారీగా 11 అగ్రికల్చరల్ టెక్నాలజీ అప్లికేషన్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఏటీఏఆర్ఐ- అటారి)లు ఉన్నాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాల్లోని అన్ని జిల్లాల కేవీకేలు హైదరాబాద్ అటారి అజమాయిషీలో పనిచేస్తుంటాయి.

టుడేస్ గ్రాఫిక్

ట్రంప్ పాలనపై ప్రపంచ దృష్టికోణం ఎలా మారుతోంది?

రెండోసారి అమెరికా అధ్యక్షుడిగా పగ్గాలు చేపట్టిన డొనాల్డ్ ట్రంప్ శక్తి సామర్థ్యాలపై ప్రపంచ దేశాలు ఏమనుకుంటున్నాయి? దీనిపై ప్యూ రీసెర్చ్ సెంటర్ అనే సంస్థ అమెరికా మినహా 24 దేశాల్లో స్ప్రింగ్ 2025 గ్లోబల్ యాటిట్యూడ్స్ సర్వే పేరుతో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టింది. దీని ప్రకారం ప్రపంచ వ్యవహారాల్లో సరైన చర్యలు చేపట్టగల సామర్థ్యం డొనాల్డ్ ట్రంప్‌కు ఉందని విశ్వసించిన వారి శాతం ఇలా ఉంది.




'కుంటాల' కళకళ

జలపాతానికి పోటెత్తిన వరద



ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలం కుంటాల జలపాతం గురువారం నుంచి వరద నీటితో పరవళ్లు తొక్కుతోంది. మొన్నటివరకు నీరు లేక వెలవెలబోయింది. బుధవారం నుంచి కురుస్తున్న వర్షాలతో భారీగా వరద నీరు పోటెత్తుతోంది. దీంతో పర్యాటకులు జలపాతం అందాలు తిలకించేందుకు తరలి వస్తున్నారు. ప్రకృతి సహజ సిద్ధమైన పచ్చని అడవి తల్లి ఒడిలో పరవళ్లు తొక్కుతున్న జలధారలు పర్యాటకులను ఆకట్టుకుంటున్నాయి. జాలువారే అందాలను చూసి మంత్రముగ్ధులు అవుతున్నారు. జలపాతం వద్ద ఫొటోలు, సెల్ఫీలు దిగుతూ సందడి చేస్తున్నారు. - నేరడిగొండ

కృష్ణమ్మ ఒడిలోకి సంగమేశ్వరుడు



నంద్యాల జిల్లా పరిధిలోని సంగమేశ్వర ఆలయం కృష్ణా నదిలో పూర్తిగా మునిగిపోయింది. జూరాల నుంచి దిగువకు జలాలను వదలడంతో శ్రీశైలం బ్యాక్ వాటర్ కొన్ని రోజులుగా పెరుగుతూ వస్తోంది. ఈనెల 15వ తేదీన సంగమేశ్వర ఆలయంలోని శివలింగం నదిలో మునిగిపోవడం తెలిసిందే. బ్యాక్‌వాటర్ మట్టాలు పెరగడంతో గురువారం ఉదయం ఆలయం గోపురం కూడా పూర్తిగా నీటిలో మునిగింది. సోమశిల, అమరగిరి, మంచాలకట్ట ప్రాంతాల్లో పుష్కరఘాట్ల వద్దకు నీళ్లు చేరుకున్నాయి. సోమశిల సమీపంలోని మసీదు కూడా నీటిలో మునిగింది. శ్రీశైలం డ్యాం బ్యాక్ వాటర్ నీటిమట్టాలు ప్రస్తుతం 863 అడుగులకు పైగా ఎత్తులో ఉన్నాయి. - కొల్లాపూర్

'కంచె' భూములపై స్పందించిన ఎన్‌హెచ్‌ఆర్సీ

పిటిషనర్ ఇమ్మనేని ఫిర్యాదుపై కేసు నమోదు

సాక్షి, న్యూఢిల్లీ: కంచె గచ్చిబౌలి భూముల వ్యవహారంలో దాఖలైన పిటిషన్‌పై జాతీయ మానవ హక్కుల సంఘం (ఎన్‌హెచ్‌ఆర్సీ) స్పందించింది. ఎలాంటి పర్యావరణ నష్టాన్ని అంచనా వేయకుండా ప్రభుత్వం ఇష్టారీతిగా ప్రకృతిని నాశనం చేసిందని న్యాయవాది ఇమ్మనేని రామారావు గతంలో ఎన్‌హెచ్‌ఆర్సీని ఆశ్రయించారు. ప్రభుత్వ చర్యలతో 27 ఎకరాల్లో సహజ సిద్ధంగా ఏర్పడిన సరస్సు, 134.28 ఎకరాల షీట్ రాక్స్, 2.33 ఎకరాల కుంటకు నష్టం వాటిల్లిందని అందులో పేర్కొన్నారు. తద్వారా ఆ ప్రాంతంలో జీవిస్తోన్న అంతరించిపోతున్న జాతికి చెందిన నక్షత్ర తాబేళ్లు, జింకలు, నెమళ్లు, ఇతర జీవజాతుల పరిస్థితి అగమ్య గోచరంగా తయారైందని ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదును పరిగణనలోకి తీసుకుంటున్నట్లు ఎన్‌హెచ్‌ఆర్సీ వెల్లడించింది. ఈ వ్యవహారంలో కేసు నమోదు చేసినట్లు ఫిర్యాదుదారుడు ఇమ్మనేని రామారావుకు గురువారం ఎన్‌హెచ్‌ఆర్సీ సమాచారం అందించింది.

మానవత్వం మరిచి సబ్బులు ఎత్తుకెళ్లారు!

- రెండు లారీలు ఢీ.. డ్రైవర్ మృతి
- ఓ లారీలోని సబ్బులు ఎత్తుకెళ్లిన ప్రజలు


లారీలోని సబ్బులు ఎత్తుకెళ్తున్న ప్రజలు

లక్సెట్టిపేట: మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేట మున్సిపాలిటీ పరిధి ఇటిక్యాల గ్రామ స్టేజీ సమీపంలో జాతీయ రహదారిపై బుధవారం అర్ధరాత్రి రెండు లారీలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఓ డ్రైవర్ మృతి చెందాడు. దేవాపూర్ నుంచి మహారాష్ట్రలోని నాందేడ్‌కు వెళ్తున్న సిమెంటు ట్యాంకర్ లారీ, హైదరాబాద్ నుంచి సంతూర్ సబ్బుల లోడ్‌తో ఛత్తీస్‌గఢ్ వెళ్తున్న లారీఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో కాసిపేట మండలం పలాంగూడ గ్రామానికి చెందిన ట్యాంకర్ లారీ డ్రైవర్ శ్రీనివాస్ (52) క్యాబిన్‌లో ఇరుక్కుని మృతిచెందాడు. పోలీసులు రెండు గంటల పాటు శ్రమించి మృతదేహాన్ని బయటకు తీశారు. మరో లారీ డ్రైవర్ సచిన్‌కుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. ఇదిలా ఉండగా.. సంతూర్ సబ్బుల లారీ యాక్సిడెంట్‌కు గురైన విషయం తెలియడంతో సమీపంలోని ప్రజలు పెద్ద ఎత్తున సంఘటన స్థలానికి చేరుకుని లారీపైకి ఎక్కి ఇష్టారాజ్యంగా సబ్బులు ఎత్తుకెళ్లారు. సబ్బులను సంచుల్లో నింపుకొని కొందరు వెళ్లగా, మరికొందరు పెట్టెలను ఎత్తుకుని వెళ్లారు. ప్రమాదంలో గాయపడ్డ డ్రైవర్లు ఒకవైపు నెత్తురోడుతూ ఉండగా వారిని రక్షించకుండా స్థానికులు సబ్బుల కోసం ఎగబడ్డారు. గురువారం ఉదయం కూడా పలువురు సబ్బులను తీసుకెళ్లడం కనిపించింది.

రంగారెడ్డిలో 'రైతు భరోసా' నిధులు జమ చేయరా?

సీఎంకు కార్తీక్‌రెడ్డి ప్రశ్న



సాక్షి, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా రైతులకు రైతు భరోసా నిధులు ఎందుకు జమ చేయడం లేదని సీఎం రేవంత్‌రెడ్డిని బీఆర్ఎస్ నేత పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి ప్రశ్నించారు. గురువారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ నేతలు గెల్లు శ్రీనివాస్‌యాదవ్, రాము యాదవ్, వెంకటేశ్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా రైతులు అంటే రేవంత్‌రెడ్డికి ఎందుకు చిన్నచూపు అని, ఆ జిల్లా ప్రజల ఓట్లు కాంగ్రెస్‌కు అవసరం లేదా అని నిలదీశారు. కాంగ్రెస్‌కు ఓట్లు, సీట్లు ఇవ్వనంత మాత్రాన ఉమ్మడి రంగారెడ్డి జిల్లాను నిర్లక్ష్యం చేస్తారా అని విమర్శించారు. ట్రిపుల్ వన్ జీవో విషయంలో కూడా అక్కడి రైతులను మోసం చేశారని, మంత్రివర్గంలో చోటుకు కూడా రంగారెడ్డి జిల్లా నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వారంరోజుల్లో రైతుబంధు నిధులు జిల్లా రైతుల అకౌంట్లలో పడకపోతే ఆమరణ నిరాహార దీక్షకు దిగుతానని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా విడుదల చేశామంటూ సంబురాలు చేసుకోవాలని పిలుపునిస్తోందని, అయితే రైతులు ఎవరూ సంబరాల్లో పాల్గొనడం లేదని కార్తీక్‌రెడ్డి విమర్శించారు.


తిరుమలగిరి ఆర్టీఏ కార్యాలయంలో ఏజెంట్లను విచారిస్తున్న ఏసీబీ అధికారులు


సలాబత్‌పూర్ చెక్‌పోస్ట్ వద్ద అధికారులు ఏర్పాటు చేసిన డబ్బాలో నగదు వేస్తున్న డ్రైవర్

ఆర్టీఏ ఆఫీసుల్లో ఏసీబీ మెరుపు దాడులు

- తిరుమలగిరి, ఉప్పల్ కార్యాలయాల్లో సోదాలు
- పలువురు ఏజెంట్లను అదుపులోకి తీసుకుని విచారణ... ముందుగానే పసిగట్టి విధులకు దుమ్మా కొట్టిన అధికారులు
- సలాబత్‌పూర్ ఆర్టీఓ చెక్‌పోస్టుపై కూడా దాడులు
- హుండీలాంటి డబ్బా పెట్టి వసూళ్లకు పాల్పడుతున్నట్లు గుర్తింపు

కంటోన్మెంట్/ ఉప్పల్/మద్నూర్ (జుక్కల్): ఉప్పల్, తిరుమలగిరి ఆర్టీఏ కార్యాలయాల్లో ఏసీబీ అధికారులు గురువారం మెరుపు దాడులు నిర్వహించారు. కామారెడ్డి జిల్లా మద్నూర్ మండలంలోని సలాబత్‌పూర్ ఆర్టీఓ చెక్‌పోస్టులో కూడా సోదాలు చేశారు. గురువారం ఉదయం తిరుమలగిరి ఆర్టీఏ కార్యాలయానికి వచ్చిన ఏసీబీ అధికారులు.. అక్కడ తచ్చాడుతున్న సుమారు 20 మంది ఏజెంట్లను అదుపులోకి తీసుకుని విచారించారు. ఒక్కో ఏజెంట్ వద్ద 50 వాహనాలు, లైసెన్సులు, రెన్యూవల్స్‌కు సంబంధించిన ధ్రువపత్రాలు ఉన్నట్లు గుర్తించారు. ఇన్‌చార్జి ఆర్టీఓ అందుబాటులో లేకపోవడంతో ఫోన్ చేసి కార్యాలయానికి రావాలని సూచించారు. ఆర్టీఓ సిబ్బందిని కూడా విచారిస్తామని ఏసీబీ డీఎస్పీ శ్రీధర్ తెలిపారు. ఉప్పల్ ఆర్టీఏ కార్యాలయంలో గురువారం మధ్యాహ్నం నుంచి ఏసీబీ సోదాలు కొనసాగాయి. ఏడుగురు ఏజెంట్లను అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. వారి నుంచి రూ.3,450 నగదు, మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు రంగారెడ్డి జిల్లా ఏసీబీ డీఎస్పీ ఆనంద్ కుమార్ తెలిపారు. ఏసీబీ సోదాలను ముందుగానే పసిగట్టిన కొందరు అధికారులు సెలవులు పెట్టి వెళ్లినట్లు ఒక ఏసీబీ అధికారి అనుమానం వ్యక్తంచేశారు. సోదాల విషయం లీకవ్వడం వల్లనే ఆశించిన విధంగా పట్టుకోలేక పోయినట్లు తెలిపారు.

ఆర్టీఓ చెక్‌పోస్టులో సోదాలు

కామారెడ్డి జిల్లా మద్నూర్ మండలంలోని సలాబత్‌పూర్ ఆర్టీఓ చెక్‌పోస్టుపై ఏసీబీ అధికారులు గురువారం తెల్లవారుజామున దాడులు నిర్వహించారు. అక్కడ లెక్కలోకి రాని రూ.91 వేల నగదును గుర్తించినట్లు ఏసీబీ డీఎస్పీ శేఖర్‌గౌడ్ తెలిపారు. ఏసీబీ అధికారులు అక్కడికి చేరుకున్న సమయంలో చెక్‌పోస్టు వద్ద ఇద్దరు ప్రైవేటు వ్యక్తులు వాహనాల డ్రైవర్ల నుంచి డబ్బులు వసూలు చేస్తూ కనిపించారు. విధుల్లో ఉండాల్సిన ఏఎంవీఐ కవిత, కానిస్టేబుల్ మొయినొద్దీన్ నిద్ర పోతున్నారు. ఏసీబీ అధికారులను గుర్తించిన మరికొందరు ప్రైవేటు వ్యక్తులు అక్కడి నుంచి పారిపోయారు. చెక్‌పోస్ట్ పక్కన ఉన్న రేకుల షెడ్డులో ఏర్పాటుచేసిన ఒక డబ్బాలో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే లారీల డ్రైవర్లు డబ్బులు వేస్తూ వెళ్తున్నారు. ఏసీబీ అధికారుల ముందే డ్రైవర్లు నగదును డబ్బాలో వేశారు. మొత్తం రూ.91 వేల అక్రమ నగదు లభించిందని డీఎస్పీ తెలిపారు.

రూ. 1,393 కోట్లను తక్షణమే చెల్లించండి

'కాళేశ్వరం' రుణ బకాయిలపై సర్కారుకు ఆర్‌ఈసీ లేఖ




- లేకుంటే రుణాలు నిరర్థక ఆస్తులుగా మారతాయని వెల్లడి
- గడువుకు 75–85 రోజుల తర్వాత చెల్లింపులతో జరిమానా, వడ్డీల భారం తప్పవని స్పష్టీకరణ
- రాష్ట్ర రుణపరపతి, క్రెడిట్ రేటింగ్‌పైనా ప్రతికూల ప్రభావం పడుతుందని హెచ్చరిక
- రుణాల పునర్వ్యవస్థీకరించాలన్న రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి తిరస్కృతి

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ఇరిగేషన్ ప్రాజెక్టు కార్పొరేషన్ లిమిటెడ్ (కేఐపీసీఎల్), తెలంగాణ రాష్ట్ర జలవనరుల మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (టీఎస్‌డబ్ల్యూఆర్ఐడీసీఎల్) పేరుతో తీసుకున్న రుణాలకు సంబంధించిన రూ. 1,393.65 కోట్ల బకాయిలను తక్షణమే చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ (ఆర్‌ఈసీ) కోరింది. గడువులోగా బకాయిలను చెల్లించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం కావడంతో ఈ నెల 6న ఆర్‌ఈసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జతీన్‌కుమార్ నాయక్ రాష్ట్ర నీటి పారుదల శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జాకు లేఖ రాశారు. ఈ లేఖను బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత గురువారం మీడియాకు విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన రూ. 1,393.65 కోట్ల బకాయిల్లో టీఎస్‌డబ్ల్యూఆర్ఐడీసీ, కేఐపీసీఎల్‌కి సంబంధించి వరుసగా రూ. 319.75 కోట్లు, రూ. 292.75 కోట్లు గత 68 రోజులుగా మొండిబకాయిలుగా మారాయని, వాటిని వరుసగా ఈ నెల 28, 29 తేదీల్లోగా చెల్లించకుంటే ఇరు సంస్థల రుణాలూ నిరర్థక ఆస్తులుగా మారిపోతాయని ఆర్‌ఈసీ పేర్కొంది. రుణాల చెల్లింపుల్లో ఈ తరహా జాప్యం వల్ల ఇరు సంస్థలతోపాటు స్థూలంగా రాష్ట్ర ప్రభుత్వ రుణ పరపతిపైనా ప్రతికూల ప్రభావం పడుతుందని.. రేటింగ్ పడిపోతోందని హెచ్చరించింది. మే 31 నాటికి టీఎస్‌డబ్ల్యూఆర్ఐడీసీఎల్, కేఐపీసీఎల్‌కి సంబంధించి వరుసగా రూ. 10,278 కోట్లు, రూ. 17,232 కోట్ల రుణాల చెల్లింపుల్లో జాప్యం జరిగిందని లేఖలో ఆర్‌ఈసీ గుర్తుచేసింది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం కోసం కేఐపీసీఎల్‌కు రూ. 30,536 కోట్ల రుణాన్ని, దేవాదుల, సీతారామ, కంతనపల్లి తదితర ప్రాజెక్టుల నిర్మాణానికి టీఎస్‌డబ్ల్యూఆర్ఐడీసీఎల్‌కి రూ. 13,517 కోట్ల రుణాలు కలిపి మొత్తం రూ. 44,053 కోట్ల రుణాలను ఆర్‌ఈసీ మంజూరు చేసినప్పటికీ అందులో కేఐపీసీఎల్‌కు రూ. 19,448 కోట్లు, టీఎస్‌డబ్ల్యూఆర్ఐడీసీఎల్‌కు రూ. 12,618 కోట్లు కలిపి మొత్తం రూ. 28,995 కోట్లను మాత్రమే విడుదల చేసింది. ఈ రుణాలను గడువులోగా తిరిగి చెల్లించడంలో రాష్ట్ర ప్రభుత్వం పదేపదే విఫలమవుతోందని పేర్కొంటూ గతేడాది నవంబర్ 5న సైతం ఆర్‌ఈసీ లేఖ రాసింది. రుణాలను గడువుకు 75–85 రోజుల తర్వాత చెల్లిస్తుండటంతో ప్రభుత్వంపై జరిమానా, వడ్డీల భారం పడుతోందని గుర్తుచేసింది.

రుణాల పునర్వ్యవస్థీకరణ కుదరదు..

కేఐపీసీఎల్‌తోపాటు టీఎస్‌డబ్ల్యూఆర్ఐడీసీఎల్ పేరుతో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి తీసుకున్న రుణాల తిరిగి చెల్లింపు వ్యవధిని పెంచడంతోపాటు వడ్డీలను తగ్గించడం ద్వారా వాటిని పునర్వ్యవస్థీకరించాలని రాష్ట్ర ప్రభుత్వం చేసిన విజ్ఞప్తిని ఆర్‌ఈసీ తిరస్కరించింది. రుణాల పునర్వ్యవస్థీకరణలో భాగంగా రుణాల గడువును 2039–40 నాటికి పొడిగించాలని కోరుతూ గతంలో రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. 2030 నాటికి 9 శాతం, 2035 నాటికి 18 శాతం, 2036 నాటికి 27 శాతం, 2040 నాటికి 46 శాతం రుణాలను తిరిగి చెల్లించేలా గడువులను పొడిగించాలని కోరింది. అయితే అది కుదరదని గతేడాది నవంబర్ 5న రాసిన లేఖలో ఆర్‌ఈసీ తేల్చిచెప్పింది. రూ. 30 వేల కోట్ల ఆర్‌ఈసీ రుణాల్లో 71 శాతాన్ని 2029–30 నాటికి.. మిగిలిన 29 శాతాన్ని 2035 నాటికి చెల్లించాల్సి ఉంది.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.



మరో లోకం

ఆంధ్రా- ఒడిశా సరిహద్దు ప్రాంతంలో పొగమంచు కనువిందు చేస్తుంది. మాచ్‌ఖండ్ ప్రాజెక్ట్‌లో విద్యుత్ ఉత్పత్తి అనంతరం మెలికలు తిరుగుతూ బిరబిరా పరుగులు పెడుతున్న జలసోయగం ఒకపక్క..కొండలను తాకుతూ పొగమంచు మేఘాలు మరోపక్క ప్రకృతి ప్రేమికుల మనసును దోచేస్తున్నాయి. ఈ దృశ్యాలను చూడాలంటే మాచ్‌ఖండ్, ఒనకఢిల్లీ, డుడుమ ప్రాంతాలను సందర్శించాల్సిందే. - ముంచంగిపుట్టు (అల్లూరి జిల్లా)



జీవితమే ముద్దు.. డ్రగ్స్ వద్దు

డ్రగ్స్‌కు వ్యతిరేకంగా విశాఖలో యువత నడుంబిగించింది. ఆర్‌కే బీచ్ రోడ్డులో గురువారం పలు కళాశాలలకు చెందిన విద్యార్థులు 'జీవితమే ముద్దు- డ్రగ్స్ వద్దే వద్దు', 'డ్రగ్స్‌కు దూరంగా ఉండండి' అంటూ ప్లకార్డులు పట్టుకుని భారీ ర్యాలీ చేపట్టారు. - పీఎల్‌మోహన్, సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం



ప్రయాణం.. ఆహ్లాదకరం

ఎన్టీఆర్ జిల్లా విజయవాడ అలంకార్ సెంటర్ సమీపంలో పచ్చని చెట్ల మధ్య ప్రయాణం వాహనదారులకు ఆహ్లాదకరంగా మారింది. ఓ వైపు వర్షపు చినుకులకు రేగుతున్న మట్టి వాసన...మరోవైపు రోడ్డుకి ఇరువైపులా అలుముకున్న పచ్చని చెట్ల మధ్య ప్రయాణం వాహనదారులకు సరికొత్త అనుభూతినిస్తోంది. - కందుల చక్రపాణి, సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

క్లుప్తంగా...

నకిలీ బంగారంతో ప్రైవేటు బ్యాంకుకు టోకరా

9 మంది అరెస్ట్

నార్పల: మండల కేంద్రంలోని కీర్తన ప్రైవేట్ గోల్డ్ లోన్ బ్యాంకులో నకిలీ బంగారాన్ని తాకట్టు పెట్టి రూ.లక్షల రుణం పొందిన మోసగాళ్లను అనంతపురం జిల్లా నార్పల పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. పట్టుబడిన వారిలో నార్పలకు చెందిన మహమ్మద్ ఇమ్రాన్, దాదాపీర్, కంసాల మంజునాథ్, షేక్ మహబూబ్ బాషా, షేక్ అబ్దుల్ రజాక్, షేక్ సాదిక్ వలి, బాబు, షేక్ యూసుఫ్ బాషా ఉన్నారు. వీరు 125.8 గ్రాముల నకిలీ బంగారాన్ని కీర్తన ప్రైవేట్ గోల్డ్ లోన్ బ్యాంకులో తనఖా పెట్టి ఆ బ్యాంక్ అధికారి మహమ్మద్ షఫీతో కలిసి రూ.9.46 లక్షలు రుణం తీసుకున్నారు. బ్యాంక్ క్లస్టర్ మేనేజర్ కొలంట్ల నాగరాజు ఇటీవల ఆడిటింగ్ చేపట్టగా తాకట్టు పెట్టిన బంగారం నకిలీదిగా నిర్ధారణ అయింది. దీంతో వెంటనే ఆయన నార్పల పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో పోలీసుల విచారణ కొనసాగుతుండగానే గురువారం మరోసారి అదే తరహాలో మోసం చేయడానికి నిందితులు ప్రయత్నించారు. విషయాన్ని గుర్తించిన మేనేజర్ అప్రమత్తం కావడంతో అక్కడి నుంచి ఉడాయించారు. సమాచారం అందుకున్న పోలీసులు గాలింపు చేపట్టి నార్పల క్రాస్ సమీపంలో అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి 10 నకిలీ బంగారు గాజులు, రెండు కడియాలు, మూడు ఉంగరాలు, ఓ ద్విచక్ర వాహనం, షిఫ్ట్ డిజైర్ కారు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేశారు.

నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు

అధికారులకు సీఎస్ ఆదేశం

సాక్షి, అమరావతి: వినియోగదారులకు నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరాకు తగిన అన్ని చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్), ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్ మధ్య ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీసీపీడీసీఎల్) పరిధిలో విద్యుత్ సరఫరాపై అధికారులతో గురువారం ఆయన సమీక్ష నిర్వహించారు. వ్యవసాయ రంగానికి 1,503 ఫీడర్ల ద్వారా 9 గంటల పాటు నిరవధిక విద్యుత్‌ను అందిస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పి.పుల్లారెడ్డి ఈ సందర్భంగా సీఎస్‌కు వివరించారు. ఈ సమావేశంలో ఏపీట్రాన్స్‌కో గ్రిడ్ డైరెక్టర్ ఏకేవీ భాస్కర్, డైరెక్టర్లు టీవీఎస్ఎన్ మూర్తి, మురళి కృష్ణ యాదవ్, చీఫ్ ఇంజినీర్లు, సూపరింటెండింగ్ ఇంజినీర్లు పాల్గొన్నారు.

పర్యాటకంలో మౌలిక వసతుల అభివృద్ధికి కృషి

ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్

సాక్షి, అమరావతి: పర్యాటక రంగంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం శ్రీకారం చుట్టినట్టు పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ తెలిపారు. విజయవాడలో రెండు రోజుల 'టూరిజం టెక్ ఏఐ 2.0 కాన్‌క్లేవ్' గురువారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా అజయ్‌జైన్ మాట్లాడుతూ ఏపీ టూరిజానికి ప్రపంచ స్థాయి గుర్తింపు లక్ష్యంగా పని చేస్తున్నట్టు చెప్పారు. ఏపీటీడీసీ ఎండీ ఆమ్రపాలి మాట్లాడుతూ రాష్ట్రంలో 80 వేలకు పైగా దేవాలయాలు ఉన్నాయని, ఈ నేపథ్యంలో టెంపుల్ టూరిజం ప్రోత్సాహంపై దృష్టి సారించడం జరిగిందని వివరించారు. ఏపీ టీడీసీ చైర్మన్ బాలాజీ, గ్లోబల్ ఫోరం ఫర్ సస్టైనబుల్ టూరిజం సభ్యుడు టక్కర్ తదితరులు తొలిరోజు కార్యక్రమంలో పాల్గొన్నారు.

జూలై 5న పేరెంట్-టీచర్స్ సమావేశం

మార్గదర్శకాలు జారీ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్య పాఠశాలల్లో జూలై 5న పేరెంట్-టీచర్స్ సమావేశం (పీటీఎం) జరగనుంది. ఈ ×మెగా పీటీఎం 2.0₹ కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిన అవసరం ఉందని సమగ్ర శిక్షా ఎస్పీడీ బి.శ్రీనివాసరావు స్పష్టం చేశారు. ఈ మేరకు గురువారం మార్గదర్శకాలు జారీ చేశారు. 61,135 పాఠశాలల్లో నిర్వహించతలపెట్టిన ఈ కార్యక్రమంలో 74,96,228 మంది విద్యార్థులు, 3,32,770 మంది ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, దాతలు తదితరులు 1,49,92,456 పాల్గొంటారన్నారు.

వైజాగ్ టు చైనా

అక్రమంగా రేషన్ బియ్యం రవాణా

- రైస్ వైన్‌లో బియ్యాన్ని వినియోగిస్తున్న చైనా
- అక్కడి డిమాండ్‌ను సొమ్ము చేసుకుంటున్న మాఫియా
- రేషన్ షాపుల ఏర్పాటుతో చెలరేగిపోతున్న ముఠా
- తాజా దాడుల్లో 473 టన్నుల బియ్యం పట్టివేత
- కీలక సూత్రధారి టీడీపీ కార్గో వ్యాపారే..!
- రేషన్ బియ్యం కాదంటూ ల్యాబ్ నివేదికలు?



సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం :

రాష్ట్రంలోని రేషన్ బియ్యం విశాఖ నుంచి చైనాకు ఎగుమతి అవుతోంది. చైనాలో రైస్ వైన్‌గా పిలిచే సంప్రదాయ మద్యపానీయం హువాంగ్జియు తయారీలో విరివిగా బియ్యాన్ని ఉపయోగిస్తారు. అక్కడి డిమాండ్‌కు అనుగుణంగా ఎగుమతి చేసేందుకు విశాఖలోని పలు షిప్పింగ్ కంపెనీలు రేషన్ బియ్యాన్ని మార్గంగా ఎంచుకున్నాయి. రేషన్ మాఫియా ద్వారా సేకరించి చైనాకు ఎగుమతి చేసేందుకు సిద్ధంగా ఉంచిన 473 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని విశాఖలోని పలు కంటైనర్ ఫ్రైట్ స్టేషన్ (సీఎఫ్‌టీ)ల్లో ఈ నెల 23, 24 తేదీల్లో దాడులు చేసి పౌరసరఫరాల శాఖ అధికారులు పట్టుకున్నారు. ఇందులో శ్రావణ్ షిప్పింగ్ సర్వీసెస్ వద్ద 150 మెట్రిక్ టన్నుల బియ్యం, గేటు వే ఈస్ట్ ఇండియా సీఎఫ్‌టీలో 156 మెట్రిక్ టన్నులు, పంచవటి టోల్ గేట్ వద్ద 167 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని గుర్తించినట్టు అధికారులు స్పష్టం చేశారు. ఈ వ్యవహారమంతా ప్రధానంగా టీడీపీకి చెందిన కార్గో వ్యాపారే నడిపిస్తున్నట్టు విమర్శలున్నాయి. పట్టుకున్నవి రేషన్ బియ్యం కాదంటూ ల్యాబ్‌ల ద్వారా



స్వాధీనం చేసుకున్న పీడీఎస్ బియ్యంతో సివిల్ సప్లయిస్ సిబ్బంది

నివేదికలు తెచ్చుకునేందుకు వ్యవహారం నడుస్తున్నట్టు విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అంతా అమ్యామ్యాలే...!

కొన్నాళ్ల క్రితం కాకినాడ నుంచి బియ్యం ఎగుమతి చేస్తున్నారంటూ కూటమి ప్రభుత్వం హంగామా చేసింది. దీంతో సాధారణ బియ్యం ఎగుమతి కూడా అక్కడి నుంచి చేయడం ఇబ్బందిగా మారింది. దీంతో అనేక మంది విశాఖ నుంచి ఎగుమతులకు తమ మకాం మార్చారు. రేషన్ బియ్యం మాఫియా కూడా వారితో పాటు విశాఖ నుంచి చైనాకు బియ్యం ఎగుమతి చేసేందుకు ప్రణాళికలు రచించింది. తాజాగా రేషన్ డిపోలు కూడా ఏర్పాటు కావడంతో రేషన్ మాఫియా మరింత రెచ్చిపోతోంది. ప్రధానంగా భీమిలి నియోజకవర్గంలోని రేషన్ మిల్లులతో పాటు పెందుర్తి, సబ్బవరం ప్రాంతాల్లోని రేషన్ మిల్లుల కేంద్రంగా ఈ వ్యవహారాన్ని నడుపుతున్నారు. సేకరించిన రేషన్ బియ్యాన్ని అక్కడ సన్న బియ్యంగా మలుస్తున్నారు. వివిధ దేశాల ఎగుమతులకు సంబంధించిన అన్ని అనుమతులను కస్టమ్ హౌస్ బ్రోకరేజీ సంస్థలు తీసుకుంటున్నాయి. అనంతరం కస్టమ్స్ నుంచి అనుమతులు పొందుతున్నాయి. తరువాత రేషన్ మిల్లుల నుంచి తీసుకొచ్చి విశాఖలో ఉన్న పలు కంటైనర్ టెర్మినల్ ఫ్రైట్ స్టేషన్ల (సీఎఫ్‌టీ)లో నిల్వ ఉంచి.. కంటైనర్ల ద్వారా ఎగుమతులు చేపడుతున్నారు. టీడీపీకి చెందిన కార్గో వ్యాపారి స్టేషన్ నుంచే కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. వాస్తవానికి పీడీఎస్ బియ్యాన్ని సీజ్ చేయాల్సిన అధికారులు.. కూడా ఈ రేషన్ మాఫియాతో చేతులు కలుపుతున్నారు.

ల్యాబ్ నివేదిక పేరుతో...!

పట్టుకున్న బియ్యం నమూనాలను ల్యాబ్‌కు పంపించామని.. నివేదిక వచ్చిన తర్వాత చర్యలు తీసుకుంటామని పౌరసరఫరాల శాఖ అధికారులు అంటున్నారు. మరోవైపు మొదటి దాడుల్లో పట్టుకున్న 150 మెట్రిక్ టన్నుల బియ్యంలో పరీక్షల కోసం ల్యాబ్‌కు పంపగా.. రేషన్ బియ్యం కాదని నివేదిక వచ్చినట్టు సమాచారం. ఇక మిగిలిన బియ్యం నమూనాల నివేదిక వచ్చిన తర్వాత చర్యలు తీసుకుంటామని అంటున్నారు. ఈ నివేదికలు కూడా రేషన్ బియ్యం కాదని వస్తాయా? అవునని వస్తాయా అనేది చూడాల్సి ఉంది. దాడుల్లో పట్టుకున్న బియ్యం అనుమానిత ప్రజా పంపిణీ బియ్యం అని స్పష్టంగా ప్రకటనల్లో పేర్కొన్న అధికారులు.. ప్రజా పంపిణీ బియ్యం అక్రమంగా రవాణా, నిల్వ చేస్తే చర్యలు తీసుకుంటామని పేర్కొనడం విశేషం.

చైనా డిమాండ్‌ను సొమ్ము చేసుకునేందుకే...!

వాస్తవానికి చైనాలో సంప్రదాయ రైస్ వైన్‌కు డిమాండ్ ఉంది. చైనీస్ రైస్ వైన్ అని కూడా పిలువబడే హువాంగ్జియును ప్రధానంగా చైనాలోని జియాంగ్నాన్ ప్రాంతంలో ఉడికించిన బియ్యాన్ని పులియబెట్టడం ద్వారా తయారుచేస్తారు. దీనికి ఉండే ప్రత్యేకమైన రుచితో పాటు తక్కువ ఆల్కహాల్ (8 నుంచి 20) శాతం, మంచి పోషక విలువలు ఉండటంతో చైనీయులు ఎంతో ఇష్టంగా సేవిస్తారు. ఇందులో అమైనో ఆమ్లాలు, కార్బోహైడ్రేట్లు, విటమిన్లు ఉంటాయి. దీనికి 5 వేల సంవత్సరాలకుపైగా చరిత్ర కలిగి ఉంది. ఈ నేపథ్యంలో చైనాలో ఉండే ఈ రైస్ వైన్ డిమాండ్‌కు అనుగుణంగా వివిధ దేశాల నుంచి బియ్యాన్ని ఆ దేశం దిగుమతి చేసుకుంటుంది. అక్కడి డిమాండ్ ఇక్కడి రేషన్ బియ్యం మాఫియాకు కలిసివస్తోంది. ఇక్కడి నుంచి భారీగా రేషన్ బియ్యాన్ని ఎగుమతి చేయడంలో టీడీపీకి చెందిన కార్గో వ్యాపారి చక్రం తిప్పుతున్నారనే ఆరోపణలున్నాయి.

అమ్మా.. నాన్నా మీ ప్రేమ కావాలి..!

- 'అమ్మా, నాన్న నేను ఇంటిలో ఉండి చదువుకుంటాను. ఇంట్లో వాళ్లను వదిలి ఒక్క క్షణం కూడా ఉండలేను. చదువు పేరుతో నన్ను ఇంటి నుంచి దూరం చేయాలని చూడవద్దు. నాకు మీ ప్రేమానురాగాలు కావాలి. బాగా చదువుకుని టీచరై పిల్లలకు మంచి విద్యాబుద్ధులు నేర్పుతాను' ఓ కుమార్తె అభ్యర్థన.
- నువ్వు హాస్టల్లో ఉండి చదవాల్సిందే. మంచి మార్కులు, ర్యాంకులు సాధించి డాక్టర్ కావాలి. తల్లిదండ్రుల సమాధానం. ఇదీ నేడు కొందరు తల్లిదండ్రులు పిల్లల పట్ల వ్యవహరిస్తున్న తీరు. పిల్లల ఆలోచన, వారి అభిరుచులకు భిన్నంగా స్పందిస్తున్న విధానం. దీంతో పిల్లలు ఒంటరిగా హాస్టళ్లలో ఉండలేకపోతున్నారు. కొందరు ఆత్మ న్యూనతా భావంతో పెరిగి పెద్దవారై ఒంటరితనానికి అలవాటు పడుతున్నారు.
- అన్నమయ్య జిల్లాలో జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్ తరగతులు ప్రారంభమయ్యాయి. చాలా మంది తమ పిల్లలను విజయవాడ, గుంటూరు, తిరుపతి, కడప వంటి నగరాల్లోని కార్పొరేట్, రెసిడెన్షియల్ కాలేజీల్లో చేర్పిస్తున్నారు. అక్కడ హాస్టళ్లలో ఉండలేక చాలా మంది ఇంటి బాటపడుతున్నారు. మరి కొందరు తల్లిదండ్రులు బలవంతంగా అక్కడే ఉండమని నచ్చచెబుతున్నారు. దీంతో విద్యార్థులు ఒంటరితనంతో నిత్యం మానసిక సంఘర్షణ పడుతున్నాయి. ఇలాంటి సంఘటనలు జిల్లాలో పలువురు విద్యార్థుల తల్లిదండ్రులకు ఎదురవుతున్నాయి.

- ప్రేమానురాగాలకు దూరమవుతున్న పిల్లలు
- తల్లిదండ్రుల నుంచి అందని అనురాగం
- ఒంటరితనంతో నిత్యం మానసిక సంఘర్షణ



మదనపల్లె సిటీ: బాల్యం పిల్లలకు దేవుడిచ్చిన వరం. తల్లిదండ్రుల ప్రేమానురాగాల మధ్య ఆడుతూ పాడుతూ, చిరునవ్వులు చిందిస్తూ బాల్యాన్ని ఆస్వాదించాలి. అప్పుడే బాల్యానికి సాకారం. ప్రపంచాన్ని అర్థం చేసుకునే విధానం కుటుంబం నుంచి రావాలి. నేటి పోటీ ప్రపంచం, ప్రపంచీకరణ నేపథ్యంలో కొందరు తల్లిదండ్రులు పిల్లల బాల్యాన్ని హరిస్తూ యాంత్రిక జీవనానికి అలవాటు చేస్తున్నారు. బాల్యంలోని మధురానుభూతులకు దూరం చేస్తున్నారు. పిల్లలను మార్కులు, ర్యాంకులను తయారు చేసే యంత్రాలుగా చేస్తున్నారు. దీని కోసం వారి ఇంటి నుంచి దూరంగా కార్పొరేట్ పాఠశాలల్లో బలవంతంగా చేర్పిస్తున్నారు. పాఠశాల స్నేహితుల సాన్నిహిత్యం ఉన్నా అమ్మ పంచే ప్రేమకు ఏదీ సాటి రాదు. నాన్న చూపే ఆదరణ ఏవీ సరితూగవు. దీంతో పిల్లలు తమలో తాము సంఘర్షణ పడుతూ జీవితాన్ని గడపాల్సిన దుస్థితి ఏర్పడింది. ఎప్పుడూ మార్కులు, ర్యాంకులే కాకుండా వారి కోసం కాస్త సమయాన్ని కూడా కేటాయించి ప్రేమను పంచాలని పిల్లలు తల్లిదండ్రుల నుంచి ఆశిస్తున్నారు. ఇదే విషయాన్ని మనోవ్యక్తిత్వ వికాస నిపుణులు కూడా అంటున్నారు. లేనిపక్షంలో పిల్లల్లో భావవ్యక్తీకరణ నైపుణ్యం తగ్గడంతో పాటు అభద్రతా భావం పెరుగుతుందని చెబుతున్నారు. కౌమార దశలోని పిల్లలకు తల్లిదండ్రుల నుంచి సరైన ప్రేమానురాగాలు లభించకపోతే వారిలో మానసిక రుగ్మతలు చోటు చేసుకుంటాయని వెల్లడిస్తున్నారు. ఆయా వయస్సులో వచ్చే శారీరక, మానసిక మార్పులను సరిచేయక, సరైన మార్గదర్శనం చేయకపోతే పిల్లల భవిష్యత్తు అంధకారమవుతుందని సూచిస్తున్నారు. కొందరు పిల్లలు తప్పటడుగులు వేసే ప్రమాదం కూడా లేకపోలేదని హెచ్చరిస్తున్నారు. మరికొందరైతే ఏ చిన్న సమస్య ఎదురైనా ఆఘాయిత్యాలకు పాల్పడే అవకాశం ఉందని పేర్కొంటున్నారు.

కనుమరుగవుతున్న ఉమ్మడి కుటుంబ వ్యవస్థ

గతంలో అవ్వా, తాతలు, అమ్మానాన్నలు, చిన్నాన్న, పెద్దనాన్న, వారి పిల్లలతో కూడిన ఉమ్మడి కుటుంబాలు ఉండేవి. కాలానుగుణంగా చోటు చేసుకుంటున్న మార్పులతో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ కనుమరుగైంది. నేటి కొందరు తల్లిదండ్రుల ఆలోచనా విధానంతో కనీసం కన్న బిడ్డలతో కూడిన సమిష్టి కుటుంబ వ్యవస్థ కూడా మాయమైపోతోంది. పిల్లలను వసతిగృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో చేర్పించి ఒంటరి జీవన విధానాన్ని అలవాటు చేసుకుంటున్నారు.

మానసిక ఒత్తిడితో అనర్థాలు..



చిన్నప్పటి నుంచే పిల్లలు తల్లిదండ్రుల ప్రేమకు దూరమైతే మానసిక ఒత్తిడి పెరిగి అనేక అనర్థాలకు దారి తీస్తాయి. ఆస్పత్రులకు వైద్య పరీక్షల కోసం వచ్చే విద్యార్థుల్లో అనేక మంది మానసిక ఒత్తిడితో పాటు మనోవేదనకు గురైన వారే ఉంటున్నారు. ఇంటికి, తల్లిదండ్రులకు దూరంగా ఉన్నందున ఆహారం సరిగ్గా తీసుకోకపోవడం, పోషక విలువలు కలిగిన ఆహారం అందకపోవడంతో వ్యాధులకు గురవుతున్నారు.

– చాముండేశ్వరి, సైకాలజిస్టు, మదనపల్లె

నకిలీ ఎస్టీ సర్టిఫికెట్ రద్దు చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు

అల్లిపురం: నకిలీ ఎస్టీ (కొండ దొర) కుల ధ్రువీకరణ పత్రం ఆధారంగా ఎల్‌డీసీ ఉద్యోగం పొందిన విశాఖలోని జ్ఞానాపురానికి చెందిన నమర్ల వెంకటరావు కుమారుడు నమర్ల సత్యనారాయణ చేసుకున్న అప్పీలును కొట్టివేస్తూ గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి ఎం.ఎం.నాయక్ గురువారం ఉత్తర్వులిచ్చారు. 1980లో చింతపల్లి ఎమ్మార్వో కార్యాలయం ద్వారా కొండ దొర(ఎస్టీ) సర్టిఫికెట్ తీసుకున్న సత్యనారాయణ, ఎస్టీ కేటగిరీలో ఎల్‌డీసీ పోస్టును పొందారు. ప్రస్తుతం విశాఖ జిల్లా, ప్రిన్సిపల్ కమిషనర్ ఆఫ్ కస్టమ్స్ కార్యాలయంలో కస్టమ్స్ సూపరింటెండెంట్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నాడు. అతను పొందిన ఎస్టీ సర్టిఫికెట్‌ను సవాల్ చేస్తూ అతని సోదరుడు కోటేశ్వరరావు ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన అధికారులు.. సత్యనారాయణ ఎస్టీ సర్టిఫికెట్‌ను రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు సత్యనారాయణ అప్పీలుకు వెళ్లడంతో అప్పిలేట్ అధికారి విచారణ చేపట్టి నమర్ల సత్యనారాయణ ఎస్టీ కాదని, అతను సూచించిన బలపం గ్రామంలో ఆ ఇంటి పేరు గల వారు కొండదొర కేటగిరీలో లేరని నిరూపణకావటంతో అప్పీలును కొట్టివేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు విశాఖ జిల్లా కలెక్టర్ తగు చర్యలు తీసుకోవాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ప్రసూతి సేవలపై ముగిసిన వర్క్‌షాప్

సాక్షి, అమరావతి: సహాయక సాధారణ ప్రసవాలపై రాష్ట్ర స్థాయి ట్రైనింగ్ ఆఫ్ ట్రైనర్స్ (టీవోటీ) వర్క్‌షాప్ విజయవాడలో గురువారం విజయవంతంగా ముగిసింది. రెండు రోజుల పాటు జరిగిన ఈ వర్క్‌షాపును ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఫెర్నాండెజ్ ఫౌండేషన్, యూనిసెఫ్ సంయుక్తంగా నిర్వహించాయి. సాధారణ ప్రసవాలుసహా ప్రసూతి సేవలకు సంబంధించి పలు అంశాలను వర్క్‌షాప్‌లో వివరించడం జరిగింది. సాధారణ ప్రసవాలకు సంబంధించి శిక్షణ పొందిన మాస్టర్ ట్రైనర్లకు ధ్రువపత్రాలు అందజేశారు.

ప్రారంభమైన జాతీయ విద్యుత్ భద్రతా వారోత్సవాలు

సాక్షి,అమరావతి: జాతీయ విద్యుత్ భద్రతా వారోత్సవాలు దేశ వ్యాప్తంగా గురువారం ప్రారంభమయ్యాయి. జూన్ 26వ తేదీన నిర్వహించే 'విద్యుత్ భద్రతా దినం' సందర్భాన్ని పురస్కరించుకుని 'స్మార్ట్ ఎనర్జీ సేఫ్ నేషన్' నినాదంతో ఈ వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. వినియోగదారుల్లో విద్యుత్ భద్రత గురించి అవగాహన పెంపొందించడం, విద్యుత్ ప్రమాదాలను తగ్గించడం ఈ వారోత్సవాల ముఖ్య ఉద్దేశ్యమని ప్రభుత్వ ప్రధాన విద్యుత్ తనిఖీ అధికారి విజయలక్ష్మి ఈ సందర్భంగా తెలిపారు. పల్నాడు జిల్లా దాచేపల్లిలో జరిగిన వారోత్సవాల్లో ఆమె పాల్గొని విద్యుత్ భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు.



విద్యుత్ భద్రతా వారోత్సవాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ప్రధాన విద్యుత్ తనిఖీ అధికారి విజయలక్ష్మి



శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 75,001 మంది స్వామివారిని దర్శించుకోగా 23,765 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ. 3.67 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 08 గంటల్లో దర్శనం లభిస్తోంది.

వేడుకగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

చంద్రగిరి : శ్రీనివాసమంగాపురం శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో జూన్ 30 నుంచి జులై 2వ తేదీ వరకు జరగనున్న సాక్షాత్కార వైభవోత్సవాలను పురస్కరించుకుని గురువారం వేడుకగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం చేపట్టారు. తెల్లవారుజామున సుప్రభాతంతో స్వామి వారిని మేల్కొలిపి తోమాలసేవ, కొలువు, పంచాంగ శ్రవణం నిర్వహించారు.



పెద్దింట్లమ్మ ఆలయ హుండీ ఆదాయం లెక్కింపు

కైకలూరు: ఏలూరు జిల్లా కైకలూరు మండలం కొల్లేటికోట గ్రామంలో కొలువైన పెద్దింట్లమ్మ దేవస్థానంలో గురువారం ఆలయ హుండీలను అధికారులు లెక్కించారు. 90 రోజుల పాటు భక్తులు సమర్పించిన కానుకల రూపంలో మొత్తం రూ.14,92,289 ఆదాయం వచ్చిందని ఆలయ ఈవో కూచిపూడి శ్రీనివాస్ చెప్పారు. పర్యవేక్షణ అధికారిగా గుడివాడ దేవదాయ శాఖ తనిఖీ అధికారి సుధాకర్ వ్యవహరించారు. దేవాలయ సేవా సమితి సభ్యులు, పోలీసు, రెవెన్యూ సిబ్బంది, గ్రామ పెద్దలు హాజరయ్యారు.



ఆర్టీసీ డ్రైవర్ల శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

నరసరావుపేట: నరసరావుపేట ఏపీఎస్ఆర్టీసీ డిపో ఆవరణలోని డ్రైవర్ల శిక్షణ స్కూల్‌లో 20వ బ్యాచ్ శిక్షణకు ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని డిపో మేనేజర్ శ్రీనివాసరావు కోరారు. వచ్చేవారంలో బ్యాచ్ ప్రారంభం కానుందన్నారు. అభ్యర్థులు తప్పనిసరిగా ఏడాది క్రితమే లైట్ వెయిట్ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. శిక్షణ ఫీజు రూ.23వేలుగా నిర్ధయించామని, ఆసక్తిగల అభ్యర్థులు 99592 25428 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

30న మెగా జాబ్‌మేళా

చిలకలూరిపేటటౌన్: ఈనెల 30వ తేదీ సోమవారం పట్టణంలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఇ.తమ్మాజీ రావు, మోడరన్ సంస్థల డైరెక్టర్ చేబ్రోలు మహేష్ తెలిపారు. ఏపీ నైపుణ్యాభివృద్ధి, శిక్షణశాఖ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, మోడరన్ డిగ్రీ కళాశాల సంయుక్తంగా ఈమెగామేళాను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. స్థానిక ఎన్‌ఆర్‌టీ సెంటర్‌లోని మోడరన్ డిగ్రీ కళాశాల కాంప్లెక్స్‌లో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జాబ్‌మేళా జరుగుతుందన్నారు. ఇందులో ఫ్లాస్క్ టెక్ సొల్యూషన్స్, గోదావరి ఆంధ్రా బ్యాంక్, మాస్టర్ మైండ్స్, దివి ఆగ్రోస్, స్కిల్ క్రాఫ్ట్, మెడ్‌ప్లస్ ఫార్మసీ వంటి 10 ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. మేళాలో ఎంపికైన వారికి వారి విద్యార్హత ప్రకారంగా రూ.12 నుంచి రూ.35 వేలు వేతనం ఉంటుందన్నారు. పది, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, బీటెక్, డిప్లొమా, ఫార్మసీ, పీజీ పూర్తి చేసిన 18 నుంచి 40 ఏళ్ల వయస్సు గల వారు పాల్గొనవచ్చన్నారు. ఇంటర్వ్యూకు తమ బయోడేటా, రెజ్యూమ్, విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్ నకళ్లు, రెండు పాస్‌పోర్ట్ ఫొటోలుతో హాజరుకావాలన్నారు.

సందడే సందడి

భాగ్యనగరంలో భలే జోరుగా షూటింగ్ చేస్తూ బిజీ బిజీగా ఉన్నారు టాలీవుడ్ స్టార్ హీరోస్. సందడి సందడిగా ఈ షూటింగ్స్ జరుగుతున్నాయి. మరి... హైదరాబాద్‌లో ఏ స్టార్ ఎక్కడెక్కడ షూటింగ్ చేస్తున్నారో తెలుసుకుందాం.



షామిర్‌పేటలో...

తెలుగు చిత్ర పరిశ్రమలోని అగ్ర హీరోల్లో ఒకరైన చిరంజీవి ఫుల్ స్వింగ్‌లో ఉన్నారు. 'బింబిసార' ఫేమ్ మల్లిడి వశిష్ఠ దర్శకత్వంలో ఒక పాట మినహా 'విశ్వంభర' సినిమా పూర్తి చేశారు చిరంజీవి. ప్రస్తుతం అనిల్ రావిపూడి దర్శకత్వంలో 'మెగా 157' (వర్కింగ్ టైటిల్) అనే చిత్రంలో నటిస్తున్నారు చిరంజీవి. 'సంక్రాంతికి వస్తున్నాం' వంటి బ్లాక్ బస్టర్ తర్వాత అనిల్ దర్శకత్వం వహిస్తున్న చిత్రమిది. అర్చన సమర్పణలో షైన్ స్క్రీన్స్ బ్యానర్, గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్మెంట్స్‌పై సాహు గారపాటి, సుష్మిత కొణిదెల నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో హీరోయిన్‌గా నయనతార నటిస్తున్నారు. ఈ సినిమాకు సంబంధించి ఇప్పటికే రెండు షెడ్యూల్స్ పూర్తయ్యాయి. మూడవ షెడ్యూల్ చిత్రీకరణ హైదరాబాద్ సమీపంలోని షామిర్‌పేటలో శరవేగంగా జరుగుతోంది. చిరంజీవితో పాటు ఇతర తారాగణంపై కీలక సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారని సమాచారం. ఈ నెలాఖరు వరకు అక్కడే షూటింగ్ ఉంటుందని, జూలై 1 నుంచి కేరళలో కొత్త షెడ్యూల్ ప్రారంభం అవుతుందనీ తెలిసింది. చాలా గ్యాప్ తర్వాత చిరంజీవి నటిస్తున్న పూర్తి స్థాయి వినోదాత్మక చిత్రం ఇది. ఆయన మార్క్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో పాటు అనిల్ రావిపూడి మార్క్ కామెడీతో ఈ సినిమా రూపొందుతోందని టాక్. 'మెగా 157' చిత్రం 2026 సంక్రాంతికి విడుదల కానుంది.



అఖండ తాండవం

హీరో బాలకృష్ణ, డైరెక్టర్ బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో తెరకెక్కుతోన్న తాజా చిత్రం 'అఖండ 2: తాండవం'. 'సింహా, లెజెండ్, అఖండ' వంటి హిట్ చిత్రాల తర్వాత వారి కాంబినేషన్‌లో రూపొందుతోన్న నాలుగో చిత్రమిది. సంయుక్తా మీనన్ హీరోయిన్‌గా నటిస్తుండగా ఆది పినిశెట్టి విలన్‌గా నటిస్తున్నారు. ఎం. తేజస్విని నందమూరి సమర్పణలో 14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ హైదరాబాద్‌కి సమీపంలోని ఓ ప్రముఖ స్టూడియోలో జరుగుతోంది. బాలకృష్ణతో పాటు ఇతర నటీనటులపై ముఖ్యమైన సన్నివేశాలను తెరకెక్కిస్తున్నారట బోయపాటి శ్రీను. ఈ చిత్రం సెప్టెంబర్ 25న విడుదల కానుంది.



ఆర్‌ఎఫ్‌సీలో...

వరుస పాన్ ఇండియా సినిమాలతో దూసుకెళుతున్నారు హీరో ప్రభాస్. ఆయన కథానాయకుడిగా 'సీతారామం' మూవీ ఫేమ్ హను రాఘవపూడి దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. ఈ సినిమాకి 'ఫౌజి' అనే టైటిల్ ప్రచారంలో ఉంది. ఈ చిత్రంలో ప్రభాస్‌కు జోడీగా ఇమాన్వీ నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న ఈ సినిమాలో జయప్రద, మిథున్ చక్రవర్తి, అనుపమ్ ఖేర్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ స్టూడియోలో జరుగుతోంది. సినిమాలోని ప్రధాన తారాగణంపై ముఖ్యమైన సన్నివేశాలు తీస్తున్నారట హను రాఘవపూడి. 'సీతారామం' వంటి హిట్ మూవీ తర్వాత ఏడాదికి పైగా సమయం తీసుకుని 'ఫౌజి' కథను తీర్చిదిద్దారు దర్శకుడు. పీరియాడికల్ బ్యాక్‌డ్రాప్‌లో రూపొందుతోన్న ఈ చిత్రంలో ఆలియా భట్ యువరాణి పాత్ర చేయనున్నారనే టాక్ వినిపిస్తోంది.



ఆటా పాటా

ఎన్టీఆర్, ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న సినిమా షూటింగ్ హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ స్టూడియోలో జరుగుతోంది. 'ఆర్ఆర్ఆర్, దేవర' వంటి వరుస హిట్ చిత్రాల తర్వాత ఎన్టీఆర్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'ఎన్టీఆర్ నీల్' (వర్కింగ్ టైటిల్). 'కేజీఎఫ్, సలార్' చిత్రాల ఫేమ్ ప్రశాంత్ నీల్ దర్శకత్వం వహిస్తున్నారు. గుల్షన్ కుమార్, భూషణ్ కుమార్, టి. సిరీస్ ఫిల్మ్స్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ బ్యానర్స్‌పై కల్యాణ్‌రామ్ నందమూరి, నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమంచిలి, హరికృష్ణ కొసరాజు నిర్మిస్తున్నారు. ఈ సినిమాకి 'డ్రాగన్' అనే టైటిల్ పరిశీలనలో ఉంది. ప్రస్తుతం జరుగుతున్న షెడ్యూల్‌లో భాగంగా ఎన్టీఆర్‌పై ఓ సాంగ్‌ను చిత్రీకరిస్తున్నారట మేకర్స్. అయితే ఇది రెగ్యులర్ సాంగ్ కాదని, దేశభక్తి నేపథ్యంలో ఉంటుందని ఫిల్మ్‌నగర్ టాక్. ఈ చిత్రంలో రుక్మిణీ వసంత్ హీరోయిన్‌గా, మలయాళ నటుడు టొవినో థామస్ కీలక పాత్రలో నటిస్తున్నారట. అయితే దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. కాగా ఈ సినిమా 2026 జూన్ 25న ప్రేక్షకుల ముందుకు రానుంది.



శంకర్‌పల్లిలో...

హీరో మహేశ్‌బాబు నటిస్తున్న తాజా చిత్రం 'ఎస్ఎస్ఎంబీ 29' (వర్కింగ్ టైటిల్). 'ఆర్ఆర్ఆర్' వంటి బ్లాక్‌బస్టర్ మూవీ తర్వాత ప్రముఖ దర్శకుడు రాజమౌళి దర్శకత్వం వహిస్తున్న సినిమా ఇది. దుర్గా ఆర్ట్స్‌పై కేఎల్ నారాయణ నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో ప్రియాంకా చోప్రా నటిస్తున్నారు. అయితే ఆమెది హీరోయిన్ పాత్ర కాదని... నెగటివ్ క్యారెక్టర్ అని టాక్. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్ సమీపంలోని శంకర్‌పల్లిలోని ఓ స్టూడియోలో జరుగుతోంది. అమేజాన్ అడవుల నేపథ్యంలో అడ్వెంచరస్ మూవీగా తెరకెక్కుతోన్న ఈ సినిమా కోసం ప్రత్యేకంగా సెట్స్ వేశారట. ప్రస్తుతం మహేశ్ బాబు, ఇతర నటీనటులపై సన్నివేశాలు తెరకెక్కిస్తున్నారని సమాచారం. ఈ సినిమా కోసం గుబురు గడ్డం, పొడవైన జుట్టుతో మహేశ్ సరికొత్త లుక్‌లోకి మారిపోయారు. ఈ చిత్రంలో మలయాళ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్ర చేస్తున్నారు. ఈ సినిమా 2027లో ప్రేక్షకుల ముందుకు రానుందని ఫిల్మ్‌నగర్ టాక్.



మొయినాబాద్‌లో...

హీరో రవితేజ, దర్శకుడు కిశోర్ తిరుమల కాంబినేషన్‌లో 'ఆర్‌టీ 76' (వర్కింగ్ టైటిల్) సినిమా తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. రవితేజ నటిస్తున్న 76వ చిత్రం ఇది. ఎస్ఎల్‌వీ సినిమాస్ పతాకంపై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌కి సమీపంలోని మొయినాబాద్‌లో జరుగుతోంది. ఈ సినిమా కోసం వేసిన ప్రత్యేకమైన సెట్‌లో చిత్రీకరణ జరుగుతోంది. రవితేజతో పాటు ప్రధాన తారాగణం ఈ షెడ్యూల్ షూటింగ్‌లో పాల్గొంటున్నారని సమాచారం. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న ఈ సినిమాలో రవితేజ ట్రేడ్ మార్క్ కామిక్ టైమింగ్, మాస్ అప్పీల్ మిస్ అవకుండా కథను సిద్ధం చేశారు కిశోర్ తిరుమల. ఈ సినిమా కోసం రవితేజ స్పెషల్‌గా మేకోవర్ అయ్యారు. 2026 సంక్రాంతికి ఈ సినిమా విడుదల కానుంది.

అల్యూమినియం ఫ్యాక్టరీలో...

రామ్ పోతినేని హీరోగా 'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి' మూవీ ఫేమ్ మహేశ్ బాబు పి. దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'ర్యాపో 22' (వర్కింగ్ టైటిల్). ఈ సినిమాలో భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న ఈ సినిమా తాజా షెడ్యూల్ హైదరాబాద్ గచ్చిబౌలిలోని అల్యూమినియం ఫ్యాక్టరీలో జరుగుతోంది. హీరో హీరోయిన్లతో పాటు ఇతర తారాగణంపై కీలకమైన సన్నివేశాలను తెరకెక్కిస్తున్నారట దర్శకుడు. రాజమండ్రిలో 34 రోజుల పాటు నాన్‌స్టాప్‌గా డే అండ్ నైట్ షూటింగ్ చేసిన అనంతరం తర్వాతి షెడ్యూల్‌ని హైదరాబాద్‌లో చిత్రీకరిస్తున్నారు యూనిట్.



ముచ్చింతల్‌లో...



'దసరా' (2023) వంటి బ్లాక్‌బస్టర్ మూవీ తర్వాత హీరో నాని, డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల, నిర్మాత సుధాకర్ చెరుకూరి కాంబినేషన్‌లో తెరకెక్కుతోన్న తాజా చిత్రం 'ది ప్యారడైజ్'. ఎస్ఎల్‌వీ సినిమాస్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం శంషాబాద్ సమీపంలోని ముచ్చింతల్‌లో జరుగుతోంది. నానితో పాటు ఇతర నటీనటులపై ముఖ్యమైన సన్నివేశాలను రూపొందిస్తున్నారట శ్రీకాంత్ ఓదెల. ఈ సినిమాలో ఫుల్ మాస్ లుక్‌లో కనిపించనున్నారు నాని. 'ది ప్యారడైజ్' నుంచి 'రా స్టేట్‌మెంట్' పేరుతో ఇప్పటికే విడుదలైన ఓ గ్లింప్స్ ఈ విషయాన్ని స్పష్టం చేసింది. ఈ సినిమా 2026 మార్చి 26న రిలీజ్ కానుంది.



గండిపేటలో...

'డీజే టిల్లు, టిల్లు స్క్వేర్' చిత్రాల ఫేమ్ సిద్ధు జొన్నలగడ్డ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'తెలుసు కదా'. ప్రముఖ స్టైలిస్ట్ నీరజ కోన ఈ సినిమా ద్వారా డైరెక్టర్‌గా పరిచయం అవుతున్నారు. రాశీ ఖన్నా, శ్రీనిధీ శెట్టి హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రంలో వైవా హర్ష కీలక పాత్ర పోషిస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వ ప్రసాద్, టీజీ కృతీ ప్రసాద్ నిర్మిస్తున్న ఈ సినిమా చివరి షెడ్యూల్ షూటింగ్ హైదరాబాద్ సమీపంలోని గండిపేటలో జరుగుతోంది. ప్రత్యేకంగా వేసిన సెట్‌లో సిద్ధు జొన్నలగడ్డ, రాశీ ఖన్నా, శ్రీనిధిలపై కీలకమైన సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. మనసును హత్తుకునే స్వచ్ఛమైన ప్రేమ, అనుబంధాల నేపథ్యంలో అద్భుతమైన భావోద్వేగాలు, వినోదాలతో ఈ సినిమా రూపొందుతోంది. దీపావళి పండుగ సందర్భంగా అక్టోబర్ 17న సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది.



తుక్కుగూడలో...

'విరూపాక్ష, బ్రో' వంటి హిట్ సినిమాల తర్వాత సాయి దుర్గా తేజ్ నటిస్తున్న తాజా చిత్రం 'ఎస్‌వైజీ' (సంబరాల ఏటిగట్టు). నూతన దర్శకుడు రోహిత్ కేపీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో ఐశ్వర్యా లక్ష్మి హీరోయిన్. ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్‌పై 'హను మాన్' వంటి బ్లాక్ బస్టర్ మూవీ నిర్మించిన కె. నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి ఈ పాన్ ఇండియా ప్రాజెక్ట్‌ను నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్ సమీపంలోని తుక్కుగూడలో జరుగుతోంది. హీరో, హీరోయిన్‌తో పాటు ప్రముఖ తారాగణంపై కీలకమైన సన్నివేశాలు తెరకెక్కిస్తున్నారట మేకర్స్. ఈ సినిమా సెప్టెంబర్ 25న తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో రిలీజ్ కానుంది.

శంషాబాద్‌లో...

'జాతి రత్నాలు, మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి' చిత్రాల ఫేమ్ నవీన్ పొలిశెట్టి హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'అనగనగా ఒక రాజు'. మారి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో మీనాక్షీ చౌదరి హీరోయిన్‌గా నటిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న ఈ సినిమా తాజా షెడ్యూల్ శంషాబాద్‌లో జరుగుతోంది. నవీన్ పొలిశెట్టితో పాటు ఇతర తారాగణం పాల్గొంటున్న ఈ షెడ్యూల్ చిత్రీకరణ శరవేగంగా సాగుతోంది.



ప్రముఖ స్టూడియోలో...

'హనుమాన్' (2024) చిత్రంతో పాన్ ఇండియన్ హిట్ అందుకున్న తేజ సజ్జా హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'మిరాయ్'. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో రితికా నాయక్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. మనోజ్ మంచు, జగపతి బాబు, శ్రియ శరణ్, జయరామ్ ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టీజీ విశ్వ ప్రసాద్, కృతీ ప్రసాద్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం ఓ ప్రముఖ స్టూడియోలో జరుగుతోంది. టీమ్ అంతా ఈ షెడ్యూల్‌లో పాల్గొంటున్నారని సమాచారం. భారీ బడ్జెట్‌తో రూపొందుతోన్న ఈ సినిమాలో విజువల్ ఎఫెక్ట్స్ హైలైట్‌గా నిలవనున్నాయి. 'మిరాయ్' 8 భాషల్లో 2డీ, 3డీ ఫార్మాట్‌లో సెప్టెంబర్ 5న ప్రేక్షకుల ముందుకు వస్తోంది.



పై సినిమాలే కాదు.. మరికొన్ని చిత్రాలు కూడా హైదరాబాద్‌తో పాటు పరిసర ప్రాంతాల్లో చిత్రీకరణ జరుపుకుంటున్నాయి.

• దేరంగుల జగన్ మోహన్

చిటుకు... చిటుకు


• రజనీకాంత్

రజనీకాంత్ హీరోగా నటించిన తాజా చిత్రం 'కూలీ'. లోకేష్ కనగరాజ్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో నాగార్జున, సత్యరాజ్, సౌబిన్ షాహిర్, ఉపేంద్ర, శ్రుతీ హాసన్, మహేంద్రన్ కీలక పాత్రలు పోషించారు. సన్ పిక్చర్స్ బ్యానర్‌పై కళానిధి మారన్ నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా విడుదలకానుంది. ఈ సినిమా తెలుగు విడుదల హక్కులను డి. సురేష్ బాబు, సునీల్ నారంగ్, 'దిల్' రాజు యాజమాన్యంలోని ఏషియన్ మల్టీప్లెక్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ సొంతం చేసుకుంది. తెలుగు రాష్ట్రాల్లో ఈ సినిమాను ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ విడుదల చేయనుంది. అనిరుధ్ రవిచంద్రన్ సంగీతం అందించిన ఈ సినిమా నుంచి 'చికిటు..' అనే పాటని విడుదల చేశారు మేకర్స్. శ్రీనివాస మౌళి సాహిత్యం అందించిన ఈ పాటని అనిరుధ్, అరివు పాడారు. ''కూలీ' నుంచి ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్లు, టీజర్లు సినిమాపై భారీ క్రేజ్‌ను నెలకొల్పాయి. తాజాగా విడుదలైన 'చికిటు..' పాటకి మంచి స్పందన వస్తోంది'' అని మేకర్స్ పేర్కొన్నారు. ఈ చిత్రానికి కెమేరా: గిరీష్ గంగాధరన్.

వార్‌కు కౌంట్‌డౌన్ స్టార్ట్


• కియారా అద్వానీ

థియేటర్స్‌లో 'వార్ 2'కి యాభై రోజుల కౌంట్‌డౌన్ మొదలైంది. హృతిక్ రోషన్, ఎన్టీఆర్, కియారా అద్వానీ లీడ్ రోల్స్‌లో నటించిన స్పై యాక్షన్ సినిమా 'వార్ 2'. 'వైఆర్ఎఫ్ (యశ్‌రాజ్ ఫిల్మ్స్)' స్పై యూనివర్స్‌లో భాగంగా రూపొందిన 'వార్ 2'ని అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో ఆదిత్యా చోప్రా నిర్మించారు. ఈ చిత్రం ఆగస్టు 14న విడుదల కానుంది. కాగా ఈ సినిమా విడుదలకు సరిగ్గా 50 రోజులు ఉన్న నేపథ్యంలో ఈ సినిమాలో నటించిన ఎన్టీఆర్, హృతిక్ రోషన్, కియారా అద్వానీల పోస్టర్స్‌ను మేకర్స్ గురువారం విడుదల చేశారు. అలాగే 'వార్ 2' సినిమాను ఉత్తర అమెరికా, మిడిల్ ఈస్ట్, యూకె, యూరప్, ఆస్ట్రేలియా, ఆఫ్రికా, సౌత్ ఈస్ట్ ఆసియా సహా భారతదేశంలో ఐమ్యాక్స్ థియేటర్లలో విడుదల చేయనున్నట్లుగా కూడా మేకర్స్ తెలిపారు. ''భారతీయ సినీ పరిశ్రమలో ఇద్దరు సూపర్ స్టార్స్ హృతిక్ రోషన్, ఎన్టీఆర్‌ల మధ్య జరిగే ఈ అద్భుతమైన పోరును ఐమ్యాక్స్ ఫార్మాట్‌లో ప్రదర్శించడం ద్వారా ప్రపంచవ్యాప్తంగా ఉన్న అభిమానులకు, ప్రేక్షకులకు ఒక అద్భుతమైన అనుభూతిని అందించనున్నాం'' అని తెలిపారు యశ్ రాజ్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిబ్యూషన్ వైస్ ప్రెసిడెంట్ నెల్సన్ డిసౌజా. ''యాక్షన్' చిత్రాలకే 'వార్ 2' సినిమా ఓ పాఠంలా ఉంటుంది. ప్రేక్షకులు మర్చిపోలేని సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌ను ఐమ్యాక్స్‌లో మాత్రమే పొందగలరు'' అని పేర్కొన్నారు ఐమ్యాక్స్ ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్, డిస్ట్రిబ్యూషన్ వైస్ ప్రెసిడెంట్ క్రిస్టఫర్ టిల్మాన్.

ఇదిగో తీసుకో..!


• సూర్య సేతుపతి

విలక్షణ నటుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్న విజయ్ సేతుపతి తనయుడు సూర్య సేతుపతి హీరోగా పరిచయం కానున్న చిత్రం 'ఫీనిక్స్'. స్టంట్ మాస్టర్ అనల్ అరసు దర్శకత్వంలో ఏకే బ్రేవ్‌మ్యాన్ పిక్చర్స్ నిర్మించిన ఈ చిత్రానికి సామ్ సీఎస్ సంగీతం అందించారు. గురువారం ఈ సినిమాలోని 'ఇందా వాంగికో...' (ఇదిగో తీసుకో అని అర్థం) అంటూ సాగే రెండో పాటను విడుదల చేశారు. ''బాబా భాస్కర్ కొరియోగ్రఫీ, ఛాయాగ్రాహకుడు వేల్‌రాజ్ అందించిన కలర్‌ఫుల్ విజువల్స్, సూర్య సేతుపతి ఎనర్జిటిక్ డ్యాన్స్ ఈ పాటకు ప్రత్యేక ఆకర్షణగా ఉంటాయి. ఇక గతంలో 'నానుమ్ రౌడీదాన్, సిందుబాద్' వంటి చిత్రాల్లో చిన్న పాత్రలు చేసిన సూర్య సేతుపతి పూర్తి స్థాయిలో హీరోగా నటించిన చిత్రం 'ఫీనిక్స్'. పవర్‌ఫుల్ యాక్షన్, చక్కని ఎమోషన్‌తో రూపొందించిన ఈ చిత్రాన్ని జూలై 4న విడుదల చేయనున్నాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది.

బిజినెస్ రీల్

సర్వీస్ నెట్‌వర్క్ విస్తరణలో మారుతీ సుజుకీ




న్యూఢిల్లీ: ఆటోమొబైల్ దిగ్గజం మారుతీ సుజుకీ తమ సర్వీస్ నెట్‌వర్క్‌ను మరింతగా పెంచుకోవడంపై దృష్టి పెట్టింది. ప్రస్తుతం 5,400గా ఉన్న టచ్‌పాయింట్ల సంఖ్యను 2030–31 నాటికి 8,000కు పెంచుకోనుంది. వివిధ రకాల కస్టమర్ల అవసరాలను తీర్చేందుకు, అలాగే తమ ఎలక్ట్రిక్ వాహన ఆవిష్కరణకు కూడా ఇది ఉపయోగపడుతుందని మారుతీ సుజుకీ ఇండియా ఎండీ హిసాషి తకెయుచి తెలిపారు. 1,000 పైగా నగరాల్లో 1,500 ఈవీ ఎనేబుల్డ్ సర్వీస్ స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. వీటిలో సుశిక్షితులైన సిబ్బంది, అధునాతనమైన పరికరాలు ఉంటాయని తకెయుచి చెప్పారు. మే నెలలో తమ సంస్థ భారీ స్థాయిలో 24.5 లక్షల వాహనాలను సర్వీస్ చేసినట్లు వివరించారు.

శాంసంగ్ అమ్మకాలకు ప్రీమియం దన్ను..



న్యూఢిల్లీ: ఈ ఏడాది ప్రథమార్ధంలో విక్రయాల్లో కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత ఉపకరణాల వాటా 50 శాతం ఉంటుందని కన్జూమర్ ఎలక్ట్రానిక్స్ దిగ్గజం శాంసంగ్ అంచనా వేస్తోంది. అమ్మకాల వృద్ధికి ప్రీమియం ఉత్పత్తులు కీలకంగా ఉంటాయని శాంసంగ్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ గుఫ్రాన్ ఆలం తెలిపారు. 2025లో రిఫ్రిజిరేటర్ సెగ్మెంట్‌లో సింగిల్ డిజిట్ వృద్ధిని, ప్రీమియం విభాగంలో రెండంకెల స్థాయి వృద్ధిని అంచనా వేస్తున్నట్లు చెప్పారు. మరోవైపు, తమ రిటైల్ స్టోర్స్‌ను విస్తరిస్తున్నామని, దేశవ్యాప్తంగా మరో 150 ఎక్స్‌క్లూజివ్ బ్రాండ్ ఔట్‌లెట్స్‌ను ఏర్పాటు చేస్తున్నామని ఆలం వివరించారు. దీంతో ఈ ఏడాది ఆఖరు నాటికి ఔట్‌లెట్స్ సంఖ్య 900కి చేరుతుందని చెప్పారు.

అన్‌లిమిటెడ్ 'రెడ్ సేల్ అలర్ట్'



హైదరాబాద్: గడిచిన వారాలుగా భారీ తగ్గింపు, డిస్కౌంట్లతో అలరిస్తున్న 'రెడ్ సేల్ అలర్ట్' ఆఫర్ త్వరలో ముగుస్తుంది, త్వరపడాలంటూ అన్‌లిమిటెడ్ స్టోర్ తెలిపింది. ఆఫర్‌లో భాగంగా బ్రాండెడ్ వస్త్రాలపై 50% ఫ్లాట్ డిస్కౌంట్ అదిస్తుంది. అలాగే రూ.3వేల షాపింగ్‌పై అంతే విలువైన ఉత్పత్తులు ఉచితంగా పొందవచ్చు. ఫ్యాషన్ ఇష్టపడే ప్రతి ఒక్కరూ 'రెడ్ సేల్ అలర్ట్' ఆఫర్‌ను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కంపెనీ కోరింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

27-6-2025

విశాఖ	575–00
చిత్తూరు	623–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	560–00
విజయవాడ	575–00
రిటైల్ ధర (డజను)	78.00
హైదరాబాద్	550–00
వరంగల్	552–00
రిటైల్ ధర	6.10

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
SHRIRAMFIN	700	3.69
JIOFIN	312.55	3.05
TATASTEEL	160.4	2.56
BHARTIARTL	2,015.60	2.54
HINDALCO	689.3	2.48

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
HEROMOTOCO	4,281.50	-0.45
DRREDDY	1,324.00	-1.31
TECHM	1,688.00	-1
WIPRO	268	-0.52
SBIN	796.05	-0.5

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్‌ఈ	6,822
ఎన్‌ఎస్‌ఈ	1,18,580
ఎన్‌ఎస్‌ఈ(డెరివేటివ్స్)	4,13,675
ఎఫ్‌ఐఐ	+ 12,594
డీఐఐ	- 194

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	68.38 (రాత్రి 11.30కు)	$ 64.92 (క్రితం ముగింపు)
బ్రెంట్	66.77 (రాత్రి 11.30కు)	$ 66.43 (క్రితం ముగింపు)

ఆచితూచి రుణం..!

- తగ్గుముఖం పట్టిన రిటైల్ లోన్లు...
- 2024–25 క్యూ4లో వృద్ధి 5 శాతమే
- రుణాల పట్ల యువత అప్రమత్తత!



ముంబై: యువత రిటైల్ రుణాల విషయంలో అప్రమత్తత వ్యవహరిస్తున్నారు. ఫలితంగా గత ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో (2024–25 క్యూ4) రిటైల్ రుణాల మంజూరులో కేవలం 5 శాతం వృద్ధి నమోదైనట్లు ట్రాన్స్‌యూనియన్ సిబిల్ వెల్లడించింది. అంతక్రితం ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో (2024 జనవరి–మార్చి) రిటైల్ రుణాల్లో వృద్ధి 12 శాతంగా ఉండడాన్ని ప్రస్తావించింది. రిటైల్ రుణాల వృద్ధి గణనీయంగా తగ్గడంలో కన్జ్యూమర్ డ్యూరబుల్ రుణాలు, క్రెడిట్ కార్డు వినియోగం ప్రభావం ఎక్కువగా ఉంది. పట్టణాల్లో యువత వీటిని ప్రధానంగా వినియోగిస్తుండడం తెలిసిందే. రిస్క్ అధికంగా ఉండే అన్‌సెక్యూర్డ్ రిటైల్ రుణాల్లో దూకుడు వద్దంటూ బ్యాంక్‌లు, ఎన్‌బీఎఫ్‌సీలకు 2023 చివర్లో ఆర్‌బీఐ సూచనలు చేయడాన్ని సిబిల్ నివేదిక గుర్తు చేసింది. క్రెడిట్ కార్డు, పర్సనల్ రుణాల్లో వృద్ధిని మోస్తరు స్థాయికి తీసుకురావడమే ఈ చర్యల ఉద్దేశ్యంగా పేర్కొంది.

అన్ని విభాగాల్లోనూ ఇదే పరిస్థితి..

- క్రెడిట్ కార్డుల జారీ సంఖ్య 2023–24 జనవరి–మార్చి త్రైమాసికంలో సున్నాగా ఉంటే, 2024–25 సంవత్సరం చివరి త్రైమాసికంలో మైనస్ 32%గా (తగ్గిపోవడం) నమోదైంది.
- వ్యక్తిగత రుణాల్లో వృద్ధి 6 శాతానికి పరిమితమైంది. ఏడాది క్రితం ఇదే క్వార్టర్‌లో 13 శాతం వృద్ధి నమోదైంది.
- కన్జ్యూమర్ డ్యూరబుల్స్ రుణాలు 2024–25 క్యూ4లో 6 శాతం వృద్ధిని నమోదు చేశాయి. ఏడాది క్రితం ఇదే కాలంలో వృద్ధి 19 శాతంగా ఉంది.
- రుణ వినియోగదారుల్లో వృద్ధి 8 శాతంగా ఉంది. క్రితం ఏడాది ఇదే కాలంలో ఇది 15 శాతం.
- కొత్త వారికి రుణ వితరణలో వృద్ధి క్రితం ఏడాది ఇదే త్రైమాసికంతో పోల్చితే 3 శాతం తక్కువగా 16 శాతానికి పరిమితమైంది.
- గృహ రుణ విభాగంలో వితరణలు (సంఖ్యా పరంగా) క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూస్తే 7 శాతం తగ్గిపోయింది. క్రితం ఏడాది ఇదే కాలంలో 5 శాతం వృద్ధి నమోదైంది. కానీ గృహ రుణాల్లో రూ.కోటికి మించిన మొత్తాల్లో మాత్రం 9 శాతం వృద్ధి కనిపించింది.
- ఆటో విభాగంలోనూ పెద్ద మొత్తం రుణాలకు డిమాండ్ కనిపించింది.
- క్రెడిట్ కార్డులు మినహా రిటైల్ రుణాల్లోని అన్ని విభాగాల్లోనూ 90 రోజులకు పైగా చెల్లింపులు చేయని వాటి విషయంలో మెరుగుదల నమోదైంది. క్రెడిట్ కార్డుల్లో మాత్రం 0.28% పెరిగి ఇవి 2%కి చేరాయి.
- రుణాలను మొదటిసారి తీసుకునే వారిలో వృద్ధి తగ్గడం ఆందోళనకరమని.. అందరికీ ఆర్థిక సేవల విస్తృతికి ఈ విభాగం కీలకమని సిబిల్ ఎండీ భవేష్ జైన్ పేర్కొన్నారు.

లఘు సంస్థలకు తగ్గిన కొత్త రుణాలు

ముంబై: గత ఆర్థిక సంవత్సరంలో లఘు, చిన్న, మధ్య తరహా సంస్థలకు (ఎంఎస్ఎంఈ) కొత్త రుణాలు (ఆరిజినేషన్) నెమ్మదించాయి. అంతక్రితం ఆర్థిక సంవత్సరంతో (2023–24) పోలిస్తే 2024–25లో విలువ 7.4 శాతం మేర క్షీణించి, రూ. 39.9 లక్షల కోట్ల నుంచి రూ. 36.9 లక్షల కోట్లకు తగ్గింది. రూ. 1 కోటి లోపు మైక్రో లోన్స్ ఇచ్చేందుకు రుణదాతలు దూరంగా ఉండటం ఇందుకు కొంత కారణంగా నిల్చింది. 2024 ఆర్థిక సంవత్సరంలో మైక్రో సెగ్మెంట్ రుణాలు రూ. 18.2 లక్షల కోట్లుగా ఉండగా 2025 ఆర్థిక సంవత్సరంలో రూ. 11.8 లక్షల కోట్లకు తగ్గాయి. పరిమాణంపరంగా చూస్తే మాత్రం ఎంఎస్ఎంఈలకు కొత్త రుణాల సంఖ్య 64.7 లక్షల నుంచి 75.8 లక్షలకు పెరిగింది. విలువ కోణంలో చూస్తే, రూ. 1–50 కోట్ల వరకు విలువ చేసే రుణాలు గణనీయంగా పెరిగాయి. క్రిఫ్ హై మార్క్ విడుదల చేసిన నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. మరిన్ని వివరాలు..

- చిన్న సంస్థల సెగ్మెంట్‌లో (రూ. 1–10 కోట్లు) రుణాలు రూ. 11 లక్షల నుంచి రూ. 12.1 లక్షల కోట్లకు పెరిగాయి. అలాగే మీడియం సెగ్మెంట్లో (రూ. 10–50 కోట్లు) లోన్లు రూ. 10.7 లక్షల కోట్ల నుంచి రూ. 13 లక్షల కోట్లకు ఎగిశాయి.
- ఈ మార్పులనేవి, రుణదాతలు పెద్ద మొత్తంలో రుణాలు తీసుకునే సెగ్మెంట్ వైపు మళ్లుతుండటాన్ని సూచిస్తున్నాయి.
- రుణ బాకీల పోర్ట్‌ఫోలియో రూ. 33.6 లక్షల కోట్ల నుంచి రూ. 40.4 లక్షల కోట్లకు చేరింది.
- 91–180 రోజుల కాలవ్యవధిలోని మొండి బాకీల పరిమాణం 1.3 శాతం నుంచి 1.2 శాతానికి తగ్గింది.

పీబీ ఫిన్‌టెక్‌లో వాటా విక్రయం

డీల్ విలువ రూ. 920 కోట్లు



న్యూఢిల్లీ: ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా పీబీ ఫిన్‌టెక్‌లో కంపెనీ సహవ్యవస్థాపకులు యాషిష్ దహియా, అలోక్ బన్సల్ 1.09 శాతం వాటాను షేరుకి రూ. 1,821.5 సగటు ధరలో విక్రయించారు. ఇన్సూర్‌టెక్.. పాలసీబజార్, ఫిన్‌టెక్ ప్లాట్‌ఫామ్ పైసాబజార్ మాతృ సంస్థలో 50.5 లక్షల షేర్లను అమ్మివేయడం ద్వారా రూ. 920 కోట్లు సమకూర్చుకున్నారు. ఎన్‌ఎస్‌ఈ బల్క్‌డీల్ వివరాల ప్రకారం సీఈవో దహియా 0.74 శాతం వాటాకు సమానమైన 34 లక్షల షేర్లు, వైస్‌చైర్మన్ బన్సల్ 0.36 శాతం వాటాకు సమానమైన 16.5 లక్షల షేర్లు విక్రయించారు. తాజా లావాదేవీల తదుపరి పీబీ ఫిన్‌టెక్‌లో దహియా వాటా 4.31 శాతం నుంచి 3.57 శాతానికి, బన్సల్ వాటా 1.4 శాతం నుంచి 1.04 శాతానికి క్షీణించింది. కాగా.. ఈ వాటాలను దేశీ ఎంఎఫ్, బీమా రంగ సంస్థలతోపాటు విదేశీ ఇన్వెస్టర్లు సొంతం చేసుకున్నాయి. ఈ జాబితాలో టాటా ఎంఎఫ్, ఎడిల్‌వీజ్ లైఫ్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, ఐసీఐసీఐ ప్రు లైఫ్‌సహా సిటీగ్రూప్ గ్లోబల్, గోల్డ్‌మన్ శాక్స్, మోర్గాన్ స్టాన్లీ ఏషియా సింగపూర్, సొసైటీ జనరాలి తదితరాలు చేరాయి.

బల్క్‌డీల్ నేపథ్యంలో ఈ షేరు ఎన్‌ఎస్‌ఈలో 0.55% నీరసించి రూ. 1,830 వద్ద ముగిసింది.

డెల్హివరీలో వాటా కొనుగోలు

జాబితాలో మోర్గాన్ స్టాన్లీ, సిటీగ్రూప్



న్యూఢిల్లీ: ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా లాజిస్టిక్స్ సర్వీసులందించే డెల్హివరీలో దేశ, విదేశీ దిగ్గజాలు వాటా కొనుగోలు చేశాయి. ఎన్‌ఎస్‌ఈ బల్క్‌డీల్ గణాంకాల ప్రకారం 1.6 శాతం వాటాకు సమానమైన 1.19 కోట్ల ఈక్విటీ షేర్లను సొంతం చేసుకున్నాయి. ఇందుకు షేరుకి రూ. 387 సగటు ధరలో రూ. 461 కోట్లు వెచ్చించాయి. షేర్లను కొనుగోలు చేసిన సంస్థల జాబితాలో మోర్గాన్ స్టాన్లీ, సిటీగ్రూప్ గ్లోబల్ మార్కెట్స్ సింగపూర్, విరిడియన్ ఏఎంతోపాటు.. ఎంఎఫ్ సంస్థలు హెచ్‌డీఎఫ్‌సీ, యాక్సిస్, టాటాతదితరాలు చేరాయి. అనుబంధ సంస్థలు నెక్సస్ అపార్చునిటీ ఫండ్, నెక్సస్ వెంచర్స్–3తో వీసీ కంపెనీ నెక్సస్ వెంచర్ పార్ట్‌నర్స్ తాజాగా డెల్హివరీలో వాటా విక్రయించింది. 2025 మార్చికల్లా డెల్హివరీలో 5.88 % వాటాను నెక్సస్ వెంచర్స్–3 కలిగి ఉంది. ఇందుకు తప్పనిసరి ఒప్పందాన్ని కుదుర్చుకున్న సంగతి తెలిసిందే.

బల్క్ డీల్స్ నేపథ్యంలో డెల్హివరీ షేరు ఎన్‌ఎస్‌ఈలో 0.55 శాతం నీరసించి రూ. 386 వద్ద ముగిసింది.

డబ్ల్యూఈఎఫ్ టెక్నాలజీ దిగ్గజాల్లో ఈక్వల్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: 2025 సంవత్సరానికి గాను వరల్డ్ ఎకనమిక్ ఫోరం 100 టెక్నాలజీ పయొనీర్ల జాబితాలో హైదరాబాద్‌కి చెందిన డేటా షేరింగ్ ప్లాట్‌ఫాం ఈక్వల్ చోటు దక్కించుకుంది. భారత్ నుంచి మొత్తం 10 సంస్థలు ఈ లిస్టులో ఎంపికయ్యాయి. గతంలో డబ్ల్యూఈఎఫ్ పయొనీర్లుగా నిల్చిన గూగుల్, స్పాటిఫై, ఎయిర్‌బీఎన్‌బీ వంటి దిగ్గజాల సరసన తమ సంస్థ కూడా నిలిచిందని కంపెనీ వ్యవస్థాపకుడు, వెంచర్ క్యాపిటలిస్ట్ జీవీకే కేశవ్ రెడ్డి తెలిపారు. కేవైసీ తదితర అంశాలకు సంబంధించి డేటా షేరింగ్‌కి ఉపయోగపడే మౌలిక సదుపాయాలను ఈక్వల్ అందిస్తోంది. కేశవ్ రెడ్డి, రాజీవ్ రంజన్ కలిసి 2022లో దీన్ని నెలకొల్పారు. 2024లో 75,000 లావాదేవీలను ప్రాసెస్ చేసింది.

కీలక ఖనిజాలపై పీఎస్‌యూల కన్ను

ఐవోసీ, గెయిల్, రైట్స్‌తో హిందుస్తాన్ కాపర్ జత



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ దిగ్గజాలు కీలక ఖనిజాలు, రేర్ ఎర్త్ మూలకాల కోసం చేతులు కలపనున్నాయి. తద్వారా మినీరత్న సీపీఎస్ఈ హిందుస్తాన్ కాపర్.. కీలక ఖనిజాలు, రేర్ ఎర్త్ మూలకాల బ్లాకులకు బిడ్ చేయనుంది. ఇందుకు ఇతర పీఎస్‌యూ దిగ్గజాలు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్(ఐవోసీ), గెయిల్ (ఇండియా), రైల్వే రంగ సంస్థ రైట్స్‌తో జత కట్టనున్నట్లు హిందుస్తాన్ కాపర్ చైర్మన్, ఎండీ సంజీవ్ కుమార్ సింగ్ పేర్కొన్నారు. ఇందుకు అనుగుణంగా ఐవోసీ, గెయిల్‌తో హిందుస్తాన్ కాపర్ తప్పనిసరికాని ఒప్పందాన్ని కుదుర్చుకోనున్నట్లు తెలియజేశారు. కాపర్ బ్లాకులతోపాటు కీలక ఖనిజాలు, రేర్ ఎర్త్ మూలకాల బ్లాకులను ప్రభుత్వం వేలం వేయనున్నట్లు వెల్లడించారు. వీటన్నిటికీ కంపెనీ బిడ్ దాఖలు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ బాటలో చిలీలో కాపర్‌సహా ఇతర కీలక ఖనిజాల అన్వేషణ కోసం మరో ప్రభుత్వ రంగ దిగ్గజం కోల్ ఇండియాతో ఒప్పందం కుదుర్చుకునే యోచనలో ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ బాటలో ఇప్పటికే ఈ నెల మొదట్లో రైల్వే రంగ ఇంజినీరింగ్ పీఎస్‌యూ రైట్స్‌తో ఒప్పందానికి తెరతీసిన విషయాన్ని ప్రస్తావించారు. తద్వారా దేశ, విదేశీ మార్కెట్ల కోసం సంయుక్తంగా కీలక ఖనిజాల సరఫరా చైన్‌ను అభివృద్ధి చేయనున్నట్లు తెలియజేశారు. అంతేకాకుండా దేశ, విదేశాలలో కీలక ఖనిజాల అన్వేషణ, వెలికితీత, శుద్ధి, ఉత్పత్తి కార్యకలాపాలను చేపట్టనున్నట్లు వివరించారు. మైనింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను సైతం అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించారు. కంపెనీ దేశీయంగా రాగి గనుల మైనింగ్‌లో కీలకపాత్ర పోషిస్తున్న సంగతి తెలిసిందే.

బృహస్పతి టెక్నాలజీస్‌లో 10 మిలియన్ డాలర్ల పెట్టుబడులు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: నిఘా, సెక్యూరిటీ సొల్యూషన్స్ సేవలందించే హైదరాబాద్ సంస్థ బృహస్పతి టెక్నాలజీస్ తాజాగా విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల నుంచి 10 మిలియన్ డాలర్లు సమీకరించింది. హైదరాబాద్‌లో 72,000 చ.అ. విస్తీర్ణంలో సీసీటీవీ తయారీ ప్లాంటు ఏర్పాటుకు, కార్యకలాపాల విస్తరణకు ఈ నిధులను ఉపయోగించుకోనున్నట్లు సంస్థ ఎండీ రాజశేఖర్ పాపోలు తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఆఖరు నాటికి ఈ ప్లాంటు అందుబాటులోకి వస్తుందని విలేఖరుల సమావేశంలో చెప్పారు. వృద్ధి ప్రణాళికల్లో భాగంగా కొత్తగా 400 మంది ఉద్యోగులను తీసుకోనున్నట్లు వివరించారు. మరోవైపు, 2026–27లో పబ్లిక్ ఇష్యూకి వచ్చే ఆలోచన కూడా ఉన్నట్లు వివరించారు. ఈ నిధులను పరిశోధన–అభివృద్ధి సామర్థ్యాలను, తయారీ సామర్థ్యాలను పెంచుకునేందుకు, ఏఐ ఆధారిత సొల్యూషన్స్‌ను రూపొందించేందుకు ఉపయోగించుకోనున్నట్లు చెప్పారు. ఇటీవలే మహారాష్ట్ర రోడ్ రవాణా కార్పొరేషన్ నుంచి సుమారు రూ. 100 కోట్ల విలువ చేసే సీసీటీవీ మానిటరింగ్ సిస్టం ఏర్పాటునకు ఆర్డరు లభించినట్లు రాజశేఖర్ తెలిపారు.

ప్రధాని మోదీతో వాల్‌మార్ట్ సీఈవో డగ్ మెక్ భేటీ



ప్రధాని నరేంద్ర మోదీతో వాల్‌మార్ట్ ఇంక్ సీఈవో డగ్ మెక్‌మిల్లన్ సమావేశయ్యారు.భారత్‌తో వ్యాపార భాగస్వామ్యంపై చర్చించారు. వాల్‌మార్ట్ సభ్యులు స్టీవర్ట్ వాల్టన్, వాల్‌మార్ట్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ కాథ్ మెక్‌లే భేటీలో పాల్గొన్నారు. ''విలువైన సమయాన్ని కేటాయించినందుకు ప్రధాని మోదీకి ధన్యవాదాలు. ఫ్లిప్‌కార్ట్, ఫోన్‌పేతో ఇన్నోవేషన్ పెట్టుబడులు, వార్షికంగా 10 బిలియన్ డాలర్ల ఎగుమతులు మా లక్ష్యసాధనలకు మద్దతు పలికినందుకు మాకెంతో గర్వంగా ఉంది. మా పెట్టుబడి ప్రణాళికలో భారత్ కేంద్రంగా ఉంది'' అని ఎక్స్ అకౌంట్ ద్వారా తెలిపారు.

రెండేళ్లలో రూ. 1,000 కోట్ల బ్రాండ్‌గా పల్స్ క్యాండీ



న్యూఢిల్లీ: వచ్చే రెండేళ్లలో తమ క్యాండీ ఉత్పత్తి 'పల్స్' రూ. 1,000 కోట్ల బ్రాండుగా ఎదుగుతుందని అంచనా వేస్తున్నట్లు దేశీ ఎఫ్‌ఎంసీజీ సంస్థ ధరమ్‌పాల్ సత్యపాల్ గ్రూప్ వైస్ చైర్మన్ రాజీవ్ కుమార్ తెలిపారు. ఒక్కోటి రూ. 1 ఖరీదు చేసే ఈ క్యాండీలు గత ఆర్థిక సంవత్సరంలో 750 కోట్ల యూనిట్లు అమ్ముడవడం ద్వారా రూ. 750 కోట్ల అమ్మకాల మార్కును సాధించినట్లు వివరించారు. హార్డ్–బాయిల్డ్ క్యాండీ విభాగంలో 19 శాతం మార్కెట్ వాటాతో తాము అగ్రగామిగా ఉన్నామని, గత మూడళ్లుగా ఏటా 15% వృద్ధి సాధిస్తున్నామని కుమార్ చెప్పారు. దేశీయంగా ఈ మార్కెట్ పరిమాణం సుమారు రూ. 4,000 కోట్లుగా ఉంది. 2015లో పల్స్ క్యాండీని ప్రవేశపెట్టారు.

హైదరాబాద్‌లో ఇళ్ల అమ్మకాలు డౌన్

- జూన్ త్రైమాసికంలో 11,040 యూనిట్ల విక్రయం
- క్రితం ఏడాదితో పోల్చితే 27 శాతం తక్కువ
- 11 శాతం పెరిగిన ధరలు
- అనరాక్ నివేదిక విడుదల



న్యూఢిల్లీ: హైదరాబాద్ మార్కెట్లో ఇళ్ల ధరలు పెరిగిపోవడంతో అమ్మకాలు చెప్పుకోతగ్గ స్థాయిలో పడిపోయాయి. రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ అనరాక్ తాజా నివేదిక ప్రకారం.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి జూన్ (క్యూ1) మధ్య కాలంలో హైదరాబాద్ మార్కెట్లో ఇళ్ల అమ్మకాలు క్రితం ఏడాది ఇదే త్రైమాసికంతో పోల్చి చూసినప్పుడు 27 శాతం క్షీణించి 11,040 యూనిట్లకు పరిమితమయ్యాయి. ఇదే కాలంలో ధరలు సగటున 11 శాతం పెరిగాయి. దేశవ్యాప్తంగా హైదరాబాద్ సహా టాప్–7 నగరాల్లో జూన్ త్రైమాసికంలో ఇళ్ల ధరలు సగటున 11 శాతం పెరిగాయి. ఈ పట్టణాల్లో ఇళ్ల అమ్మకాలు జూన్ త్రైమాసికంలో క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూసినప్పుడు 20 శాతం తక్కువగా 96,285 యూనిట్లుగా ఉండొచ్చన్నది అంచనా. క్రితం ఏడాది ఇదే కాలంలో ఈ ఏడు నగరాల్లో 1,20,335 యూనిట్లు అమ్ముడుపోవడం గమనార్హం. హైదరాబాద్‌తోపాటు ఢిల్లీ ఎన్‌సీఆర్, ముంబై మెట్రోపాలిటన్ రీజియన్ (ఎంఎంఆర్), బెంగళూరు, పుణె, కోల్‌కతా పట్టణాల్లో ఇళ్ల అమ్మకాలు పడిపోగా, ఒక్క చెన్నైలో మాత్రం పెరిగాయి.

నగరాల వారీ డేటా..

- జూన్ త్రైమాసికంలో అత్యధికంగా ఢిల్లీ ఎన్‌సీఆర్ ప్రాంతంలో ఇళ్ల ధరలు 27 శాతం పెరిగాయి. ఇక్కడ ఇళ్ల విక్రయాలు 14 శాతం క్షీణించి 14,255 యూనిట్లకు పరిమితమయ్యాయి. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో ఇళ్ల అమ్మకాలు 16,650 యూనిట్లుగా ఉండడం గమనార్హం.
- ఎంఎంఆర్‌లో ఇళ్ల అమ్మకాలు 25 శాతం పడిపోయి 31,275 యూనిట్లుగా ఉన్నాయి.
- బెంగళూరులో ఇళ్ల అమ్మకాలు 15,410 యూనిట్లకు పరిమితమయ్యాయి. క్రితం ఏడాది ఇదే కాలం విక్రయాలతో పోల్చితే 8 శాతం తక్కువ. ఇక్కడ ధరలు సగటున 12 శాతం పెరిగాయి.
- పుణెలో అమ్మకాలు 27 శాతం తగ్గి రూ.15,410 యూనిట్లుగా ఉన్నాయి.
- కోల్‌కతా నగరంలో 23 శాతం తక్కువగా 3,525 యూనిట్లు అమ్ముడయ్యాయి.
- చెన్నైలో 11 శాతం పెరిగి 5,660 యూనిట్ల విక్రయాలు నమోదయ్యాయి. క్రితం ఏడాది ఇదే కాలంలో అమ్మకాలు 5,100 యూనిట్లుగా ఉన్నాయి.

సెంటిమెంట్ బలపడుతోంది..

2025 సంవత్సరం ద్వితీయ మూడు నెలల కాలంలో (త్రైమాసికం) భారత హౌసింగ్ మార్కెట్‌కు రోలర్‌కోస్టర్ వంటిదని అనరాక్ చైర్మన్ అనుజ్‌పురి వ్యాఖ్యానించారు. పాకిస్థాన్‌లో ఘర్షణలకుతోడు అంతర్జాతీయంగానూ భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు ప్రభావం చూపించినట్టు చెప్పారు. యుద్ధ వాతావరణం నేపథ్యంలో ఇళ్ల కొనగోలుదారులు వేచిచూసే ధోరణి అనుసరించినట్టు పేర్కొన్నారు. పాకిస్థాన్‌లో ఘర్షణలు తొలగిపోవడం, ఆర్‌బీఐ రెపో రేట్ల తగ్గింపుతో కొనుగోలుదారుల సెంటిమెంట్ తిరిగి ఏర్పడుతున్నట్టు తెలిపారు.

పోకో నుంచి ఎఫ్7 స్మార్ట్‌ఫోన్

రూ. 29,999 నుంచి ధర ప్రారంభం



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: స్మార్ట్‌ఫోన్స్ బ్రాండ్ తాజాగా ఎఫ్–సిరీస్‌లో ఎఫ్7 ఫోన్‌ను ఆవిష్కరించింది. దీని ప్రారంభ ధర రూ. 29,999 నుంచి రూ. 31,999 వరకు ఉంటుంది. 7,550 ఎంఏహెచ్ బ్యాటరీ, 90 గి టర్బో చార్జింగ్, రివర్స్ చార్జింగ్, స్నాప్‌డ్రాగన్ 8ఎస్ జెన్ 4 చిప్‌సెట్, 6.83 అంగుళాల అమోలెడ్ డిస్‌ప్లే, 50 ఎంపీ సోనీ ఐఎంఎక్స్882 కెమెరా తదితర ఫీచర్లు ఇందులో ఉన్నాయని సంస్థ ప్రొడక్ట్ మార్కెటింగ్ మేనేజర్ సచిన్ దేవ్ తెలిపారు. 4 ఏళ్ల వరకు ఆండ్రాయిడ్ అప్‌డేట్స్, 6 ఏళ్ల వరకు సెక్యూరిటీ అప్‌డేట్స్ లభిస్తాయి. జూలై 1 నుంచి ఫ్లిప్‌కార్ట్‌పై ఎక్స్‌క్లూజివ్‌గా అమ్మకాలు ప్రారంభమవుతాయి. తొలి రోజున హెచ్‌డీఎఫ్‌సీ, ఎస్‌బీఐ తదితర కార్డులపై రూ. 2,000 డిస్కౌంటు, రూ. 2,000 వరకు ఎక్స్చేంజ్ బోనస్ పొందవచ్చని దేవ్ చెప్పారు.



సుదీర్ఘ ర్యాలీలతో సామర్థ్యానికి పరీక్ష
- ఫిట్‌నెస్ కీలకం
- భారత స్టార్ షట్లర్ పీవీ సింధు వ్యాఖ్య

మహిళల గేమ్ మారింది

బెంగళూరు: భారత మహిళల బ్యాడ్మింటన్‌కు సైనా నెహ్వాల్ జోష్ తెస్తే... పతకాలు, ఘన విజయాలతో ముఖచిత్రాన్నే మార్చిన స్టార్ షట్లర్ మాత్రం ముమ్మాటికి పీవీ సింధునే! ఒలింపిక్ పతకాలు, ప్రపంచ చాంపియన్‌షిప్, కామన్వెల్త్ గేమ్స్, ఆసియా క్రీడల పతకాలతో చైనాకు సవాల్‌గా నిలిచిన బ్యాడ్మింటన్ తార సింధు కొంతకాలంగా పతకాల వేటలో వెనుకబడింది. అయితే రేసులో వెనుకబడినా... తన సత్తాలో ఏ మార్పూ లేదని చెప్పింది. ఆధునిక మహిళల బ్యాడ్మింటన్ ఆటతీరు చెప్పుకోదగ్గ స్థాయిలో మారిందని వివరించింది. కోర్టులో ఎదురుపడే ప్రత్యర్థులే కాదు... సుదీర్ఘ ర్యాలీలు సైతం మహిళా షట్లర్ల సామర్థ్యానికి కఠిన పరీక్ష పెడుతున్నాయని చెప్పింది. ఇక్కడి స్పోర్ట్స్ అథారిటీ (సాయ్) కేంద్రానికి వచ్చిన సింధు మీడియాతో ముచ్చటించిన కబుర్లు ఆమె మాటల్లోనే...

'సింగిల్స్' అప్పట్లా లేదు

బ్యాడ్మింటన్‌లో ప్రత్యేకించి మహిళల సింగిల్స్ పూర్తిగా మారింది. మొదట్లో అటాకింగ్, వేగవంతమైన ర్యాలీలే కనిపించేవి. మ్యాచ్‌ను ముగించేవి. కానీ ఇప్పుడు సుదీర్ఘ ర్యాలీలు మరింత పోటీని తెచ్చాయి. దీని వల్ల మ్యాచ్‌లు పోటాపోటీగా చాలా సేపు సాగుతున్నాయి. ప్రతీ పాయింట్‌ను కాపాడుకునేందుకు రక్షణాత్మక ధోరణితో ఆడుతుండటంతోనే మ్యాచ్‌ల టైమింగ్ పెరుగుతోంది. మారిన పరిస్థితులకు తగ్గట్టే మన ఆట తీరు మార్చుకోవాల్సిందే.

ఫిట్‌నెస్ కీలకం

ఆటలో దూకుడు కనబర్చాలంటే... అభివృద్ధి చెందుతున్న టెంపోకు అనుగుణంగా మన ఆట తీరును మార్చాలంటే ఫిట్‌నెసే కీలకం. అందుకే నేను నా శారీరక సత్తాను మెరుగుపర్చుకోవడంపై దృష్టి పెట్టాను. అప్పుడే నేను సహనంతో కోర్టులో ఎంతసేపైనా ఆడగలుగుతాను. ఇప్పుడు ప్రత్యర్థిపై ఫోకస్ కంటే ఇలాంటి మార్పులపైనే మరింత దృష్టి సారించాల్సిన అవసరం వచ్చింది. కొత్త కోచ్ కూడా సుదీర్ఘ సమయం ఆడటంపైనే శిక్షణ ఇస్తున్నారు.

ఎప్పుడూ ఒకేలా ఉండలేం

ఎవరైనా సరే ఎప్పుడు కూడా ఒకేలా ఉండలేరు. ఆడలేరు. పదేళ్ల క్రితం ఆడిన ఆటే ఇప్పుడు ఆడాలంటే ఎలా? అప్పటి ఆట, శిక్షణ, పరిస్థితులు వేరు. ఇప్పుడు ఎదురవుతున్న సవాళ్లు వేరు. ఇవన్నీ అర్థం చేసుకొని ఆడగలగడమే ముఖ్యం. అయితే కెరీర్‌లో నా సాఫల్యాల పట్ల సంతృప్తిగానే ఉన్నాను. కామన్వెల్త్, ఆసియా, ఒలింపిక్స్, ప్రపంచ చాంపియన్‌షిప్ పతకాలన్నీ గెలిచాను. ఇప్పుడు ఎలాంటి ఒత్తిడి లేకుండా ఆడితే చాలు. మళ్లీ పతకాల బాట పట్టొచ్చు.

ఫలితాలు నిరాశ పరిచాయి

కొన్నాళ్లుగా కోర్టులో ఫలితాలు, నా ఆటతీరు నిరాశపరిచిన మాట నిజమే. అయితే ఈ వైఫల్యాలను అధిగమించేందుకు ఇటీవల తీవ్రమైన కసరత్తులు చేశాను. ఐదారు టోర్నీల్లో తొలి రౌండ్లలోనే ఓడిపోయాను. ఇప్పుడలా ఉండదు. తప్పకుండా మెరుగైన ఆటతీరునే చూస్తారు. క్లిష్టమైన ప్రత్యర్థులు ఎదురైనపుడే మనం మరింత కష్టపడతాం. నేను కూడా అంతే సానుకూల దృక్పథంతో అడుగు ముందుకు వేయాలనుకుంటున్నాను.

టెస్టుల్లో స్టాప్ క్లాక్

'స్లో ఓవర్‌రేట్' నియంత్రణకు ఐసీసీ చర్యలు

'షార్ట్ రన్'కు పాల్పడితే ప్రత్యర్థి జట్టుకు 5 పరుగులు

దుబాయ్: టెస్టు క్రికెట్‌లో జాప్యాన్ని తగ్గించి మరింత రసవత్తరంగా మార్చే దిశగా అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ప్రయత్నాలు ప్రారంభించింది. సుదీర్ఘ ఫార్మాట్‌లో 'స్లో ఓవర్‌రేట్'ను నియంత్రించేందుకు ఐసీసీ 'స్టాప్ క్లాక్' పద్ధతిని ప్రవేశ పెట్టింది. 2025–27 ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) సైకిల్‌లో ఈ కొత్త నిబంధనలు అమలవుతున్నాయి. ఇందులో భాగంగా ఇప్పటికే శ్రీలంక, బంగ్లాదేశ్ మధ్య ఒక టెస్టు మ్యాచ్ పూర్తికాగా... ప్రస్తుతం రెండో టెస్టు జరుగుతోంది. మరోవైపు ఆస్ట్రేలియా, వెస్టిండీస్ మధ్య జరుగుతున్న తొలి టెస్టులో సైతం ఈ కొత్త నిబంధనలు అమలవుతున్నాయి. దీంతో పాటు బ్యాటర్లు వికెట్ల మధ్య పరుగు తీసే సమయంలో ఉద్దేశపూర్వకంగా 'షార్ట్ రన్'కు పాల్పడితే... స్ట్రయిక్‌లో ఎవరు ఉండాలనే నిర్ణయం ఫీల్డింగ్ జట్టు సారథి తీసుకునే అవకాశం కల్పించింది. ఆటను మరింత జనరంజకంగా మార్చే ప్రక్రియలో భాగంగా ఐసీసీ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. దీనికి సంబంధించిన వివరాలను అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపరిచింది.

International Cricket Council

- 'స్లో ఓవర్‌రేట్'ను అరికట్టేందుకు బోర్డు నడుం బిగించింది. ఓవర్‌కు ఓవర్‌కు మధ్య వ్యవధిని 60 సెకన్లకు పరిమితం చేసింది.
- టెస్టు మ్యాచ్‌లో ఒక ఓవర్ ముగిసిన అనంతరం మైదానంలోని 'స్టాప్ క్లాక్'లో కౌంట్‌డౌన్ ప్రారంభమవుతుంది. 60 సెకన్లలో తదుపరి ఓవర్ తొలి బంతి పడాల్సి ఉంటుంది.
- నిర్దీత సమయంలో ఓవర్ ప్రారంభం కాకపోతే... అంపైర్లు హెచ్చరిస్తారు.
- బౌలింగ్ చేస్తున్న జట్టు రెండు సార్లకు మించి అంపైర్ల హెచ్చరికలు పొందితే... బ్యాటింగ్ జట్టుకు అదనంగా 5 పరుగులు కేటాయిస్తారు.
- ఒక ఇన్నింగ్స్‌లో 80 ఓవర్లు ముగిస్తే హెచ్చరికలను తిరిగి ఒకటి నుంచి లెక్కిస్తారు.



- బంతి ఆకారం మారిందని అంపైర్లు గుర్తిస్తే ఏ సమయంలోనైనా బాల్‌ను మార్చవచ్చు.
- ఫీల్డ్ అంపైర్ 'అవుట్' అని ఇచ్చిన నిర్ణయంపై రెండో సమీక్ష జరిగితే... ఆ నిర్ణయంలో స్పష్టత రాకుంటే దాన్ని అవుట్‌గానే పరిగణించనున్నారు. ఉదాహరణకు... ఒక బ్యాటర్ క్యాచ్ అవుటైన సందర్భంలో ఆన్‌ఫీల్డ్ అంపైర్ ఇచ్చిన నిర్ణయాన్ని బ్యాటర్ సవాలు చేసి బంతి ప్యాడ్‌లను తాకినట్లు రీప్లేల్లో చూపించి నాటౌట్‌గా నిర్ణయిస్తే... టీవీ అంపైర్ ఎల్బీని పరిశీలిస్తాడు. ఈ సందర్భంలో డిఫాల్ట్ నిర్ణయం 'అవుట్'గానే ఉంటుంది. బాల్ ట్రాకింగ్ విధానంలో పరిశీలించిన అనంతరం 'అంపైర్ కాల్' చూపిస్తే బ్యాటర్ క్రీజు వదిలి వెళ్లాల్సి ఉంటుంది.
- ఉద్దేశపూర్వకంగా షార్ట్ రన్‌కు పాల్పడితే... అదనపు ప్రయోజనం పొందాలనే లక్ష్యంతోనే ఇలా చేసినట్లు అంపైర్లు భావిస్తే... ఫీల్డింగ్ జట్టుకు 5 పరుగులు అదనంగా అందివ్వనున్నారు. దీంతో పాటు తదుపరి బంతికి ఎవరు స్ట్రయిక్ తీసుకోవాలనే అంశం కూడా నిర్ణయించే అధికారం ఫీల్డింగ్ జట్టు కెప్టెన్‌కు కల్పిస్తారు.





సూర్యకుమార్‌కు జర్మనీలో శస్త్రచికిత్స

న్యూఢిల్లీ: భారత టి20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌కు జర్మనీలో శస్త్రచికిత్స విజయవంతంగా జరిగింది. కొన్నాళ్లుగా ఈ స్టార్ బ్యాటర్ 'స్పోర్ట్స్ హెర్నియా'తో సతమతమవుతున్నాడు. పొత్తికడుపు కుడివైపు దిగువన ఈ చికిత్స జరిగినట్లు సూర్యకుమార్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. ఈ ఆపరేషన్ కోసమే అతను ఇటీవల మ్యూనిక్ వెళ్లాడు. 'లైఫ్ అప్‌డేట్: కుడివైపు పొత్తికడుపు కింద స్పోర్ట్స్ హెర్నియా ఆపరేషన్ జరిగింది. అంతా సజావుగానే జరిగిందని మీ అందరికి ఈ సందర్భంగా వెల్లడిస్తున్నాను. మెల్లిగా కోలుకునే పనిలో పడతాను. సాధ్యమైనంత త్వరగా మైదానంలోకి దిగాలని వుంది' అని ఇన్‌స్టాగామ్‌లో పేర్కొన్నాడు. కొన్నిరోజుల విశ్రాంతి అనంతరం బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో అతను రెండు వారాల పాటు పునరావాస శిబిరంలో గడపనున్నాడు. గడిచిన మూడేళ్లలో సూర్యకుమార్‌కిది మూడో సర్జరీ. 2023లో చీలమండకు, 2024లో 'స్పోర్ట్స్ హెర్నియా' ఆపరేషన్ జరిగింది. పొత్తికడుపు కింది భాగంలో కండరాల నొప్పి, గజ్జల్లో గాయం, లిగమెంట్ బాధించడాన్ని వైద్య పరిభాషలో 'స్పోర్ట్స్ హెర్నియా'గా పేర్కొంటారు. కాగా భారత్ తదుపరి పరిమిత ఓవర్ల మ్యాచ్‌ల్ని బంగ్లాదేశ్ పర్యటనలో ఆడనుంది. ఆగస్టులో అక్కడ మూడు వన్డేలు, మూడు టి20ల సిరీస్‌లో భారత్ తలపడుతుంది.



రేసు గుర్రానికి సెలవిచ్చిన అనుశ్

న్యూఢిల్లీ: భారత ఈక్వెస్ట్రియన్ అనుశ్ అగర్వల్లా తన విజయాల కోసం సుదీర్ఘకాలంగా శ్రమించిన రేసు గుర్రానికి సెలవిచ్చాడు. సర్ కారామెల్లో అనే అశ్వంతో 25 ఏళ్ల అనుశ్ చెప్పుకోదగ్గ విజయాలు సాధించాడు. పారిస్ ఒలింపిక్స్‌లోనూ పోటీపడ్డాడు. ఆ విశ్వక్రీడల్లో డ్రెస్సెజ్ ఈవెంట్‌ను పూర్తి చేసిన తొలి భారతీయ రైడర్‌గా ఘనత వహించాడు. పతకం రౌండ్‌కు అర్హత సాధించలేకపోయినప్పటికీ గ్రూప్ 'ఇ'లో డ్రెస్సెజ్ ఈవెంట్ పోటీలో తొమ్మిదో స్థానంలో నిలిచాడు. ఇలా తన ఒలింపిక్ ముచ్చట కూడా తీర్చిన గుర్రం కారామెల్లోకు గురువారం వీడ్కోలు పలికాడు. 'థ్యాంక్యూ కారామెల్లో... నీవు కేవలం గుర్రానివే కాదు. అంతకుమించి మంచి భాగస్వామివి. నాకెంతో ముఖ్యమైన స్నేహితుడవు కూడా! నీవు నా కలల్నే కాదు... జాతి కలల్ని సాకారం చేశావ్. నీవల్లే ఒలింపిక్స్‌కు వెళ్లగలిగాను. మరెంతో మంది ఈక్వెస్ట్రియన్లకు ప్రేరణగా నిలిచావు. నిన్ను నేను ఎప్పటికీ మర్చిపోను. ఇన్నేళ్లు నా కోసం చెమటోడ్చిన నీకు విశ్రాంతి కావాలనే ఈ నిర్ణయం తీసుకున్నాను. హ్యాపి రిటైర్మెంట్ కారామెల్లో' అని భావోద్వేగంతో సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు.

ఆస్ట్రేలియా 180 ఆలౌట్

వెస్టిండీస్ తొలి ఇన్నింగ్స్ 190 ఆలౌట్



సీల్స్



జోసెఫ్

బ్రిడ్జ్‌టౌన్: ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్లో దక్షిణాఫ్రికా చేతిలో ఓడి... రన్నరప్‌గా నిలిచిన ఆస్ట్రేలియా క్రికెట్ జట్టు... వెస్టిండీస్ పర్యటనను పేలవంగా ప్రారంభించింది. 3 టెస్టులు, 5 టి20ల సిరీస్‌లు ఆడేందుకు కరీబియన్ దీవుల్లో పర్యటిస్తున్న ఆసీస్ జట్టు... తొలి టెస్టులో స్వల్ప స్కోరుకే ఆలౌటైంది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 56.5 ఓవర్లలో 180 పరుగులకు ఆలౌటైంది. వెస్టిండీస్ గడ్డపై తొలుత బ్యాటింగ్ చేసిన సందర్భాల్లో ఆస్ట్రేలియాకు ఇదే అత్యల్ప స్కోరు. ట్రావిస్ హెడ్ (78 బంతుల్లో 59; 9 ఫోర్లు) అర్ధశతకంతో ఆకట్టుకోగా... ఉస్మాన్ ఖ్వాజా (128 బంతుల్లో 47; 4 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. స్యామ్ కొన్‌స్టాస్ (3), కామెరూన్ గ్రీన్ (3), జోష్ ఇన్‌గ్లిస్ (5), బ్యూ వెబ్‌స్టర్ (11), అలెక్స్ కేరీ (8) విఫలమయ్యారు. కెప్టెన్ ప్యాట్ కమిన్స్ (18 బంతుల్లో 28; 3 ఫోర్లు, 1 సిక్స్) ధాటిగా ఆడాడు. విండీస్ బౌలర్లలో జైడెన్ సీల్స్ 5 వికెట్లతో అదరగొట్టగా... షమార్ జోసెఫ్ 4 వికెట్లు పడగొట్టాడు.

అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన వెస్టిండీస్ కూడా తడబడింది. తొలి ఇన్నింగ్స్‌లో 63.2 ఓవర్లలో 190 పరుగులకు ఆలౌటైంది. షై హోప్ (91 బంతుల్లో 48; 5 ఫోర్లు), కెప్టెన్ రోస్టన్ చేజ్ (108 బంతుల్లో 44; 1 ఫోర్, 1 సిక్స్) ఫర్వాలేదనిపించారు. బ్రాత్‌వైట్ (4), క్యాంప్‌బెల్ (7), కార్టీ (20), వారికన్ (0), బ్రాండన్ కింగ్ (26) విఫలమయ్యారు. ఆఖర్లో అల్జారీ జోసెఫ్ (20 బంతుల్లో 23 నాటౌట్; 2 ఫోర్లు, 1 సిక్స్) కీలక పరుగులు చేసి జట్టుకు 10 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం అందించాడు. ఆస్ట్రేలియా బౌలర్లలో స్టార్క్ 3, హాజల్‌వుడ్, కమిన్స్, వెబ్‌స్టర్ తలా 2 వికెట్లు పడగొట్టారు.

భారత్ ఆడే సిడ్నీ మ్యాచ్ టికెట్లు 'సోల్డ్ అవుట్'

కాన్‌బెర్రా టి20కీ అదే బోర్డు

మెల్‌బోర్న్: టీమిండియా ప్రస్తుతం ఇంగ్లండ్ పర్యటనలో సంప్రదాయ టెస్టు ఫార్మాట్ ఆడుతోంది. ఇది ఐదు టెస్టుల సుదీర్ఘ సిరీస్ కావడంతో ఇంగ్లండ్ పర్యటన ముగిసేందుకే చాలా సమయం పడుతోంది. ఆగస్టు 4 వరకు ఆఖరి టెస్టు జరుగుతుంది. అనంతరం బంగ్లాదేశ్ పర్యటన ఉంది. ఆ తర్వాతే ఆస్ట్రేలియాలో భారత్ పర్యటిస్తుంది. అక్టోబర్–నవంబర్‌లలో జరిగే ఈ పరిమిత ఓవర్ల సిరీస్‌లకు ఇంకా నాలుగు నెలల సమయం ఉంది. అయినా సరే భారత్ క్రికెట్ క్రేజ్‌ను ఆస్ట్రేలియా కూడా సొమ్ము చేసుకుంది. మూడు వన్డేలు, ఐదు టి20ల కోసం క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) టికెట్ల విక్రయం చేపట్టగా ఏకంగా 90 వేల పైచిలుకు టికెట్లు హాట్ కేకుల్లా అమ్ముడయినట్లు స్వయంగా సీఏ వర్గాలే వెల్లడించాయి. సిడ్నీలో జరిగే మూడో వన్డే, కాన్‌బెర్రాలో జరిగే తొలి టి20 టికెట్లయితే ఒక్కటి కూడా మిగలకుండా 'సోల్డ్ అవుట్' కావడం విశేషం. 'భారత్, ఆసీస్‌ల మధ్య జరగబోయే పరిమిత ఓవర్ల సిరీస్‌ల కోసం అంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. టికెట్లు హాట్‌కేకుల్లా అమ్ముడవుతున్నాయి. ముఖ్యంగా 'కంగారూ' దేశంలో స్థిరపడిన భారత సంతతి ప్రేక్షకులు వేలంవెర్రిగా ఎగబడ్డారు' అని సీఏ ఒక ప్రకటనలో తెలిపింది. సిడ్నీ క్రికెట్ గ్రౌండ్ (మూడో వన్డే వేదిక), మనుక ఓవల్ (కాన్‌బెర్రా–తొలి టి20 వేదిక)లలో జరిగే మ్యాచ్ టికెట్లకు అనూహ్య డిమాండ్ నెలకొనడంతో నాలుగు నెలల ముందే టికెట్లన్నీ అయిపోయాయని సీఏ పేర్కొంది. భారత సంతతి అభిమానులు కొందరు వందలు, వేల సంఖ్యలో టికెట్లు కొనుగోలు చేసినట్లు తెలిసింది.





ఇంగ్లండ్ జట్టులో ఆర్చర్

బర్మింగ్‌హామ్: భారత్‌తో రెండో టెస్టు కోసం ఇంగ్లండ్ క్రికెట్ జట్టు... పేసర్ జోఫ్రా ఆర్చర్‌ను తీసుకుంది. గాయాలతో సహవాసం చేసే ఆర్చర్... 2021 తర్వాత టెస్టు జట్టులో చోటు దక్కించుకోవడం ఇదే తొలిసారి. అతడు చివరగా... అహ్మదాబాద్ వేదిగా టీమిండియాపై టెస్టు మ్యాచ్ ఆడాడు. అనంతరం మోచేతి గాయంతో సుదీర్ఘ ఫార్మాట్‌కు దాదాపు దూరమయ్యాడు. టీమిండియాతో ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో భాగంగా లీడ్స్‌లో నువ్వా నేనా అన్నట్లు సాగిన తొలి పోరులో ఇంగ్లండ్ విజయం సాధించి 'అండర్సన్–టెండూల్కర్ ట్రోఫీ' సిరీస్‌లో 1–0తో ముందంజ వేయగా... బుధవారం నుంచి ఇరుజట్ల మధ్య రెండో మ్యాచ్ ప్రారంభం కానుంది. 'జాతీయ జట్టు తరఫున 13 టెస్టులు ఆడిన 30 ఏళ్ల జోఫ్రా ఆర్చర్ రెండో టెస్టుకు అందుబాటులో ఉంటాడు. 2021 ఫిబ్రవరిలో భారత్‌పైనే చివరి టెస్టు ఆడిన అతడు... మళ్లీ టీమిండియాపైనే పునరాగమనం చేస్తున్నాడు' అని ఇంగ్లండ్, వేల్స్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) వెల్లడించింది.

ఇంగ్లండ్ జట్టు: స్టోక్స్ (కెప్టెన్), ఓలీ పోప్, హ్యారీ బ్రూక్, జో రూట్, బెన్ డకెట్, జాక్ క్రాలీ, జేమీ స్మిత్, స్యామ్ కుక్, బెథెల్, ఆర్చర్, షోయబ్ బషీర్, బ్రైడెన్ కార్స్, ఓవర్టన్, జోష్ టంగ్, క్రిస్ వోక్స్.

నిసాంక అజేయ సెంచరీ

చండీమల్ 93 అవుట్

- శ్రీలంక తొలి ఇన్నింగ్స్ 290/2
- బంగ్లా తొలి ఇన్నింగ్స్ 247 ఆలౌట్



నిసాంక

కొలంబో: ఓపెనర్ పాథుమ్ నిసాంక (238 బంతుల్లో 146 బ్యాటింగ్; 18 ఫోర్లు) అజేయ శతకంతో చెలరేగడంతో బంగ్లాదేశ్‌తో జరుగుతున్న రెండో టెస్టులో శ్రీలంక జట్టు భారీ స్కోరు దిశగా సాగుతోంది. గురువారం రెండో రోజు ఆట ముగిసే సమయానికి శ్రీలంక తొలి ఇన్నింగ్స్‌లో 78 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 290 పరుగులు చేసింది. బంగ్లాదేశ్ బౌలర్లను సమర్థవంతంగా ఎదుర్కొన్న నిసాంక చూడచక్కటి షాట్లతో అలరించగా... దినేశ్ చండీమల్ (153 బంతుల్లో 93; 10 ఫోర్లు, 1 సిక్స్) త్రుటిలో సెంచరీ చేజార్చుకున్నాడు. మరో ఓపెనర్ లహిరు ఉడారా (65 బంతుల్లో 40; 4 ఫోర్లు) ఫర్వాలేదనిపించాడు. తొలి వికెట్‌కు ఉడారాతో కలిసి 88 పరుగులు జోడించిన నిసాంక... రెండో వికెట్‌కు చండీమల్‌తో 194 పరుగులు జతచేశాడు. బంగ్లా బ్యాటర్లు పరుగులు చేసేందుకు తీవ్రంగా ఇబ్బంది పడిన పిచ్‌పై నిసాంక స్వేచ్ఛగా ఆడాడు. వన్డే క్రికెట్‌లో 'డబుల్ సెంచరీ' చేసిన ఏకైక శ్రీలంక ప్లేయర్‌గా రికార్డుల్లోకెక్కిన నిసాంక... బంగ్లా బౌలర్లకు ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా చెలరేగాడు. తొలి టెస్టులోనూ 'శత'క్కొట్టిన నిసాంకకు ఇది వరుసగా రెండో సెంచరీ కాగా... ఓవరాల్‌గా టెస్టుల్లో నాలుగోది. చివరి సెషన్‌లో చండీమల్ అవుట్ కాగా... నైట్ వాచ్‌మన్ ప్రభాత్ జయసూర్య (5 బ్యాటింగ్) క్రీజులోకి వచ్చాడు. వీరిద్దరూ కలిసి మరో వికెట్ పడకుండా రెండో రోజు ఆటను ముగించారు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 220/8తో గురువారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన బంగ్లాదేశ్... చివరకు 79.3 ఓవర్లలో 247 పరుగులకు ఆలౌటైంది. తైజుల్ ఇస్లామ్ (60 బంతుల్లో 33; 5 ఫోర్లు) కీలక పరుగులు చేశాడు. శ్రీలంక బౌలర్లలో అరంగేట్రం స్పిన్నర్ సోనాల్ దినుశా, అశిత ఫెర్నాండో చెరో 3 వికెట్లు పడగొట్టారు. చేతిలో 8 వికెట్లు ఉన్న శ్రీలంక ప్రస్తుతం 43 పరుగుల ఆధిక్యంలో ఉంది.



చండీమల్

సాక్షి ప్లస్

శుక్రవారం। 27-6-2025



ఫ్రాన్స్‌కు చెందిన ఈయన పేరు అలెన్ రాబర్ట్. ముద్దుపేరు 'ఫ్రెంచ్ స్పైడర్ మ్యాన్'. ఆకాశహర్మ్యాలను అధిరోహించడంలో దిట్ట. స్పెయిన్‌లోని బార్సెలోనాలో 116 మీటర్ల ఎత్తు, 31 అంతస్తులు కలిగిన మెలియా బార్సెలోనా స్కై హోటల్ భవనాన్ని గురువారం ఈ స్పైడర్‌మ్యాన్ ఎలాంటి రక్షణలు లేకుండానే ఇలా అలవోకగా ఎక్కేసి, విజయ సంకేతం చూపారు.

విమర్శల జడివానలో మమ్దానీ

- పాలస్తీనా అనుకూల వైఖరి
- ఇజ్రాయెల్ వ్యతిరేక ధోరణి
- హిందూత్వంపై అక్కసు
- అమెరికా విదేశాంగ విధానాలపై తరచూ విమర్శలు
- దాంతో అన్ని వర్గాల నుంచి వెల్లువెత్తుతున్న విమర్శలు



బుధవారం న్యూయార్క్‌లో జరిగిన ఎన్నికల ప్రచార కార్యక్రమంలో తల్లిదండ్రులు మీరా నాయర్, మహ్మూద్, భార్య రమ దువాజితో జొహ్రానీ మమ్దానీ

అన్ని వర్గాల నుంచి విమర్శల బాణాలు గుచ్చుకుంటున్నా గెలుపే లక్ష్యంగా సాగిపోతున్న మమ్దానీ వైఖరిపై ఇప్పుడు న్యూయార్క్ నగరవ్యాప్తంగా చర్చకొనసాగుతోంది. పాలస్తీనా అనుకూల, ఇజ్రాయెల్ వ్యతిరేక వైఖరితో వార్తల్లోనేకాదు న్యూయార్క్ సిటీ మేయర్ ఎన్నికల్లోనూ నిలిచి డెమొక్రటిక్ అభ్యర్థిత్వాన్ని గెల్చుకున్న జోహ్రామ్ ఖ్వామీ మమ్దానీని భారత్‌లోనూ పెద్దసంఖ్యలో ప్రజలు విమర్శిస్తున్నారు. ప్రధాని మోదీ, హిందూయిజం, భారత ప్రభుత్వ పాలనా విధానాలపైనా మమ్దానీ గతంలో చేసిన వ్యాఖ్యలు, పెట్టిన ట్వీట్లే ఇందుకు ప్రధాన కారణమని తెలుస్తోంది. తరచూ అబద్ధాలు వల్లెవేస్తూ అందలానికి ఎక్కాలని చూసే పూర్తి అవకాశవాది అనే ఆరోపణలూ పెరిగాయి.

మొదట్నుంచీ అతి వాగ్దానాలు

డెమొక్రటిక్ పార్టీ తరఫున అభ్యర్థిత్వాన్ని గెల్చుకున్న వెంటనే మమ్దానీని 'నెరవేరని వాగ్దానాలుచేసే నేత'గా ప్రస్తుత న్యూయార్క్ మేయర్ ఎరిక్ ఆడమ్స్ అభివర్ణించారు. ''ఎలాంటి వాగ్దానాలు చేస్తే జనం మెచ్చుతారో మమ్దానీ అచ్చు అలాగే మాట్లాడతారు. నెరవేర్చడం అసాధ్యం అని తెల్సికూడా ఇష్టమొచ్చిన హామీలిస్తాడు''అని ఎరిక్ ఆరోపించారు. ఈసారి స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి మమ్దానీని ఓడిస్తానని ఎరిక్ ప్రతిజ్ఞచేశారు. ''అపార్ట్‌మెంట్లలో అద్దెలను క్రమబద్ధీకరిస్తానని, అవసరమైతే భారీగా తగ్గేలా చేస్తానని మమ్దానీ హామీ ఇచ్చాడు. ప్రజాధనంతో ప్రజలందరికీ ఉచిత బస్సు, శిశుసంరక్షణ కార్యక్రమాలు చేపడతానని చెప్పాడు. నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో సరకు దుకాణాలు తెరుస్తానన్నాడు. తన వాగ్దానాలు నెరవేర్చేందుకు ఏకంగా 10 బిలియన్ డాలర్లు ఖర్చువుతుందని ప్రకటించారు. ఇందుకు కావాల్సిన నగదు మొత్తాలను న్యూయార్క్ నగరంలోని సంపన్నులు, బడా పారిశ్రామికవేత్తల నుంచి పన్నుల రూపంలో ముక్కు పిండిమరీ వసూలుచేస్తానన్నాడు. అయితే నగరంలో పన్నులు వసూలుచేసే అధికారం మేయర్‌కు ఉండదన్న కనీస అవగాహన మమ్దానీకి లేదు''అని ఆడమ్స్ గుర్తుచేశారు. మమ్దానీ ప్రస్తుతం క్వీన్స్ 36వ జిల్లా నుంచి న్యూయార్క్ రాష్ట్ర అసెంబ్లీ సభ్యుడిగా కొనసాగుతున్నారు.

పాలస్తీనాకు జై.. నెతన్యాహూకు నై

పాలస్తీనియన్ల హక్కులను పరిరక్షించాలని తరచూ మమ్దానీ ప్రసంగాలిస్తుంటారు. గాజాలోని హమాస్‌పై ఇజ్రాయెల్ సేనల భీకర దాడులను ఈయన తీవ్రంగా తప్పుబట్టారు. దాడులకు ఆదేశించిన ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ యుద్ధనేరాలకు పాల్పడిన నేరస్తుడిగా మమ్దానీ అభివర్ణించారు. ''యుద్ధనేరస్తుడిగా అంతర్జాతీయ నేర న్యాయస్థానం నెతన్యాహూపై 2024 నవంబర్‌లోనే అరెస్ట్ వారెంట్ జారీ చేసింది. అతను న్యూయార్క్‌కు వస్తే ఖైదు చేసి బందీఖానాలో పడేస్తా''అని మమ్దానీ గతంలో చేసిన వ్యాఖ్యలపై అమెరికాలోని యూదు సంఘాలు ఒంటికాలిపై లేచి ఆగ్రహం వ్యక్తంచేశాయి.

మోదీపైనా విమర్శలు

గుజరాత్ అల్లర్లలో ఎంతో మంది ముస్లింలు చనిపోయారని, అందుకు నాటి ముఖ్యమంత్రి నరేంద్ర మోదీయే కారణమని మమ్దానీ గత నెలలో ఆరోపించారు. అమెరికాలో ఏదైనా వేడుకలో మోదీతో కలిసి మీరు వేదికను పంచుకుంటారా? అని మీడియా అడిగిన ప్రశ్నకు మమ్దానీ పైవిధంగా సమాధానమిచ్చారు. ''నెతన్యాహూ మాదిరే మోదీ కూడా యుద్ధనేరస్తుడే. గుజరాత్‌లో ఎంతో మంది ముస్లింల మరణాలకు మోదీ కూడా కారణమే. అందరూ చనిపోగా గుజరాత్‌లో మచ్చుకైనా మనం మిగిలిపోతామని ఒక్క ముస్లిం కూడా భావించి ఉండడు'' అని అన్నారు. ఈ వివాదాస్పద వ్యాఖ్యలపై బీజేపీతోపాటు కాంగ్రెస్ నేతలూ తీవ్ర అభ్యంతరంవ్యక్తంచేశారు. ''మమ్దానీ ఒక్కసారి నోరు తెరిచాడంటే తమకింక పని లేదని పాకిస్తాన్‌లోని తప్పుడు ప్రచార బృందాలు కూడా సెలవు పెట్టి ఇంటికి వెళ్లిపోతాయి. ఆ స్థాయిలో భారత్‌పై విద్వేషం చిమ్ముతాడు. న్యూయార్క్ నుంచి ఊహాత్మక అబద్ధాలు అల్లే ఇతగాడు ఉండగా మనకు వేరే శత్రువు అక్కర్లేదు''అని కాంగ్రెస్ నేత అభిషేక్ మను సింఘ్వీ వ్యాఖ్యానించారు. నగరంలో మమ్దానీకి మద్దతుదారులు పెరిగితే చివరకు 'జిహాదీ మేయర్'అవతరిస్తాడు అని ఒక నెటిజన్ ఆగ్రహం వ్యక్తంచేశాడు. మమ్దానీని విమర్శించే వాళ్లు అతని తల్లిదండ్రులపైనా విమర్శలు ఎక్కుపెట్టారు. ''మమ్దానీ తండ్రి అసలైన మార్కిస్టుకాదు. నిఖార్సయిన వ్యక్తికాదు. ఇక అతని తల్లి మీరా నాయర్ అసలైన కేరళ మలయాళీ నాయర్ కాదు. ఆమె పేరులో అక్షరదోషం ఉంది. ఆ పేరు నాయర్ కాదు పంజాబీ నయ్యర్. మమ్దానీ చాలా ప్రమాదకరమైన వ్యక్తి. ఇతని హిందువులన్నీ, యూదులన్నీ అస్సలు పడదు. వీళ్లపై జరిగే దాడులను సమర్థిస్తాడు''అని మరో నెటిజన్ విమర్శించాడు.

– సాక్షి, నేషనల్ డెస్క్

హిందూ వ్యతిరేకి?

2020 ఆగస్టులో న్యూయార్క్‌లోని టైమ్స్ స్క్వేర్ కూడలి వద్ద రామమందిర వేడుకలను నిరసిస్తూ జరిగిన ఒక హిందూ వ్యతిరేక ర్యాలీలో మమ్దానీ పాల్గొన్నట్లు ఒక వీడియో ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. జిహాదీ, ఖలిస్తాన్ వేర్పాటువాదులు ఈ ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీలో శ్రీరాముడిని, హిందువులనుద్దేశిస్తూ మమ్దానీ అసభ్య పదజాలాన్ని వాడారు. గతంలో బీజేపీకి వ్యతిరేక పోస్టులు పెట్టారు. ''భారత్‌లో బీజేపీ కేవలం హిందుత్వాన్నే ప్రోత్సహిస్తోంది. మన హిందూ ముత్తాతలు ఉర్దూ కవితలను ఇష్టపడితే, ముస్లిం పెద్దలు ఎంతో శ్రద్ధతో గుజరాతీలో భజనలు చేశారు. ఇలాంటి ఘన చరితను బీజేపీ తుడిచిపారేస్తోంది''అని మమ్దానీ గతంలో ఒక ట్వీట్‌చేశారు. ''ఉగాండాలో ఉన్న మా కుటుంబాన్ని మేం భారతీయులనే కారణంతో వెలివేశారు. ముస్లింలు అనే కారణంగా భారత్‌లో మా తోటి ముస్లింలను పీడిస్తున్నారు''అని గతంలో మరో పోస్ట్ పెట్టారు. బాబ్రీ మసీదు విధ్వంసానికి పూర్వపు ఫొటోను షేర్‌చేసి దానికి ఒక క్యాప్షన్ ఇచ్చారు. ''ఇది 400 ఏళ్లపాటు నిలిచిన మసీదు. కానీ దీనిని బీజేపీ ప్రేరేపిత మతమూక 1992లో కూల్చేసింది. దీనికి గుర్తుగా టైమ్స్ స్క్వేర్ కూడలిలో హిందువులు పండగ చేసుకున్నారు''అని మరో పోస్ట్ పెట్టారు. ఆధునిక నాగరికతకు నిలయమైన న్యూయార్క్‌కు అవకాశమొస్తే మేయర్‌గా సేవలందించాల్సిన నేత ఇలా విపక్షధోరణితో ఉంటే పాలన సవ్యంగా సాగడం కష్టమని పలువురు న్యూయార్క్‌వాసులు ఆందోళన వ్యక్తంచేశారు.

బ్లాక్‌బాక్స్ నుంచి డేటా సేకరణ షురూ

24న ఐఏఎఫ్ విమానంలో ఢిల్లీకి బ్లాక్‌బాక్స్

సాక్షి, న్యూఢిల్లీ: అహ్మదాబాద్‌లో ఈ నెల 12న చోటుచేసుకున్న ఎయిరిండియా విమాన ప్రమాదంపై 'ఎయిర్‌క్రాఫ్ట్ యాసిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో'(ఏఏఐబీ) నేతృత్వంలో దర్యాప్తు ముమ్మరంగా సాగుతోందని కేంద్ర పౌర విమానయానశాఖ తెలిపింది. ప్రమాదం జరిగిన ప్రాంతంలో లభించిన బ్లాక్‌బాక్స్‌ను ఢిల్లీకి తరలించినట్లు తెలిపింది. ఈ బృందంలో ఒక ఏవియేషన్ మెడిసిన్ స్పెషలిస్ట్, ఏటీసీ అధికారి, బోయింగ్ విమానాల తయారీ, డిజైన్‌ను రూపొందించిన అమెరికా సంస్థ నేషనల్ ట్రాన్స్‌పోర్టేషన్ సేఫ్టీ బోర్డ్ (ఎన్‌టీఎస్‌బీ) ప్రతినిధులు ఉంటారని పేర్కొంది. కాక్‌పిట్ వాయిస్ రికార్డర్లు (సీవీఆర్), ఫ్లైట్ డేటా రికార్డర్(ఎఫ్‌డీఆర్) రెండూ ఏఏఐబీ) ఆధీనంలో ఉన్నాయని పౌర విమానయాన శాఖ వెల్లడించింది. 'ఈ నెల 25న ఏఏఐబీ డైరెక్టర్ జనరల్ యుగంధర్ సారథ్యంలోని బృందం ఏఏఐబీ, ఎన్‌టీఎస్‌బీకి చెందిన సాంకేతిక సభ్యులు సమాచార వెలికితీత ప్రక్రియను ప్రారంభించారు. ముందుగా బ్లాక్ బాక్స్ నుంచి క్రాష్ ప్రొటెక్షన్ మాడ్యూల్ (సీపీఎం)ను సురక్షితంగా వెలికి తీశారు. మెమరీ మాడ్యూల్‌ను విజయవంతంగా తెరిచాం. డేటాను ఏఏఐబీ ల్యాబ్‌లో డౌన్‌లోడ్ చేశాం. కాక్‌పిట్ వాయిస్ రికార్డర్ (సీవీఆర్), విమాన డేటా రికార్డర్ (ఎఫ్‌డీఆర్) విశ్లేషణ మొదలైంది. ఇది ప్రమాదానికి దారితీసిన సంఘటనల క్రమాన్ని పునర్నిర్మించడంతో పాటు విమానయాన భద్రతను మెరుగు పరిచేందుకు సహాయపడుతుంది'అని పౌర విమానయాన శాఖ తెలిపింది.

పాక్‌లో బాలలపై అఘాయిత్యాలు

ఐక్యరాజ్యసమితిలో భారత ప్రతినిధి హరీశ్ ధ్వజం

ఐక్యరాజ్యసమితి: పాకిస్తాన్‌లో బాలలపై పెద్ద ఎత్తున అఘాయిత్యాలు, నేరాలు జరుగుతున్నాయని ఐక్యరాజ్యసమితిలో భారత ప్రతినిధి పి. హరీశ్ ఆరోపించారు. సీమాంతర ఉగ్రవాదాన్ని పాక్ ప్రోత్సహిస్తోందని మండిపడ్డారు. పాక్ ప్రోద్బలంతో పహల్గాంలో జరిగిన ఉగ్రవాద దాడులను ప్రపంచం మర్చిపోలేదని అన్నారు. వీటన్నింటిని నుంచి ప్రపంచ దేశాల దృష్టిని మళ్లించడానికి పాక్ కుట్రలు పన్నుతోందని ధ్వజమెత్తారు. బాలలపై నేరాలను అరికట్టడానికి అనుసరించాల్సిన వ్యూహాలపై బుధవారం ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో చర్చా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పి.హరీశ్ ఒక స్టేట్‌మెంట్ విడుదల చేశారు. పాకిస్తాన్‌లో పాఠశాలలపై, ప్రధానంగా బాలికల పాఠశాలలపై, ఆరోగ్య కార్యకర్తలపై దాడులు పెరిగిపోతున్నాయని, పాక్-అఫ్గానిస్తాన్ సరిహద్దులో అరాచకం రాజ్యమేలుతోందని అన్నారు. ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటేరస్ సైతం ఈ విషయం వెల్లడించినట్లు గుర్తుచేశారు. పాక్ ప్రభుత్వం ఇకనైనా పద్ధతి మార్చుకోవాలని, సొంత దేశాన్ని చక్కదిద్దుకోవడంపై దృష్టి పెట్టాలని సూచించారు. ఉగ్రవాదులను ఎగదోయడం మానుకోకపోతే పాకిస్తాన్ మరింత నష్టపోవడం ఖాయమని తేల్చిచెప్పారు.

హిందీని రుద్దితే ఊరుకోం

రాజ్, ఉద్ధవ్ స్పష్టీకరణ

- ఐక్యంగా పోరాడుతామన్న శరద్ పవార్

ముంబై: మహారాష్ట్రలోని స్కూళ్లలో హిందీ భాష బోధనకు వ్యతిరేకంగా పోరాడుతామని శివసేన 'యూబీటీ)చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే, ఆయన సోదరుడు మహారాష్ట్ర నవనిర్మాణ సేన(ఎంఎన్ఎస్) చీఫ్ రాజ్ ఠాక్రే స్పష్టం చేశారు. గురువారం వీరిద్దరూ వేర్వేరుగా మీడియాతో మాట్లాడారు. బీజేపీ భాష ఆధారంగా ప్రజలను విభజించాలని చూస్తోందని ఉద్ధవ్ ఠాక్రే ఆరోపించారు. బలవంతంగా హిందీని రుద్దాలని చూస్తే తీవ్రంగా వ్యతిరేకిస్తామని స్పష్టం చేశారు. మరాఠా మాట్లాడే మహారాష్ట్రలో భాషాపరమైన అత్యవసర పరిస్థితిని తెచ్చేందుకు బీజేపీ ప్రయత్నాలు చేస్తోందన్నారు. హిందీకి తాము వ్యతిరేకం కాదు, హిందీని ద్వేషించడం లేదంటూ.. తప్పనిసరి చేస్తే మాత్రం అడ్డుకుని తీరుతామని హెచ్చరించారు. మరాఠా, ఇంగ్లిష్ మీడియం స్కూళ్లలో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు హిందీని బోధించడంపై ఆయన పైవిధంగా స్పందించారు. స్కూళ్లలో హిందీ బోధనను తప్పనిసరి చేయబోమని సీఎం ఫడ్నవీస్ ప్రకటిస్తేనే ఈ వివాదం సమసిపోతుందని ఠాక్రే తెలిపారు. స్కూళ్లలో హిందీని బలవంతంగా రుద్దడాన్ని వ్యతిరేకిస్తూ ముంబైలో జూలై 7వ తేదీన జరిగే నిరసన ప్రదర్శనలో తమ పార్టీ పాల్గొంటుందని ఆయన వెల్లడించారు. మహారాష్ట్ర విద్యార్థులపై హిందీని బలవంతంగా రుద్దేందుకు చేసే ఎలాంటి ప్రయత్నాన్నైనా అడ్డుకుంటామని మహారాష్ట్ర నవనిర్మాణ సేన(ఎంఎన్ఎస్) గురువారం స్పష్టం చేసింది. జూలై 5వ తేదీన ముంబైలోని గిర్‌గామ్ చౌపట్టి నుంచి ర్యాలీ చేపడతామని ఎంఎన్ఎస్ చీఫ్ రాజ్ ఠాక్రే చెప్పారు. తమకు ఏ రాజకీయ పార్టీతోనూ సంబంధం లేదన్నారు. హిందీని తప్పనిసరిగా బోధించాలనుకుంటే 5వ తరగతి తర్వాతే అమలు చేయాలని ఎన్సీపీ(ఎస్పీ)చీఫ్ శరద్ పవార్ సూచించారు. ఒకటో తరగతి నుంచే హిందీని నిర్బంధంగా బోధించాలన్న విధానాన్ని ఆయన వ్యతిరేకించారు. ఉద్ధవ్, రాజ్ ఠాక్రే సోదరుల వైఖరిని ఆయన సమర్థించారు. మరాఠా భాషకు ఇది ఎంతో మేలు చేస్తుందన్నారు. దీనిపై వారితో కలిసి ముందుకు సాగుతామన్నారు. మరాఠా భాష కోసం జరిగే నిరసనల్లో తామూ పాల్గొంటామని మహారాష్ట్ర కాంగ్రెస్ చీఫ్ హర్షవర్ధన్ సప్కాల్ తెలిపారు.

1, 2 తరగతులకు పుస్తకాలుండవు

ఒకటి, రెండు తరగతుల విద్యార్థులకు ఎలాంటి పుస్తకాలు ఉండవని పాఠశాల విద్యా శాఖ మంత్రి దాదా భుసే చెప్పారు. ఈ రెండు తరగతుల చిన్నారులకు మౌఖికంగాను పాటలు, చిత్రాల ద్వారా బోధన ఉంటుందన్నారు. ఈ తరగతుల విషయంలో హిందీ ప్రసక్తే లేదని వివరించారు.

మా వల్లే మీకు దుస్తులు, బూట్లు, ఫోన్లు

మహారాష్ట్ర ఎమ్మెల్యే లోనికర్ వివాదాస్పద వ్యాఖ్యలు

ముంబై: మహారాష్ట్రలో బీజేపీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాబన్‌రావు లోనికర్ వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. ఆయన తాజాగా జాల్నా జిల్లా పార్తూర్‌లో ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. తమ ప్రభుత్వంపై, పార్టీపై కొందరు అనవసరంగా ఆరోపణలు చేస్తున్నారని తప్పుబట్టారు. ''మీకు దుస్తులు, బూట్లు, మొబైల్ ఫోన్లు, ప్రభుత్వ ప్రయోజనాలు, పథకాలు, నిధులు ఎలా వస్తున్నాయి? మా ప్రభుత్వం వల్ల కాదా? అవన్నీ మా వల్లనే మీకు అందుతున్నాయి''అని ప్రజలను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. యువత మాత్రం సోషల్ మీడియాలో ప్రభుత్వాన్ని విమర్శించడమే పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు.

అరిగిపోయిన టైర్లు.. అడుగడుగునా నిర్లక్ష్యం

టేకాఫ్, ల్యాండింగ్ మధ్య గాల్లో ప్రయాణికుల ప్రాణాలు

- ఢిల్లీ, ముంబై ఎయిర్‌పోర్టుల్లో బయటపడ్డ నిర్వహణ లోపాలు
- అహ్మదాబాద్ విషాదం తర్వాతా మారని పరిస్థితి
- డీజీసీఏ సేఫ్టీ ఆడిటింగ్‌లో వెల్లడైన వాస్తవాలు

సాక్షి, న్యూఢిల్లీ: విమానసంస్థల నిర్లక్ష్యం, విమానాశ్రయాల నిర్వహణ తీరుపై కళ్లు చెదిరే వాస్తవాలు వెలుగు చూశాయి. అహ్మదాబాద్‌లో ఎయిరిండియా డ్రీమ్‌లైనర్ విషాదం నేపథ్యంలో ఈనె 20, 21వ తేదీల్లో పౌరవిమాన యాన డైరెక్టరేట్ జనరల్(డీజీసీఏ) దేశంలోనే అత్యంత రద్దీ అయిన ఢిల్లీ, ముంబై విమానాశ్రయాల్లో సేఫ్టీ ఆడిటింగ్ చేపట్టింది. ఒక విమానయాన సంస్థకు చెందిన విమానం టైర్లు పూర్తిగా అరిగిపోయినా దాన్ని అలాగే టేకాఫ్ చేయిస్తున్నట్లు గుర్తించింది. వెంటనే ఆ విమానాన్ని నిలిపివే యాలని అక్కడికక్కడే ఆదేశాలిచ్చింది. ప్రయాణికుల ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టేసి ఇలాంటివే పలు లోపాలు డీజీసీఏ ఆడిట్ సమ యంలో అధికారుల దృష్టికి వచ్చాయి. అహ్మదాబాద్‌లో ఘోర విషాదం జరిగిన తర్వాత కూడా దేశీయ విమానాయాన సంస్థల నిర్వహణ తీరు మారకపోవడంపై డీజీసీఏ తీవ్ర ఆందోళన వెలిబుచ్చింది.

నిబంధనలు బేఖాతరు...

ఒక ఎయిర్‌పోర్టులో రన్‌వేపై ఉండే సెంటర్ లైన్ మార్కింగ్ కనిపించని విషయాన్ని అధికారులు ఆడిట్‌లో గుర్తించారు. పైలట్లకు ఈ మార్కింగ్ స్పష్టంగా కనిపించకుంటే రన్‌వేపై ల్యాండింగ్ చేస్తున్నప్పుడు విమానం ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంటుంది. అలాగే, విమాన సంస్థలు పలురకాల డేటాను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాల్సి ఉంటుంది. కానీ, చాలావరకు విమానయాన సంస్థలు గత మూడేళ్లుగా అవసరమైన డేటాను అప్‌డేట్ చేయలేదని తెలిసింది. విమానాశ్రయం లోపల స్పీడ్ గవర్నర్లు లేకుండానే చాలా వాహనాలు నడుస్తున్నట్లు, గ్రౌండ్ హ్యాండ్లింగ్‌లో కూడా చాలా లోపాలు ఉన్నట్లు ఆడిట్‌లో గుర్తించారు.

విమానం ఒకటైతే.. శిక్షణ మరొకటి...

ఒక విమానం నడపడానికి పైలట్‌కు సిమ్యులేటర్ శిక్షణ ఇస్తారు. పైలట్ ఆ విమానాన్ని నడపడానికి, అందులోని కమాండ్లను అర్థం చేసుకోవడానికి ఈ శిక్షణ ఇస్తారు. అయితే, విమానం ఒకటైతే పైలట్‌కు శిక్షణ ఇచ్చే సిమ్యులేటర్ ఇంకొకటని, అది ఆ విమానం కాన్ఫిగరేషన్‌తో సరిపోలలేదని సేఫ్టీ ఆడిట్‌లో వెల్లడైంది. దీంతో, విమాన ప్రయాణంలో ఏదైనా అత్యవసర పరిస్థితి ఎదురైతే పైలట్‌కు దిక్కుతోచని స్థితి తప్పదని తేలింది.

ఇంజనీర్లు కూడా లేరు

విమానం నిర్వహణ సమయంలో ఇంజనీర్లు కొన్ని ఎయిర్‌క్రాఫ్ట్ మెయింటెనెన్స్ మాన్యువల్‌లను పాటించడం లేదని కూడా ఈ ఆడిట్‌లో తేలింది. విమానంలో ఏమైనా లోపాలు తలెత్తితే వాటిని సరిచేయడానికి చాలా చోట్ల ఎయిర్‌క్రాఫ్ట్ ఇంజనీర్లు లేరని గుర్తించారు. విమానానికి సబంధించిన మరమ్మతుల రిపోర్ట్‌ను టెక్నికల్ లాగ్ పుస్తకంలో నమోదు చేయడంలేదని తేలింది. ఈ రికార్డును తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్న విషయాన్ని సైతం డీజీసీఏ సేఫ్టీ ఆడిట్ బృందం గుర్తించింది.

ఇక పూర్తిగా కన్నడలోనే

అధికారిక కార్యకలాపాలపై కర్ణాటక ప్రభుత్వ నిర్ణయం

బెంగళూరు: కర్ణాటకలో 'కన్నడ'భాషపై వరుస వివాదాల తరువాత రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 1963 నాటి కర్ణాటక రాష్ట్ర భాషా చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని నిర్ణయించింది. ఈ చట్టం ప్రకారం కార్యాలయ బోర్డులు, శాసనసభ కార్యకలాపాలు, అధికారిక ఉత్తర ప్రత్యుత్తరాలు, ప్రజా నోటీసులు అన్నీ రాష్ట్ర అధికారిక భాషలోనే నిర్వహించాలని పేర్కొంది. నియామకాలు, బదిలీలు, సెలవు ఆమోదాలకు సంబంధించిన అన్ని అధికారిక ఉత్తర్వులు కన్నడలోనే జారీ చేయాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. కేంద్ర ప్రభుత్వం, ఇతర రాష్ట్రాలు, న్యాయవ్యవస్థకు సంబంధించిన కమ్యూనికేషన్ మినహా, అన్ని ఇతర అధికారిక ఉత్తర ప్రత్యుత్తరాలు కన్నడలోనే నిర్వహించాలని స్పష్టం చేసింది. ఈ మార్గదర్శకాలను ఇప్పటికే అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు పంపింది.

నిరుపేదకు సొంతింటి కల దూరం: రాహుల్

న్యూఢిల్లీ: దేశంలోని పెద్ద నగరాల్లో ఇళ్ల ధరలు విపరీతంగా పెరిగిపోతుండటంపై కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ ఆందోళన వ్యక్తం చేశారు. మన స్థూల జాతీయోత్పత్తి(జీడీపీ) చాలా ఎక్కువగా ఉందంటూ ఎవరైనా లెక్కలు మీకు చూపితే, దేశంలో సామాన్యుల బడ్జెట్ గురించిన వాస్తవాలను వారికి చెప్పండి. ఎవరికోసం ఈ ఆర్థిక వ్యవస్థ?'అని ప్రశ్నించండని రాహుల్ వ్యాఖ్యానించారు. వాట్సాప్ చానెల్‌లో ఈ మేరకు గురువారం ఆయన ఒక నివేదికను ఉదహరించారు. మహారాష్ట్రలోని పట్టణ ప్రాంతాల్లో ఆదాయపరంగా అగ్రస్థానంలో ఉన్న టాప్ 5% కుటుంబాలు సైతం సొంతింటి కలను నిజం చేసుకోవాలంటే కనీసం 100 ఏళ్లయినా పొదుపు చేయాల్సి ఉంటుందని వ్యాఖ్యానించారు. 'ఇది నిజం, ఈ కుటుంబాల వారు 109 ఏళ్లపాటు తమ ఆదాయంలో కనీసంగా 30 శాతం ఆదా చేస్తేనే సొంతంగా ఇంటిని కొనుక్కోగలరు'అని రాహుల్ పేర్కొన్నారు. 'ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉండే పెద్ద నగరాల్లోని అధికాదాయ వర్గాల ప్రజల పరిస్థితి ఇది. అదే నిరుపేదలైతే, సొంతంగా ఇల్లు కట్టుకోవాలన్న కలను వదులు కోవాల్సి ఉంటుంది'అని రాహుల్ తెలిపారు.

హిందూమతం నాశనానికి సిద్ధమయ్యాడు

జొహ్రాన్ మమ్దానీపై కంగనా రనౌత్ ధ్వజం

ముంబై: భారతీయ అమెరికన్ ప్రజాప్రతినిధి జొహ్రాన్ మమ్దానీ(33)పై బీజేపీ ఫైర్‌బ్రాండ్ ఎంపీ కంగనా రనౌత్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. న్యూయార్క్ మేయర్ పదవికి జరిగిన ప్రైమరీ ఎన్నికలో డెమోక్రాటిక్ పార్టీ తరఫున మమ్దానీ విజయం సాధించడం తెల్సిందే. అప్పట్నుంచీ ఆయన వార్తల్లో ప్రముఖుడిగా నిలిచారు. గతంలో ప్రధాని మోదీపై ఆయన చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు ఇప్పుడు తెరపైకి వచ్చాయి. ఎంపీ కంగన సైతం బుధవారం సోషల్ మీడియాలో మమ్దానీ మతం, సాంస్కృతిక గుర్తింపుపై జరిగిన చర్చలో పాల్గొన్నారు. 'భారత్‌లో పుట్టి పెరిగిన, ఉత్తమ సినీ నిర్మాతల్లో ఒకరైన పద్మశ్రీ మీరా నాయర్ కుమారుడే మమ్దానీ. ఇండియన్‌గా కంటే పాకిస్తానీ మాదిరిగానే ఇతడు కనిపిస్తున్నాడు..ఇతడి హిందూ మూలాలు, రక్త సంబంధం ఏదైనప్పటికీ హిందూయిజాన్ని లేకుండా చేసేందుకు సిద్ధమయ్యాడు!! ప్రతి చోటా ఇదే కథ'అని ఆమె 'ఎక్స్'లో పేర్కొన్నారు.

ఒక ఉగ్రవాది హతం.. ఉచ్చులో ముగ్గురు

జమ్మూకశ్మీర్‌లో కొనసాగుతున్న కాల్పులు

జమ్మూ: జమ్మూకశ్మీర్‌లోని ఉధంపూర్‌లో గురువారం భద్రతా బలగాలతో జరిగిన ఎదురుకాల్పుల్లో పాకిస్తాన్ కేంద్రంగా పనిచేసే జైషే మహమ్మద్‌కు చెందిన ఉగ్రవాది హతమయ్యాడు. దట్టమైన అటవీ ప్రాంతంలో మరో ముగ్గురు ముష్కరులు తమ దిగ్బంధంలో చిక్కుకున్నట్లు అధికారులు తెలిపారు. నలుగురు సభ్యులున్న ఈ బృందం కోసం ఏడాది కాలంగా గాలింపు సాగిస్తున్నామన్నారు. బసంత్‌గఢ్ ప్రాంతంలోని మారుమూల బిహాలీలో ఆర్మీ, పోలీసులు చేపట్టిన కూంబింగ్ సమయంలో ఉదయం 8.30 గంటలప్పుడు తారసపడ్డారని వివరించారు. దట్టంగా కురుస్తున్న మంచుతో వాతావరణం ప్రతికూలంగా ఉన్నప్పటికీ వీరిని మట్టుపెట్టేందుకు ఎన్‌కౌంటర్ ప్రాంతానికి అదనంగా బలగాలను తరలించామన్నారు. వాతావరణం మెరుగుపడిన తర్వాత పూర్తి వివరాలు తెలిసే అవకాశం ముందని వివరించారు.

సైబర్ నేరాలు.. 42 చోట్ల సీబీఐ సోదాలు

న్యూఢిల్లీ: దేశంలో సాధారణ ప్రజలను బలితీసుకుంటున్న సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయడమే లక్ష్యంగా కేంద్ర దర్యాప్తు సంస్థ(సీబీఐ) ఆపరేషన్ చక్ర-4 ప్రారంభించింది. ఇందులో భాగంగా గురువారం రాజస్తాన్, ఢిల్లీ, హరియాణా, ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో 42 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించింది. విశ్వసనీయ సమాచారం మేరకు ఈ సోదాలు జరిగాయి. సైబర్ నేరగాళ్లు వ్యవస్థీకృతంగా పనిచేస్తూ దేశవ్యాప్తంగా 700కుపైగా బ్యాంకు శాఖల్లో ఏకంగా 8.5 లక్షల మ్యూల్ ఖాతాలు తెరిచినట్లు గుర్తించారు. డిజిటల్ కుంభకోణాలు, పెట్టుబడి మోసాలు, యూపీఐ ఆధారిత ఆర్థిక నేరాలకు ఈ ఖాతాలను వాడుకుంటున్నట్లు తేల్చారు. బాధితుల నుంచి కొల్లగొట్టిన సొమ్మును సైబర్ నేరగాళ్లు ఈ ఖాతాల్లోకి మళ్లించి, డ్రా చేసుకుంటున్నట్లు సీబీఐ అధికారులు చెప్పారు. ఈ వ్యవహారంలో బ్యాంకు అధికారులు, ఏజెంట్లు, మధ్యవర్తుల హస్తం ఉన్నట్లు తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించి తప్పుడు ధ్రువ పత్రాలతో బ్యాంకు ఖాతాలు తెరిపించేందుకు బ్యాంకు అధికారులు సహకరిస్తున్నట్లు తేలిందన్నారు. అవినీతి నిరోధక చట్టం కింద వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు వివరించారు.

పొద్దున్నే లేవలేను.. పోలీసు ఉద్యోగం వొద్దు!

డియోరియా: పోలీసు శిక్షణ ఎంత కఠినంగా ఉంటుందో యూపీ పోలీసు నియామకాలు మరోసారి నిరూపిస్తున్నాయి. నాలుగు గంటలకు తాను నిద్ర లేవలేనని, ఈ పోలీసు ఉద్యోగం తనకొద్దని చెబుతున్నాడో పోలీసు. ఉత్తరప్రదేశ్లో కొత్తగా కానిస్టేబుల్ నియామకాలు జరిగాయి. కేంద్ర హోంమంత్రి అమిత్ షా నుంచి నియామక లేఖలు అందుకున్నారు. అయితే.. శిక్షణ ఐదవ రోజునే ఓ కానిస్టేబుల్ తన తండ్రితో కలిసి డియోరియాలోని ఎస్పీ కార్యలయానికి వచ్చాడు. ఎస్పీ విక్రాంత్ వీర్‌ను కల్పించాలని కోరాడు. కారణం ఏమిటని ఎస్పీ ప్రజా సంబంధాల అధికారి (పీఆర్వో) డాక్టర్ మహేంద్ర కుమార్ అడగగా.. తనకు ఉదయం త్వరగా నిద్రలేవడం అలవాటు లేదని స్పష్టంగా చెప్పాడు. అంతేకాదు... ఉదయం 8 గంటల వరకు నిద్రపోయే అలవాటు ఉందని, రోజంతా కఠినమైన శిక్షణ తనకు చాలా కష్టంగా ఉందని వెల్లడించాడు. తన కుమారుడికి బీఎడ్ డిగ్రీ కూడా ఉందని, ఆయన ఉపాధ్యాయుడు కావాలని కోరుకుంటున్నాడని అభ్యర్థి తండ్రి తెలిపాడు. పోలీసు శిక్షణలో శారీరక కఠినత్వం తన కొడుకును పెద్దగా ఉత్సాహపరచలేదని చెప్పాడు. అయితే, కౌన్సెలింగ్ నిర్వహించిన పీఆర్వో మహేంద్ర కానిస్టేబుల్‌కు నచ్చజెప్పి ఒప్పించాడు. శిక్షణా సెషన్లలో ఇటువంటి సమస్యలు సహజమని, తరువాత అంతా సాధారణంగా ఉంటుందని చెప్పారు. చివరికి మనసు మార్చుకున్న కానిస్టేబుల్ ఎస్పీని కలవకుండానే శిక్షణకు వెళ్లిపోయాడు.

2024లో రూ.25 వేల కోట్ల డ్రగ్స్ పట్టివేత

సాక్షి, న్యూఢిల్లీ: దేశంలో గత దశాబ్ద కాలంలో మాదక ద్రవ్యాల వినియోగానికి సంబంధించిన కేసులు 4 రెట్లు పెరిగాయని, పట్టుబడిన డ్రగ్స్ విలువ సైతం అదే స్థాయిలో ఉందని కేంద్రం తెలిపింది. 2024లో ఒక్క ఏడాది కాలంలోనే నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో(ఎన్‌సీబీ) సహా ఇతర డ్రగ్స్ నియంత్రణ సంస్థలు, ప్రభుత్వ విభాగాలు కలిపి ఏకంగా రూ.25,330 కోట్ల విలువైన మాదక ద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నాయని తెలిపింది. గుజరాత్‌లో గత ఏడాదిలోనే భారీగా 3,132 కిలోల డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నామని తెలిపింది.

స్కూల్ వద్ద ట్రాన్స్‌ఫార్మర్ పేలుడు
తొక్కిసలాటలో 29మంది విద్యార్థులు మృతి

బెన్‌గుయి (సెంట్రల్ ఆఫ్రికన్ రిపబ్లిక్): సెంట్రల్ ఆఫ్రికన్ రిపబ్లిక్‌లో కనీసం 29 మంది బాలలు మృత్యువాతపడ్డారు. మరో 260 మంది గాయాలపాలయ్యారు. దేశ రాజధాని బెన్‌గుయిలోని బర్తెలెమీ బొగాండా ఉన్నత పాఠశాల స్కూల్ వద్ద బుధవారం ఈ ఘోర విషాదం చోటుచేసుకుంది. స్కూల్ ఆవరణలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను మరమ్మతు చేస్తుండగా అది అకస్మాత్తుగా పేలింది. సుమారు 5 వేల మంది విద్యార్థులు ఆ సమయంలో పరీక్షలు రాస్తున్నారు. భారీ శబ్దం రావడంతో విద్యార్థులు ఉలిక్కి పడ్డారు. ఏం జరుగుతోందో తెలియక భయంతో ఇష్టమొచ్చిన దిక్కుగా పరుగులు తీశారు. పై అంతస్తుల నుంచి కిందికి దిగే క్రమంలో ఎంట్రన్స్ వద్ద తొక్కిసలాట జరిగిందని అధికారులు తెలిపారు.

‘జై తెలంగాణ పార్టీ’ స్థాపకుడు ఎవరు?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ ఉద్యమం

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో వివిధ రాజకీయ పార్టీల పాత్ర

తెలంగాణ ప్రజా ఫ్రంట్

ప్రజాస్వామిక తెలంగాణే లక్ష్యంగా ‘తెలంగాణ ప్రజా ఫ్రంట్’ (టీపీఎఫ్) ఆవిర్భవించింది. ఇది అనేక ప్రజా సంఘాల కూటమి.

- టీపీఎఫ్ ఏర్పాటులో గద్దర్, ఆకుల భూమయ్య, వేదకుమార్, విమలక్క తదితరులు కీలకపాత్ర పోషించారు.
- ప్రజా గాయకుడు గద్దర్ నేతృత్వంలో 2010 అక్టోబర్ 9న టీపీఎఫ్ ఏర్పడింది.



- పోలవరం ప్రాజెక్టు వల్ల తెలంగాణకు తీవ్రమైన నష్టం జరుగుతుందని, దాన్ని వ్యతిరేకిస్తూ ప్రజా ఉద్యమాలు చేపట్టారు.
- తెలంగాణ ఏర్పాటు ప్రక్రియలో జాప్యాన్ని నిరసిస్తూ ఆందోళనలు నిర్వహించారు.
- శ్రీకృష్ణ కమిటీ సిఫారసులపై ఆందోళన చేపట్టారు.
- ఉద్యమ పార్టీలు ఎన్నికల్లో పాల్గొనవద్దని గద్దర్ పేర్కొన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలోనే తెలంగాణ ఏర్పాటు సాధ్యమని, అందువల్ల తప్పకుండా పోటీ చేయాలని విమలక్క వాదించారు. దీంతో విభేదాలు తలెత్తి విమలక్క టీపీఎఫ్ నుంచి వైదొలిగారు.
- 2010 అక్టోబర్ 21న విమలక్క ‘ఐక్య కమిటీ’ని ఏర్పాటు చేశారు.
- టీపీఎఫ్ నుంచి గద్దర్ పక్కకు తప్పుకోవడంతో 2012లో ఆకుల భూమయ్య దీని అధ్యక్షుడిగా వ్యవహరించారు.

తెలంగాణ జనసభ -1985

- 1985లో తెలంగాణ జనసభను ఏర్పాటు చేశారు.
- 80వ దశకంలో తెలంగాణ ఉద్యమంలో తెలంగాణ జనసభ ముఖ్య భూమిక పోషించింది.

తెలంగాణ ఫోరం - జానారెడ్డి

1990లో జానారెడ్డి కన్వీనర్‌గా తెలంగాణ ఫోరం ఏర్పాటైంది.

- 1992 సెప్టెంబర్‌లో నాటి ప్రధాని పీవీ నరసింహారావును కలిసి విద్య ఉద్యోగ, సాగునీటి కేటాయింపుల్లో తెలంగాణకు జరుగుతున్న అన్యాయాలపై జానారెడ్డి వినతిపత్రం సమర్పించారు.
- తెలంగాణకు జరుగుతున్న అన్యాయాలపై జానారెడ్డి నాటి ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్ రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు.



వైఎస్ఆర్‌సీపీ అధ్యక్షుడు వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి భారత రాజ్యాంగంలోని 3వ ప్రకరణ ప్రకారం పార్లమెంట్ ప్రత్యేక రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తుందని, ఈ విషయంలో ప్రాంతీయ పార్టీల అభిప్రాయాలను పెద్దగా పరిగణనలోకి తీసుకోరని పేర్కొన్నారు.

ప్రజారాజ్యం

ప్రజారాజ్యం పార్టీని ప్రముఖ నటుడు చిరంజీవి స్థాపించారు. తర్వాత దీన్ని కాంగ్రెస్‌లో విలీనం చేశారు.

- చిరంజీవి సమైక్యాంధ్రవైపు మొగ్గు చూపారు.
- 2010 జనవరి 5న ఢిల్లీలో నిర్వహించిన అఖిలపక్ష సమావేశానికి ప్రజారాజ్యం పార్టీ తరఫున చిరంజీవి, సి.రామచంద్రయ్య హాజరయ్యారు. వీరిద్దరూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు తాము వ్యతిరేకమని చెప్పారు.

జై తెలంగాణ పార్టీ - 1997

1997లో ఇంద్రారెడ్డి ‘జై తెలంగాణ పార్టీ’ని స్థాపించారు. తెలంగాణ వ్యాప్తంగా సదస్సులు, సమావేశాలు నిర్వహించారు.

- పటోళ్ల ఇంద్రారెడ్డి టీడీపీలో కీలక నేతగా ఉండేవారు. నాటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్‌కు ఈయన అత్యంత విశ్వసనీయుడు.
- ఎన్.టి. రామారావు ప్రభుత్వంలో ఈయన మంత్రిగా పనిచేశారు.
- 1995లో టీడీపీ సంక్షోభ సమయంలో ఇంద్రారెడ్డి ఎన్టీఆర్ పక్షాన నిలిచారు.
- తర్వాత జరిగిన పరిణామాల వల్ల ఇంద్రారెడ్డి తన పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేశారు.
- 1996లో నాటి ప్రధాని దేవెగౌడ చిన్న రాష్ట్రాల ఏర్పాటుకు అనుకూలం అని ప్రకటించారు.

తెలంగాణ కాంగ్రెస్ లెజిస్లేటివ్ ఫోరం - చిన్నారెడ్డి

చిన్నారెడ్డి తెలంగాణ వాది. కాంగ్రెస్‌లోని తెలంగాణవాదులందరినీ ఒక్కటి చేసి ‘తెలంగాణ కాంగ్రెస్ లెజిస్లేటివ్ ఫోరం’ను ఏర్పాటు చేశారు. దీనికి ఆయన కన్వీనర్‌గా వ్యవహరించారు.

- 2000 ఆగస్టు 11న కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ హైదరాబాద్‌కు వచ్చారు. చిన్నారెడ్డి నాయకత్వంలో 41 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తెలంగాణకు అనుకూలంగా సోనియాగాంధీకి వినతిపత్రం సమర్పించారు.
- తెలంగాణ రీజినల్ కాంగ్రెస్ కో ఆర్డినేషన్ కమిటీకి చిన్నారెడ్డి సారథ్యం వహించారు.
- 2004 శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. వై.ఎస్. రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రి పదవి చేపట్టారు. వనపర్తి నియోజక వర్గం నుంచి గెలిచిన చిన్నారెడ్డికి వైఎస్ మంత్రి పదవి ఇచ్చారు.



2008 - నవ తెలంగాణ పార్టీ

- టీడీపీ సీనియర్ నేత దేవేందర్ గౌడ్ 2008లో సాధారణ ఎన్నికల ముందు ఆ పార్టీ నుంచి బయటకు వచ్చి నవ తెలంగాణ పార్టీ స్థాపించారు.
- వాహనాలకు తెలంగాణ పేరుతో స్టిక్కర్లు అంటించడం తదితర కార్యక్రమాలు చేపట్టారు. తెలంగాణ రాష్ట్ర ప్రక్రియను వేగవంతం చేయాలంటూ ఆందోళనకు దిగారు.
- 2009 మార్చిలో దేవేందర్‌గౌడ్ తన పార్టీని ప్రజారాజ్యం పార్టీలో విలీనం చేశారు.
- 2009 ఆగస్టు 6న ప్రజారాజ్యం నుంచి బయటకు వచ్చి మళ్లీ తెలుగుదేశం పార్టీలో చేరారు.

తెలంగాణ రిజర్వేషన్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్

ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థులు విద్యా సంస్థల్లో రిజర్వేషన్ల కోసం ‘తెలంగాణ రిజర్వేషన్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్’ ఏర్పాటు చేశారు.

- తెలంగాణ ఆకాంక్షను ఈ సంస్థ బలంగా వినిపించింది.
- ఆరు సూత్రాల పథకం ప్రకారం విద్యాసంస్థల్లో స్థానికులకు 85 శాతం సీట్లు కేటాయించాల్సి ఉండేది. ఓపెన్ కాంపిటీషన్ కోటా కోసం 15 శాతం సీట్లు కేటాయించాల్సి ఉండగా, ప్రభుత్వం ఓపెన్ కోటా కోసం 15 శాతం సీట్లను స్థానికేతరులకు రిజర్వు చేసింది.
- తెలంగాణలో రిజర్వేషన్ల కోసం మొదలైన ఈ ఉద్యమం తెలంగాణకు జరుగుతున్న అన్యాయాలను వెలుగులోకి తీసుకువచ్చింది.



లోక్‌సత్తా పార్టీ

2006లో లోక్‌సత్తా రాజకీయ పార్టీగా అవతరించింది. మొదట్లో ఇది తెలంగాణపై ఎలాంటి నిర్ణయం చెప్పలేదు. తర్వాత తెలంగాణ ప్రాంతానికి చెందిన ఈ పార్టీ నాయకుల ఒత్తిడితో తెలంగాణ ఏర్పాటును స్వాగతిస్తామని చెప్పారు. ఆ తర్వాత ఈ పార్టీ కార్యకర్తలు ఉద్యమంలో పాల్గొన్నారు.


మాదిరి ప్రశ్నలు

1. 1990లో జానారెడ్డి దేనికి కన్వీనర్‌గా వ్యవహరించారు?
   ఎ) తెలంగాణ జేఏసీ
   బి) తెలంగాణ ఫోరం
   సి) తెలంగాణ పార్టీ
   డి) తెలంగాణ సమితి
2. 2005లో కేంద్రం ఎవరి అధ్యక్షతన ఒక ఉప సంఘాన్ని నియమించింది?
   ఎ) చిదంబరం బి) శశిథరూర్
   సి) రాహుల్ గాంధీ డి) ప్రణబ్ ముఖర్జీ
3. ఏ పార్టీ కామన్ మినిమమ్ ప్రోగ్రాంలో తెలంగాణ అంశాన్ని చేర్చింది?
   ఎ) టీడీపీ బి) కాంగ్రెస్
   సి) టీఆర్ఎస్ డి) బీజేపీ
4. నాగం జనార్దన్ రెడ్డి ఏర్పాటు చేసిన పార్టీ ఏది?
   ఎ) నవ తెలంగాణ
   బి) నిత్య తెలంగాణ
   సి) తెలంగాణ మండల సమితి
   డి) తెలంగాణ నగారా సమితి
5. 2001 మే 11న కరీంనగర్‌లో కేసీఆర్ ఏర్పాటు చేసిన ‘సింహగర్జన’ సమావేశానికి హాజరై తెలంగాణ ఏర్పాటుకు మద్దతు తెలిపిన శిబూ సోరెన్ ఏ పార్టీ నాయకుడు?
   ఎ) జార్ఖండ్ ముక్తి మోర్చా
   బి) అకాలీదళ్ సి) బీఎస్పీ డి) ఎస్.పి.
6. తెలంగాణ బిల్లుకు లోక్‌సభలో మద్దతు తెలిపిన బీజేపీ ఫ్లోర్ లీడర్ ఎవరు?
   ఎ) రాజ్‌నాథ్ సింగ్ బి) వరుణ్ గాంధీ
   సి) సుష్మాస్వరాజ్ డి) అరుణ్‌జైట్లీ
7. తల్లి తెలంగాణ పార్టీని ఎవరు స్థాపించారు?
   ఎ) విజయశాంతి బి) నాగం జనార్దన్ రెడ్డి
   సి) డి.కె. అరుణ డి) సబిత ఇంద్రారెడ్డి
8. 2002 ఏప్రిల్ 27న టి.ఆర్.ఎస్. ప్రథమ వార్షికోత్సవ సభను ఎక్కడ నిర్వహించారు?
   ఎ) ఆదిలాబాద్ బి) నిజామాబాద్
   సి) రంగారెడ్డి డి) నల్లగొండ
9. 2010 జనవరి 5న కేంద్రం నిర్వహించిన అఖిలపక్ష సమావేశానికి బీజేపీ తరఫున తెలంగాణ ప్రాంతం నుంచి హాజరైన నాయకుడు ఎవరు?
   ఎ) కిషన్ రెడ్డి
   బి) బండారు దత్తాత్రేయ
   సి) యెండల లక్ష్మీనారాయణ
   డి) లక్ష్మణ్
10. 2000లో ఆలె నరేంద్ర బీజేపీ నుంచి బయటకు వచ్చి ఏ పార్టీని స్థాపించారు?
   ఎ) తెలంగాణ నగారా సమితి
   బి) తెలంగాణ రాష్ట్ర సమితి
   సి) తెలంగాణ సాధన సమితి
   డి) నవ తెలంగాణ
11. తెలంగాణ బిల్లుకు రాజ్యసభలో బీజేపీ తరఫున మద్దతు తెలిపిన నాయకులు ఎవరు?
   ఎ) అరుణ్ జైట్లీ బి) అర్జున్ ముండ
   సి) రవిశంకర్ ప్రసాద్
   డి) మహావీర్ త్యాగి
12. 1969 తెలంగాణ ఉద్యమం, జై ఆంధ్ర ఉద్యమం తర్వాత ప్రవేశపెట్టిన పథకం ఏది?
   ఎ) 5 సూత్రాల పథకం
   బి) 3 సూత్రాల పథకం
   సి) 4 సూత్రాల పథకం
   డి) 6 సూత్రాల పథకం
13. గిర్‌గ్లాని కమిషన్ తన నివేదికను ఎన్ని రోజుల్లోగా ఇవ్వాలని కేంద్రం పేర్కొంది?
   ఎ) 30 రోజులు బి) 90 రోజులు
   సి) 60 రోజులు డి) 40 రోజులు
14. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు సంబంధించిన బిల్లును రాజ్యసభ ఎప్పుడు ఆమోదించింది?
   ఎ) 2014 ఫిబ్రవరి 20
   బి) 2014 ఫిబ్రవరి 21
   సి) 2014 ఫిబ్రవరి 22
   డి) 2014 ఫిబ్రవరి 24
15. ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు కోసం కేసీఆర్ దీక్షను ఎప్పుడు ప్రారంభించారు?
   ఎ) 2009 నవంబర్ 29
   బి) 2009 డిసెంబర్ 24
   సి) 2009 అక్టోబర్ 24
   డి) 2009 నవంబర్ 4

సమాధానాలు

1) బి; 2) డి; 3) బి; 4) డి; 5) ఎ; 6) సి; 7) ఎ; 8) డి; 9) బి; 10) సి; 11) ఎ; 12) డి; 13) బి; 14) ఎ; 15) ఎ.

చంద్రుడి పైకి మానవుడిని పంపిన మొదటి దేశం?



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

ఫిజిక్స్

మన విశ్వం

1. శుక్రగ్రహం తరహాలోనే సూర్యుడి చుట్టూ తూర్పు నుంచి పడమరకు తిరిగే గ్రహం?
   - యురేనస్
2. అక్షం అత్యధికంగా వంగి ఉండటం ఏ గ్రహం ప్రత్యేకత?
   - యురేనస్
3. యురేనస్ గ్రహం సూర్యుడి చుట్టూ పరిభ్రమించడానికి పట్టే సమయం?
   - 84 సంవత్సరాలు
4. యురేనస్ గ్రహానికి మరో పేరు?
   - గ్రీన్ ప్లానెట్
5. సూర్యుడి చుట్టూ పరిభ్రమించడానికి నెప్ట్యూన్‌కు పట్టే సమయం?
   - 165 సంవత్సరాలు
6. తోకచుక్కలు సూర్యుడి చుట్టూ ఏ కక్ష్యలో పరిభ్రమిస్తుంటాయి?
   - అతి దీర్ఘవృత్తాకార కక్ష్య
7. తోకచుక్క సూర్యుడిని సమీపించే కొద్దీ దాని తోక పొడవు?
   - పెరుగుతుంది.
8. హేలీ అనే తోకచుక్క ఎన్ని సంవత్సరాలకు ఒకసారి కనిపిస్తుంది?
   - 76 సంవత్సరాలు. హేలీ తోకచుక్క 1986లో కనిపించింది. తిరిగి 2062లో దీన్ని చూడవచ్చు.
9. సౌర కుటుంబం ఏయే పదార్థాలతో ఏర్పడిందో తెలుసుకోవడానికి శాస్త్రవేత్తలకు ఉపకరించేవి?
   - ఉల్కాపాతాలు
10. భారతదేశం మొదటిసారిగా ప్రయోగించిన ఉపగ్రహం?
   - ఆర్యభట్ట
11. విశ్వానికి కేంద్రంలో సూర్యుడు ఉన్నాడు. మిగతా అంతరిక్ష వస్తువులన్నీ దాని చుట్టూ పడమర నుంచి తూర్పు వైపు తిరుగుతున్నాయని తెలిపిన శాస్త్రవేత్త?
   - కోపర్నికస్
12. చంద్రుడి ఆకారంలో కలిగే మార్పులను ఏమంటారు?
   - చంద్రకళలు
13. అతి తక్కువ వ్యాసం ఉన్న గ్రహం?
   - బుధగ్రహం
14. సూర్యుడిలో మండుతున్న ఇంధనం?
   - ఉదజని (హైడ్రోజన్)
15. నక్షత్రాలు తూర్పు నుంచి పడమరకు తిరుగుతున్నట్లు కనిపించడానికి కారణం?
   - భూమి పడమర నుంచి తూర్పునకు గుండ్రంగా తిరగడం.
16. సూర్యుడు ఏ తరహా నక్షత్రం?
   - మధ్య తరహా నక్షత్రం
17. సూర్యుడి చుట్టూ ఒకసారి పరిభ్రమించడానికి శని గ్రహానికి ఎంత కాలం పడుతుంది?
   - 29.5 సంవత్సరాలు
18. మనం ఎల్లప్పుడూ చంద్రుడి ఒకే ముఖాన్ని చూస్తుంటాం. కారణం?
   - చంద్రుడి ఆత్మభ్రమణ, భూమి చుట్టూ పరిభ్రమణ కాలాలు సమానం (27.3 రోజులు). చంద్రుడికి, భూమికి మధ్య దూరం 3,84,399 కి.మీ.
19. బ్లాక్‌హోల్ దేన్ని సూచిస్తుంది?
   - రోదసిలో ఒక నక్షత్ర స్థితి
20. రోదసి యాత్రికుడికి బాహ్య రోదసి ఎలా కనిపిస్తుంది?
   - నల్లగా
21. కాస్మిక్ కిరణాలను విడుదల చేసేవి?
   - సూర్యుడు, నక్షత్రాలు
   - కాస్మిక్ కిరణాల ఉనికిని మొదటిసారిగా సి.టి.ఆర్.విల్సన్ గుర్తించారు.
   - కాస్మిక్ కిరణాలను మిల్లికాన్, విక్టర్ హెజ్ ప్రయోగపూర్వకంగా కనుగొన్నారు.
   - కాస్మిక్ కిరణాలు ఎలక్ట్రాన్, ప్రోటాన్, న్యూట్రాన్, పాజిట్రాన్ అయాన్లను కలిగి ఉంటాయి.
   - ఈ కిరణాల్లో 80% వరకు ప్రోటాన్లు ఉంటాయి. నక్షత్రాల్లో అధిక సంఖ్యలో ప్రోటాన్లు ఉండటమే దీనికి కారణం.
   - కాస్మిక్ రే టెలిస్కోప్ అనే పరికరం ద్వారా కాస్మిక్ కిరణాల ఉనికి, దిశను తెలుసుకోవచ్చు.
   - ఈ కిరణాల తీవ్రత ధ్రువాల వద్ద అత్యధికంగా, భూమధ్యరేఖ వద్ద అత్యల్పంగా ఉంటుంది.
   - మనదేశంలో కాస్మిక్ కిరణాలను గురించి విక్రమ్ సారాభాయ్, హోమీ జహంగీర్ బాబా, మేఘనాథ్ సాహా అధ్యయనం చేశారు.
   - 1985లో భారత్, అమెరికా సంయుక్తంగా అనురాధ అనే ఉపగ్రహాన్ని అంతరిక్షంలోకి పంపి కాస్మిక్ కిరణాల గురించి అధ్యయనం చేశాయి.
22. భూ కేంద్రం ఎన్ని పొరలుగా ఉంటుంది?
   - రెండు
   - బాహ్యకేంద్ర మండలం- 2,300 కి.మీ.
   - అంతర కేంద్ర మండలం- 2600 కి.మీ.
23. రాత్రి సమయంలో కాంతివంతంగా కనిపించే గ్రహం?
   - శుక్రుడు
24. జియోస్టేషనరీ ఉపగ్రహం భూమి చుట్టూ తిరగడానికి పట్టే సమయం?
   - 24 గంటలు
25. ఆస్ట్రనామికల్ యూనిట్ అనే ప్రమాణాన్ని వేటి మధ్య దూరం కొలవడానికి ఉపయోగిస్తారు?
   - సూర్యుడి కేంద్రం నుంచి భూ కేంద్రానికి మధ్య దూరం కొలవడానికి
26. అంతరిక్షం బయట నుంచి భూవాతావరణంలోకి ప్రవేశించిన చిన్న పదార్థాన్ని ఏమని పిలుస్తారు?
   - ఉల్క
27. భూ వాతావరణంలో పొరల సరైన క్రమం?
   - ట్రోపోస్ఫియర్, స్ట్రాటోస్ఫియర్, మోనోస్ఫియర్, ఐనోస్ఫియర్, ఎక్సోస్ఫియర్
28. సౌరవ్యవస్థను కనుగొన్నవారు?
   - కోపర్నికస్
29. సౌరమండల వ్యవస్థ ఎక్కడి నుంచి ప్రారంభమైనట్లు భావిస్తారు?
   - సూర్యుడు
30. కృత్రిమ ఉపగ్రహాన్ని ప్రయోగించిన మొదటి దేశం?
   - రష్యా
31. చంద్రుడి పైకి మానవుడిని పంపిన మొదటి దేశం?
   - అమెరికా
32. జాన్‌గాలే కనుగొన్న గ్రహం?
   - ఇంద్రుడు
33. భారత్ తన తొలి ఉపగ్రహమైన ఆర్యభట్టను ఎప్పుడు ప్రయోగించింది?
   - 1975
34. పాలపుంత చుట్టూ సూర్యుడు ఒకసారి పరిభ్రమించడానికి పట్టే కాలం?
   - 250 మిలియన్ సంవత్సరాలు
35. నక్షత్రం రంగు దేన్ని సూచిస్తుంది?
   - ఉష్ణోగ్రత
36. భూమి ఏ గ్రహాల మధ్యలో ఉంది?
   - శుక్రుడు, అంగారకుడు
37. బిగ్ బ్యాంగ్ సిద్ధాంతం ఏ విషయాన్ని వివరిస్తుంది?
   - విశ్వ ఆవిర్భావం
38. బిగ్ బ్యాంగ్ సిద్ధాంతాన్ని ప్రతిపాదించింది ఎవరు?
   - అబ్బెజార్జియస్ లైమిట్రి
39. జీవిని ప్రతిచోట ప్రభావితం చేసేది?
   - గురుత్వాకర్షణ
40. బ్లూ మూన్ అంటే?
   - ఒకే నెలలో రెండోసారి వచ్చే పౌర్ణమిచంద్రుడు
41. భూ స్థావర ఉపగ్రహం ఎత్తు?
   - 36,000 కి.మీ.
42. భూ కేంద్రం నుంచి భూస్థావర ఉపగ్రహం ఎత్తు?
   - 42,400 కి.మీ.
43. భూస్థావర ఉపగ్రహం భూమి చుట్టూ పరిభ్రమించడానికి పట్టే కాలం?
   - 23 గంటల 56 నిమిషాల 4.09 సెకన్లు లేదా సుమారు 24 గంటలు లేదా ఒక రోజు
44. భూమికి అత్యంత సమీపంలో భూమిచుట్టూ పరిభ్రమించేందుకు ఉపగ్రహానికి పట్టే సమయం?
   - 84.6 నిమిషాలు లేదా 5,000 సెకన్లు
45. సూర్యకేంద్రక సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన శాస్త్రవేత్త?
   - కోపర్నికస్
46. సూర్యకేంద్రక సిద్ధాంతం సరైందేనని అభిప్రాయపడ్డ శాస్త్రవేత్త?
   - టైకోబ్రాహి
47. సూర్యకేంద్రక సిద్ధాంతాన్ని వివరించేందుకు నియమాలు ప్రతిపాదించిందెవరు?
   - జోహన్నెస్ కెప్లర్
48. కెప్లర్ ఎన్ని గ్రహ గమన నియమాలను ప్రతిపాదించారు?
   - మూడు
49. కెప్లర్ మొదటి గ్రహ గమన నియమానికి మరోపేరు?
   - కక్ష్యానియమం
50. కెప్లర్ రెండో గ్రహ గమన నియమానికి మరో పేరు?
   - వైశాల్య నియమం
51. కెప్లర్ మూడో గ్రహ గమన నియమానికి మరో పేరు?
   - ఆవర్తన కాల నియమం
52. కెప్లర్ మూడో గ్రహ గమన నియమం సూత్రం?
   - $T^2 \propto R^3$
53. సూర్యుడి చుట్టూ గ్రహాలు ఏ కక్ష్యలో పరిభ్రమిస్తుంటాయి?
   - దీర్ఘవృత్తాకార కక్ష్య
54. సూర్యుడికి, భూమికి మధ్య దూరాన్ని ఏ ప్రమాణాల్లో కొలుస్తారు?
   - ఆస్ట్రనామికల్ యూనిట్లలో $1\ A.U. = 1.495 \times 10^{11}$ మీ. = 149.5 మిలియన్ కి.మీ.
   - ఇది భూమికి, సూర్యుడికి మధ్య సగటు దూరాన్ని సూచిస్తుంది.
55. భూమికి, సూర్యుడికి మధ్య ఉన్న అత్యల్ప దూరాన్ని ఏమంటారు?
   - పరిహేళి
56. పరిహేళి ఏ రోజున ఏర్పడుతుంది?
   - జనవరి 3
57. పరిహేళి ఏర్పడినప్పుడు భూమికి, సూర్యుడికి మధ్య దూరం?
   - 147 మిలియన్ కి.మీ.
58. భూమికి, సూర్యుడికి మధ్య ఉండే అత్యధిక దూరాన్ని ఏమంటారు?
   - అపహేళి
59. అపహేళి ఏ రోజున సంభవిస్తుంది?
   - జూలై 4
60. అపహేళి ఏర్పడినప్పుడు భూమికి సూర్యుడికి మధ్య ఉండే దూరమెంత?
   - 152 మిలియన్ కి.మీ.
61. భూమి ఉపరితలంపై ఉన్న పొరను ఏమంటారు?
   - భూపటలం
   - భూపటలం మందం 5 కి.మీ. నుంచి 32 కి.మీ.
   - ఈ పొరలో లభ్యమయ్యే మూలకాలు సిలికాన్, అల్యూమినియం.
62. భూపటలం కింది భాగంలో ఉండే పొరను ఏమని పిలుస్తారు?
   - భూ ప్రావారం
   - దీని మందం 2900 కి.మీ.
   - ఈ పొరలో లభ్యమయ్యే మూలకాలు సిలికాన్, మెగ్నీషియం

విద్య, ఉద్యోగ సమాచారం

ఎంవోఈఎఫ్‌సీసీ, న్యూఢిల్లీలో వివిధ ఉద్యోగాలు

న్యూఢిల్లీలోని మినిస్ట్రీ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్ ఫారెస్ట్ క్లైమెట్ ఛేంజ్(ఎంవోఈఎఫ్‌సీసీ) ప్రోగ్రామ్ కోఆర్డినేటర్, కంటెంట్ రైటర్/కాపీ రైటర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 02.
» **పోస్టుల వివరాలు:** నేషనల్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్-1,కంటెంట్ రైటర్/కాపీ ఎడిటర్-1
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎంఎస్సీలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **గరిష్ట వయో పరిమితి:** 07.06.2025 నాటికి 65 ఏళ్లు ఉండాలి.
» **వేతనం:** నెలకు ప్రోగ్రామ్ కోఆర్డినేటర్‌కు రూ.1,00,000, కంటెంట్ రైటర్/కాపీ ఎడిటర్‌కు రూ.60,000.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును డా.ఉన్మన సారంగి, డైరెక్టర్, ఈఐఏసీపీ సెల్, మినిస్ట్రీ ఆఫ్ ఇన్విరాన్‌మెంట్, ఫారెస్ట్-క్లైమేట్ ఛేంజ్, ఇందిరా పర్యావరణ భవన్, జోర్‌బాగ్ రోడ్, న్యూఢిల్లీ-110003 చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 27.06.2025.
» **వెబ్‌సైట్:** https://moef.gov.in

బెల్ హైదరాబాద్‌లో పార్ట్‌టైమ్ విజిటింగ్ డాక్టర్ పోస్టులు

హైదరాబాద్‌లోని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(బీఈఎల్) ఒప్పంద ప్రాతిపదికన పార్ట్‌టైమ్ విజిటింగ్ డాక్టర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 02.
» **పోస్టుల వివరాలు:** పార్ట్‌టైమ్ విజిటింగ్ డాక్టర్ (ఆయుర్వేద)-01, హోమియోపతి-01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఏదైనా గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి బీహెచ్ఎంఎస్/బీఏఎంఎస్‌లో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 01.06.2025 నాటికి 65 ఏళ్లు ఉండాలి. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
» **వేతనం:** నెలకు రూ.25,000.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ఏజీఎం (హెచ్ఆర్), ఎం/ఎస్ భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, నాచారం, హైదరాబాద్-500076 చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 30.06.2025.
» **వెబ్‌సైట్:** https://bel-india.in

కోకింగ్ బొగ్గు ప్రధానంగా దేశంలో ఎక్కడ లభిస్తుంది?

భారతదేశం
ఇంధన వనరులు

సాధారణంగా ప్రతి పోటీ పరీక్షలో ఖనిజ వనరులకు సంబంధించి ప్రశ్నలు కచ్చితంగా ఉంటాయి. ఖనిజ వనరుల్లో ఇంధన వనరులు అతి ప్రధానమైనవి. ఆర్థిక వ్యవస్థ ప్రగతి ఆయా దేశాల, ప్రాంతాల ఇంధన వనరుల స్థాయి మీద ఆధారపడి ఉంటుంది. ప్రశ్నలు సాధారణంగా వివిధ ఇంధన ధాతువులు, వాటి లభ్యత స్థాయి, విస్తరణ, గనుల(ఉత్పత్తి) కేంద్రాలు, వాటిని ఉత్పత్తి చేస్తున్న ప్రధాన ప్రభుత్వ - ప్రైవేట్ రంగ సంస్థల పేర్లు, ఖనిజాల శుద్ధి మొదలైన అంశాలపై ఉంటాయి. ఖనిజ వనరులు తెలంగాణలో ఎక్కడ లభ్యమవుతున్నాయి లేదా ఉత్పత్తి అవుతున్నాయనే అంశాలపై కూడా ప్రత్యేకంగా దృష్టి కేంద్రీకరించాల్సి ఉంటుంది. ఇంధన వనరులను ప్రధానంగా రెండు తరగతుల కింద విభజించవచ్చు.అవి 1) శిలాజ ఇంధనాలు 2) అణు ఇంధనాలు బొగ్గు, చమురు, సహజవాయువు శిలాజ ఇంధనాల తరగతికి చెందుతాయి. యురేనియం, థోరియం, ప్లుటోనియం, లిథియం, ఇల్మనైట్, ర్యుటైల్, జిర్కాన్ మొదలైనవి అణు ఇంధనాల తరగతికి చెందుతాయి. శిలాజ ఇంధనాలు జీవ పదార్థం నుంచి తయారవుతాయి. ఇవి ప్రధానంగా కార్బోనిఫెరస్ భౌమ్య యుగంలో ఏర్పడ్డాయి. నిల్వల పరంగా చూస్తే భారతదేశంలో బొగ్గు నిల్వలు సంతృప్తికర స్థాయిలో ఉన్నట్లుగా చెప్పొచ్చు. కానీ చమురు-సహజ వాయువు నిల్వల స్థాయి, ఉత్పత్తి చాలా తక్కువగా ఉంది. చమురు - సహజ వాయువు ఉత్పత్తుల కోసం మన దేశం ప్రధానంగా దిగుమతులపై ఆధారపడుతుంది. భవిష్యత్తులో వీటి భారాన్ని తగ్గించడానికి ప్రభుత్వం ప్రస్తుతం చమురు- సహజ వాయువు నిక్షేపాల అన్వేషణపై దృష్టి కేంద్రీకరిస్తుంది. ఇందుకోసం దేశ, విదేశీ పెట్టుబడులను ఈ రంగంలోకి ఆహ్వానిస్తుంది. అణు ఇంధన వనరులు విస్తారంగా లభిస్తున్నప్పటికీ, వీటిని వినియోగించే అణు రియాక్టర్ సాంకేతిక పరిజ్ఞానం మనకు లేకపోవడం ప్రధాన సమస్య. దేశంలో అమలవుతున్న మూడంచెల అణు ఇంధన పథకం మూడో దశకు చేరుకున్నప్పుడు దేశీయ అణు ఇంధన నిల్వలు వినియోగంలోకి వస్తాయి. ప్రస్తుతం ఈ పథకం రెండో దశలోనే ఉంది..

మాదిరి ప్రశ్నలు

1. బొగ్గు నిల్వలు భారతదేశంలోని కింది ఏ నదీ లోయలో లభించవు?
   ఎ) దామోదర్ బి) నర్మద
   సి) మహానది డి) సోన్
2. టైపామ్ శ్రేణి అవక్షేప శిలల్లో ఏ ఖనిజ వనరులు లభిస్తున్నాయి?
   ఎ) బొగ్గు బి) యురేనియం
   సి) చమురు డి) థోరియం
3. నైవేలిలో ఏ రకమైన బొగ్గు లభిస్తుంది?
   ఎ) ఆంత్రసైట్ బి) బిట్యూమినస్
   సి) లిగ్నైట్ డి) పీట్
4. బూడిద శాతం ఏ రకమైన బొగ్గులో ఎక్కువగా ఉంటుంది?
   ఎ) ఆంత్రసైట్ బి) బిట్యూమినస్
   సి) లిగ్నైట్ డి) పీట్
5. భారతదేశంలో మోనజైట్ నిల్వలు అత్యధికంగా ఉన్న రాష్ట్రం?
   ఎ) తమిళనాడు బి) మహారాష్ట్ర
   సి) కేరళ డి) ఒడిశా
6. టెరిషరీ భౌమ్య యుగానికి చెందిన బొగ్గు నిల్వలు భారతదేశంలో ఏ ప్రాంతంలో ఉన్నాయి?
   ఎ) చోటానాగపూర్ పీఠభూమి
   బి) మహారాష్ట్ర
   సి) పశ్చిమ భారతదేశం
   డి) ఈశాన్య భారతదేశం
7. భారతదేశంలో బొగ్గు నిల్వలు సుమారుగా ఎన్ని టన్నులు?
   ఎ) 250 మిలియన్ బి) 250 బిలియన్
   సి) 100 మిలియన్ డి) 100 బిలియన్
8. తెలంగాణలోని కింది జిల్లాలో బొగ్గు నిల్వలు లేవు?
   1) ఖమ్మం 2) వరంగల్
   3) కరీంనగర్ 4) ఆదిలాబాద్
   ఎ) 2 బి) 2, 3
   సి) 1 డి) పైవేవీ కావు
9. తెలంగాణలో బొగ్గును ఉత్పత్తి చేసే రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థ సింగరేణి కాలరీస్ కంపెనీ ప్రధాన కార్యాలయం ఎక్కడ ఉంది?
   ఎ) కొత్తగూడెం బి) రామగుండం
   సి) సింగరేణి డి) హైదరాబాద్
10. పీట్ తరగతికి చెందిన బొగ్గు నిల్వలు ప్రధానంగా ఎక్కడ కేంద్రీకృతమై ఉన్నాయి?
    ఎ) ఛత్తీస్‌గఢ్ బి) జమ్ము
    సి) తమిళనాడు డి) కేరళ
11. భారతదేశంలో అత్యధిక నిల్వలు ఉన్న అతిపెద్ద బొగ్గు క్షేత్రం ఏది?
    ఎ) ఝరియా బి) రాణిగంజ్
    సి) గిర్డి డి) సింగరేణి
12. కింద సూచించిన వాటిలో బొగ్గు గని కేంద్రాలను గుర్తించండి.
    1) భూపాలపల్లి 2) సత్తుపల్లి
    3) మణుగూరు 4) మందమర్రి
    ఎ) 1, 2 బి) 3, 4
    సి) 1, 3, 4 డి) పైవన్నీ
13. కోకింగ్ బొగ్గు ప్రధానంగా దేశంలో ఎక్కడ లభిస్తుంది?
    ఎ) ఝరియా బి) కోర్బా
    సి) సింగ్రౌలి డి) తాల్చేర్
14. భారతదేశం ప్రధానంగా ఏ దేశాల నుంచి బొగ్గును దిగుమతి చేసుకుంటుంది?
    1) ఆస్ట్రేలియా 2) యూఎస్ఏ
    3) దక్షిణాఫ్రికా 4) చైనా
    ఎ) 1, 2 బి) 1, 3
    సి) 2, 3 డి) 1, 4
15. భారతదేశంలో నీటి ముంపు వల్ల అతి పెద్ద దుర్ఘటన జరిగిన బొగ్గుగని ?
    ఎ) తాల్చేర్ బి) బొకారో
    సి) చస్నాలా డి) గోదావరిఖని
16. భారతదేశంలో బొగ్గు ఉత్పత్తి చేసే అతిపెద్ద ప్రభుత్వ రంగ సంస్థ కోల్ ఇండియా లిమిటెడ్ (CIL) ప్రధాన కార్యాలయం ఎక్కడ ఉంది?
    ఎ) ధన్‌బాద్ బి) ఢిల్లీ
    సి) కలకత్తా డి) నాగపూర్
17. అంబానీ చమురు క్షేత్రం ఏ ప్రాంతంలో ఉంది?
    ఎ) కావేరి బేసిన్ బి) కె.జి. బేసిన్
    సి) కాంబత్ సింధుశాఖ
    డి) బ్రహ్మపుత్ర లోయ
18. భారతదేశంలో అత్యధికంగా చమురును ఉత్పత్తి చేసే అతిపెద్ద చమురు క్షేత్రం ?
    ఎ) గాంధార్ బి) రవ్వ
    సి) దిగ్బాయ్ డి) ముంబై హై

గ్రూప్స్,
ఇతర పోటీ పరీక్షల
ప్రత్యేకం

జనరల్ స్టడీస్
జాగ్రఫీ

19. భారత ప్రభుత్వం ఓఎన్‌జీసీ (ONGC) కింద సూచించిన ఏ విదేశీ చమురు క్షేత్రంలో పెట్టుబడి పెట్టింది?
    ఎ) అంపారా బి) డహరాన్
    సి) సఖాలిన్ డి) బాకు
20. భారతదేశంలో మొట్టమొదటిగా కనుగొన్న చమురు క్షేత్రం?
    ఎ) లూనెజ్ బేసిన్ బి) దిగ్బాయ్
    సి) నహర్‌కతియా డి) నారిమన్నం
21. వాయవ్య భారతదేశంలో కింది ప్రాంతంలో చమురు సహజవాయువు నిల్వలున్నట్లుగా నిర్ధారించారు?
    ఎ) థార్ ఎడారి బి) చంబల్ లోయ
    సి) కచ్ మైదానం
    డి) సట్లెజ్-యమునా మైదానం
22. HBJ పైపు లైను మార్గం కింది రాష్ట్రాల గుండా వెళ్తుంది?
    ఎ) మహారాష్ట్ర-గుజరాత్-రాజస్థాన్
    బి) గుజరాత్-మధ్యప్రదేశ్-ఉత్తరప్రదేశ్
    సి) గుజరాత్-మధ్యప్రదేశ్-రాజస్థాన్
    డి) గుజరాత్-మహారాష్ట్ర-మధ్యప్రదేశ్
23. కింద సూచించిన ప్రదేశాల్లో చమురు శుద్ధి కర్మాగారం లేదు?
    ఎ) బరౌని బి) పానిపట్
    సి) బోన్‌గాయిగావ్ డి) రాంచీ
24. ప్రపంచంలో కెల్లా అతిపెద్ద చమురు శుద్ధి కేంద్రంగా రూపొందిన భారతీయ నగరమేది?
    ఎ) దిగ్బాయ్ బి) ట్రాంబే
    సి) జామ్‌నగర్ డి) వడోదర



25. ఏ రెండు పట్టణాలు / నగరాలను కలుపుతూ చమురు - సహజవాయువు గొట్టపు మార్గాన్ని నిర్మిస్తున్నారు?
    ఎ) విజయవాడ-విశాఖపట్నం
    బి) కాకినాడ-విశాఖపట్నం
    సి) హైదరాబాద్-కాకినాడ
    డి) హైదరాబాద్-విశాఖపట్నం
26. జతపరచండి.
    a) నహర్‌కతియా 1) గుజరాత్
    b) గాంధార్ 2) అస్సాం
    c) కర్సాంగ్ 3) మహారాష్ట్ర
    d) బేసిన్ 4) అరుణాచల్‌ప్రదేశ్

	a	b	c	d
ఎ)	1	2	4	3
బి)	1	2	3	4
సి)	2	1	4	3
డి)	2	1	3	4

27. తెలంగాణ,ఆంధ్రప్రదేశ్‌లోని ఏ జిల్లాల్లో యురేనియం నిక్షేపాలున్నట్లుగా నిర్ధారించారు?
    ఎ) నల్లగొండ, కడప
    బి) నల్లగొండ, అనంతపురం
    సి) వరంగల్, కడప
    డి) వరంగల్, కర్నూల్
28. జాదుగుడా ఏ ఖనిజాన్ని ఉత్పత్తి చేసే గని కేంద్రం?
    ఎ) బొగ్గు బి) చమురు
    సి) యురేనియం డి) థోరియం
29. ఈశాన్య భారతదేశంలో యురేనియం ఖనిజం ఎక్కడ లభిస్తుంది?
    ఎ) ఖాసీ కొండలు బి) గారో కొండలు
    సి) నాగా కొండలు డి) మిష్మి కొండలు
30. ప్రపంచంలో అత్యధికంగా మోనజైట్ నిల్వలు కలిగి ఉన్న దేశం ?
    ఎ) ఆస్ట్రేలియా బి) భారతదేశం
    సి) కెనడా డి) దక్షిణాఫ్రికా
31. మోనజైట్ ముడి ఖనిజంలోని ప్రధాన ఖనిజం ఏది?
    ఎ) యురేనియం బి) ప్లుటోనియం
    సి) థోరియం డి) బెరీలియం
32. భారతదేశంలో జిర్కాన్ ఇల్మనైట్ వంటి అణు ఖనిజాలను ఉత్పత్తి చేసే సంస్థ ?
    ఎ) యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్
    బి) ఇండియన్ రేర్ ఎర్త్స్ లిమిటెడ్
    సి) ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్
    డి) మినరల్ ఎక్స్‌ప్లొరేషన్ కార్పొరేషన్ లిమిటెడ్
33. ఆంధ్రప్రదేశ్‌లో మోనజైట్ నిక్షేపాలు ఏ తీరంలో లభిస్తున్నాయి?
    ఎ) నెల్లూరు బి) మచిలీపట్నం
    సి) కాకినాడ డి) భీమునిపట్నం
34. భారతదేశంలోని కింది ప్రాంతంలో చమురు-సహజవాయువు నిల్వలు బయటపడే అవకాశాలున్నాయి.
    ఎ) దక్కన్ పీఠభూమి
    బి) చోటానాగపూర్ పీఠభూమి
    సి) ఒడిశా తీరం
    డి) సట్లెజ్-యమునా మైదానం
35. చమురు-సహజవాయువు నిల్వలు సముద్ర భూతలంపై కింది ప్రాంతంలో కేంద్రీకృతమై ఉంటాయి?
    ఎ) ఖండ తీరపు అంచు
    బి) ఖండ తీరపు వాలు
    సి) ఆబిసల్ మైదానం
    డి) అగాధ సముద్ర ప్రాంతాలు
36. కేంద్రీయ గనుల పరిశోధన కేంద్రం (CMRS) ఎక్కడ ఉంది?
    ఎ) రాంచీ బి) కలకత్తా
    సి) దుర్గాపూర్ డి) ధన్‌బాద్


సమాధానాలు

1) బి; 2) సి; 3) సి; 4) డి;
5) సి; 6) డి; 7) బి; 8) డి;
9) ఎ; 10) డి; 11) బి; 12) డి;
13) ఎ; 14) డి; 15) సి; 16) సి;
17) బి; 18) డి; 19) సి; 20) బి;
21) ఎ; 22) బి; 23) డి; 24) సి;
25) బి; 26) సి; 27) ఎ; 28) సి;
29) ఎ; 30) బి; 31) సి; 32) బి;
33) డి; 34) డి; 35) ఎ; 36 డి.

The screen background is known as..

TCP/IP MODEL

(Transmission Control Protocol (TCP) And The Internet Protocol (IP)) Like OSI network model, TCP/IP also has a network model. TCP/IP was on the path of development when the OSI standard was published and there was interaction between the designers of OSI and TCP/IP standards. The TCP/IP model is not same as OSI model. OSI is a seven-layered standard, but TCP/IP is a four layered standard. The OSI model has been very influential in



the growth and development of TCP/IP standard, and that is why much OSI terminology is applied to TCP/IP. The following figure compares the TCP/IP and OSI network models.As we can see from the above figure, presentation and session layers are not there in TCP/IP model. Also note that the Network Access Layer in TCP/IP model combines the functions of Data link Layer and Physical Layer.

LAYER 4: APPLICATION LAYER

Application layer is the top most layer of four layer TCP/IP model. Application layer is present on the top of the Transport layer. Application layer defines TCP/IP application protocols and how host programs interface with Transport layer services to use the network.

Application layer includes all the higher-level protocols like DNS (Domain Naming System), HTTP (Hypertext Transfer Protocol), Telnet, SSH, FTP (File Transfer Protocol), TFTP (Trivial File Transfer Protocol), SNMP (Simple Network Management Protocol), SMTP (Simple Mail Transfer Protocol) , DHCP (Dynamic Host Configuration Protocol), X Windows, RDP (Remote Desktop Protocol) etc.



BANK EXAMS
COMPUTER AWARENESS

LAYER 3: TRANSPORT LAYER

Transport Layer is the third layer of the four layer TCP/IP model. The position of the Transport layer is between Application layer and Internet layer. The purpose of Transport layer is to permit devices on the source and destination hosts to carry on a conversation. Transport layer defines the level of service and status of the connection used when transporting data.

The main protocols included at Transport layer are TCP (Transmission Control Protocol) and UDP (User Datagram Protocol).

LAYER 2: INTERNET LAYER

Internet Layer is the second layer of the four layer TCP/IP model. The position of Internet layer is between Network Access Layer and Transport layer. Internet layer pack data into data packets known as IP datagram's, which contain source and destination address (logical address or IP address) information that is used to forward the datagram's between hosts and across networks. The Internet layer is also responsible for routing of IP datagrams. Packet switching network depends upon a connectionless internetwork layer. This layer is known as Internet layer. Its job is to allow hosts to insert packets into any network and have them to deliver independently to the destination. At the destination side data packets may appear in a different order than they were sent. It is the job of the higher layers to rearrange them in order to deliver them to proper network applications operating at the Application layer.

The main protocols included at Internet layer are IP (Internet Protocol), ICMP (Internet Control Message Protocol), ARP (Address Resolution Protocol), RARP (Reverse Address Resolution Protocol) and IGMP (Internet Group Management Protocol).

LAYER 1: NETWORK ACCESS LAYER

Network Access Layer is the first layer of the four layer TCP/IP model. Network Access Layer defines details of how data is physically sent through the network, including how bits are electrically or optically signaled by hardware devices that interface directly with a network medium, such as coaxial cable, optical fiber, or twisted pair copper wire. The protocols included in Network Access Layer are Ethernet, Token Ring, FDDI, X.25, Frame Relay etc. The most popular LAN architecture among those listed above is Ethernet. Ethernet uses an Access Method called CSMA/CD (Carrier Sense Multiple Access/Collision Detection) to access the media, when Ethernet operates in a shared media. An Access Method determines how a host will place data on the medium.

IN CSMA/CD Access Method, every host has equal access to the medium and can place data on the wire when the wire is free from network traffic. When a host wants to place data on the wire, it will check the wire to find whether another host is already using the medium. If there is traffic already in the medium, the host will wait and if there is no traffic, it will place the data in the medium. But, if two systems place data on the medium at the same instance, they will collide with each other, destroying the data. If the data is destroyed during transmission, the data will need to be retransmitted. After collision, each host will wait for a small interval of time and again the data will be retransmitted..

MODEL BITS

1. At which place is India's Silicon Valley situated?
   1) Kolkata 2) Hyderabad
   3) Chennai 4) Bangalore
   5) None of these
2. A connection from one HTML document to another HTML document is called ________
   1) Connecting Link
   2) Hyper Link 3) Icon
   4) All of these 5) None of these
3. ________ device is used to connect your computer with a telephone line, so that can access information from other servers and ordinary users too.
   1) LAN Card 2) Set Top Box
   3) Modem 4) UPS
   5) None of these
4. Device on one network can communicate with devices on another network via_______
   1) Gateway 2) Utility Server
   3) Printer Server
   4) File Server
   5) None of these
5. The screen background is known as the________
   1) Desktop 2) Window
   3) Application 4) Frames
   5) None of these
6. Which of the following is not an input device?
   1) VDU 2) Keyboard
   3) Light pen 4) Mouse
   5) None of these
7. What are the units used to count the speed of a printer?
   1) CPM 2) BIT 3) PPM
   4) DPI 5) None of these
8. A computer that combines the characteristic of analog and digital computers_________
   1) Super Computer
   2) Digital Computer
   3) Analog Computer
   4) Hybrid Computer
   5) None of these
9. WORM stands for?
   1) Wanted Original Read Memory
   2) Wanted Once Read Memory
   3) Write Once Read Memory
   4) Write Original Read Memory
   5) None of these
10. Memory unit is a part of ______
    1) Input Device
    2) Control Unit
    3) Output Device
    4) Central Processing Unit
    5) None of these
11. Which of the following companies developed MS Office-2000?
    1) Novell 2) Corel 3) Lotus
    4) Sunsoft 5) None of these
12. What is the meaning of 'MICR'?
    1) Magnetic Ink Character Recognition
    2) Magnetic Intelligence Character Recognition
    3) Magnetic Information Cable Recognition
    4) Magnetic Insurance Cases Recognition
    5) None of these
13. VIRUS stands for________
    1) Very Important Record User Searched
    2) Vital Information Resource Under Siege
    3) Verify Interchanged Result until Source
    4) Very Important Resource under Search
    5) None of these
14. The technique that extends storage capacities of main memory beyond the actual size of the main memory is called ______
    1) Virtual storage
    2) Multitasking
    3) Multiprocessing
    4) Multiprogramming
    5) Switching
15. ________ command we can use to close the windows.
    1) Alt + F4 2) Alt+ S
    3) Alt + End 4) Alt + F1
    5) None of these
16. Algorithm is used ________
    1) To bring itself into desired state by its own action
    2) To perform logarithmic operations
    3) To describe a set of procedure by given result is obtained
    4) As a high level language
    5) None of these
17. FOXPRO is a ________
    1) RDMBS 2) DBMS
    3) Language 4) All of the above
    5) None of these
18. Who is considered as the father of FORTRAN?
    1) John Bardeen
    2) Charles Babbage
    3) John Backus
    4) William Shockley
    5) None of these
19. Which of the following will connect you to the Internet?
    1) A Commercial online service
    2) An Internet service provider
    3) A network connection
    4) All of the above
    5) None of these
20. What software allows you to view internet sites?
    1) A cyber cafe 2) A browser
    3) A modem 4) Your computer
    5) None of these
21. When more than one window is open, to switch to the next window – is the key combination.
    1) CTRL+F5 2) CTRL+F6
    3) CTRL+F7 4) CTRL+F8
    5) None of these
22. Where are data and program stored when the processor uses them?
    1) Main memory
    2) Secondary memory
    3) Disk memory
    4) Program memory
    5) None of these
23. __ represents raw facts, whereas ______is a meaningful data.
    1) Information, reporting
    2) Data, information
    3) Information, bits
    4) Records, bytes
    5) Bits, bytes
24. Saving is a process
    1) To copy the document from memory to storage medium
    2) To bring change in present status of the document
    3) To change entire form
    4) All of the above
    5) None of these
25. PNG stands for_______
    1) Potable Name Generator
    2) Portable Network Generator
    3) Printed Name Graphics
    4) Portable Network Graphics
    5) None of these
26. The maximum Zoom percentage in MS Power Point is________
    1) 100% 2) 200% 3) 400%
    4) 500% 5) None of these
27. The word 'FTP'stands for _____
    1) File Translate Protocol
    2) File Transit Protocol
    3) File Typing Protocol
    4) File Transfer Protocol
    5) None of these
28. Compiler in computer system is a ______
    1) Package
    2) System Software
    3) Process
    4) Application Software
    5) None of these

KEY

1) 4 2) 2 3) 3 4) 1 5) 1
6) 1 7) 4 8) 4 9) 3 10) 4
11) 5 12) 1 13) 2 14) 1 15) 1
16) 3 17) 3 18) 3 19) 2 20) 2
21) 2 22) 1 23) 2 24) 1 25) 4
26) 3 27) 4 28) 4